శుక్రవారం 12-4-2024

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 20

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



ముంబై ఫటాఫట్...

బెంగళూరుపై ముంబై ఘన విజయం.. మెరిసిన బుమ్రా, ఇషాన్, సూర్య - 15లో



భారత వృద్ధి అంచనాలు పెంపు

6.7 శాతం నుంచి 7 శాతానికి పెంచిన ఏడీబీ - 15లో



స్పైవేర్ దాడులు జరగొచ్చు

భారత్‌లో మరోమారు పెగాసస్ తరహా స్పైవేర్ దాడులు జరగొచ్చని యూజర్లను యాపిల్ సంస్థ హెచ్చరించింది.

వివరాలు 6లో ▸



ఎలక్టోరల్ బాండ్ల వివరాలివ్వలేం

ఈసీకి అందజేసిన ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ఆర్టీఐ కింద బహిర్గతం చేసేందుకు ఎస్‌బీఐ నిరాకరించింది.

వివరాలు 6లో ▸



వియత్నాం 'రియల్' దిగ్గజానికి ఉరి

బ్యాంకులో రూ.లక్ష కోట్లకుపైగా మోసానికి పాల్పడిన వియత్నాం రియల్ ఎస్టేట్ దిగ్గజం ట్రూంగ్‌కు కోర్టు మరణశిక్ష విధించింది.

వివరాలు 6లో ▸



కవితను అరెస్టు చేసిన సీబీఐ

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సీబీఐ గురువారం అరెస్టు చేసింది.

వివరాలు 2లో ▸

ఓ విధానమూ లేదు... నినాదమూ లేదు

ఆరోపణలే అజెండా!

2014-19 మధ్య తాను చేసిందేమీ లేక... చంద్రబాబు దుష్ప్రచారం

విధ్వంస పాలన, రాష్ట్రాన్ని నాశనం చేశారు... అంటూ రోజూ అరుపులు

అంటే ఏంటో... రాష్ట్రాన్ని ఏం నాశనం చేశారో చెప్పే పరిస్థితే లేదు

- బడులను బాగు చేసి, విద్యా వ్యవస్థను సంస్కరించటం విధ్వంసమా?
- నిరుపేదలందరికీ వైద్యాన్ని అందుబాటులోకి తేవటం నాశనం చేయటమా?
- సాగును బాగు చేసి, రైతన్నకు భరోసా ఇవ్వటం రాష్ట్రాన్ని దెబ్బతీయటమా?
- సంక్షేమంతో పేదలందరినీ ఆదుకోవటం, గ్రామాలకు కొత్త కళ తేవటం తప్పా?
- పోర్టులు, హార్బర్లు, భారీ పరిశ్రమలతో పురోగమనం కనిపించటం లేదా?
- ఐదేళ్లలో దాదాపు 3 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చిన చరిత్ర ఎవరికైనా ఉందా?
- ఇవన్నీ తెలిసే తన హామీలను నమ్మటం లేదని గ్రహించి... బాబు తిట్ల దండకం
- ప్రభుత్వాన్ని దూషించటమే పనిగా పనికిమాలిన ఎత్తుగడలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2014-19 మధ్య అధికారంలో ఉన్నప్పుడు చేసిన మంచి ఒక్కటీ లేకపోవడంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నేతలకు ప్రజల్లోకి వెళ్లేందుకు ముఖం చెల్లడంలేదు. నాడు కూడా కూటమికి నేతృత్వం వహించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు 650కిపైగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక కనీసం పది శాతం హామీలను కూడా అమలు చేయకుండా దారుణంగా వంచించడంతో ఇప్పుడు సూపర్ సిక్స్ అంటూ ఎన్ని వాగ్దానాలు గుప్పించినా ప్రజలు నమ్మని పరిస్థితి నెలకొంది. దీంతో అజెండా లేని కూటమి నేతలు పచ్చి అబద్ధాలు వల్లిస్తూ సీఎం వైఎస్ జగన్‌పై బురద చల్లడమే ఏకైక లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల హామీల్లో 99 శాతం అమలు చేయడంతోపాటు కూటమి దోపిడీతో 2019 మే 29 నాటికి వెంటిలేటర్‌పైకి చేరిన రాష్ట్రాన్ని సుపరిపాలనతో శరవేగంగా పునర్నిర్మిస్తున్న సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో విశ్వసనీయత రోజురోజుకూ పెరుగుతోంది. నిన్న వరుసగా సిద్ధం సభలు, నేడు మేమంతా సిద్ధం బస్సు యాత్రతో

మిగతా 10వ పేజీలో ▸

ఒంటరిగా ఎదుర్కోలేకనే మళ్లీ..

సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో నమ్మకం బలంగా నాటుకుపోయింది. 2019 తర్వాత జరిగిన ప్రతి ఎన్నికలోనూ ఇదే విషయం వెల్లడైంది. వరుస ఓటములతో వెంటిలేటర్‌పైకి చేరి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న టీడీపీ మనుగడ కోసం చంద్రబాబు మరోసారి జనసేన, బీజేపీతో జట్టు కట్టారు. 2014లో అధికారంలోకి వచ్చి మోసం చేసిన కూటమే మళ్లీ ఇప్పుడు తెరపైకి రావడంతో ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. టీడీపీ-జనసేన ఉమ్మడిగా తాడేపల్లిగూడెంలో నిర్వహించిన సభతోపాటు మూడు పార్టీలు ఉమ్మడిగా ఏకంగా ప్రధాని మోదీని తీసుకొచ్చి చిలకలూరిపేటలో నిర్వహించిన సభకు సైతం ప్రజలు ముఖం చాటేశారు. అవకాశవాద పొత్తులను తిప్పికొట్టారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పురందేశ్వరి కలిసి నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారానికి ప్రజల స్పందన కరువైంది. మరో వైపు సీఎం వైఎస్ జగన్ నిర్వహిస్తున్న బస్సు యాత్రకు ప్రతిచోటా బ్రహ్మరథం పడుతున్నారు. దీంతో ఘోర పరాజయం తప్పదని నిరాశ నిస్పృహల్లో కూరుకుపోయిన కూటమి నేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పచ్చి అబద్ధాలు వల్లె వేస్తూ సీఎం జగన్‌పై బురద చల్లుతున్నారు.



నేడు ఇంటర్ ఫలితాలు

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియట్ ఫలితాలను శుక్రవారం ఉదయం 11 గంటలకు వెల్లడించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సుబ్బారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం మేరకు పరీక్షలను గత మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించారు. ఇంటర్మీడియట్‌లో రెండు సంవత్సరాల విద్యార్థులు మొత్తం 9,99,698 మంది పరీక్షలు రాయగా, జవాబు పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 4వ తేదీకి పూర్తి అయ్యింది. శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రకటించే మొదటి, రెండో సంవత్సరం ఫలితాలను www.sakshi education.comలో చూడొచ్చు.

ఫ్యాక్ట్‌చెక్

పచ్చగంతలు తీస్తే రోడ్లు కనిపిస్తాయి

- రోడ్లపై రోత రాతలతో పరాకాష్టకు రామోజీ పైత్యం
- బాబు హయాంలోనే తీవ్ర నిర్లక్ష్యం.. టీడీపీ ప్రభుత్వం పెట్టిన ఖర్చు రూ.23,792 కోట్లు
- రోడ్ల పునరుద్ధరణకు సీఎం జగన్ అత్యధిక ప్రాధాన్యం
- వైఎస్సార్‌సీపీ వెచ్చించింది రూ.46,383.20 కోట్లు
- యుద్ధప్రాతిపదికన రహదారుల నిర్మాణం, మరమ్మతులు

16లో

ఈనాడు దగా'కోడ్' రాతలు

- 'ఈసీ'డించుకునేలా కథనాలు
- ఓటమి భయంతో బాబు, రామోజీ బెంబేలు
- ఎన్నికల కమిషన్ అధికార పరిధిని ప్రశ్నిస్తూ దుష్ప్రచారం
- పోలీసులపై కక్షగట్టి విద్వేషం
- మొన్న ఐపీఎస్‌లపై.. నేడు డీఎస్పీలు, సీఐలపై..
- పోలీసుల బ్లాక్‌మెయిలింగ్‌కు 'ఈనాడు' కుతంత్రం
- ఈసీ మార్గదర్శకాల ప్రకారమే రక్షకభటుల విధి నిర్వహణ

5లో

నిస్సిగ్గుగా నిజాలను కాలదన్ని..

- ఐటీకి ఆద్యుడని చెప్పుకున్న బాబు హయాంలో ఒక్క కంపెనీ అయినా వచ్చిందా?
- ఆ విషయం తెలిసినా వాస్తవం రాయలేని రామోజీ
- రాష్ట్రంలో సత్ఫలితాలిస్తున్న జగన్ ఐటీ పాలసీ
- ఐదేళ్లలో ఇన్ఫోసిస్, రాండ్‌స్టాడ్, బీఈఎల్ వంటి దిగ్గజ సంస్థల రాక
- గత ఐదేళ్లలో కొత్తగా పెరిగిన 75,551 మంది ఐటీ ఉద్యోగులు

10లో

చంద్రబాబు పేదల ద్రోహి

వైద్య విద్యను వ్యాపారంగా మార్చిన పెత్తందారుడు

- ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటుచేయలేమని అసెంబ్లీలో చెప్పిన నాటి మంత్రి కామినేని
- బాబు పాపాలతో రాష్ట్రంలో పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందని ద్రాక్షగా వైద్య విద్య
- బాబు పెత్తందారి పోకడలకు కొమ్ముకాసిన ఫిలింసిటీ జమిందారు రామోజీరావు
- వైఎస్ జగన్ సీఎం అయ్యాక రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యవిద్యకు సువర్ణాధ్యాయం
- 17 కళాశాలలతో పేద, మధ్యతరగతి విద్యార్థులకు మరిన్ని అవకాశాలు

3లో

ప్రైవేట్ వైద్య కళాశాలల ఏర్పాటునే ప్రోత్సహించిన టీడీపీ అధినేత చంద్రబాబు





ప్రభం'జనం'.. మేమంతా సిద్ధం

నిబద్ధత, నిజాయితీతో పని చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు జన నీరాజనం

- మాటపై నిలబడే నాయకుని నాయకత్వంలో పని చేసేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నేతల పోటా పోటీ
- వైఎస్సార్‌సీపీలో చేరేందుకు భారీ ఎత్తున ఆసక్తి చూపుతున్న నేతలు
- కార్యకర్తల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని పార్టీలో చేర్చుకుంటున్న సీఎం
- ప్రజా బలం ఉన్న నేతలు పార్టీ వీడుతుండటంతో కూటమి పెద్దల్లో ఆందోళన
- గేట్లు ఎత్తేస్తే ఆ పార్టీలు కుదేలవడం ఖాయమంటోన్న రాజకీయ పరిశీలకులు

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల తొలి విడత ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం' పేరుతో రాష్ట్రంలో నిర్వహిస్తున్న బస్సు యాత్రకు వస్తున్న ప్రజా స్పందన టీడీపీ-జనసేన-బీజేపీ నేతల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. ఇచ్చిన మాటకు కట్టుబడి.. నిజాయితీతో, నిబద్ధతతో సుపరిపాలన అందించే నాయకుడిని

మిగతా 2వ పేజీలో ▸



భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

2లో

రంజాన్ పండుగ సందర్భంగా గురువారం కడప ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

వలంటీర్లపై చంద్రబాబుది కపట ప్రేమే



- నిన్నటి వరకు వలంటీర్లను తూలనాడింది చంద్రబాబే
- తిరిగి జన్మభూమి కమిటీలను తేవాలన్నదే ఆయన ధ్యేయం
- ఆ కమిటీల్లోని సభ్యులనే వలంటీర్లను చేయాలనుకుంటున్నారు.. ఇది జరగని పని
- మార్గదర్శిపై సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం
- బాబును గద్దెనెక్కించేందుకు రామోజీ దిగజారిపోయారు
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎంపిక శాస్త్రీయంగా జరిగింది.. మార్పులు ఉండవు: సజ్జల

11లో

బాబును మించిన ఊసరవెల్లి షర్మిల..

- వైఎస్సార్‌టీపీ ఫౌండర్ కొండా రాఘవరెడ్డి ఫైర్
- చంద్రబాబు లాంటి రాక్షసులతో చేతులు కలిపింది
- ఆయనలాంటి విషసర్పాలకు పాలుపోస్తావా?
- వైఎస్ కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తే ఊరుకోం
- తెలంగాణలో కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసగించింది
- ఇప్పుడు ఇక్కడికొచ్చి రాజకీయం చేస్తోంది

12లో



మహిళా వలంటీర్లపై గూండాగిరి

కాకినాడ రూరల్ జనసేన అభ్యర్థి దాష్టీకం



ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్‌పై దౌర్జన్యం చేస్తున్న జనసేన అభ్యర్థి నానాజీ

- పుట్టినరోజు వేడుకలు చేసుకుంటున్న మహిళలపై దౌర్జన్యం
- కుర్చీలు విరగ్గొట్టి భయభ్రాంతులకు గురి చేసిన వైనం
- బయట నుంచి తలుపులు వేసిన జనసేన నేతలు
- ఓ గర్భిణి ఉందని వేడుకున్నా వినిపించుకోని వైనం
- భయంతో స్పృహ తప్పిన గర్భిణి.. ఓ యువతి ఫోన్‌తో రంగంలోకి పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్
- పోలీసులు వచ్చి తలుపులు తెరిచే వరకు గృహ నిర్బంధంలోనే మహిళలు
- జనసేన అభ్యర్థి నానాజీ, మరికొందరిపై క్రిమినల్ కేసు

10లో


గుంటూరులోని నగరంపాలెం ఈద్గా వద్ద రంజాన్‌ను పురస్కరించుకుని ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు


విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల హుస్సేన్ మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు


కర్నూలులోని పాత ఈద్గా వద్ద ప్రార్థనల్లో వేలాది ముస్లింలు

■ తెలంగాణ

14న 'మేమంతా సిద్ధం' ఆత్మీయ సమ్మేళనం

- హైదరాబాద్‌లో వైఎస్సార్‌సీపీ అభిమానులు, పార్టీ ఐటీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు
- పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ అభిమానులు, ఐటీ విభాగం నాయకులు

సాక్షి, హైదరాబాద్: వైఎస్సార్‌సీపీ అభిమానులు, పార్టీ ఐటీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన హైదరాబాద్‌లో 'మేమంతా సిద్ధం'పేరిట ఆత్మీయసమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కొండా జయవర్ధనరెడ్డి, డీవీవీ సత్యనారాయణరెడ్డి, వి.సాంబశివరెడ్డి తదితరులు తెలిపారు. కూకట్‌పల్లి మెట్రోస్టేషన్ సమీపంలోని పిల్లర్ నంబర్ ఏ847 దగ్గర ఉన్న ఎస్‌కేఎస్‌ఆర్ గార్డెన్స్‌లో 14వ తేదీ ఉదయం 10 గంటలకు ఈ సమ్మేళనం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పాల్గొననున్నారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, డాక్టర్ ఎం.గురుమూర్తి, అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ వై.శివరామిరెడ్డి, తమతం కల్పలత, మేరిగ మురళీధర్, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, కాకాని గోవర్ధన్‌రెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, అన్నాబత్తుని శివకుమార్, అనంతవెంకటరామిరెడ్డి, మేరుగ నాగార్జున తదితరులు హాజరుకానున్నారు. ఈ మేరకు గురువారం 'మేమంతా సిద్ధం'వైఎస్సార్‌సీపీ అభిమానుల ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వై.ఈశ్వరప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ అభిమానులు, పార్టీ ఐటీ విభాగం ప్రతినిధులు కె.విజయభాస్కర్ రెడ్డి, ఎస్వీ సుబ్రమణ్యంరెడ్డి, ఎల్.రఘురామిరెడ్డి, భాన రాఘవరెడ్డి, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, కె.రాజశేఖరరెడ్డి మల్లు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభం'జనం'.. మేమంతా సిద్ధం

▶ మొదటి పేజీ తరువాయి

ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారనడానికి నిలువెత్తు నిదర్శనం 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి, పేదింటి భవిష్యత్తును గొప్పగా తీర్చిదిద్దుతూ.. రాష్ట్రం రూపురేఖలు మార్చిన సీఎం వైఎస్ జగన్‌కు బస్సు యాత్రలో జనం అడుగడుగునా బ్రహ్మరథం పడుతున్నారు. మండుటెండైనా అర్ధరాత్రయినా ఊరూరా అభిమాన సంద్రం ఉప్పొంగుతోంది. వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడానికి భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్లలో సీఎం వైఎస్ జగన్ నిర్వహించిన సిద్ధం సభలకు జనం పోటెత్తారు. రాప్తాడు, మేదరమెట్ల సభలు ఉమ్మడి రాష్ట్రంలో, తెలుగు రాష్ట్రాల చరిత్రలో అతి పెద్ద ప్రజా సభలుగా నిలిచాయి. సిద్ధం సభలను మరిపించేలా బస్సు యాత్రకు జనం అడుగడుగునా బ్రహ్మరథం పడుతుండటంతో సార్వత్రిక ఎన్నికలకు ముందే వైఎస్సార్‌సీపీ ప్రభంజనం కన్పిస్తోందని ఇటు రాజకీయ పరిశీలకులు, అటు కూటమి నేతలు గుర్తించారు. మాటపై నిలబడే నాయకుని నాయకత్వంలో పని చేసేందుకు కూటమి నేతలు పోటాపోటీగా వైఎస్సార్‌సీపీలోకి చేరేందుకు క్యూ కడుతున్నారు.



జన బలమే గీటురాయిగా చేరికలు

- టీడీపీ, జనసేన, బీజేపీల నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరేందుకు పోటీ పడుతున్న నాయకుల్లో.. జనబలమే గీటురాయిగా.. సచ్ఛీలత, నిజాయితీ, నిబద్ధత ఆధారంగా.. కార్యకర్తల మనోభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సీఎం వైఎస్ జగన్ చేర్చుకుంటున్నారు.
- టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వంచన వైఖరితో విభేదించిన ఆ పార్టీ రాయచోటి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, 2019లో కావలి నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, కళ్యాణదుర్గం నుంచి 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఉమామహేశ్వర నాయుడు, పలమనేరు మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, చిత్తూరు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు రావూరి ఈశ్వరరావు, చిత్తూరు మాజీ మేయర్ సరళ మేరీ, 2019 ఎన్నికల్లో గంగాధర నెల్లూరు నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎ.హరికృష్ణ, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా తదితరులు తమ అనుచరులతో కలిసి బస్సు యాత్రలో సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.
- జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నాయకత్వంతో విభేదించిన ఆ పార్టీ విజయవాడ (పశ్చిమ) సమన్వయకర్త పోతిన మహేష్, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి (2019 ఎన్నికల్లో పి.గన్నవరం నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేశారు), అమలాపురం సమన్వయకర్త శెట్టిబత్తుల రాజాబాబు, ముమ్మిడివరం సమన్వయకర్త పితాని బాలకృష్ణ తదితరులు తమ అనుచరులతో కలిసి బస్సు యాత్రలో సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.
- అఖిల భారత యాదవ సంఘం, రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్, బీజేపీ సీనియర్ నేత ఏవీ సుబ్బారెడ్డి సహా పలువురు ప్రజా సంఘాల నేతలు తమ అనుచరులతో కలిసి సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

తలుపులు బార్లా తెరిస్తే కూటమి ఖాళీ

తమ పార్టీలను వీడి ప్రజాబలం ఉన్న నేతలు వైఎస్సార్‌సీపీలో చేరుతుండటం కూటమి నేతల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. ఎలాంటి ప్రామాణికాలు పాటించకుండా సీఎం వైఎస్ జగన్ వైఎస్సార్‌సీపీ తలుపులు బార్లా తెరిస్తే.. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు ఖాళీ కావడం ఖాయమని రాజకీయ పరిశీలకులు చేస్తున్న విశ్లేషణ ఆయా పార్టీల అభ్యర్థుల్లో నైతిక స్థైర్యాన్ని దెబ్బ తీస్తోంది. ఓ వైపు బస్సు యాత్రతో సీఎం వైఎస్ జగన్ సృష్టిస్తున్న ప్రభంజనం.. మరో వైపు తమ పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీలోకి నేతలు క్యూ కడుతుండటంతో సార్వత్రిక ఎన్నికలకు ముందే టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు కాడి పారేస్తున్నారు.

నేడు మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఇలా..

- ఉదయం 9 గంటలకు ధూళిపాళ్ల నుంచి సీఎం యాత్ర ప్రారంభం
- హౌసింగ్ బోర్డు వద్ద భోజన విరామం
- సాయంత్రం గుంటూరులో ఏటుకూరు బైపాస్ వద్ద బహిరంగ సభ
- నంబూరు బైపాస్ వద్ద రాత్రి బస



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర 13వ రోజైన శుక్రవారం(ఏప్రిల్ 12) షెడ్యూల్‌ను వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం గురువారం విడుదల చేశారు. ఈ యాత్రలో భాగంగా సీఎం జగన్ బుధవారం రాత్రి బస చేసిన ధూళిపాళ్ల ప్రాంతం దగ్గర నుంచి శుక్రవారం ఉదయం 9 గంటలకు బయలుదేరుతారు. సత్తెనపల్లి, కొర్రపాడు, మేడికొండూరు, పేరేచెర్ల జంక్షన్, నల్లపాడు మీదుగా హౌసింగ్ బోర్డు వద్దకు చేరుకుని భోజన విరామం తీసుకుంటారు. అనంతరం చుట్టుగుంట సర్కిల్, వీఐపీ రోడ్డు మీదుగా సాయంత్రం 3.30 గంటలకు గుంటూరులోని ఏటుకూరు బైపాస్ సభ ప్రాంగణానికి చేరుకుని బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రసంగిస్తారు. సభ అనంతరం తక్కెళ్లపాడు బైపాస్, పెదకాకాని బైపాస్, వెంగళ్రావు నగర్, నంబూరు క్రాస్ మీదుగా ప్రయాణించి నంబూరు బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన రాత్రి బస శిబిరానికి సీఎం చేరుకుంటారు.

దాన గుణాన్ని పెంపొందించే పవిత్ర పండుగ రంజాన్

ముస్లింలకు సీఎం జగన్ రంజాన్ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: క్రమశిక్షణ, మనోనిశ్చలత, దాన గుణాన్ని పెంపొందించే పవిత్రమైన పండుగ రంజాన్ అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ముస్లిం సోదర సోదరీమణులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ గురువారం ఆయన ట్వీట్ చేశారు.

మద్యం కేసులో మరోమారు కవిత అరెస్టు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సీబీఐ అరెస్టు చేసింది. ఈ కేసులో ఈడీ ఇప్పటికే ఆమెను అరెస్టు చేయగా జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా తాము కవితను అరెస్టు చేసినట్లు గురువారం మధ్యాహ్నం ఆమె కుటుంబ సభ్యులకు సీబీఐ అధికారులు తెలిపారు. దీంతో కవిత అరెస్టును సవాల్ చేస్తూ కవిత తరఫు న్యాయవాది నితీష్ రాణా రౌజ్ అవెన్యూ ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. గురువారం రంజాన్ సెలవు నేపథ్యంలో ప్రత్యేక న్యాయమూర్తి మనోజ్‌కుమార్ ముందు ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా అరెస్టు చేయడం సరికాదన్నారు. ముందుగా చెప్పాలంటూ కోర్టు ఆదేశాలున్నాయని గుర్తు చేశారు. దీంతో మద్యం కుంభకోణం కేసు తాను గతంలో విచారించలేదని న్యాయమూర్తి పేర్కొన్నారు. అత్యవసర కేసులే ప్రస్తుతం పరిశీలిస్తామని, దీనిని శుక్రవారం రెగ్యులర్ కోర్టు ముందు ప్రస్తావించాలని సూచించారు.

కస్టడీ కోరనున్న సీబీఐ!

రౌస్ అవెన్యూ కోర్టు అనుమతితో సీబీఐ శనివారం కవితను తీహార్ జైలులో ప్రశ్నించిన విషయం విదితమే. మాజీ ఆడిటర్ బుచ్చిబాబుతో వాట్సాప్ చాట్‌లు, భూ ఒప్పందానికి సంబంధించిన అంశాలపై కవితను ప్రశ్నించినట్లు సీబీఐ వర్గాలు వెల్లడించాయి. తాజాగా ఆమె అరెస్టు నేపథ్యంలో విచారణ నిమిత్తం కస్టడీకి ఇవ్వాల్సిందిగా సీబీఐ శుక్రవారం ప్రత్యేక కోర్టును కోరనున్నట్లు తెలిసింది.

గుంటూరు 'సిద్ధం'

ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం జగన్ చేపట్టిన బస్సు యాత్రకు సంఘీభావంగా గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గంలోని రావెల గ్రామస్తులు మిర్చితో 'గుంటూరు సిద్ధం' అంటూ ఇలా అలంకరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.





ప్రధాన నగరాలు, పట్టణాల్లో గురువారం నమోదైన ఉష్ణోగ్రతలు

నగరం/పట్టణం	గరిష్టం	కనిష్టం
తిరుపతి	42.0	24.0
హిందూపురం	41.8	21.7
అనంతపురం	40.9	23.8
కర్నూలు	40.6	27.7
కడప	40.2	23.4
రాజమహేంద్రవరం	40.0	22.0
రెంటచింతల	39.7	27.3
విజయవాడ	38.0	26.0
గుంటూరు	38.0	26.0
విజయనగరం	37.0	32.0
విశాఖపట్నం	37.0	23.0
అనకాపల్లి	36.8	24.5
నెల్లూరు	36.6	27.0


ఇలాంటివాళ్లు


... ఇల్లంతా ఊడ్చిపెడితే ఓటేస్తానని హామీ ఇచ్చానులే!

ఏపీలో 'థర్మల్' ధగధగ

- అధికారంలోకి రాగానే పెండింగ్ విద్యుత్ ప్రాజెక్టులపై దృష్టి
- ఒకే ఏడాదిలో రెండు థర్మల్ ప్రాజెక్టుల సామర్థ్యం పెంపు
- అందుబాటులోకి వచ్చిన 1600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- ప్లాంట్లు ఆగకుండా నిరంతరం బొగ్గు నిల్వలు ఉండేలా చర్యలు
- చంద్రబాబు హయాంలో బొగ్గు కొరతతో తీవ్ర ఇబ్బందులు

రాష్ట్ర ప్రజల విద్యుత్ అవసరాల కోసం ప్రభుత్వం చర్యలు



నాడు: రాష్ట్రంలో విద్యుత్తు కోతలు... పారిశ్రామిక రంగంలో వెతలు, జనం రోడ్ల మీదకు వచ్చి నిరసనలు, విద్యుత్తు కార్యాలయాల ముందు ధర్నాలు. రాత్రి, పగలూ ఒకటే యాతన. ఇటు వ్యవసాయ రంగం, అటు పారిశ్రామిక రంగం కుదేలు. ఇక చిన్న, మధ్య తరహా పరిశ్రమల కష్టాలు చెప్పనవసరం లేదు. పవర్ హాలీడేలతో నరక యాతనే.

నేడు: కరెంటు కష్టాలు లేవు...కోతలు అసలే లేవు. జనంలో అప్పటి మాదిరిగా ఆగ్రహోద్వేగాల జాడే లేదు. పారిశ్రామికం, వ్యవసాయానికి నిరంతరంగా విద్యుత్తు సరఫరా కావడంతో ఆయా రంగాల్లో ఉత్పత్తి భేషుగ్గా నమోదవుతోంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమల నిర్వాహకుల మోముల్లో దరహాసం కనిపిస్తోంది. దీనికి కారణం సీఎం జగన్ తీసుకున్న చర్యలు.. దూర దృష్టి.

సాక్షి, అమరావతి: సీఎం జగన్‌మోహన్ రెడ్డి ముందు చూపు ఫలితంగా రాష్ట్రంలో గత ఐదేళ్లుగా విద్యుత్ వెలుగులీనుతోంది. విద్యుదుత్పత్తికి ఎలాంటి అవరోధాలు లేకపోవడంతో వినియోగదారులకు, పారిశ్రామికవేత్తలకు ఎటువంటి ఇబ్బందులు లేకపోవడానికి జగన్ ముందు చూపే కారణం. చంద్రబాబు హయాంలో ముఖ్యంగా థర్మల్ విద్యుత్ కేంద్రాలు సామర్థ్యానికి తగ్గట్టుగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయలేని దుస్థితిలో ఉండేవి. అవే ప్లాంట్లు జగన్ పాలనలో 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి అదనపు సామర్థ్యాన్ని జోడించుకుని పురోగతిని సాధించాయి. రాష్ట్ర విద్యుత్ డిమాండ్‌లో దాదాపు 45 శాతం ఏపీ జెన్‌కో థర్మల్ ప్రాజెక్టుల నుంచే సమకూరుతోందంటే రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రోత్సాహమే ప్రధాన కారణం. అధికారంలోకి రాగానే పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించడం తోనే ఇది సాధ్యమైందని ఆ రంగ నిపుణులే చెబుతున్నారు.

గత ప్రభుత్వ అసమర్థత

శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ (కృష్ణపట్నం)లో రూ.8,432 కోట్ల అంచనా వ్యయంతో స్టేజ్ 1ని ఏర్పాటు చేయాలని నిర్ణయించి, 2012లో ఒక యూనిట్ 800 మెగావాట్లు, 2013లో మరో 800 మెగావాట్ల యూనిట్‌ను పూర్తి చేయాలని నిర్దేశించారు. కానీ అలా జరగలేదు. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో నడిచే మొదటి ప్రాజెక్ట్ ఇది. విదేశీ తయారీదారుల నుంచి సాంకేతికతను బదిలీ చేయడంలో అప్పటి ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడంతో ప్రాజెక్ట్ ప్రారంభించడంలో జాప్యం చోటుచేసుకుంది. తర్వాత అంచనా వ్యయం రూ.12,230 కోట్లకు పెంచారు. అయితే స్టేజ్ 1 నిర్మాణం కోసం తీసుకున్న రూ.12942.28 కోట్ల అప్పులకు వడ్డీలు, వాయిదాలు చెల్లించలేని పరిస్థితి తలెత్తింది. అవన్నీ కలిపి మొత్తంగా రూ.20 వేల కోట్లకు చేరాయి. వీటిలో గత ప్రభుత్వం అసమర్థత కారణంగా రూ.4200 కోట్లను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి గుర్తించలేదు. అప్పులతోపాటు రూ.2106.75 కోట్ల నష్టాల్లోకి ప్లాంటు వెళ్లిపోయింది.

జగన్ సర్కారు సమర్థత

అలాంటి ప్లాంటులో 800 మెగావాట్ల యూనిట్ నిర్మాణానికి చేయూతనందించింది రాష్ట్ర ప్రభుత్వం. అంతేకాదు త్వరితగతిన పనులు పూర్తి చేయించి, గతేడాది మార్చిలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జాతికి అంకితం చేశారు. అక్కడితో ఆగలేదు. ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ ఎన్‌టీటీపీఎస్ (వీటీపీఎస్)లో 800 మెగావాట్ల యూనిట్ నిర్మాణంపైనా దృష్టి సారించించారు. గతేడాది డిసెంబర్‌లో దానినీ అందుబాటులోకి తెచ్చారు.

బొగ్గు కొరతకు చెక్

దేశ వ్యాప్తంగా బొగ్గు కొరత ఏర్పడినప్పుడు భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు జగన్ సర్కారు ప్రణాళికలు అమలు చేస్తోంది. గతంలో ఒక్క రోజు నిల్వలకే అప్పటి ప్రభుత్వం నానా తంటాలు పడేది. ఉత్పత్తి లేక విద్యుత్ కోతలు విధించేది.

- ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో విద్యుత్ సంస్థలు రాష్ట్రంలో థర్మల్ విద్యుదుత్పత్తికి సరిపడా బొగ్గు నిల్వలు సమకూర్చుకుంటున్నాయి.
- సాధారణంగా 65 శాతం నుంచి 75 శాతం వరకు ఉండే ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ వద్ద 1000 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి 3.5 నుంచి 4 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం.
- ఈ మేరకు వీటీపీఎస్‌లో రోజుకి 28,500 మెట్రిక్ టన్నులు అవసరం కాగా 1,12,350 మెట్రిక్ టన్నులు నిల్వ చేశారు.
- ఆర్టీపీపీలో 21 వేల మెట్రిక్ టన్నులు కావాల్సి వస్తే అక్కడ 1,28,715 మెట్రిక్ టన్నులు తెచ్చి ఉంచారు. కృష్ణపట్నంలో 29 వేలు ఉత్పత్తికి వాడాల్సి ఉంటే 9,0971 మెట్రిక్ టన్నులు అందుబాటులో పెట్టారు.
- ఈ నిల్వలు వారం రోజుల వరకూ విద్యుత్ ఉత్పత్తికి సరిపోతాయి. బొగ్గును వినియోగిస్తూ థర్మల్ విద్యుదుత్పత్తి చేస్తున్నాయి.
- కేంద్ర బొగ్గు, విద్యుత్ మంత్రిత్వ శాఖలతో నిరంతరం సంప్రదింపులు, సకాలంలో చెల్లింపులు చేస్తూ స్వదేశీ బొగ్గు కేటాయింపులను పొందడంతోపాటు, టెండర్ల ద్వారా విదేశీ బొగ్గును రప్పించుకుంటున్నాయి.
- శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్‌డీఎస్‌టీపీఎస్), స్టేజ్-2లోని యూనిట్-3కి ఏటా 35.48 లక్షల టన్నుల బొగ్గును సరఫరా చేయడానికి మహానది కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎంసీఎల్) అంగీకరించేలా ప్రభుత్వం చేసిన కృషి ఫలించింది.
- ఇది కాకుండా థర్మల్ కేంద్రాలకు ఎంసీఎల్ నుంచి ఏటా 17.165 మిలియన్ మెట్రిక్ టన్నులు (ఎంటీపీఏ), సింగరేణి కోల్ కాలరీస్ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) నుంచి 6.88 ఎంటీపీఏ బొగ్గు సరఫరా కోసం ఇంధన సరఫరా ఒప్పందం (ఎఫ్ఎస్ఏ) చేసుకుంది.
- ఈ ఒప్పందం ప్రకారం ఎంసీఎల్, ఎస్‌సీసీఎల్‌లు డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (డా.ఎన్‌టీటీపీఎస్), రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్(ఆర్‌టీపీపీ)కు రైలు, సముద్ర మార్గంలో బొగ్గును సరఫరా చేస్తున్నాయి.

పూలేకు ఘన నివాళి



సాక్షి, అమరావతి: మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ.. 'భారతదేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే. బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పూలే ఎంతగానో కృషి చేశారు. ఆయన ఆశయాలను పాటిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్. రాష్ట్రంలోని 200 ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు వంద స్థానాలు కేటాయించిన గొప్ప వ్యక్తి సీఎం జగన్. సామాజిక సాధికారితను చేతల్లో చూపించారు. పూలే విధానాలు కొనసాగాలన్నా.. మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరముంది' అని అన్నారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, పార్టీ నాయకులు నారాయణమూర్తి, తోలేటి శ్రీకాంత్, పురుషోత్తం, కాకుమాను రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ భవన్‌లో ఘనంగా పూలే జయంతి వేడుకలు

సాక్షి, న్యూఢిల్లీ: సామాజిక విప్లవానికి పునాది వేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ కొనియాడారు. పూలే చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలను ఢిల్లీలోని ఏపీ భవన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి నివాళులర్పించి లవ్ అగర్వాల్ ప్రసంగించారు. అట్టడుగు వర్గానికి ఎనలేని సేవలు చేసిన వ్యక్తి పూలే అని అన్నారు. ఏపీ భవన్ అధికారులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణలో బ్రిటన్ ప్రభుత్వం భాగస్వామ్యం

ఏపీ ప్రభుత్వంతో తెలుగు రాష్ట్రాల బ్రిటన్ డిప్యూటీ హైకమిషనర్ చర్చలు

సాక్షి, అమరావతి: ఏపీ యువత బ్రిటన్‌లో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా అవసరమైన నైపుణ్య శిక్షణను అందించడానికి యూకే ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఏపీఎస్ఎస్‌డీసీ ప్రధాన కార్యాలయంలో బ్రిటన్‌లో ఉన్న ఉపాధి అవకాశాలు, అందుకు అవసరమైన నైపుణ్య శిక్షణా అవకాశాలపై తెలుగు రాష్ట్రాలబ్రిటన్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ ఏపీ ప్రభుత్వంతో గురువారం చర్చలు జరిపారు. యూకే దేశాల్లో ఆరోగ్య సంరక్షణ నిపుణులకు అవసరమైన ఆంగ్ల భాష శిక్షణ, సర్టిఫికేషన్ అందించే అంశాలపై చర్చించారు. బ్రిటిష్ కౌన్సిల్, స్కిల్ అండ్ ఎడ్యుకేషన్ గ్రూప్, పియర్సన్, కేంబ్రిడ్జ్ వర్సిటీ, నీత్ పోర్ట్ టాల్బోట్ కాలేజ్ గ్రూప్ సంయుక్తంగా కలిసి ఇంగ్లిష్ టెస్టింగ్ ప్రత్యామ్నాయాలు, వర్కర్ రైట్స్ ట్రైనింగ్, బ్లెండెడ్ లెర్నింగ్ మోడల్స్, ఆన్‌లైన్ కోర్సుల ప్రోగ్రామ్‌లను అందించడానికి ఆసక్తి వ్యక్తం చేశాయి. ఏపీ నైపుణ్యాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా రాష్ట్ర యువత పోటీపడే విధంగా నైపుణ్య శిక్షణను అందించడానికి బ్రిటన్ సంస్థలు ముందుకు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. పైలట్ ప్రాజెక్ట్ కింద హెల్త్‌కేర్ రంగంలో నైపుణ్య శిక్షణను ఇవ్వనున్నట్లు ఏపీ ఎస్ఎస్‌డీసీ ఎండీ రాజబాబు చెప్పారు.

రాజకీయాల్లో నటించకు పవన్..

పార్టీని ప్యాకప్ చేసి షూటింగ్‌లు చేసుకోండి.. సినిమాల్లో నటించండి.. రాజకీయాల్లో వద్దు

- కాపు యువత జీవితాలతో ఆడుకోవద్దు
- సీఎం జగన్ అభ్యర్థుల విజయానికి సహకరించాలి
- పిఠాపురం ప్రజలు అమ్ముడుపోయే వాళ్లలా కనిపిస్తున్నారా?
- స్వచ్ఛమైన నీరు ఇస్తామనాలిగానీ, స్వచ్ఛమైన సారా ఇస్తామని చెప్పడమేమిటి?
- కాపు సంఘ సమావేశంలో కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం



తాడేపల్లిగూడెం నియోజకవర్గ కాపు సంఘ సమావేశంలో మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం. చిత్రంలో కొట్టు సత్యనారాయణ తదితరులు

తాడేపల్లిగూడెం: ప్రజాసేవ అనే మాట పలకని పవన్‌కళ్యాణ్ తన జనసేన పార్టీని ప్యాకప్ చేసి, సినిమా షూటింగ్‌లకు వెళ్లిపోవడం మంచిదని కాపు ఉద్యమ నేత, మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు ముద్రగడ పద్మనాభం సూచించారు. సినిమాల్లో నటించు.. కానీ రాజకీయాల్లో నటించొద్దంటూ హితవు పలికారు. ఈరోజు పేదల నోట్లోకి ఐదువేళ్లు వెళ్తున్నాయంటే అది జగన్ దయేనని.. పేదలను ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్ బాగుండాలని, ఆయన పది కాలాలపాటు పేదలకు సేవచేయాలని ముద్రగడ ఆకాంక్షించారు. జగన్ ప్రకటించిన అభ్యర్థులను బలపరచాలని, వారి విజయానికి సహకరించాలని కోరారు. తాడేపల్లిగూడెంలో గురువారం జరిగిన కాపు సంఘీయుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముద్రగడ మాట్లాడుతూ.. కాపు యువత జీవితాలతో ఆడుకోవద్దని పవన్‌ను కోరారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

కాపు, తెలగ, బలిజలను మోసగించిన బాబు..

2014లో కాపు, తెలగ, బలిజలకు రిజర్వేషన్లు పునరుద్ధరిస్తానని చెప్పి చంద్రబాబు మోసగించాడు. ఇచ్చిన హామీని అమలుచేయమంటే నన్ను, నా కుటుంబాన్ని తీవ్రంగా అవమానించారు. ఆ ఐదేళ్లూ చంద్రబాబు పక్కనే ఉన్న పవన్ ముద్రగడను అలా ఎందుకు అవమానించారని ఏనాడైనా అడిగారా? పవన్‌కు దమ్ము, ధైర్యం ఉండి మగాడైతే నన్ను తిట్టాలి.. అంతేగానీ మెసేజ్‌లు పెట్టడం మగతనం అనిపించుకోదు.

21 సీట్లకు పరిమితం కావడం దారుణం..

తెలుగుదేశం గ్రాఫ్ పూర్తిగా పడిపోయిన సమయంలో పవన్ పొత్తువల్ల టీడీపీ గ్రాఫ్ పెరిగింది. పవన్ ముఖ్యమంత్రి కావాలని అందరూ కోరుకునేవారు. 80 సీట్లు తీసుకుని, పవర్‌లో షేరు అడగాలని అందరూ భావించారు. కానీ, చంద్రబాబు మాత్రం లోకేశ్‌ను ముఖ్యమంత్రిని చేయడానికి తనయుడితో యువగళం పాదయాత్ర చేయించారు. అడగాల్సినన్ని సీట్లు అడగకుండా.. పవర్ షేరింగ్ లేకుండా కేవలం 21 సీట్లకు పవన్ పరిమితం అయిపోవడం చాలా దారుణం. ఆ సీట్లు కూడా త్యాగం చేసి ఉంటే బాగుండేది.

మీకు చెప్పుకోవడానికి ఏమీలేదా బాబూ?

అసలు పేదల కోసం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను మీరు అధికారంలోకి వస్తే చేస్తానని చెప్పడం ఏంటి.. మీకంటూ సొంతంగా చెప్పుకోడానికి ఏమీ లేవా బాబూ? ఈ మాటలు చెప్పడానికి మీరు సిగ్గుపడటంలేదేమోగాని వినడానికి మాకు సిగ్గుగా ఉంది. వైఎస్సార్‌సీపీ ఓటుకు లక్ష రూపాయలు ఇస్తుందని మీరు చెప్పడం చూస్తే పిఠాపురం ప్రజలు అమ్ముడుపోయే మనుషుల్లా కనపడుతున్నారా పవన్? అయినా అధికారంలోకి వస్తే స్వచ్ఛమైన నీరు ఇస్తామని చెప్పాలిగానీ స్వచ్ఛమైన సారా ఇస్తామని చెప్పడం ఏమిటి? నిజానికి.. పవన్ కళ్యాణ్ ముందుగా తాడేపల్లిగూడెం నుంచి పోటీచేయాలనుకున్నారు. అయితే ఇక్కడి జనసేన అభ్యర్థి త్యాగాలు చేయడానికి సిద్ధంగాలేనని, వస్తే కాలూచేయీ తీసేస్తానని బెదిరించడంతో పవన్ పిఠాపురం వెళ్లిపోయారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్-2024 రిజిస్ట్రేషన్ తేదీల మార్పు

- ఈ నెల 27 నుంచి మే 7 వరకు అవకాశం
- కొత్త షెడ్యూల్‌ను ప్రకటించిన ఐఐటీ మద్రాస్

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రిజిస్ట్రేషన్ తేదీలను మద్రాస్ ఐఐటీ మార్చింది. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 21 నుంచి 30 వరకు 'అడ్వాన్స్‌డ్' కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అయితే, ఐఐటీ మద్రాస్ కొత్త షెడ్యూల్‌ను విడుదల చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 27 నుంచి మే 7వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించింది. పరీక్ష తేదీలో ఎలాంటి మార్పు లేదని, తొలుత ప్రకటించిన ప్రకారం మే 26న పరీక్ష జరుగుతుందని పేర్కొంది. తాజాగా మార్చిన తేదీల ప్రకారం మే 10 సాయంత్రం 5 గంటల వరకు జేఈఈ అడ్వాన్స్‌డ్ దరఖాస్తు ఫీజు చెల్లించవచ్చు. మే 17 నుంచి 26 వరకు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు (అడ్మిట్ కార్డులు) డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పరీక్ష అనంతరం అభ్యర్థుల రెస్పాన్స్ షీట్లు మే 31 నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ప్రాథమిక ఆన్సర్ 'కీ' జూన్ 2న విడుదల చేస్తారు. అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుది కీ, ఫలితాలను జూన్ 9న ఉదయం 10 గంటలకు ప్రకటిస్తారు. ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ రిజిస్ట్రేషన్ జూన్ 9, 10 తేదీ సాయంత్రం వరకు చేసుకోవచ్చు.

చంద్రబాబు పేదల ద్రోహి

"ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుచేయాలంటే రూ.350 కోట్లు ఖర్చవుతుంది. దాని నిర్వహణ కోసం ఏటా రూ.30 కోట్లు కావాలి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏం బాగోలేదు. ఈ క్రమంలో అన్ని ప్రభుత్వమే చేయాలంటే సాధ్యంకాదు. ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే ప్రైవేట్ వైద్య కళాశాలల ఏర్పాటుకు అనుమతులిస్తాం."

- వెనుకబడిన విజయనగరం జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుచేయాలని గత టీడీపీ ప్రభుత్వాన్ని కోరగా అసెంబ్లీలో నాటి వైద్య, ఆరోగ్య మంత్రి కామినేని శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలు.

సాక్షి, అమరావతి: నాటి చంద్రబాబు ప్రభుత్వ పెత్తందారు పోకడలకు కామినేని వ్యాఖ్యలు అద్దంపట్టాయి. విద్య, వైద్యం ఈ రెండింటినీ ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తేనే పేదలకు ప్రయోజనం. ఇందుకోసం ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ఈ ప్రాథమిక సూత్రానికి తిలోదకాలు వదిలి.. ప్రభుత్వ రంగంలో విద్య, వైద్య వ్యవస్థలను నిర్వీర్యం చేసి, ప్రైవేట్ వ్యక్తుల ప్రయోజనాలకు కొమ్ముకాశారు చంద్రబాబు. ఫలితంగా ఆయన జమానాలో కొత్తగా ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటుకాకపోవడం, ప్రైవేట్ కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లు కొనలేక వేల మంది పేద విద్యార్థుల వైద్యవిద్య కల కలగానే మిగిలిపోయింది. బాబు సీఎంగా ఉన్న రోజుల్లో ప్రైవేట్ వైద్య కళాశాలల ఏర్పాటుపై చూపిన శ్రద్ధ ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుపై ఏనాడు చూపలేదు. ఫలితంగా ఆయన పేదల ద్రోహిగా మిగిలిపోయారు.

బాబు చూపిన చొరవ శూన్యం..

'40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉంది. 14 ఏళ్లు సీఎంగా పనిచేశా. దేశంలో నాకంటే సీనియర్ నాయకుడు ఎవరూలేరు'.. అని తరచూ చంద్రబాబు గొప్పగా చెప్పుకుంటారు. ఇంత డబ్బా కొట్టుకునే పెద్దమనిషి రాష్ట్రంలో ప్రభుత్వ పరిధిలో వైద్య కళాశాలల ఏర్పాటులో చూపెట్టిన శ్రద్ధ మాత్రం గుండుసున్నా. నిజానికి.. 2019లో బాబు దిగిపోయే నాటికి రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో 11 కళాశాలలు ఉండగా.. ఆంధ్ర, గుంటూరు వైద్య కళాశాలలు స్వాతంత్ర్యానికి ముందే ఏర్పాటయ్యాయి. టీడీపీ ఏర్పడే నాటికి ఉమ్మడి రాష్ట్రంలో కర్నూలు, కాకినాడ రంగరాయ, తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలలు ఏర్పడ్డాయి. అంటే.. టీడీపీ ఆవిర్భవించి ఎన్టీఆర్ సీఎం అయ్యే నాటికే రాష్ట్రంలో ఐదు వైద్య కళాశాలలున్నాయి. 1986లో సిద్ధార్థ వైద్య కళాశాలను ఎన్టీఆర్ ప్రభుత్వంలోకి మార్చారు. ఇలా మొత్తంగా 2004 నాటికి రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో ఏడు కళాశాలలు ఉన్నాయి. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎం అయ్యాక ప్రభుత్వ రంగంలో వైద్యసేవలను బలోపేతం చేయడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఇందులో భాగంగా కడప, శ్రీకాకుళం, ఒంగోలు రిమ్స్‌లు ఏర్పాటుచేశారు. నెల్లూరులో ఏసీఎస్సార్ కళాశాల ఏర్పాటుకు వైఎస్సార్ సానుకూలంగా స్పందించగా, ఆయన అకాల మరణం అనంతరం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే ఆ కళాశాలను ప్రారంభించింది. ఈ లెక్కన పరిశీలిస్తే మూడుసార్లు సీఎంగా పనిచేసిన బాబు తన జమానాలో ప్రభుత్వ రంగంలో వైద్యవిద్య బలోపేతంపై ఏమాత్రం పట్టించుకోలేదు.

కేంద్రంలో భాగస్వామిగా ఉండి..

ఇక 2014లో బీజేపీతో పొత్తు పెట్టుకుని రాష్ట్రంలో టీడీపీ గెలుపొందింది. కేంద్రంలో భాగస్వామిగా కూడా కొనసాగింది. అప్పుడు కూడా రాష్ట్రంలో ఒక్కటంటే ఒక్క కొత్త ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు దిశగా చంద్రబాబు ప్రభుత్వం అడుగులు వేయలేదు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూ సాకులు చెప్పి ప్రైవేట్ వైద్య కళాశాలల ఏర్పాటుకు అనుమతులిచ్చి తన వాళ్ల జేబులు నింపడానికే శ్రద్ధ చూపారు. పేదలకు ద్రోహం చేస్తూ విద్య, వైద్య రంగాలను చంద్రబాబు ప్రైవేట్ వ్యక్తుల కబంధ హస్తాల్లో పెట్టారు. దీంతో.. కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటవ్వక మన విద్యార్థులు వైద్యవిద్య కోసం వలసలు వెళ్తున్నా.. చేరువలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు లేక ప్రజలు విలవిల్లాడుతున్నా రాజగురువు, రామోజీ ఫిల్మ్‌సిటీ జమిందారు రామోజీ మాత్రం చూసిచూడనట్లు వ్యవహరించారు.

చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఏర్పాటైన ప్రైవేట్ వైద్య కళాశాలలు..

కళాశాల	సంవత్సరం
ఏఎస్ఆర్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఏలూరు	2000
అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, చిత్తూరు	2016
పిన్నమనేని సిద్ధార్థ, చిన్న అవుటపల్లి, కృష్ణాజిల్లా	2002
గాయత్రీ విద్య పరిషత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌కేర్, మెడికల్ టెక్నాలజీ, విశాఖపట్నం	2016
గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్, విశాఖపట్నం	2015
జీఎస్ఎల్ మెడికల్ కాలేజ్, రాజమండ్రి	2002
కాటూరి మెడికల్ కాలేజ్, గుంటూరు	2002
మహారాజ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, విజయనగరం	2002
నారాయణ మెడికల్ కాలేజ్, నెల్లూరు	2000
నిమ్రా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్	2016
ఎన్ఆర్ఐ, గుంటూరు	2003
పీఈఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్, కుప్పం	2001

సువర్ణాధ్యాయం లిఖించిన సీఎం జగన్



2019లో సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టాక ప్రభుత్వ రంగంలో ఏకంగా రూ.8వేల కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటుచేయాలని సంకల్పించారు. తద్వారా ఆంధ్ర రాష్ట్ర వైద్య విద్య చరిత్రలో సువర్ణాధ్యాయాన్ని లిఖించారు. ఇందులో భాగంగా.. 2023–24 విద్యా సంవత్సరంలో విజయనగరం, ఏలూరు, రాజమండ్రి, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలలను ప్రారంభించి 750 సీట్లను అందుబాటులోకి తెచ్చారు. 2024–25 విద్యా సంవత్సరంలో పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లె, పాడేరు కళాశాలలను ప్రారంభించబోతున్నారు. మిగిలిన ఏడు 2025–26లో ప్రారంభించనున్నారు. వీటి ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో కొత్తగా 2,550 ఎంబీబీఎస్ సీట్లను సీఎం జగన్ సమకూరుస్తున్నారు. వాస్తవానికి.. 2019 నాటికి రాష్ట్రంలో కేవలం 11 ప్రభుత్వ వైద్య కళాశాలలు మాత్రమే ఉన్నాయి. కానీ, వందేళ్ల చరిత్రలో ఎన్నడూ లేనట్లుగా ఒకేసారి 17 ప్రభుత్వ వైద్య కళాశాలలు స్థాపించడానికి చర్యలు తీసుకున్న ఏకైక ప్రభుత్వంగా కూడా సీఎం జగన్ ప్రభుత్వం రికార్డుకెక్కింది. కరోనా వ్యాప్తి, లాక్‌డౌన్ వంటి ప్రతికూల పరిస్థితులకు ఎదురొడ్డి సీఎం జగన్ వైద్య కళాశాలల ఏర్పాటు ద్వారా మన విద్యార్థులకు వైద్యవిద్య అవకాశాలు పెంచడంతో పాటు, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను చేరువ చేయడానికి కృషిచేశారు.



సీఎంను కించపరిచేలా కూటమి నేతల వ్యాఖ్యలు

ఎన్నికల కమిషన్‌కు ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఫిర్యాదు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కించపరిచేలా కూటమి నేతలు చేస్తున్న వ్యక్తిగత దాడులపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు కోరారు. నవరత్నాల కార్యక్రమం ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఎ. నారాయణమూర్తితో కలిసి ఈసీకి గురువారం ఆధారాలతో ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరిలకు ఎన్నికల సంఘం నోటీసులు ఇస్తున్నా.. తీరు మారడం లేదన్నారు. కోర్టు పరిధిలో ఉన్న వివేకానందరెడ్డి కేసును పదేపదే ప్రస్తావిస్తున్నారని.. బాబుకు గొడ్డలిపై ఉన్న శ్రద్ధ, ప్రజా క్షేమంపై లేదని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష పాత్ర పోషించడంలోనూ బాబు ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు తెలుగుదేశం పంపిస్తున్న వాయిస్ మెసేజ్‌లనూ మరోసారి ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. మరోవైపు అల్లర్లు సృష్టించే వారు, పోలీస్ కేసులు ఉన్న వారిని కూడా పోలింగ్ ఏజెంట్లుగా నియమించుకునే అవకాశం కల్పించాలని తెలుగుదేశం పార్టీ ఎలక్షన్ కమిషన్‌ను కోరడం హాస్యాస్పదమని మల్లాది విష్ణు అన్నారు. టీడీపీ ఒక ఫేక్ పార్టీ అని విమర్శించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను మసకబార్చేలా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దళితుల గురించి మాట్లాడే నైతిక అర్హత చంద్రబాబుకు, టీడీపీకి ఏమాత్రం లేదని అన్నారు. హోం మంత్రిగా, డిప్యూటీ సీఎంగా.. ఇలా దళితులను కేబినెట్లో అగ్రస్థానంలో కూర్చోబెట్టిన ఏకైక సీఎం జగన్ అని చెప్పారు. చంద్రబాబు అధికారంలో ఉన్నంతకాలం దళితుల ఆత్మాభిమానం దెబ్బతీసేలా మాట్లాడటమే తప్ప.. వారి సంక్షేమాన్ని ఏనాడూ పట్టించుకోలేదని గుర్తుచేశారు. 2014–19, 2019–24 మధ్య కాలంలో బడ్జెట్ కేటాయింపులు చూసుకుంటే.. ఎవరి హయాంలో దళిత సోదరులకు ఎక్కువ మేలు జరిగిందో తెలుస్తుందన్నారు. తెలుగుదేశంతో పోలిస్తే.. అన్ని రంగాలలోనూ ఈ ప్రభుత్వం నూటికి నూరు శాతం మెరుగైన ప్రగతిని సాధించిందని వివరించారు. మంత్రిగా ఉండి ఘోరపరాజయం మూటగట్టుకున్న దేవినేని ఉమా కూడా సీఎం బస్సు యాత్రపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని విష్ణు అన్నారు.



భూమిలోకి ప్రవేశించేది మరియు దాని నుండి బయటికి వచ్చేది మరియు ఆకాశం నుండి దిగేది మరియు దానిలోకి పైకి ఎక్కిపోయేది, అంతా ఆయనకు బాగా తెలుసు. మరియు ఆయన అపార కరుణాప్రదాత, క్షమాశీలుడు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 12 ఏప్రిల్ 2024

మన చదువుకు కీర్తి కిరీటం!

అంతర్జాతీయంగా మన ఉన్నత విద్యారంగం వెలుగులీనుతున్న వైనాన్ని వరసగా మూడో ఏడాది కూడా క్యూఎస్ (క్వాక్వరెలీ సైమండ్స్) జాబితా నిరూపించింది. బుధవారం ప్రకటించిన ఆ జాబితాలో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం(జేఎన్‌యూ) దేశంలోనే ప్రథమ స్థానం సంపాదించింది. అంతర్జాతీయంగా అభివృద్ధి అధ్యయనాల విభాగంలో 20వ ర్యాంకు సాధించి తనకెవరూ సాటిలేరని నిరూపించింది. వామపక్ష భావజాలం బలంగావున్న విద్యాసంస్థగా ముద్ర వున్న జేఎన్‌యూ ప్రతియేటా విద్యాప్రమాణాల విషయంలో తన సత్తా చాటుతూనే వస్తోంది. ఇక అహ్మదాబాద్ ఐఐఎం 25వ ర్యాంకు, బెంగళూరు, కలకత్తా ఐఐఎంలు 50వ స్థానంలోనూ వున్నాయి. డేటా సైన్స్‌లో, పెట్రోలియం ఇంజనీరింగ్‌లో గువాహటి ఐఐటీ క్యూఎస్ జాబితాలో చోటు సంపాదించుకుంది. పరిశోధనా రంగంలో మన దేశం నాలుగో స్థానంలో వుండటం ఈసారి చెప్పుకోదగిన అంశం. ఈ విషయంలో మనం బ్రిటన్‌ను అధిగమించటం గమనించదగ్గది. ఒకప్పుడు మన పరిశోధనలకు పెద్ద విలువుండేది కాదు. రెండేళ్లుగా ఈ ధోరణి మారడం మంచి పరిణామం.

క్యూఎస్ ర్యాంకుల జాబితా అంతర్జాతీయంగా ప్రతిష్ఠాత్మకమైనది. 96 దేశాల్లోని 1,559 విశ్వవిద్యాలయాల తీరుతెన్నులు 55 శాస్త్రాల్లో ఎలావున్నవో అధ్యయనం చేసి ఈ ర్యాంకులు నిర్ణయిస్తారు. ఇందుకు క్యూఎస్ పెట్టుకున్న కొలమానాలు ఆసక్తికరమైనవి. దేశంలోని విద్యాసంస్థలు వాటిని గమనిస్తే మన విద్యావ్యవస్థ ఎంతోకొంత మెరుగుపడుతుంది. విద్యా విషయక కార్యక్రమాల్లో, పరిశోధనల్లో ఒక విశ్వవిద్యాలయం పనితీరు ఎలావున్నదో అంతర్జాతీయంగా భిన్న రంగాల్లో నిష్ణాతులైనవారి అభిప్రాయాలు తీసుకుంటారు. అలాగే ఫలానా యూనివర్సిటీనుంచి వచ్చే పట్టభద్రుల్లో నైపుణ్యాలూ, సామర్థ్యమూ ఎలావున్నాయో వివిధ కంపెనీలనూ, సంస్థలనూ అడిగి తెలుసుకుంటారు. అధ్యాపకులు, విద్యార్థుల నిష్పత్తి, చదువు విషయంలో విద్యార్థులకు అందుతున్న మద్దతు వగైరాలు ఆరా తీస్తారు. అధ్యాపకుల ప్రమాణాలతోపాటు అధ్యాపకవర్గంలో వైవిధ్యత చూస్తారు. అంతర్జాతీయ నేపథ్యంవున్న అధ్యాపకులు, విద్యార్థులు ఎందరున్నారన్నది లెక్కేస్తారు. శాస్త్ర సాంకేతిక విద్యలో, తత్వశాస్త్ర విద్వత్తులో మన ప్రతిభావ్యుత్పత్తులు సాటిలేనివన్న ఖ్యాతి వుండేది. ఐటీరంగంలో మనవాళ్ల బుద్ధికుశలత వారిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లిన దాఖలాలు కనబడుతూనే వున్నాయి. అయితే అంతర్జాతీయ ర్యాంకింగ్‌ల విషయంలో మన విశ్వవిద్యాలయాలు వెనకబడివుండేవి. ఆ కొలమానాలు, అందుకనుసరించే పద్ధతులు సక్రమంగా వుండవనీ, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదనీ కొందరు విద్యావేత్తలు అనేవారు. మనకు ఇష్టం వున్నా లేకున్నా ఆ ప్రమాణాలు అందుకోవటం తప్పదు. ఎందుకంటే ప్రపంచం నలుమూలలా వుండే విద్యార్థులు ఉన్నత విద్య కోసం మన గడప తొక్కాలంటే అది తప్పనిసరి. వివిధ దేశాల్లోని విద్యాసంస్థలందించే విద్య ఎలావున్నదో తులనాత్మక అధ్యయనం చేయటంవల్ల ఎవరు ఏ రంగంలో ముందంజలో వున్నారన్న సమాచారం వెల్లడవుతుంది. అది పై చదువులకెళ్లే విద్యార్థులకు మాత్రమే కాదు... పరిశోధకులకూ ప్రయోజనకారిగా వుంటుంది. అలాగే అంతర్జాతీయంగా ఎవరి భాగస్వామ్యం పొందితే మన విశ్వవిద్యాలయాల ప్రమాణాలు మెరుగుపడతాయో విధాన నిర్ణేతలు నిర్ధారించుకుంటారు. అయితే సంపన్న, వర్ధమాన దేశాల విశ్వవిద్యాలయాల మధ్య పోటీ పెట్టడం ఎంత మాత్రమూ సరైంది కాదన్న వాదనలు ఎప్పటినుంచో వున్నాయి. పరిశోధనలకూ లేదా పరికల్పనలకూ సంపన్న దేశాల్లో ప్రభుత్వాలనుంచీ, ప్రైవేటు వ్యక్తులనుంచీ నిధుల రూపంలో అందే ప్రోత్సాహం అంతా ఇంతా కాదు. ఇక్కడ అది చాలా అరుదు. మన విశ్వవిద్యాలయాలు వెనకబడి వుండటానికి అదొక కారణం. ఇక ఇతర విశ్వవిద్యాలయాల గురించి మాట్లాడుకోవాలి. మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని తొలి యూపీఏ ఏలుబడిలో 2005లో దోహాలో జరిగిన డబ్ల్యూటీఓ–గాట్స్ సంభాషణల్లో సూత్రప్రాయంగా అంగీకరించిన పర్యవసానంగా ఇతర రంగాలతోపాటు విద్య కూడా ఖరీదైన వ్యవహారంగా మారింది. విదేశీ వర్సిటీలకు మన దేశం తలుపులు తెరిచింది. 2017లో నైరోబీలో జరిగిన డబ్ల్యూటీఓ సమావేశంలో ఎన్‌డీఏ సర్కారు సంతకం చేశాక 62 ఉన్నత విద్యాసంస్థలకు 'ఆర్థిక స్వయంప్రతిపత్తి' మొదలైంది. ఇది పరిమిత స్థాయిలోనైనా ప్రభుత్వ రంగ ఉన్నత విద్యా సంస్థలను ప్రైవేటీకరించటమే. పర్యవసానంగా ఉన్నత విద్యను అందుకోవటం నిరుపేద వర్గాలకు కష్టమవుతోంది. దానికితోడు అధ్యాపక నియామకాల్లోనూ, మౌలిక సదుపాయాలు కల్పించటంలోనూ ప్రభుత్వాలనుంచి మద్దతు కొరవడుతోంది. ఏతావాతా చాలా విశ్వవిద్యాలయాలు గత వైభవ చిహ్నాలుగా మిగిలాయి. ఇప్పుడు ఉన్నత శ్రేణి ర్యాంకులు పొందిన విద్యాసంస్థలకు దీటుగా ఇతర సంస్థలను కూడా తీర్చిదిద్దకపోతే, అన్ని వర్గాలకూ అందుబాటులోకి రాకపోతే 'స్కిల్ ఇండియా' వంటివి నినాదప్రాయమవుతాయని పాలకులు గుర్తించాలి.

ఉన్నత విద్యను అందుకోవాలనుకునే పేద వర్గాల పిల్లలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం కల్పిస్తోంది. ఈ విధానం కింద దేశంలోనే కాదు... అంతర్జాతీయ అగ్రశ్రేణి సంస్థల్లో సీటు సంపాదించుకునేవారికి సైతం భారీ మొత్తాల్లో ఫీజులు చెల్లించటానికి సిద్ధపడుతోంది. వారు చదువుకునే కాలంలో అయ్యే వ్యక్తిగత ఖర్చు కూడా భరిస్తోంది. ఈ మాదిరి విధానం ఇతర రాష్ట్రాల్లో లేదు. క్యూఎస్ ర్యాంకుల జాబితా ఇలాంటి అంశాలపై పాలకులు దృష్టి సారించేలా చేయగలిగితే, లోపాలను సరిదిద్దగలిగితే అది మన విద్యా, వైజ్ఞానిక రంగాలను అత్యున్నత స్థాయికి చేరుస్తుంది.

ఫర్ డెమాక్రసీ? అగేనెస్ట్ డెమాక్రసీ?

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

'సిటిజెన్స్ ఫర్ డెమాక్రసీ' ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి, ముఖ్యంగా ఈ ఎన్నికల్లో కాపాడటానికి పుట్టినట్టు కనిపిస్తుంది. ఈ సంస్థ చేసిన అతి గొప్ప పని ముసలివాళ్ళకు, గుడ్డివాళ్ళకు, కుంటివాళ్ళకు ఇంటి దగ్గరే పింఛన్లను అందించే కార్యక్రమాన్ని ఆపించడం. ఇందుకోసం ముందు కోర్టుకు పోయింది. తరువాత ఎన్నికల కమిషన్ వద్దకు పోయి ఆపించింది. ఎందుకు? జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నియమించిన 2,50,000 మంది వలంటీర్లు ఫించన్ల పంపిణీ ద్వారా ఓటును ప్రభావితం చేస్తారని. ఇదో కొత్త వాదన, వింత వాదన. ఈ అప్రజాస్వామిక సంస్థ చెయ్యబట్టి 30కి పైగా ముసలివాళ్ళు చనిపోయారని వార్తలు వస్తున్నాయి. ఇంత దారుణానికి ఒడిగట్టిన ఈ సంస్థను ప్రజలు గౌరవిస్తారా?

వైసీపీ ప్రభుత్వం పెద్ద సంఖ్యలో వలంటీర్లను కాంట్రాక్టు ఉద్యోగ పద్ధతిలో నియమించింది. వారినందరినీ ఉద్యోగాల నుండి తీసేసే అధికారం ఈసీకి కూడా లేదు. వలంటీర్లు చేసే అతిమానవత్వపు పని ముసలోళ్ళకు, కుంటోళ్ళకు, గుడ్డోళ్ళకు ఒకటో తారీఖు నాడు పెన్షన్ డబ్బు వాళ్ళ ఇంటి వద్ద అందించడం. అదికాక వీళ్లు ఇంకా చాలా పనులు తమ క్లస్టర్స్ (దాదాపు 50 కుటుంబాలు)లో చేస్తారు. దాదాపు నాలుగున్నర సంవత్సరాలకు పైగా ఆ కుటుంబాలతో, ఆ ముసలి వారితో, రోగస్థులతో సంబంధంలో ఉండి వారి మెప్పును పొందిన వలంటీర్లను ఎన్నికలయ్యే వరకు వారిని కలిసి మాట్లాడకుండా ఎలా ఆపుతారు?

అంతేకాదు, ప్రభుత్వ వెల్‌ఫేర్ స్కీముల కిందికొచ్చే ప్రజలు ఏ రాష్ట్రంలోనైనా మెజారిటీ. అటువంటి కుటుంబాలన్నిటితో ఈ వలంటీర్లు చాలా ఇతర స్కీముల ద్వారా కూడా కలుస్తారు కదా. ఆరోగ్య సంబంధ స్కీములు, గర్భిణీ స్త్రీలకు సంబంధించిన అవసరాలు, స్కూలు పిల్లలకు ఉన్న అవసరాలు, రేషనుకు సంబంధించిన అవసరాలు అన్నీ వాళ్లు ఇంటింటికి తీరుస్తున్నారు. ఈ క్రమంలో వాళ్ళకు చెడ్డ పేరొస్తే తప్ప, మంచి పేరుతో, సహాయ సహకార సంబంధాలలో వలంటీర్లు ఉంటే వారి సంబంధాల్ని సిటిజెన్స్ ఫర్ డెమాక్రసీ గానీ, ఈసీగానీ ఎలా ఆపుతాయి? ఈ పనిని ఈ సంస్థ డెమాక్రసీకి అనుకూలంగా కాదు చేసింది; డెమాక్రసీ వ్యతిరేక బుద్ధితో చేసినట్లు అర్థమౌతూనే ఉంది. ఈ వలంటీర్లు ఆయా గ్రామాల వారే, వాడల వారే. పట్టణాల్లో కూడా వాళ్ళు పనులు చేసే కుటుంబాలకు తెలిసిన వారే. వీళ్ళు నిత్య సంబంధాలు ముసలోళ్ళకు, కుంటోళ్ళకు, గుడ్డోళ్ళకు ఫించను ఇవ్వకుండా ఆపితే ఆగుతాయా?

అప్పుడు ఈ సంస్థ ఏమి చెయ్యాలి? ఈ వలంటీర్ల ఉద్యోగాలు పీకించి గ్రామ బహిష్కరణ చేయించాలి. అప్పుడు వీళ్ళు నిజమైన సిటిజెన్స్ ఫర్ డెమాక్రసీ పని చేసినట్టు! కానీ అది వారి నుంచి కాదు కనుక ఈ ఒక్క డిమాండ్ సాధించారు. ఈ పని చేసింది ప్రజాస్వామ్యం కోసమా, ప్రతిపక్షాల కోసమా?

అసలు ఈ సంస్థ ఏర్పడిన విధానం, దాని లక్ష్యం, అది సాధించిన ఘనతలను చూద్దాం. ఇది 2023 అక్టోబర్‌లో విజయవాడలో ఏర్పడింది. మాజీ ఏపీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ (రిటైర్డ్ ఐఏఎస్) జనరల్ సెక్రటరీగా ఏర్పడింది. మాజీ ఛీఫ్ సెక్రటరీ ఎల్‌వీ సుబ్రహ్మణ్యం (రిటైర్డ్ ఐఏఎస్) ఇందులో ముఖ్యంగా పని చేస్తున్నారు. ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లోనే డెమాక్రసీని కాపాడటానికి, ముఖ్యంగా ఈ ఎన్నికల్లో కాపాడటానికి పుట్టినట్టు కనిపిస్తుంది. ఈ ఇద్దరికి పౌరహక్కుల గురించి ఎన్నడూ మాట్లాడిన చరిత్ర లేదు. ఆదివాసుల్లోగానీ, దళితుల్లోగానీ వీరికి అభిమానులు ఉన్నట్లు ఎక్కడా కనిపించదు.



ఇంతకుముందు ఐఏఎస్ అధికారులు పదవుల్లో ఉండగా, దిగిపోయాక కూడా ప్రజల హక్కుల కోసం పని చేసినవాళ్ళు ఉన్నారు. మన ఉమ్మడి రాష్ట్రంలో ఎస్ఆర్ శంకరన్, కాకి మాధవరావు చాలా కాలం ఇటువంటి పని చేశారు. ఆదివాసుల కోసం బీడీ శర్మ చాలా పనిచేశారు. శంకరన్ రిటైర్ అయ్యాక కమిటీ ఆఫ్ కన్సర్న్‌డ్ సిటిజన్స్ అనే సంస్థ పెట్టి బీద ప్రజల కోసం, పౌర హక్కుల రక్షణ కోసం చాలా పనిచేశారు. ఆయన మరణానంతరం దళిత సంఘాలు ఈనాటికీ ఆయన సంస్మరణ సభలు జరుపుతాయి. కాకి మాధవరావు ఫోరమ్ ఫర్ సోషల్ జస్టిస్‌లో చాలా చురుకుగా పనిచేశారు. బీడీ శర్మ ఆదివాసుల హక్కుల కోసం తన జీవిత కాలమంతా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారు.

అందుకు భిన్నంగా రమేష్ కుమార్, సుబ్రహ్మణ్యం... చంద్రబాబు నాయుడి ఏజెంట్లుగా వ్యవహరించారని స్పష్టంగా అర్థమౌతూనే ఉంది. దానివల్ల ఎవరి హక్కులు భంగమయ్యాయి? అతి బీద, ముసలి, కుంటి, గుడ్డి వారి హక్కులు భంగమయ్యాయి. చాలా బాధాకరమైన విషయమేమంటే ఈ అప్రజాస్వామిక సంస్థ చెయ్యబట్టి 30కి పైగా ముసలివాళ్ళు చనిపోయారని వార్తలు వస్తున్నాయి. ఇంత దారుణానికి ఒడిగట్టిన సిటిజెన్స్ ఫర్ డెమాక్రసీ అనే పేరు గల సంస్థను ప్రజలు గౌరవిస్తారా?

ఇప్పుడు పరిస్థితి చూడండి. అదే చంద్రబాబు నాయుడు నేను వలంటరీ వ్యవస్థను కొనసాగిస్తాను; వాళ్ళందరికీ నెలకు 10 వేలు ఇస్తానంటున్నాడు ఎందుకు? మొత్తం ప్రజానీకంలో ఆయన ఆట బొమ్మలైన మాజీ ఐఏఎస్ అధికారులు చేసిన పనివల్ల మొత్తం కూటమి ఓట్లు గల్లంతయ్యే పరిస్థితి వచ్చింది. ఈ కూటమి కూడా ఒక ఉమ్మడి మానిఫెస్టోను ప్రకటించలేదు. ఎవరిది వాళ్ళు మానిఫెస్టోగా రాసుకున్నారు. కానీ రేపు అధికారమొస్తే ముగ్గురు మంత్రి మండలిలో ఉండి పరిపాలించాలి. చంద్రబాబు ఇప్పుడు ఇచ్చే హామీలు బీజేపీ, జనసేనవి కావు కదా! వాళ్ళెందుకు అంగీకరిస్తారు? ఆయన పబ్లిక్ మీటింగుల్లో ఇష్టమొచ్చినట్లు వాగ్దానాలు చేస్తున్నాడు.

మరో వాగ్దానం చూడండి. ఆయన అధికారంలోకి వస్తే ప్రతి స్త్రీకి సంవత్సరానికి 15 వేలు ఇస్తాడట. ఇంట్లో ఎంతమంది స్త్రీలు ఉంటే అన్ని పదిహేను వేలు ఇస్తాడట. ఇద్దరుంటే 30 వేలు, ముగ్గురుంటే 45 వేలు అంటున్నాడు. ఈ పైసల పంపకాన్ని బీజేపీ ఒప్పుకుంటుందా! అందుకు మోదీ సరే అన్నాడా? చంద్రబాబు హామీలు జగన్ హామీలలా కాదే. జగన్ అన్నీ స్వయంగా తన పార్టీలో నిర్ణయించగలడు. కానీ బాబు ఇప్పుడు అలా చెయ్యలేడే. బీజేపీ ఒక జాతీయ పార్టీ. దానికి 30 వేల ఎకరాల్లో వేల కోట్లు పెట్టి రాజధాని కట్టడమే అంగీకారం కాదు. ఇప్పుడు ఆంధ్రలో వలంటరీ వ్యవస్థను అంగీకరిస్తే దేశమంతా అటువంటి డిమాండ్లు వచ్చే అవకాశముంది. కనుక బాబు బోగస్ వాగ్దానాలు ఇస్తున్నాడు. ఆయన అయోమయంలో మాట్లాడుతున్నాడు.

ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు దేశంలో చాలా అంశాలను ప్రభావితం చేస్తాయి. ప్రశాంత్ కిశోర్ డబ్బులతో ఎన్నికల రిజల్ట్ ప్రిడిక్షన్స్ చేస్తూ స్వంత పార్టీ పెట్టి బిహార్‌లో ఏ మాత్రం గుర్తింపు లేని నాయకుడుగా మిగిలిపోయి ఇప్పుడు మళ్ళీ పాత అవతారమెత్తుతున్నాడు. ఏపీ ఎన్నికలు అతన్ని దేశంలోనే ఎవరూ నమ్మకుండా చేసే అవకాశముంది. విదేశాల్లో ఇంగ్లిష్ మీడియంలో చదువుకొని వచ్చిన ఈ బ్రాహ్మణ మేధావి ఇంగ్లిష్ మీడియం విద్యా ప్రభావంగానీ, సంక్షేమ పథకాల ప్రభావంగానీ ఎన్నికల్లో ఉండదని ఊకదంపుడు బ్రాహ్మణ వాదం చేస్తున్నాడు. బడులు కాకుండా, గుడులు కడితే ప్రజలు ఓట్లేస్తారని వీరి సిద్ధాంతం. రిటైర్డ్ ఐఏఎస్‌లు పౌరహక్కుల నాయకుల అవతారమెత్తి ముసలోళ్ళను, కుంటోళ్లను, గుడ్డోళ్ళను ముంచితే వారి నాయకుడు చంద్రబాబు వలంటీర్లను, అమరావతి రైతులను అంతు లేని ఆశలతో ముంచుదామని చూస్తున్నాడు. కానీ ప్రజలు నమ్మే పరిస్థితి కనిపిస్తలేదు. ఎలా నమ్ముతారు? జగన్ వెల్‌ఫేర్ కార్యక్రమాల వల్ల రాష్ట్రం అప్పుల పాలైంది; అభివృద్ధి అంటే సింగపూర్ వంటి రాజధాని కట్టలేదు; అద్దంలా మెరిసే రోడ్లు వెయ్యలేదు అంటూనే ఇప్పుడు జగన్‌ను మించిన హామీలిస్తున్నాడు.

ఆయన ఇచ్చే హామీల గురించి పవన్ కల్యాణ్ గానీ, పురందేశ్వరిగానీ ఏమీ మాట్లాడటం లేదు. అంటే ఆ పార్టీలు ఈ వాగ్దానా లను అంగీకరించవనే కదా అర్థం. ఎన్నికలు ఇంకో నెల రోజులు ఉండగా, ఈ మూడు పార్టీల పరేషాన్ చూస్తే చూసేవారికే జాలేస్తుంది. మరీ చంద్రబాబు అయితే ఓడిపోతే ఎట్లా, ఎట్లా అనే భయం ముఖంలో కనిపిస్తుంది. ఇవి ఆఖరి ఎన్నికలని ఆయన భయమే చెబుతుంది. ఏమౌతుందో ఏపీ ప్రజలే నిర్ణయిస్తారు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మొఘలుల ఈద్



మొత్తానికి నేను ఒక మొఘల్ చక్రవర్తి ఈద్ జరుపుకొంటున్న చిత్రాన్ని చూశాను(పెయింటింగ్ షేర్ చేశారు). బెర్లిన్ మ్యూజియం ఆఫ్ ఇస్లామిక్ ఆర్ట్స్‌లో. ఇందులో ఉన్నది జహంగీర్. 1615–25 మధ్య కాలానిది. కాకపోతే వాళ్లు చేస్తున్నది ఈద్ ఉల్ ఫితర్(రమజాన్) కాదు. ఈద్ అల్ అజహ్ (బక్రీద్). చాలావారకు మొఘల్ చక్రవర్తులు హోలీ జరుపుకోవడం చూశాను; కొన్ని మినియేచర్స్‌లో యువరాజులు, యువరాణులు దీపావళి జరపడం చూశాను.

– రాణా సఫ్వీ, రచయిత్రి

ఆహార వైవిధ్యం



దీపావళి రోజు అల్పాహారంగా ఇడ్లీ, మటన్ కూర తినే సంప్రదాయం తమిళనాడులో ఉంది. ఉత్తర మలబార్‌లో ఓనమ్ వంటకాల్లో చేప, చికెన్ ఉంటాయి. చాలామంది కన్నడిగులు హోసా తొడకు(ఉగాది తర్వాతి రోజు) నాడు చికెన్ తింటారు. కాబట్టి, ఆహార అలవాట్లను బట్టి జనాల మీద తీర్పులు ఇవ్వకూడదు. భారత్ వైవిధ్యభరిత దేశం.

– అద్వైద్, క్రానికలర్

వ్యూహకర్త



నేను బీజేపీతో తీవ్రంగా విభేదిస్తాను. కానీ రాజకీయంగా మన వైరి పక్షాల నుంచి కూడా మనం చాలా నేర్చుకోవచ్చు. ప్రధానమంత్రి ఇందులో మాస్టర్. ముఖ్యంగా ఆయన గేమింగ్ కమ్యూనిటీని కలవడం, అదీ ఇన్‌ఫ్లుయెన్సర్స్‌ను కలిశాక కలవడం నిజంగా బాగుంది.

– తెహసీన్ పూనావాలా, వెంచర్ క్యాపిటలిస్ట్

దా'రుణం'



2014లో ఇండియా రుణం: 49 లక్షల కోట్ల రూపాయలు. 2024లో ఇండియా రుణం: 205 లక్షల కోట్ల రూపాయలు. మోదీ ప్రభుత్వ హయాంలో రుణం విపరీతంగా పెరిగింది. కానీ మోదీ అనుకూల మీడియా దీన్ని ఎప్పుడూ చూపదు.

– ధ్రువ్ రాఠీ, యూట్యూబర్

రికార్డు లావాదేవీలు




చాలామంది మిస్సయిన ఒక వార్త: మార్చ్ 2024లో యూపీఐ ద్వారా రికార్డు స్థాయిలో జరిగిన లావాదేవీల సంఖ్య 13.4 బిలియన్లు. (ఫిబ్రవరిలో వీటి సంఖ్య 12 బిలియన్లు.)

– తుషార్ గుప్తా, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

బహుముఖ ప్రజ్ఞాశాలి

మిర్యాలగూడలో ముగ్గురు వ్యక్తులు సైన్ బోర్డులు రాసేవారు. ఒకరు రాసిన బోర్డులు నన్ను నిలబెట్టేవి. ఎవరది? సుదర్శన్! సంతకం, కింద గీత, రెండు పువ్వులు. నేను పని నేర్చుకుంటే, సొంతంగా షాప్ పెడితే ఇతనితోనే బోర్డు రాయించుకోవాలని నిశ్చయించుకున్నాను. ఆర్మీచర్ – బ్యాటరీ బొమ్మలతో 'కృష్ణ ఆటో ఎలక్ట్రికల్ వర్క్స్' బోర్డును సుదర్శన్ ప్రేమగా రాశారు, 1973లో. ఆయన నటుడు కూడా. కొన్ని నాటకాలలో స్త్రీ వేషం ధరించారు. మిర్యాలగూడ శ్రీనివాస టాకీస్‌లో అప్ స్టెయిర్ దారిలో తాను వేసిన ఉమర్ ఖయ్యాం, రాధ కృష్ణుల చిత్రాలు ప్రేక్షకులను కాసేపు నిలబెట్టేవి. నాగార్జున బ్రాన్ ఆయిల్ మిల్ కోసం సుదర్శన్ వేసిన ఆచార్య నాగార్జునుని బృహద్ చిత్రం సాగర్ రోడ్‌లో ప్రయాణించే వారిని ముగ్ధులను చేసేది. నేటి ప్రముఖ ఆర్టిస్టులు చిత్ర, నర్సిం తదితరులు సుదర్శన్ శిష్యులే.



నందికొండ (హిల్ కాలనీ) జూనియర్ కాలేజీలో డ్రాయింగ్ టీచర్‌గా సుదర్శన్ ఉద్యోగస్థుడు కావడం సాహితీ అభిమానులు చేసుకున్న అదృష్టం. గురజాడ, శ్రీశ్రీ, రావిశాస్త్రి జయంతి – వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించేవారు. ప్రియదర్శిని అనే ఫోటో స్టూడియో పెట్టి ఔత్సాహికులను ఫోటోగ్రాఫర్స్‌గా తీర్చిదిద్దారు. జర్నలిస్ట్‌గా నాగార్జున సాగర్ గురించి, బౌద్ధ పర్యాటకుల గురించి అమూల్యమైన వ్యాసాలు రాశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కృషి చేసిన సాంస్కృతిక సైనికుడు.

ప్రముఖ ఫిల్మ్ మేకర్ బి. నర్సింగ్ రావు ఆత్మీయతను పొందిన సుదర్శన్ దాదాపు వారి అన్ని సినిమాలకు తనవంతు సేవలు అందించారు. 'దాసి' కాస్ట్యూమ్ డిజైనర్‌గా సుదర్శన్ రాష్ట్రపతి అవార్డు పొందారు. లలిత కళల పరమార్థం కరడు కట్టిన మనస్సులను మృదువు పరచడం. లలిత కళలన్నిటిలో తనదైన ప్రత్యేకత కలిగిన సుదర్శన్ చిరంజీవి.

– పున్నా కృష్ణ మూర్తి । 76809 50863

(నేడు మిర్యాలగూడలో 'దాసి' సుదర్శన్ సంస్మరణ సభ)

బాబు ప్రచార ప్రగల్భాలు–వాస్తవాలు

అభిప్రాయం




డా॥ జి. నవీన్

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు కేవలం నెల రోజులు మాత్రమే మిగిలాయి. దీనితో, వాతావరణం లానే ప్రచార పర్వం కూడా వేడెక్కింది. ఒక వైపు జగన్ 'మేమంతా సిద్ధం' సభల జన సునామీ ఉధృతి రోజు రోజుకీ పెరిగిపోతుంటే, మరో వైపు 'ప్రజాగళం' పేరుతో చంద్రబాబు నాయుడు కూడా రాష్ట్రాన్ని చుట్టి వస్తున్నారు. ఇప్పటికే విశ్వసనీయత పలుమార్లు కోల్పోయిన చంద్రబాబు ఎన్నికల సభల్లో చేస్తున్న అనేక సత్యదూరమైన ప్రకటనల్లో కొన్నింటిని ఇక్కడ చర్చించాలి.

కొవ్వూరు సభలో ఆయన 'తమ్ముళ్ళూ, నేనెప్పుడైనా విద్యుత్ ఛార్జీలు పెంచానా?' అని అడగడం చూస్తుంటే ప్రజల మేధస్సుపై ఆయనకు ఇంత చిన్న చూపు ఏంటి అని అనిపిస్తోంది. 2000 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రిగా ఉంటూ దేశంలోనే ఆనాటికి రికార్డు స్థాయిలో కరెంట్ చార్జీలు అకస్మాత్తుగా పెంచితే లక్షల మంది ప్రజలు స్వచ్ఛందంగా రోడ్లు ఎక్కి ధర్నాలు, దీక్షలు చేపట్టిన ఘట్టం ఆయన మరిచినంత తేలిగ్గా జనం మరుస్తారా? ఆ నిరసన స్వరాలను ఉక్కు పాదంతో తొక్కి పోలీసు కాల్పులు జరిపించి ముగ్గురి విలువయిన ప్రాణాలను పొట్టన పెట్టుకున్న వైనం ఇప్పటికీ 'బషీర్బాగ్ ఉదంతం'గా మన కళ్ళ ముందు మెదులుతూనే ఉండగా ఈయన ఈ విధంగా అసత్య ప్రేలాపనలు చేయడం అసమంజసం.

పామర్రు సభలో హైటెక్ సిటీ ప్రస్తావన తెచ్చి 'ఇక్కడే అలాంటి టవర్‌లు కడతాను' అని చెప్పారు. ఇలాంటి డాంబికాలు పచ్చ'కామెర్లు' వచ్చిన వారికి రుచించవచ్చుగానీ కొంచెం అయినా ఆలోచించే జనం అటువంటి ప్రకటనలను శంకించక మానరు. అసలు ఐటీ అంటే చంద్రబాబు అని జరిగిన ప్రచారం... ఉన్న దాన్ని చిలవలు పలవలు చేసిన చందంగా జరిగింది. ప్రపంచీకరణలో భాగంగా వచ్చిన ఒరవడిలో చెన్నై, బెంగుళూరు వంటి నగరాలతో పోటీ పడుతూ హైదరాబాద్ కూడా ఐటీ హబ్ అవ్వడం జరిగింది. అయితే, ఇతర రాష్ట్రాల్లోని అప్పటి ముఖ్యమంత్రులకు రాని ఖ్యాతిని చంద్రబాబుకి చేకూర్చడంలో ఆయన ప్రచార కౌశల్యం, అడక్కుండానే వంది వార్చే అస్మదీయ మీడియా సహకారం పాత్ర మరవరానిది. ఒక అర్ధ సత్యాన్ని వందల, వేల సార్లు నొక్కి వక్కాణిస్తే అది ఏవిధంగా చరిత్రలో స్థిరీకరించుకుపోతుందో ఈ 'చంద్రబాబు–ఐటీ' ఉదంతం ఒక బలమైన ఉదాహరణ.

ఆయన 2004లో అదే హైదరాబాద్ సిటీలో, హైటెక్ సిటీ పరిసర నియోజకవర్గాల్లో కూడా చిత్తుగా ఓడిపోయిన మాట వాస్తవం. అంటే, ఈయన చెప్పుకునే అభివృద్ధి అక్కడ శ్రామిక జనాలకు ఏ మాత్రం ఉపయోగ పడలేదు అనేది సుస్పష్టం. అలాగే, హైదరాబాద్ నగరం చంద్రబాబును వదిలించుకుని ఇప్పటికి 20 ఏళ్లు దాటినా, ఇంకా ఐటీ రంగంలో అగ్రగామిగా ఎందుకు ఉంది? ఈయన తరవాత వచ్చిన ప్రభుత్వాలకు అందులో పాత్ర లేదా? నిజానికి, ఆయన తదనంతర పాలనలోనే హైదరాబాద్ విపరీతంగా అభివృద్ధి చెందింది అని కూడా చెప్పొచ్చు. అందుకే, అభివృద్ధి అనేది ఒక్క వ్యక్తి ద్వారా వచ్చి పడే విషయం కాదు. ఒక నగరానికి, ప్రాంతానికి ఉన్న భౌగోళిక, చారిత్రక, స్వాభావిక నేపథ్యాల వల్ల సాధ్యమయ్యే విషయం.



పెనమలూరు ప్రచార సభలో చంద్రబాబు 'సంపద సృష్టిస్తా' అని అరిచి గీ పెట్టారు. అసలు 'సంపద సృష్టి' అంటే ఏంటి? నేల విడిచి సాము చేసి, గ్రాఫిక్స్‌తో మాయ చేసి, తిమ్మిని బమ్మిని చేయడం సంపద సృష్టి అవుతుందా? ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి, దావోస్ పర్యటనలకు వెళ్లి విశ్వవ్యాప్త పెట్టుబడిదారీ రాబంధుల అడుగులకు మడుగులొత్తడమా సంపద సృష్టి అంటే? అణగారిన వర్గాల భూముల్లో జయభేరీలు, ఫోరమ్మాళ్లూ కట్టడమా సంపద సృష్టి అంటే? వేల సంవత్సరాల వివక్ష వల్ల నలిగిపోయి ఉన్న బతుకులను కొత్త ప్రపంచపు ఎండమావుల మిరిమిట్లను చూపి మళ్ళీ దగా చేయడమా సంపద సృష్టి అంటే? నిజమైన సంపద సృష్టి అంటే కింది జనాలకు నాణ్యమైన విద్యను అందించడం కాదా? వారికి కావాల్సిన ఆర్థిక చేదోడు ఇచ్చి నేను ఉన్నాను అని వెన్ను తట్టే ప్రభుత్వమే సంపద సృష్టికి నాంది పలుకుతుంది. ఈ రాష్ట్రంలో ఒక తరం పేద పిల్లలు అందరూ ప్రభుత్వ బడులలో ఇంగ్లీష్ చదువులు నేర్చుకుంటే కలిగే మానవ వనరుల సంపద వంద చంద్రబాబులు వెయ్యి రియల్ ఎస్టేట్ మాయాజాలాలు చేసినా ఒనగూడదు.

పల్నాడులో మాట్లాడుతూ బాబు శవ రాజకీయాల ప్రస్తావన చేశారు. గోదావరి పుష్కరాల సందర్భంగా 2015లో ఈయన పబ్లిసిటీ పిచ్చి వల్ల జరిగిన తొక్కిసలాటలో 29 మంది అమాయక భక్తులు శవాలుగా మారిన దుర్ఘటన మరవరాదు. అలాగే, 2022 డిసెంబర్ 29న కందుకూరులో ఈయన అత్యుత్సాహంతో ఇరుకు సందుల్లో సభ పెట్టడం వల్ల 8 మంది చనిపోతే, 4 రోజులు తిరగకుండానే గుంటూరులో చీరల పంపిణీ పేరున మరో తొక్కిసలాట జరిగి ముగ్గురు శవాలుగా మారారు. ఆ నిస్సహాయ, పేద ప్రజల శవాలు బాబు రాజకీయ ప్రస్థానంలో సమిధలు.

మొత్తానికి, ఈ విషయాలన్నీ గమనిస్తే మనకు అవగతమవుతున్న దేంటంటే చంద్రబాబు నాయుడు దృష్టి కోణంలోనే లోపం ఉంది. అందులో ప్రజల సంక్షేమానికి తావు లేదు. ఉన్నదల్లా అభూత కల్పనపై మక్కువ, కల్పిత స్వీయ చరిత్రపై ఎనలేని అతి విశ్వాసం. వీటిని రాష్ట్ర ప్రజలు సమూలంగా మరోసారి తిరస్కరిస్తారని ఆశిద్దాం.

వ్యాసకర్త సామాజిక ఆర్థిక అంశాల విశ్లేషకులు

మూడంశాల మేలు కలయిక

గురు దర్శనము, గురు పూజ, గురు సేవ అనునవి భక్తియందలి మూడు ముఖ్యాంశములు. వీటిద్వారా భక్తుడు నిర్మల భక్తిని పెంపొందించుకొని సద్గురువు కృపను చూరగొంటాడు. సద్గురువు కేవలం ఒక భౌతిక స్వరూపమే కాక సాక్షాత్తు భగవంతుని అవతారమే.

సద్గురువు విశ్వ శక్తికీ, విశ్వ చలనమునకూ ప్రాతినిధ్యం వహిస్తాడు. కేవలము నిష్కళంకమైన భక్తిద్వారా భక్తుడు సద్గురువు భగవత్తత్త్వమును లేక విశ్వవ్యాపకత్వమును అనుభవ పూర్వకముగా గ్రహిస్తాడు. భక్తి, అహంభావాలు కలిసి ముందుకు వెళ్ళలేవు. అహంభావము ఎంతవరకు మిగులునో దానిని తొలగించు నంతవరకు భక్తిని పెంచుకొని, నిజమైన భక్తిగా వృద్ధి చేసుకోవలసిన అవసరం ఉంది.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మీరా, ధ్రువుని ఉదంతాలు శ్రేష్ఠమైన భక్తికి దృష్టాంతములు. నిన్ను నీవు ఒక భక్తుడిగా పరిగణించుకొన్నచో, పైన పేర్కొన్న భక్తులు ఎదుర్కొనిన పరీక్షలను ఎదుర్కొని, నీవు నిజమైన భక్తుడివేనా అని నిన్ను నీవు ప్రశ్నించుకోవాలి. 'నేను నిజమైన భక్తుడను' అని ఏ నిజమైన భక్తుడు చెప్పుకోడు. అతడు కేవలం భక్తిని మాత్రమే కలిగి ఉండి మిగిలిన విషయములను తన ఆరాధ్య దైవమునకే వదలిపెట్టాలి.

ప్రతి ఒక్క వ్యక్తి కోరుకొనదగిన, మిక్కిలి విలువైన వరము భక్తియే. ఇదే మానవునికి గల గొప్ప మానసిక శక్తి. భక్తి మనస్సును దృఢపరుస్తుంది. మనసు శక్తిని ఆకాశమును దాటి వ్యాపించునట్లు చేస్తుంది. భక్తియందలి ముఖ్యాంశము ప్రేమ. నిరంతరము సాధన చేసినచో, ఇది భక్తుని ముందు భగవంతుని సాక్షాత్కరింప చేస్తుంది. భగవంతునిపై భక్తి తారాస్థాయిని చేరగానే భగవంతునికి, భక్తునికి మధ్యగల భేదము లేకుండా పోతుంది. అలాగే జీవితం సఫలమవుతుంది.

ఆత్మ వికాసానికి భక్తి సులభమైన మార్గమని చెప్పబడినప్పటికీ, ఆలోచించి చూచినప్పుడు, ఇది చాలా కష్టతరమైన మార్గం. నిజమైన భక్తిగల వ్యక్తి తాను భగవంతుని నుండి కానీ లేక గురువు నుండి కానీ భిన్నంగా ఉన్నానని తలచడు. ఆ విధముగా తలచుటకు అవకాశమే లేదు. భక్తి పరిపూర్ణత పొందిన వెంటనే, భక్తుడు భక్తుడు కానేరడు. కాని అతను తన ఆరాధ్య దైవములో ఒక భాగముగా ఉంటాడు. రాధ కృష్ణునిలో ఒక భాగమైనట్లు!

వాస్తవానికి మూర్తీభవించిన భక్తియే భక్తుడు. కట్టెల నుండి నిప్పు ఏ విధముగా వేరుగా ఉండదో, అదే విధముగా భక్తుడు తన ఆరాధ్య దైవము నుండి భిన్నము కానేరడు!!

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.చవితి సా.5.09 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** రోహిణి తె.4.48 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి మృగశిర, **వర్జ్యం:** రా.8.56 నుండి 9.32 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.05 వరకు, తదుపరి ప.12.23 నుండి 1.12 వరకు, **అమృతఘడియలు:** రా.1.40 నుండి 3.14 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.49, **సూర్యాస్తమయం:** 6.10.

క్లుప్తంగా...

ఆర్యవైశ్యులకు సీఎం జగన్ పెద్దపీట

- ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం



రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోనే ఆర్యవైశ్యులకు రాజకీయపరంగా తగిన గుర్తింపు లభించిందని ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం రివర్‌బే హోటల్‌లోని ఆహ్వానం ఫంక్షన్ హాలులో గురువారం నిర్వహించిన రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆర్యవైశ్యులకు మంత్రి, డిప్యూటీ స్పీకర్ పదవులనిచ్చారని, అలాగే నామినేటెడ్ పోస్టుల పరంగా ముగ్గురికి చైర్మన్లుగా అవకాశం ఇచ్చిన ఘనత కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఆర్య వైశ్యులను చిల్లర వ్యక్తులుగా చిత్రీకరిస్తూ ఎంతోకాలంగా ప్రదర్శిస్తున్న చింతామణి నాటకాన్ని రాష్ట్రంలో ప్రదర్శించకుండా జీవో జారీ చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని చెప్పారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని అధికారికంగా నిర్వహించాలనే జీవోను కూడా వైఎస్ జగన్ ప్రభుత్వం జారీ చేసిందన్నారు. ఆర్యవైశ్యులు నిర్వహించే పలు ధార్మిక సంస్థలను దేవదాయ శాఖ తన ఆధీనంలోకి తీసుకోగా.. తిరిగి వాటిని ఆర్యవైశ్యులే నిర్వహించుకునేలా అనుకూల ఉత్తర్వులిచ్చిన ఘనత వైఎస్ జగన్‌దేనని వివరించారు. రానున్న ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలిచిన రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను గెలిపించాలని శివరామ సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. మంత్రి చెల్లుబోయిన వేణు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

నకిలీ ఐఏఎస్ అధికారిపై టీటీడీ విజిలెన్స్‌కు ఫిర్యాదు



నరసింహమూర్తి

తిరుమల: శ్రీవారి బ్రేక్ దర్శనం టికెట్ల కోసం నకిలీ ఐఏఎస్ అవతారం ఎత్తిన వ్యక్తిని టీటీడీ విజిలెన్స్ వింగ్ అధికారులు పట్టుకుని తిరుమల పోలీసులకు గురువారం అప్పగించారు. తిరుమల టూటౌన్ పీఎస్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు.. గుంటూరులోని శ్యామలానగర్‌కు చెందిన నరసింహమూర్తి తాను ప్రభుత్వంలోని ఎంఈఐటీవై (మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)లో జాయింట్ సెక్రటరీగా ఐఏఎస్ హోదాలో పనిచేస్తున్నట్లు తన చుట్టుపక్కల వారికి తెలిపాడు. అనంతరం వారితో కలిసి తిరుమలకు చేరుకుని శ్రీవారి బ్రేక్ దర్శనం కోసం అదనపు ఈవో కార్యాలయంలో లేఖను సమర్పించాడు. దీనిపై అనుమానం రావడంతో టీటీడీ అదనపు ఈవో కార్యాలయ సిబ్బంది టీటీడీ విజిలెన్స్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన విజిలెన్స్ అధికారులు నరసింహమూర్తిని పట్టుకున్నారు. అతని నుంచి నకిలీ గుర్తింపు కార్డు, లెటర్ ప్యాడ్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తిరుమల టూటౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణ అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేయనున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

- అనకాపల్లి జిల్లాలో బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

అచ్యుతాపురం (అనకాపల్లి జిల్లా): బైక్‌ను టిప్పర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృత్యువాత పడిన ఘటన అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సమీపంలో గురువారం చోటు చేసుకుంది. స్థానిక సీఐ బుచ్చిరాజు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల మేరకు.. అచ్యుతాపురం మండలంలోని దుప్పుతూరుకు చెందిన గొల్లపల్లి శేఖర్ (17), జంగుళూరు జంక్షన్‌కు చెందిన దూది జ్యోతి ప్రకాశ్ (14) అచ్యుతాపురం సినిమా హాల్ జంక్షన్‌కు సమీపంలోని ఒక జ్యూస్ షాపు వద్దకు వెళ్లారు. షాపు నిర్వాహకురాలు సర్మాల అమల (38) తనను యలమంచిలి మార్గంలో ఉన్న సాయిబాబా గుడి వద్దకు తీసుకెళ్లమని కోరారు. దీంతో ముగ్గురూ బైక్‌పై అచ్యుతాపురం జంక్షన్ దాటి యలమంచిలి మార్గం వైపు వెళుతున్నారు. అదే సమయంలో అదే మార్గంలో వెళుతున్న టిప్పర్ లారీని ఓవర్‌టేక్ చేయబోయారు. ఈ నేపథ్యంలో రోడ్డు పక్క నడుస్తున్న వ్యక్తిని తప్పించబోయి.. అదే టిప్పర్ లారీ ముందుకొచ్చారు. ఈ హఠాత్పరిణామాన్ని గమనించని టిప్పర్‌లారీ డ్రైవర్ బైక్‌ను బలంగా ఢీ కొట్టాడు. ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురూ అక్కడికక్కడే విగతజీవులయ్యారు. కాగా, టిప్పర్ లారీ చక్రాల కింద నలిగిపోయిన శరీరాలు ఛిద్రమై మాంసపు ముద్దలుగా మారడంతో చూపరులు సైతం కంటతడి పెట్టారు.

ఈనాడు దగాకోడ్ రాతలు

'ఈసి'డించుకునేలా కథనాలు

- పోలీసు యంత్రాంగంపై కక్షగట్టి విద్వేషం
- మొన్న ఐపీఎస్‌లపై... నేడు డీఎస్పీలు, సీఐలపై..
- పోలీసుల బ్లాక్‌మెయిలింగ్‌కు ఈనాడు కుతంత్రం
- ఈసీ మార్గదర్శకాల ప్రకారమే రక్షకభటుల విధి నిర్వహణ
- టీడీపీ అరాచకాలు, దౌర్జన్యానికి కళ్లెంవేస్తున్న వైనం

సాక్షి, అమరావతి: 'మేమంతా సిద్ధం' పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న బస్సు యాత్ర దిగ్విజయంగా సాగుతుండటంతో రాష్ట్రంలో ఎల్లో సిండికేట్ బెంబేలెత్తుతోంది. త్వరలో నిర్వహించనున్న ఎన్నికల్లో వరుసగా రెండోసారి టీడీపీ ఓటమి ఖాయమని స్పష్టం కావడంతో చంద్రబాబు, ఈనాడు రామోజీరావుల కాళ్ల కింద భూమి కంపిస్తోంది. తమ రాజకీయ జీవితానికి ముగింపు కార్డు పడిందని చంద్రబాబుకు.. తమ అక్రమ ఆర్థిక సామ్రాజ్యం కుప్పకూలుతుందని రామోజీరావుకు భయం పట్టుకుంది. తమ భవిష్యత్తు సినిమా కళ్ల ముందు కనిపిస్తోంది. ఫలితంగా దింపుడు కళ్లెం ఆశతో విద్వేష కథనాలు అల్లుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైనా, ప్రభుత్వ యంత్రాంగంపైనా విషం చిమ్ముతున్నారు. ఏకంగా రాజ్యాంగబద్ధ సంస్థ ఎన్నికల కమిషన్(ఈసీ) అధికార పరిధినీ ప్రశ్నిస్తూ కట్టుకథలతో 'ఈనాడు' పత్రిక చెలరేగిపోతోంది. ఎన్నికల విధి నిర్వహణలో ఉన్న పోలీసు, అధికార యంత్రాంగాన్ని బ్లాక్‌మెయిల్ చేయాలని పన్నాగం పన్నింది. మొన్న ఐపీఎస్ అధికారుల పోస్టింగులను ప్రశ్నిస్తూ ఈసీనే బ్లాక్ మెయిల్ చేసేందుకు యత్నించిన ఈనాడు.. తాజాగా డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలే లక్ష్యంగా అబద్ధాలను వల్లెవేసింది. 'వైకాపా కోడ్ నడుస్తోంది' అంటూ బుధవారం ఓ విష కథనాన్ని వండి వార్చింది. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు యత్నించింది.



పోలీసు అధికారుల బెదిరింపునకూ పన్నాగం

తాజాగా ఈనాడు రామోజీరావు క్షేత్రస్థాయిలో క్రియాశీలంగా వ్యవహరించే పోలీసు అధికారులను లక్ష్యంగా చేసుకుని దుష్ప్రచార కుట్రకు తెరతీశారు. ఎన్నికల విధుల్లో క్షేత్రస్థాయిలో క్రియాశీలంగా ఉండే డీఎస్పీ, సీఐ, ఎస్సైలను బ్లాక్‌మెయిల్ చేయడం ద్వారా టీడీపీ అక్రమాలకు అడ్డులేకుండా చేయాలన్నది పచ్చ కుట్ర. ఇటీవల రాష్ట్రంలో పలు నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు, కార్యకర్తలు దౌర్జన్యాలకు పాల్పడ్డ ఉదంతాలను ఈనాడు పత్రిక వక్రీకరిస్తూ తప్పుడు కథనం ప్రచురించింది. మాచర్ల, గన్నవరం, అద్దంకి, ఉరవకొండ, గుడివాడ తదితర నియోజకవర్గాల్లో గత వారం పది రోజుల్లో టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యాలకు పాల్పడ్డారు. తాజాగా బుధవారం రాత్రి ఒంగోలులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులనే అడ్డుకున్నారు. అసలు ఎన్నికల ప్రచారం చేయడానికి వీల్లేదని గలాభా సృష్టించారు. ఇటువంటి ఘటనలపై స్థానిక పోలీసులకు ఫిర్యాదులు అందడంతో కఠిన చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం యావత్ పోలీసు యంత్రాంగం ఈసీ మార్గదర్శకాల ప్రకారం విధులు నిర్వహిస్తోంది. ఈ వాస్తవాన్ని ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తూ వైఎస్సార్ సీపీ నేతల ఆదేశాల ప్రకారం పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని కట్టుకథలను ఈనాడు ప్రచారంలోకి తీసుకువస్తోంది. టీడీపీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడినా.. వైఎస్సార్ సీపీ అభ్యర్థుల ప్రచారాన్ని అడ్డుకున్నా సరే పోలీసు యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుండాలి అన్నట్టుగా ఈనాడు వితండవాదం చేస్తోంది. నిజంగా పోలీసులు ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఈసీకి ఫిర్యాదు చేయవచ్చు. ఈసీ విచారించి తగిన చర్యలు తీసుకుంటుంది. కానీ చంద్రబాబుగానీ ఈనాడు రామోజీరావుగానీ ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదు. ఎందుకంటే పోలీసులు నిబంధనల మేరకే వ్యవహరిస్తున్నారు. అందుకే ఈనాడు పత్రిక ద్వారా పోలీసు అధికారులపై దుష్ప్రచారానికి పాల్పడుతున్నారు. తద్వారా క్షేత్రస్థాయిలో పనిచేసే పోలీసు అధికారులను బెదిరించి టీడీపీ అక్రమాలకు అడ్డులేకుండా చేయాలన్నది చంద్రబాబు, రామోజీ లక్ష్యం. కానీ వారి కుట్రలను తిప్పికొడుతూ ఈసీ నిబంధనల మేరకు సక్రమ ఎన్నికల నిర్వహణకు పోలీసు యంత్రాంగం అన్ని చర్యలూ తీసుకుంటోంది.

మొన్న ఐపీఎస్‌లపై అక్కసు బెడిసికొట్టి..

చంద్రబాబు హయాంలో రాజ్యాంగేతర శక్తిగా చలామణి అయిన రామోజీరావు ప్రస్తుతమూ తన మాటే శాసనం అనేట్టుగా ఉండాలని భావిస్తున్నారు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్నదీ ప్రజలు ఎన్నుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అని.. రాజ్యాంగబద్ధ సంస్థ ఈసీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ సాగుతుందని గానీ గుర్తించేందుకు ఆయన ససేమిరా అంటున్నారు. తాను చెప్పిన అధికారులనే ఎస్పీలుగా నియమించాలన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. అందుకు విరుద్ధంగా ఎన్నికల నియమావళి ప్రకారం ఇటీవల ఎన్నికల కమిషన్ ఒక డీఐజీ, ఐదుగురు ఎస్పీలు, ముగ్గురు కలెక్టర్లను నియమించడంతో ఆయన చిందులు తొక్కారు. 'వీళ్లా ఎస్పీలు' అంటూ ఈనాడు పత్రికలో విద్వేష కథనాన్ని ప్రచురించారు. దీనిపై యావత్ పోలీసు యంత్రాంగం తీవ్రంగా స్పందించడం విశేషం. ఏకంగా 13 మంది ఐపీఎస్ అధికారులు సంతకాలు చేసి మరీ టీడీపీ, జనసేన, బీజేపీ, ఈనాడు పత్రికకు వ్యతిరేకంగా ఈసీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రతిపక్ష పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీలు ఈనాడు పత్రికను అడ్డం పెట్టుకుని పోలీసు వ్యవస్థను, ఈసీని బ్లాక్ మెయిల్ చేసేందుకు యత్నిస్తున్నాయన్న వాస్తవం దేశవ్యాప్తంగా అందరికీ తెలిసింది. ఈసీ తీవ్ర చర్యలు తీసుకునే అవకాశాలు ఉండటంతో రామోజీరావు తోక ముడిచారు. టీడీపీ, జనసేన, బీజేపీ నోళ్లు కూడా మూతపడ్డాయి. కానీ అధికారయంత్రాంగం ఆత్మస్థైర్యం దెబ్బతీసే కుతంత్రాలు మాత్రం ఆపలేదు.

ఏపీని అగ్రగామిగా నిలిపిన సీఎం జగన్

- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి



ప్రసంగిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టారని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. ఇంతకన్నా బాగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవడం చారిత్రక అవసరమని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఉమ్మడి విజయనగరం జిల్లా వైఎస్సార్‌సీపీ సమావేశం గురువారం విజయనగరం శివారులోని జగన్నాథ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రజాహితమే తన అభిమతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేసిన ప్రతి కార్యక్రమం ప్రజలకు ఎంతో మేలు చేసిందని చెప్పారు. కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా ప్రతి సంక్షేమ పథకాన్ని అమలుచేసినట్లు తెలిపారు. గతంలో ఎవరూ చేయలేనంత మేలు, అభివృద్ధి చేసినందుకు ప్రజలను ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందని వివరించారు. పార్టీ శ్రేణులు సమష్టిగా, సమన్వయంతో పనిచేసి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మరోవైపు ప్రజల దృష్టిని మళ్లించడానికి దుష్ట చతుష్టయం కుట్రలు పన్నుతోందని, వాటిని పచ్చమీడియా రోజూ వండి వార్చుతోందని మండిపడ్డారు. ఈ దుష్ప్రచారాన్ని ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని, కూటమి బూటకపు హామీల్లోని లోగుట్టును ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, శాసన సభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, పార్టీ డిప్యూటీ రీజనల్ కో–ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చిన్నఅప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, పాముల పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, అరకు లోక్‌సభ అభ్యర్థి గుమ్మడి తనూజారాణి, రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీటీ రవికుమార్



అలిపిరి కాలినడక మార్గంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్. చిత్రంలో న్యాయమూర్తి కోటేశ్వరరావు తదితరులు

తిరుమల: తిరుమల శ్రీవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సీటీ రవికుమార్, జస్టిస్ సంజయ్ కరోల్ గురువారం వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కాగా, జస్టిస్ సంజయ్ కరోల్ అలిపిరి మార్గంలో కాలినడకన గురువారం రాత్రి తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అశోక్ కినగి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. మరోవైపు, వైఎస్సార్‌సీపీ ఎంపీ సత్యనారాయణ, సినీ నటి అంజలి, నటుడు శ్రీనివాసరెడ్డి, దర్శకుడు శివ చూలిపాటి, శివారెడ్డి, నిర్మాత కోన వెంకట్ కూడా వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.



కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అశోక్ కినగి

శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు జడ్జి

మఠంపల్లి (సూర్యాపేట జిల్లా): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి స్వయంభూ శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని గురువారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ టి.మల్లికార్జున రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, చెన్నూరు విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్‌కుమార్ అర్చకులతో కలిసి వారికి స్వాగతం పలికారు. గర్భాలయంలో శ్రీస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ప్రాశస్త్యాన్ని జస్టిస్ మల్లికార్జున రావుకు వివరించారు. అనంతరం ఆలయ ముఖమండపంలో జడ్జి దంపతులు, కుటుంబసభ్యులను ఆశీర్వదించి, శేషవస్త్రాలతో సత్కరించారు. గతంలో కృష్ణానదికి వచ్చిన భారీ వరదలతో పులిచింతల బ్యాక్ వాటర్‌లో ఆలయం మునిగిపోయిన ఫొటో ఆల్బమ్‌ను జస్టిస్ మల్లికార్జునరావు తిలకించారు.



ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ మల్లికార్జునరావు కుటుంబ సభ్యులను ఆశీర్వదించి సత్కరిస్తున్న అర్చకులు, ధర్మకర్తలు

అక్రమ మద్యంపై గట్టి నిఘా పెట్టాలి

అధికారులను ఆదేశించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మీనా

- 15లోగా మద్యం సరఫరా వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయాలి
- ఇప్పటివరకు రూ. 100 కోట్లకు పైగా విలువైన నగదు, లిక్కర్, డ్రగ్స్ జప్తు

సాక్షి, అమరావతి/సింగరాయకొండ (మర్రిపూడి)/శ్రీకాళహస్తి(తిరుపతి జిల్లా)/నెల్లూరు(బారకాసు): త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో మద్యం అక్రమ నిల్వలు, అమ్మకం, పంపిణీని నిరోధించేందుకు వెబ్ క్యాస్టింగ్, జీపీఎస్ సాంకేతికత ద్వారా నిఘా పెంచేందుకు తగు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా ఆదేశించారు. రాష్ట్రంలోని డిస్టిలరీలు, బ్రూవరీలు, మద్యం గొడౌన్ల ఎంట్రీ–ఎగ్జిట్ పాయింట్లు, మద్యం తయారీ–నిల్వ చేసే స్థలాల వంటి ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. గోడౌన్ల నుంచి షాపులకు మద్యం సరఫరా చేసే వాహనాలకు జీపీఎస్ కనెక్టివిటీని ఈనెల 15లోగా ఏర్పాటు చేసి ట్రాకింగ్ ద్వారా నిఘా ఉంచాలన్నారు. ఈ ప్రక్రియను వెబ్ క్యాస్టింగ్ ద్వారా గమనించేలా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం, జిల్లా ఎన్నికల అధికారుల కార్యాలయాలకు అనుసంధానం చేయాలన్నారు. అదేవిధంగా తనిఖీలను ముమ్మరం చేయాలని అబ్కారీ శాఖ కమిషనర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్‌లకు ఆదేశాలు జారీచేశారు. మద్యం ద్వారా ఓటర్లను ప్రలోభపరచకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులు మార్గదర్శకాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు.



సీఐ రంగనాథ్‌తో మాట్లాడుతున్న ముకేశ్ కుమార్ మీనా

ప్రలోభాలపై గట్టి నిఘా

రాష్ట్రంలో ఓటర్లను ప్రలోభ పెట్టే చర్యలపై గట్టి నిఘా ఉంచామని, ఎన్నికల షెడ్యూలు ప్రకటించినప్పటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా రూ. 100 కోట్ల విలువకు పైబడి నగదు, లిక్కర్, డ్రగ్స్, ఇతర విలువైన వస్తువులు జప్తు చేశామని ముకేశ్ కుమార్ మీనా ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్ పోస్టులతో పాటు రాష్ట్రంలోని పలు చెక్ పోస్టుల ద్వారా అలాగే పోలీస్, ఎక్సైజ్, ఐటీ, ఫారెస్టు, ఈడీ, ఎన్సీబీ, ఆర్పీఎఫ్, కస్టమ్స్ తదితర 20 ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో నిరంతరం నిఘా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు జప్తు చేసిన వాటిలో రూ. 25.03 కోట్ల నగదు, రూ. 12.49 కోట్ల విలువైన మద్యం, రూ.2.05 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు, రూ. 51.23 కోట్ల విలువైన లోహాలు, రూ. 2.42 కోట్ల విలువైన ఉచితాలు, రూ. 7.04 కోట్ల విలువైన ఇతర వస్తువులను జప్తుచేయడం జరిగిందని ఆయన తెలిపారు.

నామినేషన్లకు 18న నోటిఫికేషన్

నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్‌తో కలిసి గురువారం ముకేశ్ కుమార్ మీనా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 18న ప్రారంభం అవుతుందని చెప్పారు. కోడ్‌ను అమలు చేస్తున్న తీరు పరిశీలించి అధికారులను అభినందించారు. ఓటు ఆవశ్యకతను తెలుపుతూ ప్రత్యేకంగా రూపొందించిన అవగాహన మస్కట్‌ను ఆవిష్కరించారు.

సింగరాయకొండ చెక్‌పోస్టు తనిఖీ

ప్రకాశం జిల్లా సింగరాయకొండలోని జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును గురువారం ముకేశ్ కుమార్ మీనా తనిఖీ చేశారు. ఈమార్గంలో వస్తున్న వాహనాలను సిబ్బంది తనిఖీ చేస్తున్న తీరు, వీడియో రికార్డింగ్ చేస్తున్న విధానాన్ని ఆయన చెక్‌పోస్టు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు సీజ్ చేసిన నగదు, నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మహిళా ప్రయాణికుల బ్యాగులను కచ్చితంగా మహిళా సిబ్బందితోనే తనిఖీ చేయించాలని సూచించారు. తగిన ఆధారాలు లేకుండా రూ. 50 వేలకు పైగా నగదు ఉంటే దానిని సీజ్ చేసి ట్రెజరీకి జమచేయాలన్నారు. ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో రెండు రోజుల పాటు పర్యటిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఒంగోలులో బుధవారం రాత్రి జరిగిన ఘటనపై పూర్తి విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం ఎన్నికల రాష్ట్ర పోలీసు అబ్జర్వర్ దీపక్‌మిశ్రా ఆధ్వర్యంలో విచారణ చేసి బాధ్యులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రకాశం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్ కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో మీనా

జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆర్డీవో రవిశంకర్ రెడ్డి, ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు మీనాకు ఆశీర్వచనం ఇవ్వగా.. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అధికారులు అందజేశారు.

మరాఠా గడ్డపై మహా పోరు!

హోరాహోరీ తలపడుతున్న బీజేపీ, కాంగ్రెస్ కూటములు

2019లో ఎన్డీఏ క్లీన్‌స్వీప్

48 స్థానాల్లో 41 కైవసం

ఈసారి అఘాడీ గట్టి పోటీ

మరాఠా గడ్డపై ఈసారి ఎన్నికలు మరింత రసవత్తరంగా మారాయి. పొత్తుకు పై పొత్తు అన్నట్లుగా ఏ పార్టీ ఎప్పుడు ఏ కూటమిలో ఉంటుందో తెలియని ట్విస్టులతో మహారాష్ట్రలో రాజకీయం నానా మలుపులు తిరుగుతోంది. శివసేన, దిగ్గజ నేత శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ) పగ్గాలు చీలిక వర్గాల చేతికి వెళ్లడంతో కొత్త పొత్తులు పొడుస్తున్నాయి. ఆ రెండు పార్టీలతో రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లోనూ వాటితో కలిసే కూటమిగా పోటీ చేస్తోంది. మరో పక్క, ఉద్ధవ్ శివసేన, కాంగ్రెస్, ఎన్‌సీపీ (శరద్ పవార్)తో సహా చిన్నాచితకా పార్టీలు జట్టు కట్టి రంగంలోకి దిగాయి...

48 లోక్‌సభ స్థానాలున్న మహారాష్ట్ర సీట్లపరంగా ఉత్తరప్రదేశ్ తర్వాత రెండో అతి పెద్ద రాష్ట్రం. ఇక్కడి రాజకీయాలు ఎక్కువగా స్థానికాంశాల చుట్టూనే తిరుగుతుంటాయి. ఎన్నికల వేళ అనూహ్య రాజకీయ మార్పులూ పరిపాటే. ఏ పార్టీ కూడా ఒంటిచేత్తో మెజారిటీ స్థానాలు దక్కించుకున్న దాఖలాలు పెద్దగా లేవు.


రెండేళ్లలో అంతా తలకిందులు

పొత్తు రాజకీయాలకు పేరొందిన మహారాష్ట్రలో గడిచిన రెండేళ్లలో రాజకీయాలు శరవేగంగా మారిపోయాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ భాగస్వాములుగా పోటీ చేసిన బీజేపీ, శివసేన ఏకంగా 41 స్థానాలు కైవసం చేసుకున్నాయి. బీజేపీ 25 స్థానాల్లో పోటీ చేసి 23 సీట్లు దక్కించుకోగా, శివసేన 23 చోట్ల పోటీ చేసి 18 సీట్లను కైవసం చేసుకుంది. కాంగ్రెస్, ఎన్సీపీ మరో రెండు ప్రాంతీయ పార్టీలను కలుపుకొని బరిలోకి దిగినా ప్రభావం చూపలేకపోయాయి. కాంగ్రెస్ 25 స్థానాల్లో పోటీ చేసి ఒక్క చోటే గెలిచింది. ఎన్సీపీ 19 చోట్ల అభ్యర్థులను నిలబెట్టి 4 సీట్లతో సరిపెట్టుకుంది. ఇతర పార్టీలు ఎన్డీఏ సునామీలో కొట్టుకుపోయాయి. ఇప్పుడు శివసేన, ఎన్సీపీ రెండుగా చీలిపోయాయి. ఒకటి ఎన్డీఏలో, మరోటి మహాకూటమి పంచన చేరాయి. 48 లోక్‌సభ స్థానాల్లో 5 సీట్లు ఎస్సీలకు, 4 ఎస్టీలకు కేటాయించారు.


ఏక్‌నాథ్ షిండే


అజిత్ పవార్


దేవేంద్ర ఫడ్నవీస్


ఉద్ధవ్ ఠాక్రే


శరద్ పవార్


నానా పటోలే

అధికార కుమ్ములాటలు

2019 లోక్‌సభ ఎన్నికల్లో ఘనవిజయం తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో సైతం బీజేపీ, శివసేన కలిసి పోటీ చేసి మెజారిటీ సాధించాయి. మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) పేరిట కలిసి బరిలో దిగిన కాంగ్రెస్, ఎన్సీపీ ప్రతిపక్షానికి పరిమితయ్యాయి. అధికార పంపకంపై బీజేపీ, శివసేన కుమ్ములాట చివరికి కూటమి నుంచి సేన వైదొలిగేందుకు దారితీసింది. శివసేనకు ఎంవీఏ సీఎం పదవి ఆఫర్ చేయడంతో అది కూటమిలో చేరింది. పార్టీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే తొలిసారి సీఎం పగ్గాలు చేపట్టారు. 100కు పైగా సీట్లను దక్కించుకున్నా అధికారం దక్కకపోవడంతో బీజేపీ అదను చూసి శివసేనకు షాకిచ్చింది. శివసేన నేత ఏక్‌నాథ్ షిండే మెజారిటీ ఎమ్మెల్యేలను చీల్చి వేరుకుంపటి పెట్టుకున్నారు. ఆయన సీఎంగా బీజేపీ–శివసేన సంకీర్ణ సర్కారు ఏర్పాటు చేసింది. శివసేన పార్టీ, గుర్తు షిండే వర్గానికే దక్కాయి. అటు ఎన్సీపీలోనూ అజిత్ పవార్ తిరుగుబావుటా ఎగరేశారు. ఎమ్మెల్యేలను చీల్చి అధికార సంకీర్ణంలో చేరి డిప్యూటీ సీఎం అయ్యారు. ఎన్సీపీ పేరు, గుర్తు కూడా అజిత్ వర్గానికే దక్కడంతో శరద్ పవార్ కొత్త పేరు, గుర్తుతో పోటీ చేయాల్సిన పరిస్థితి నెలకొంది!


'మహా'యుతి కూటమి

బీజేపీ, శివసేన, ఎన్సీపీలతో కూడిన మహాయుతి కూటమి బలంగా కన్పిస్తోంది. శివసేన (ఉద్ధవ్), ఎన్సీపీ (శరద్ పవార్) కాంగ్రెస్ సారథ్యంలోని విపక్ష ఇండియా కూటమిలో ఉన్నాయి. అయోధ్య రామ మందిరం సాకారం, అభివృద్ధి నినాదాలతో బీజేపీ ప్రచారం సాగిస్తోంది. మోదీ కేబినెట్లో రెండు విడతల్లోనూ మంత్రి పదవి దక్కించుకున్న మిత్రపక్షం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) షిర్డీ లోక్‌సభ సీటు డిమాండ్ చేస్తోంది. దాన్ని తమ సిట్టింగ్ ఎంపీకే కేటాయించాలని సీఎం షిండే పట్టుబడుతున్నారు. షిర్డీ నుంచి తాను పోటీ చేసినా, చేయకపోయినా ఎన్డీఏతోనే ఉంటానని ఆర్పీఐ చీఫ్ రాందాస్ అథవాలే ప్రకటించారు. ఆయనకున్న ఓటు బ్యాంకు చాలా స్థానాల్లో కూటమికి కలిసొస్తుందని భావిస్తున్నారు. ఎన్డీఏ కూటమి సీట్ల సర్దుబాటు ఇంకా కొలిక్కి రావాల్సి ఉంది. బీజేపీ దాదాపు 30 సీట్లలో పోటీ చేయాలని భావిస్తోంది. కానీ ఎన్సీపీ 10, శివసేన 18 సీట్లు కోరుతున్నాయి. ఇప్పటిదాకా బీజేపీ 24, శివసేన 8, ఎన్సీపీ 3 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాయి. గత ఎన్నికల్లో మహారాష్ట్రలో 7 శాతం ఓట్లు సాధించిన అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ సారథ్యంలోని బహుజన్ అఘాడీ కూడా బీజేపీతో సీట్ల బేరం సాగిస్తోంది. మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రే కూడా తాజాగా మోదీకి జై కొట్టారు. ఈ ఎన్నికల్లో మహాయుతి కూటమికి బేషరతుగా మద్దతు ప్రకటించారు!

స్టేట్ స్కాన్

మాటల యుద్ధం

ఎన్నికల ప్రచారం జోరందుకుంటున్న కొద్దీ నేతల మాటల్లో వాడి, వేడి కూడా పెరుగుతోంది. ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్ ఠాక్రే బీజేపీకి బేషరతు మద్దతు ప్రకటించడాన్ని కాంగ్రెస్ నేత విజయ్ వడెట్టివార్ తప్పుబట్టారు. 'రాజ్ ఠాక్రే బీజేపీ ముందు మరీ ఇలా సాగిలపడిపోతారనుకోలేదు. పులి కాస్త గొర్రెలా మారింది. ఠాక్రే వంటి పోరాట యోధుడు బానిసగా మారారు. అతను బీజేపీకి మద్దతు ప్రకటించినా ఎన్నికల్లో మా విపక్ష ఎంవీఏ కూటమిపై ఎలాంటి ప్రభావం ఉండదు' అని విజయ్ పేర్కొన్నారు. కాగా, బుధవారం నాగ్‌పూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో మోదీ విపక్షాల ఆరోపణలను తిప్పికొట్టారు. 'సర్వేలన్నీ ఎన్డీఏ బంపర్ విజయం ఖాయమంటున్నాయి. ప్రతిపక్షాలు నాపై చేస్తున్న విమర్శలు, దూషణలతో మా బలం మరింత పెరుగుతోంది. 'అబ్‌కీ బార్ 400 పార్' ట్రెండ్ బలపడుతోంది' అని స్పష్టం చేశారు. బీజేపీ తరఫున డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవిస్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వంటి నేతలు ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. కాగా, రెండు నెలల క్రితం కాంగ్రెస్‌ను వీడిన మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్ కూడా బీజేపీ స్టార్ క్యాంపెయినర్లలో ఉండటం విశేషం. ఆయనకు బీజేపీ రాజ్యసభ సీటు కట్టబెట్టింది. మరోపక్క, కాంగ్రెస్ ప్రచారంలో రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గేకు రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలే దన్నుగా నిలుస్తున్నారు.



ఎన్నికల తేదీలు
ఏప్రిల్ 19, 26, మే 7, 13, 20

సర్వేల సంగతేంటి?

సర్వేల్లో మహారాష్ట్రపై మిశ్రమ అంచనాలు వెలువడుతున్నాయి. కొన్ని అధికార మహాయుతి కూటమికే మెజారిటీ సీట్లు కట్టబెట్టగా మరి కొన్ని ఎంవీఏ భారీగా పుంజుకుని పైచేయి సాధిస్తుందంటున్నాయి. తాజా సర్వే ఒకటి ఎంవీఏ కూటమికి ఏకంగా 26 స్థానాలు అంచనా వేయడంతో కాంగ్రెస్ తదితర విపక్షాల్లో ఉత్సాహం నెలకొంది.

- సాక్షి నేషనల్ డెస్క్

'ఇండియా' పైచేయి సాధించేనా?

ప్రతిపక్ష ఎంవీఏ కూటమిలో ఎట్టకేలకు సీట్ల పంపకం కొలిక్కి వచ్చింది. శివసేన (ఉద్ధవ్) 21 సీట్లు, కాంగ్రెస్ 17 స్థానాలు, ఎన్సీపీ (శరద్ పవార్) 10 స్థానాల చొప్పున పంచుకున్నాయి. ఎన్సీపీ, శివసేన ఓటు బ్యాంకు తమతోనే ఉందని ఎంవీఏ చెబుతోంది. కాంగ్రెస్ 6 న్యాయాలు, 25 గ్యారంటీలతో కూడిన మేనిఫెస్టోను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తోంది. మహాయుతి కూటమికి ఎంవీఏ గట్టి పోటీ ఇస్తున్నట్టు కన్పిస్తోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్న నేపథ్యంలో మహారాష్ట్రపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఓటు కోసం కూటి విద్యలు





ప్రచారంలో భాగంగా గురువారం రోడ్డుపక్కనే భోజనం చేస్తున్న జమ్మూ–రియసీ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి జుగల్ కిశోర్ శర్మ

డ్రీమ్ గర్ల్ హేమమాలిని (బీజేపీ) తన నియోజకవర్గం మథురలో గురువారం ఇలా చేలోకి దిగి గోధుమ పంట కోతల్లో పాలుపంచుకున్నారు.

కోత కొచ్చిన ఓట్ల పంట



'మూడో విడత'కు నేడు నోటిఫికేషన్

- ఈనెల 19 వరకు నామినేషన్లకు అవకాశం
- 12 రాష్ట్రాల్లోని 94 లోక్‌సభ స్థానాల్లో మే 7న పోలింగ్

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక సమరంలో మూడో విడత ఎన్నికల ప్రక్రియకు రంగం సిద్ధమైంది. మూడో విడతలో 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 94 లోక్‌సభ స్థానాల్లో మే 7వ తేదీన పోలింగ్ జరగనుంది. వీటితోపాటు అభ్యర్థి మృతితో రెండో విడతలో వాయిదా పడిన మధ్యప్రదేశ్‌లోని బేతుల్ లోక్‌సభ నియోజకవర్గానికి మే 7నే పోలింగ్ ఉంటుంది. శుక్రవారం మూడో విడత ఎన్నికల ప్రక్రియకు నోటిఫికేషన్ వచ్చాక నామినేషన్ల ప్రక్రియ మొదలుకానుంది. ఈ 94 లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 19 వరకు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చు. నామినేషన్ల పరిశీలన ఏప్రిల్ 20న ఉంటుంది. మూడో విడతలో అస్సాం, బిహార్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌తదితర రాష్ట్రాల్లో మే 7న ఎన్నికలు జరుగనున్నాయి. గుజరాత్‌లోని విజాపూర్, ఖంభట్, వఘోడియా, మానవదర్, పోర్‌బందర్ అసెంబ్లీ స్థానాలతో పాటు, పశ్చిమబెంగాల్‌లోని భగవాన్‌గోలా, కర్ణాటకలోని షోరాపూర్ (ఎస్టీ) అసెంబ్లీ సీటుకు ఉప ఎన్నిక పోలింగ్ జరుగనుంది.

బీజేపీలో చేరిన రోహన్ గుప్తా

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి రోహన్ గుప్తా బీజేపీలో చేరారు. గురువారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే సమక్షంలో ఆయన కాషాయ కండువా కప్పుకున్నారు. ఐఏఎస్ మాజీ అధికారి పరంపల్ కౌర్, ఆమె భర్త, శిరోమణి అకాలీదళ్ సీనియర్ నేత సికందర్ బీజేపీలో చేరారు. జాతీయవాదం, సనాతన ధర్మం వంటి అంశాలపై సంప్రదాయ వైఖరి నుంచి వైదొలిగిన కాంగ్రెస్ పార్టీ విశ్వసనీయతను కోల్పోయిందని గుప్తా పేర్కొన్నారు.

స్పైవేర్ దాడులు జరగొచ్చు

మరోమారు యూజర్లను హెచ్చరించిన యాపిల్ సంస్థ

న్యూఢిల్లీ: ప్రభుత్వ మద్దతున్న సైబర్ నేరగాళ్లు మీ ఐఫోన్ తదితర యాపిల్ ఉత్పత్తులపై సైబర్‌దాడులు చేయొచ్చని గతంలో హెచ్చరించి తీవ్ర చర్చకు తెరలేపిన యాపిల్ సంస్థ తాజాగా మరోమారు అలాంటి హెచ్చరికనే చేసింది. పెగాసస్ తరహా అత్యంత అధునాతనమైన స్పైవేర్ దాడులు కీలకమైన పాత్రికేయులు, కార్యకర్తలు, రాజకీయవేత్తలు, దౌత్యవేత్తలను లక్ష్యంగా చేసుకుని జరగొచ్చని యాపిల్ ఏప్రిల్ పదో తేదీ ఒక 'థ్రెట్' నోటిఫికేషన్‌లో పేర్కొంది. ''కొనుగోలుచేసిన అధునాతన స్పైవేర్‌తో సైబర్ దాడులు జరిగే అవకాశాలను ముందే పసిగట్టి యూజర్లకు సమాచారం ఇవ్వడం, వారిని అప్రమత్తం చేయడం కోసం థ్రెట్ నోటిఫికేషన్లను రూపొందించాం. సాధారణ సైబర్‌నేరాల కంటే ఈ దాడులు చాలా సంక్లిష్టమైనవి. అత్యంత తక్కువ మందినే లక్ష్యంగా చేసుకుంటారు కాబట్టి ఎవరిపై, ఎందుకు దాడి చేస్తారో చెప్పడం కష్టం. అయితే దాడి జరిగే అవకాశాన్ని మాత్రం ఖచ్చితంగా అంచనావేసి ముందే యూజర్లను అప్రమత్తం చేస్తాం'' అని థ్రెట్ నోటిఫికేషన్‌లో యాపిల్ హెచ్చరించింది. సార్వత్రిక ఎన్నికలకు సంసిద్ధమవుతున్న భారత్‌సహా 60 దేశాల్లోని యూజర్లకు యాపిల్ ఈ నోటిఫికేషన్లు పంపించింది. ఇజ్రాయెల్ తయారీ పెగాసస్ స్పైవేర్ సాయంతో మొబైల్ ఫోన్‌కు వాట్సాప్ ద్వారా మిస్డ్‌కాల్ ఇచ్చి కూడా ఆ ఫోన్‌ను సైబర్‌నేరగాళ్లు తమ నియంత్రణలోకి తెచ్చుకోవచ్చు. ''ఎవరైనా యూజర్‌ను సైబర్‌నేరగాళ్లు లక్ష్యంగా చేసుకుంటే ముందే గుర్తించి ఆ యూజర్‌ను హెచ్చరిస్తాం. ఐఫోన్‌ను సైబర్‌భూతం నుంచి కాపాడాలంటే దానిని లాక్‌డౌన్ మోడ్‌లో పెట్టుకోవచ్చు. అప్పుడు ఆ ఫోన్‌లో ఫింగర్‌ప్రింట్ సెన్సార్, ఫేషియల్ రికగ్నిషన్, వాయిస్ రిగ్నిషన్ ఏవీ పనిచేయవు. ఒకవేళ మనమే మళ్లీ వాడుకోవాలంటే పిన్ లేదా పాస్‌కోడ్ లేదా ప్యాట్రన్ సాయంతోనే మళ్లీ ఫోన్‌ను పనిచేసేలా చేయొచ్చు'' అని యాపిల్ సూచించింది. ఒక సర్వే ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 49 శాతం సంస్థలు తమ ఉద్యోగుల డివైజ్‌లపై సైబర్ దాడులు/ఉల్లంఘన ఉదంతాలను పసిగట్ట లేకపోతున్నాయి. భారత్‌లో లెక్కిస్తే మొబైల్ మాల్‌వేర్ సాయంతో సగటు వారానికి 4.3 శాతం సంస్థలపై సైబర్ దాడులు జరుగుతున్నాయి. అదే ఆసియాపసిఫిక్ ప్రాంతంలో అయితే గత ఆరు నెలల్లో సగటును 2.6 శాతం సంస్థలపై సైబర్ దాడులు చోటుచేసుకున్నాయి.


రిషికేశ్‌లో ఎన్నికల ర్యాలీలో ఢమరుకం మోగిస్తున్న ప్రధాని మోదీ

ఉగ్రవాదులకు చావుదెబ్బ: మోదీ

రిషికేశ్/జైపూర్: కేంద్రంలో బీజేపీ నేతృత్వంలో బలమైన ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ఉగ్రవాదులు చావుదెబ్బ తిన్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ముష్కర మూకలను మన భద్రతా దళాలు వారి సొంత గడ్డపైనే మట్టుబెట్టాయని పేర్కొన్నారు. ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కారు(మరోసారి మోదీ ప్రభుత్వం) అనే నినాదం దేశమంతటా ప్రతిధ్వనిస్తోందని అన్నారు. స్థిరమైన ప్రభుత్వం వల్ల కలిగే లాభాలను ప్రజలు ప్రత్యక్షంగా చూశారని తెలిపారు. గురువారం ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్‌లో, రాజస్తాన్‌లోని కరౌలీలో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. బహిరంగ సభల్లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గతంలో కేంద్రంలో బలహీన, అస్థిర ప్రభుత్వాలు ఉన్నప్పుడు ఉగ్రవాదులు చెలరేగిపోయారని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చాక తోక ముడిచారని వ్యాఖ్యానించారు. దేశాన్ని లూటీ చేయకుండా అవినీతిపరులను అడ్డుకున్నానని, అందుకే వారంతా తనను దూషిస్తున్నారని ఆక్షేపించారు.

వీరి బాధలు ఎవరికీ పట్టట్లేవు

రైతులు, నిరుద్యోగులనుద్దేశించి రాహుల్ వ్యాఖ్య

జైపూర్: తమను కష్టాల నుంచి గట్టెక్కించాలని రైతులు, నిరుద్యోగ యువత, మహిళలు ఎంత మొత్తుకున్నా బాధలను మోదీ సర్కార్ పట్టించుకోవట్లేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. గురువారం రాజస్థాన్‌లోని బికనీర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని అనూప్‌గఢ్‌లో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ ప్రసంగించారు. '' తమ పంటల కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత కల్పించాలని రైతులు డిమాండ్‌చేస్తున్నారు. ఉపాధి కల్పించాలని నిరుద్యోగ యువత విన్నపాలు చేస్తోంది. నిత్యా వసరాల ధరల నుంచి ఉపశమనం కల్పించాలని మహిళలు వేడుకుంటున్నా వీళ్ల గోడు ఎవరికీ పట్టదు'' అని రాహుల్ అన్నారు. '' వెనుకబడిన వర్గాలు, దళితులు, గిరిజనులు, జనరల్ కేటగిరీలో ఉన్న పేదల అభ్యున్నతి కోసమే ఈ ఎన్నికలు. నిరుద్యోగమే దేశంలో అతిపెద్ద సమస్య. ద్రవ్యోల్బణం రెండో సమస్య. దేశంలో 90 శాతం మంది ఇవే చెబుతారు. కానీ ఒకవేళ కేంద్రంలో బీజేపీ చెప్పుచేతల్లో ఉన్న జాతీయమీడియాను ఫాలో అయితే మాత్రం మనకు అంబానీ కుమారుల పెళ్లివేడుకే దేశంలో అతిపెద్ద చర్చనీయాంశంగా కనిపిస్తుంది. మోదీ ఓసారి సాగరగర్భంలోకి వెళ్తారు, మరోసారి గస్తీవిమానంలో చక్కర్లు కొడతారు, మరోసారి డప్పు వాయిస్తూ కనిపిస్తారు, ఇంకోసారి సభలో మొబైల్ ఫ్లాష్‌లైట్లు వెలిగించాలని పిలుపునిస్తూ కనిపిస్తారు. జాతీయ మీడియాలో 24 గంటలూ మోదీ ముఖమే దర్శనమిస్తుంది'' అని ఎద్దేవాచేశారు.



ఇవేం పేర్లు బాబోయ్!

రాజకీయ పార్టీలకు గమ్మత్తైన పేర్లు

దేశవ్యాప్తంగా చాంతాడంత జాబితా

ట్వంటీ20. హైటెక్. సాఫ్. సూపర్ నేషన్. జాగ్తే రహో...



ఇవన్నీ ఏమిటా అనుకుంటున్నారా? రాజకీయ పార్టీల పేర్లు! వినడానికి చిత్రంగా ఉన్నా ఇది నిజం. మన దేశంలో ఆరు జాతీయ పార్టీలు, 57 రాష్ట్ర పార్టీలున్నాయి. వీటి పేర్లు మనం తరచూ వినేవే. వీటితో పాటు భారత్‌లో ఏకంగా 2,597 గుర్తింపు లేని రాజకీయ పార్టీలు కూడా ఉన్నాయి. వీటిలో వినడానికే గమ్మత్తైన, ఆసక్తికరమైన, పేర్లున్న పార్టీలకు కొదవ లేదు. కాకపోతే వీటిలో చాలావరకు ఎన్నికల సమయంలో తప్ప పెద్దగా తెరపైకే రావు.

పార్టీ పెట్టడం యమా ఈజీ



మన దేశంలో పార్టీ పెట్టడం సులువైన పని. రూ.10 వేలు డిపాజిట్, 100 మంది సభ్యుల మద్దతుంటే చాలు... పార్టీ పెట్టేయొచ్చు. ఏ మతాన్నో, కులాన్నో, ప్రాంతాన్నో కించపరిచేలా లేకపోతే చాలు. దాంతో దేశవ్యాప్తంగా ఇలా వేలాది పార్టీలు పుట్టుకొచ్చాయి. వాటిలో గమ్మత్తైన పేర్లకూ కొదవ లేదు. ఇండియన్ లవర్స్ పార్టీ, ఇండియన్ ఓషియానిక్ పార్టీ, లైఫ్ పీస్‌ఫుల్ పార్టీ, హోలీ బ్లెస్సింగ్ పీపుల్స్ పార్టీ, లేబర్ అండ్ జాబ్ సీకర్స్ పార్టీ, అఖిల భారతీయ భారత్ మాతా–పుత్రపక్ష, భారతీయ మొహబ్బత్ పార్టీ, మినిస్టీరియల్ సిస్టం అబాలిషన్ పార్టీ, ఆల్ పెన్షనర్స్ పార్టీ, తమిళ్ తెలుగు నేషనల్ పార్టీ, ఇండియన్ విక్టరీ పార్టీ, ఇంటర్నేషనల్ పార్టీ, చిల్డ్రన్ ఫస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా, చాలెంజర్స్ పార్టీ, స్వచ్ఛ భారత్ పార్టీ, సత్యయుగ్ పార్టీ, ఇన్సానియత్ పార్టీ, నేషనల్ టైగర్ పార్టీ, మర్యాదీ దళ్... ఇలా ఈ జాబితా చాంతాడును మించిపోతుంది. ప్రధాని మోదీ ఇటీవల పదేపదే ప్రస్తావిస్తున్న నారీ శక్తి పేరుతో కూడా ఒక పార్టీ ఉంది! ఆమ్ ఆద్మీ పార్టీని తలపించేలా గరీబ్ ఆద్మీ పేరుతో కూడా ఒక పార్టీ ఉంది. ఇక, ద రిలిజియన్ ఆఫ్ మ్యాన్ రివాల్వింగ్ పొలిటికల్ పార్టీ ఆఫ్ ఇండియా అనే పార్టీ పేరునైతే వీటికి పరాకాష్టగా చెప్పుకోవచ్చు! అయితే ఈ పార్టీల్లో చాలావరకు వ్యవస్థపై తమ అసంతృప్తిని, అసహనాన్ని వ్యక్తం చేసేందుకు, ఆదర్శ సమాజ స్వప్నానికి రూపమిచ్చేందుకు వాటి వ్యవస్థాపకులు చేసిన ప్రయత్నంగా కనిపిస్తుంది.

రైట్ టు రీకాల్!

...అంటే తమకు నచ్చని ప్రజాప్రతినిధిని చట్టసభ నుంచి తప్పించే హక్కు. భారత్‌లో లేకున్నా చాలా దేశాల్లో ఈ హక్కుంది. కాకపోతే యూపీలో రాకేశ్ సూరి అనే 42 ఏళ్ల కంప్యూటర్ ఆపరేటర్ ఈ పేరుతో ఏకంగా పార్టీయే పెట్టారు. హామీలు నెరవేర్చని ప్రజాప్రతినిధులను రీకాల్ చేసే ప్రతిపాదనపై పౌరులకు అవగాహన కల్పించడమే ఆయన లక్ష్యమట. అన్నట్టూ, ఈ లోక్‌సభ ఎన్నికల్లో గాజియాబాద్ నుంచి ఆయన పోటీ కూడా చేస్తున్నారు! యూపీలో ఇలాంటి భిన్నమైన పేర్లతో కూడిన పార్టీలకు కొదవ లేదు. సబ్ సే అచ్ఛీ అనే పార్టీ కూడా అక్కడ ఉనికిలో ఉంది. తొలుత దీని పేరు ఇస్లామిక్ డెమోక్రటిక్ పార్టీ. మతపరమైనదిగా ఉందంటూ అభ్యంతరాలు రావడంతో ఇలా మార్చేశారన్నమాట! ఆప్ కీ అప్నీ పార్టీ (పీపుల్స్), సుభాష్‌వాదీ భారతీయ సమాజ్‌వాదీ పార్టీ వంటి పార్టీలు కూడా యూపీలో ఉన్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

కేజ్రీవాల్ ప్రైవేట్ సెక్రటరీ తొలగింపు

న్యూఢిల్లీ: సీఎం కేజ్రీవాల్ ప్రైవేట్ సెక్రటరీ బిభవ్ కుమార్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఢిల్లీ ప్రభుత్వ విజిలెన్స్ డైరెక్టరేట్ తెలిపింది. ఆయన నియామకం నియమ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని పేర్కొంది. మద్యం కుంభకోణం కేసులో దర్యాప్తు సంస్థలు బిభవ్ కుమార్ పాత్రపైనా అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయని తెలిపింది. సెంట్రల్ సివిల్ సర్వీసెస్(టెంపరరీ సర్వీస్) నిబంధనలు–1965 ప్రకారం బిభవ్ కుమార్‌ను సీఎం కేజ్రీవాల్ ప్రైవేట్ సెక్రటరీ విధుల నుంచి తొలగిస్తున్నట్లు వివరించింది. ఈ పరిణామంపై అధికార ఆప్ స్పందించలేదు.

చెట్టును ఢీకొట్టిన స్కూల్ బస్సు 6గురు విద్యార్థులు మృతి

మరో 20 మంది చిన్నారులకు గాయాలు

చండీగఢ్: విద్యార్థులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ స్కూలు బస్సు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఆరుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. 20 మంది తీవ్ర గాయాలతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. హరియాణాలోని మహేంద్రగఢ్ జిల్లా ఉన్హాని గ్రామ సమీపంలో గురువారం ఉదయం ఈ ఘోరం జరిగింది. బస్సు డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. రంజాన్ సెలవైనప్పటికీ స్కూలు యాజమాన్యం తరగతుల నిర్వహణపై దర్యాప్తు ప్రారంభించారు.

లోయలో పడిన బస్సు 17 మంది మృత్యువాత

కరాచీ: పాకిస్తాన్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 17 మంది మృతి చెందారు. 38 మంది గాయపడ్డారు. సింధ్, బలోచిస్తాన్ ప్రావిన్స్‌ల సరిహద్దుల్లోని హుబ్ పట్టణ సమీపంలో బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. సింధ్ ప్రావిన్స్‌లోని తట్టా పట్టణానికి చెందిన కొందరు బలోచిస్తాన్‌లోని హుబ్ పట్టణంలోని షా నూరానీ దర్గాకు బుధవారం మధ్యాహ్నం బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న బస్సు రాత్రి 8 గంటల సమయంలో అదుపుతప్పి రోడ్డు పక్కన లోయలో పడిపోయింది. క్షతగాత్రులను అక్కడికి 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న కరాచీ నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీఐ కింద ఎలక్టోరల్ బాండ్ల వివరాలు ఇవ్వలేం

ఎస్‌బీఐ వెల్లడి

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కేంద్ర ఎన్నికల సంఘానికి అందజేసిన ఎలక్టోరల్ బాండ్ల వివరాలను సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కింద బహిర్గతం చేసేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) నిరాకరించింది. ఇది వ్యక్తిగత సమాచారమని పేర్కొంది. సంబంధిత రికార్డులు ఎన్నికల సంఘం వెబ్‌సైట్ అందరికీ అందుబాటులో ఉన్నప్పటికీ ఆర్టీఐ కింద ఈ వివరాలు ఇవ్వడం సాధ్యం కాదని తేల్చిచెప్పింది. ఈ బాండ్లకు సంబంధించిన పూర్తి డేటాను డిజిటల్ రూపంలో ఇవ్వాలని కోరుతూ సమాచార హక్కు చట్టం కార్యకర్త లోకేశ్ బాత్రా మార్చి 13న దరఖాస్తు చేశారు.

దక్షిణ కొరియా అధ్యక్షునికి ఎదురుదెబ్బ

ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీ ఘన విజయం

సియోల్: పీపుల్ పవర్ పార్టీ నేత, దక్షిణ కొరియా దేశాధ్యక్షుడు యూన్ సుక్ ఇయోల్ పరిపాలనకు రెఫరెండంగా భావిస్తున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ కూటమి ఘన విజయం సాధించింది. ఓట్ల లెక్కింపు తాజా సమాచారం ప్రకారం 300 సీట్లకుగాను విపక్షాల కూటమి 175 చోట్ల విజయం సాధించింది. అధికార పీపుల్ పవర్ పార్టీ, దాని మిత్రపక్షం కలిపి 109 చోట్ల గెలిచాయి. ప్రతిపక్షం గెలుపుతో అధ్యక్షుడిగా యూన్ సుక్‌కు కష్టాలు మొదలయ్యాయి. పార్లమెంట్‌లో ప్రతిపక్షం ఆధిపత్యం పెరిగిన నేపథ్యంలో అధ్యక్షుడికి కొత్త సవాళ్లు ఎదురుకానున్నాయి.

రియల్‌ఎస్టేట్ మహిళా దిగ్గజానికి మరణశిక్ష

తీర్పు చెప్పిన వియత్నాం కోర్టు

హనోయి: తనకు వాటాలు ఉన్న బ్యాంక్‌ను మోసం చేసి ఏకంగా రూ.1 లక్ష కోట్లకుపైగా మోసానికి పాల్పడిన వియత్నాం రియల్ ఎస్టేట్ మహిళా దిగ్గజం ట్రూంగ్ మై లాన్‌కు అక్కడి సిటీ కోర్టు గురువారం మరణశిక్షను విధించింది. దేశంలోనే అతిపెద్ద ఆర్థిక మోసంగా ఈ ఉదంతం రికార్డులకెక్కింది. అక్కడి ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ వాన్ థిన్ ఫాట్‌కు 67 ఏళ్ల లాన్ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఈమె 2012–2022 కాలంలో అక్కడి సైగన్ జాయింట్ స్టాక్ కమర్షియల్ బ్యాంక్‌పై అజమాయిషీ చలాయించారు. ఆ కాలంలో తప్పుడు ధృవీకరణ పత్రాలు సమర్పించి ఏకంగా 2,500 రుణాలు మంజూరయ్యేలా చేసి బ్యాంక్‌కు సుమారు రూ.2.24 లక్షల కోట్లు(27 బిలియన్ డాలర్లు) నష్టం చేకూర్చారని గతంలో ఆమెపై కేసు నమోదైంది. దీంతో 2022 అక్టోబర్‌లో ఆమెను పోలీసులు అరెస్ట్‌చేశారు. ఈ ఉదంతంలో బ్యాంక్‌కు రూ.224 కోట్లు(2.69 కోట్ల డాలర్లు) జరిమానాగా చెల్లించాలని హో చిన్ మిన్హ్ సిటీ కోర్టు ఆదేశించింది. '' ఈమె భారీ ఆర్థిక, వ్యవస్థీకృత నేరానికి పాల్పడి ఆ నగదు మళ్లీ రికవరీ చేసే పరిస్థితి లేకుండా చేశారు. ఇంతటి హేయమైన నేరానికి పాల్పడినందుకే మరణశిక్ష విధిస్తున్నాం. ఈ కేసులో దాదాపు రూ.43 కోట్లలంచం తీసుకున్న సెంట్రల్ బ్యాంక్ మాజీ అధికారి డో థి నహాన్‌కు జీవితఖైదు విధిస్తున్నాం. లాన్ అత్యంత సన్నిహిత బంధువు, వాన్ థిన్ ఫాట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారిణి ట్రూంగ్ హూయా వాన్‌కు 17 ఏళ్ల కారాగారశిక్ష విధిస్తున్నాం' అని కోర్టు తన తీర్పులో పేర్కొంది. రియల్ ఎస్టేట్ సంస్థ వాన్ థిన్హ్ ఫాట్ అక్కడి లగ్జరీ నివాస భవంతులు, కార్యాలయాలు, హోటళ్లు, షాపింగ్ సెంటర్లను నిర్మించడంలో మంచి పేరు సాధించింది.


ట్రూంగ్ మై లాన్

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
శుక్రవారం । 12 । ఏప్రిల్ । 2024



బెజవాడలో 'లవ్ మౌళి' సందడి

గాంధీనగర్: హీరో నవదీప్ నటించిన 'లవ్ మౌళి' చిత్ర యూనిట్ విజయవాడ జీత్రీ థియేటర్‌లో సందడి చేసింది. చిత్ర ట్రైలర్‌ను రిలీజ్ చేసింది.



టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి..

నందిగామ టౌన్: వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన 20 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. ఎమ్మెల్సీ అరుణ కుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.



విస్తృతంగా ప్రచారం

గుడివాడ టౌన్: స్థానిక దనియాల పేటలో గురువారం ఎమ్మెల్యే కొడాలి నాని విస్తృతంగా ప్రచారం చేశారు. వాహనాల్లో వెళ్లే ప్రయాణికులను ఆశీర్వదించాలని కోరారు.

న్యూస్‌రీల్

గొప్ప సాంఘిక సంస్కర్త జ్యోతిరావ్ పూలే

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సాంఘిక సంస్కర్తగా మహాత్మా జ్యోతిరావ్ పూలే చేసిన సేవలు చాలా గొప్పవని.. మహిళల విద్య, సామాజిక న్యాయం కోసం ఆయన ఎనలేని కృషి చేశారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పూలే చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రజలకు సాంఘిక న్యాయం, సమాన హక్కుల కోసం సత్యశోధక సమాజాన్ని స్థాపించి చైతన్యం తెచ్చి, విశేష సేవలు అందించారని కలెక్టర్ డిల్లీరావు అన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చదరంగం రాష్ట్ర పోటీలకు ఏర్పాట్లు పూర్తి



విజయవాడస్పోర్ట్స్: చెస్ అండర్-17 బాలికల, ఓపెన్ రాష్ట్ర స్థాయి పోటీలను ఈ నెల 20, 21 తేదీల్లో పోరంకిలోని గ్రీన్ స్కూల్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి భీమారావు తెలిపారు. పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను స్కూల్ ప్రిన్సిపాల్ జె.సాయి అపర్ణ, కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఫణికుమార్‌తో కలిసి గురువారం ఆవిష్కరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల క్రీడాకారులు ఈ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. బాలికల, ఓపెన్ రెండు విభాగాల్లో పోటీలు జరుగుతాయని వివరించారు. పోటీల అనంతరం జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్లను ఎంపిక చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9700775220ను సంప్రదించాలని సూచించారు.

నిష్పక్షపాత ఎన్నికలే లక్ష్యం



గన్నవరం: రానున్న సార్వత్రిక ఎన్నికలను సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ కేంద్రంలో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ కోసం చేసిన ఏర్పాట్లను జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గీతాంజలి శర్మ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఈ కేంద్రంలోని సదుపాయాలను, పరిసరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని అసెంబ్లీ కేంద్రాల్లో స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సహాయక ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ పవన్‌కుమార్, సీఐ వరప్రసాద్ పాల్గొన్నారు.

రూ.6.74 కోట్ల విలువైన నగదు, మద్యం సీజ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సమర్థంగా అమలుచేస్తున్నామని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సీజర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ కూడా పటిష్టంగా అమలవుతోందని, ఇప్పటి వరకు జిల్లాలో రూ.6.74 కోట్ల విలువైన నగదు, మద్యం, మత్తు పదార్థాలు, ఇతర విలువైన వస్తువులను సీజ్ చేసినట్లు తెలిపారు. రూ.3.01 కోట్ల నగదుతో పాటు రూ.92.56 లక్షల విలువైన 19,233 లీటర్ల మద్యం, రూ.5.91 లక్షల విలువైన 58,401 గ్రాముల మత్తు పదార్థాలు, రూ.2.32 కోట్ల విలువైన 7,758 గ్రాముల విలువైన లోహాలు, రూ.6.43 లక్షల విలువైన 132 ఉచితాలు తదితరాలను సీజ్ చేసినట్లు తెలిపారు. జగ్గయ్యపేట నియోజకవర్గానికి సంబంధించి రూ.1.13 కోట్ల మేర సీజ్ చేశామన్నారు. మైలవరం నియోజకవర్గంలో రూ.35.62 లక్షలు, నందిగామలో రూ.18.33 లక్షలు, తిరువూరులో రూ.84.57 లక్షలు, విజయవాడ సెంట్రల్‌లో రూ.2.75 కోట్లు, విజయవాడ తూర్పులో రూ.64.12 లక్షలు, విజయవాడ పశ్చిమలో రూ.82.44 లక్షల మేర సీజ్ చేసినట్లు కలెక్టర్ ఢిల్లీరావు వివరించారు.

ఈద్ సంబరం



విజయవాడ చిట్టినగర్ ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నెలరోజుల కఠోర దీక్ష ముగిసింది. నెలవంక దర్శనమివ్వడంతో అత్యంత నియమ, నిష్టలతో కొనసాగించిన రంజాన్ మాసానికి ముస్లింలు ముగింపు పలికారు. గురువారం ఈద్ ఉల్ ఫితర్‌ను సంతోషంగా జరుపుకున్నారు. సామూహికంగా పండుగను నిర్వహించుకున్నారు. అందరూ ఒక్కచోట చేరి ఈద్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని, శుభాకాంక్షలు చెప్పుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈద్ కమిటీల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. మానవులందరూ సుఖ సంతోషాలతో ఉండటమే రంజాన్ ముఖ్య ఉద్దేశమని వక్తలు పేర్కొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి దేవినేని అవినాష్

అంగన్‌వాడీ.. ఏబీసీడీ



ఈ చిత్రంలో బ్లాక్ బోర్డుపై ఏబీసీడీ అని రాస్తున్న చిన్నారి ఎండీ రెహమతున్నీసాది కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గం గూడూరు. పట్టణంలోని అంగన్‌వాడీ రెండో సెంటర్‌లో ప్రభుత్వ సేవలు పొందుతోంది. చిన్నారి తండ్రి ఎండీ అజీమ్ 2022లో మరణించారు. దీంతో తల్లి ఎండీ మున్నీరున్నీసాపై కుమార్తె భారం పడింది. అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చిన్నప్పటి నుంచి పౌష్టికాహారం అందించడంతోపాటు ఇంగ్లిష్‌లో బోధిస్తున్నారని తెలుసుకుని సమీపంలోని కేంద్రంలో చేర్పించారు. దీంతో ఆ చిన్నారి రోజు ప్రీ ప్రైమరీ స్కూలుకు వెళ్లి ఆడుతూ పాడుతూ ఇంగ్లిష్ నేర్చుకుంటోంది.

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ విద్యా సంస్కరణల్లో ఇదీ ఒకటి
- 55,607 అంగన్‌వాడీ కేంద్రాలు 'వైఎస్సార్ ప్రీ ప్రైమరీ స్కూళ్లు'గా మార్పు
- 8 లక్షల మందికి పైగా చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ఆంగ్ల బోధన
- అంగన్‌వాడీ టీచర్లకు ఇప్పటికే ప్రత్యేక శిక్షణ
- ప్రత్యేక సిలబస్‌ను రూపొందించిన మహిళా, శిశు సంక్షేమ శాఖ

సాక్షి, మచిలీపట్నం: కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లకే పరిమితమైన ఖరీదైన ఆంగ్ల విద్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. వీటిలో చదివే పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలు అందించడమే లక్ష్యంగా ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు అమలు చేస్తున్నారు. వీటిల్లో భాగంగానే అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా ఆంగ్ల విద్యను చేరువ చేశారు. పౌష్టికాహారం అందజేయడం, చిన్నారుల్లో మానసిక ఆనందమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలను వైఎస్సార్ ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా ప్రభుత్వం మార్చింది. అన్ని ప్రాజెక్టుల చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 55 వేల ప్రీ ప్రైమరీ స్కూళ్లలో టీచర్లు చిన్నారులకు ఆంగ్లంలో ఓనమాలు దిద్దిస్తున్నారు. ఈ మేరకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రీ స్కూల్ సిలబస్‌ను సైతం రూపొందించింది.

చిన్నారులకు తొలి అడుగులోనే ఆంగ్లంలో ఓనమాలు



కృష్ణా జిల్లా గూడూరులోని వైఎస్సార్ ప్రీ ప్రైమరీ అంగన్‌వాడీ స్కూల్‌లో చిన్నారులకు ఏబీసీడీలు నేర్పిస్తున్న కార్యకర్త



అంగన్‌వాడీలో కేరింతలు కొడుతున్న చిన్నారులు

8 లక్షల మందికి ఆంగ్ల బోధన

రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో 55,607 అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ స్కూల్స్ నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాల్లో మూడేళ్ల నుంచి ఏడేళ్లలోపు వయసున్న 8,02,573 మంది చిన్నారులు చదువుకుంటున్నారు. టీచర్లు.. బోర్డులు, టీవీలు, చార్ట్‌లపై రాస్తూ పిల్లలకు బోధిస్తున్నారు. అంగన్‌వాడీలను ప్రీ ప్రైమరీ స్కూళ్లగా మార్చిన నేపథ్యంలో వాటిలో అందుకనుగుణంగా ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించింది.

టీచర్లకు ప్రత్యేక శిక్షణ..

అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే కార్యకర్తలను ఆంగ్ల బోధనకు అనుగుణంగా టీచర్లుగా మార్చారు. ఈ మేరకు వారికి గతేడాది ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 55,607 అంగన్‌వాడీ కార్యకర్తలకు మహిళా, శిశు సంక్షేమశాఖ పీడీ, సీడీపీవోల పర్యవేక్షణలో సూపర్‌వైజర్ల ద్వారా ఆంగ్ల భాష నైపుణ్యాలను బోధించారు. బోధన పద్ధతులు, పాటించాల్సిన విధివిధానాలపై వారం పాటు శిక్షణ ఇచ్చారు.



చిన్నారులకు పలకలపై ఏబీసీడీలు నేర్పుతున్న కార్యకర్త

జిల్లాల వారీగా వివరాలు..

జిల్లా	అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య	విద్యార్థుల సంఖ్య (3-7 ఏళ్లు)
అల్లూరి సీతారామరాజు	3,214	53,576
అనకాపల్లి	1,908	20,125
అనంతపురం	2,302	46,512
అన్నమయ్య	2,275	32,875
బాపట్ల	1,888	21,713
చిత్తూరు	2,420	34,624
డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ	1,726	21,668
తూర్పుగోదావరి	1,556	21,403
ఏలూరు	2,225	27,781
గుంటూరు	1,480	22,452
కాకినాడ	1,986	26,399
కృష్ణా	1,707	19,516
కర్నూలు	1,886	53,679
నంద్యాల	1,663	32,119
ఎన్టీఆర్	1,475	18,344
పల్నాడు	2,031	36,702
పార్వతీపురం మన్యం	2,064	26,143
ప్రకాశం	2,903	42,635
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు	2,934	38,675
శ్రీ సత్యసాయి	2,824	40,096
శ్రీకాకుళం	3,358	33,859
తిరుపతి	2,492	38,147
విశాఖపట్నం	776	13,686
విజయనగరం	2,499	24,080
పశ్చిమ గోదావరి	1,626	20,838
వైఎస్సార్	2,389	34,926
మొత్తం	55,607	8,02,573

సర్కార్ బడుల్లో 'టోఫెల్'

- ప్రాథమిక పాఠశాలల్లో పరీక్ష పూర్తి
- నేడు పరీక్షకు హాజరవనున్న 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు



పరీక్ష తీరును పరిశీలిస్తున్న డీఈవో సుబ్బారావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విద్యావ్యవస్థను బలోపేతం చేయటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి సల్పుతున్నారు. మన విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచి, పోటీ పరీక్షల్లో రాణించేలా చిన్నప్పటి నుంచే తీర్చిదిద్దే కార్యక్రమాలతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిరంతరం పాటుపడుతోంది. అందులో భాగంగా ఆంగ్ల భాషలో నైపుణ్యాలు పెంచేందుకు వీలుగా టోఫెల్ (టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ యాజ్ ఏ ఫారెన్ లాంగ్వేజ్) పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యుత్తమ ఆంగ్ల నైపుణ్యాలు, సామర్థ్యాలు అలవడేలా తగిన శిక్షణను ఇచ్చి టోఫెల్ పరీక్షకు ఉపాధ్యాయులతో తర్ఫీదునిచ్చింది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా మూడు నుంచి తొమ్మిదో తరగతి వరకూ ఉన్న విద్యార్థులు ఈ నెల 10వ తేదీ నుంచి టోఫెల్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. మూడు నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ప్రైమరీ స్థాయిలో, ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకూ జూనియర్ స్థాయిలో పరీక్షలు నిర్వహిస్తోంది. ఉత్తీర్ణులకు అమెరికాకు చెందిన ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ నుంచి టోఫెల్ సర్టిఫికెట్లను ప్రదానం చేయనుంది.

ఎన్టీఆర్ జిల్లాలో..

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 377 పాఠశాల్లో మూడు నుంచి ఐదో తరగతి వరకూ చదువుతున్న 9,839 మంది విద్యార్థులు ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ నిర్వహించే ప్రైమరీ పరీక్షకు హాజరయ్యారు. ఈ నెల 12వ తేదీన జరిగే టోఫెల్ జూనియర్ ప్రిపరేటరీ పరీక్షను ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న 50,851 మంది విద్యార్థులు రాసేలా ప్రణాళికలు రూపొందించారు. విద్యార్థుల్లో ఉన్నత నైపుణ్యాలు, బంగారు భవిష్యత్‌కు బాటలు వేయటమే లక్ష్యంగా టోఫెల్ పరీక్షను ప్రభుత్వం నిర్వహిస్తోంది.

జగన్మాతకు పుష్పాభిషేకం



అమ్మవారికి పుష్పార్చన నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

మూడో రోజు చామంతులు, మల్లెలతో అర్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో వసంత నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వసంత నవరాత్రోత్సవాలలో మూడో రోజైన గురువారం అమ్మవారికి చామంతి, మల్లెలతో అర్చన నిర్వహించారు. తొలుత ఆలయ ఈవో కేఎస్ రామరావు, స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు మురళీ రంగావజ్జుల శ్రీనివాసశాస్త్రి, అర్చకులు గోపాలకృష్ణ, ఏఈవో ఎస్. రమేష్‌బాబు అమ్మవారికి అర్చన నిర్వహించే పుష్పాలతో మూలవిరాట్‌ను దర్శించుకున్నారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ లక్ష్మీ గణపతి ప్రాంగణానికి చేరుకున్నారు. ప్రత్యేక వేదికపై కొలువుదీరి ఉన్న అమ్మవారి ఉత్సవ మూర్తికి తెల్లచామంతి, పచ్చ చామంతి, మల్లెలతో అర్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పంచహారతులు సేవ జరిగింది. ఈవో రామరావు అమ్మవారి పూజలో పాల్గొనగా, పూజ అనంతరం అర్చన నిర్వహించిన పుష్పాలను భక్తులకు పంపిణీ చేశారు.



అర్చన కోసం పుష్పాలను తీసుకువస్తున్న ఆలయ ఈవో రామారావు, అర్చకులు

సార్వత్రికం.. సర్వ సన్నద్ధం

జిల్లాలో ప్రశాంత ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు



- ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు
- దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు
- సీ–విజిల్ యాప్‌లో ఫిర్యాదులకు 100 నిమిషాల్లో పరిష్కారం
- జిల్లాలో తాగునీటి అవసరాలకు ప్రత్యేక ప్రణాళిక
- 'సాక్షి'తో కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): 'భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి.. అందుకు కావాల్సిన ఏర్పాట్లన్నీ చేస్తున్నాం.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.. దీంతో పాటు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉండటంతో ప్రణాళిక ప్రకారం సమస్యను పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేశాం..' అని కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఇటీవల ఆయన కొత్తగా బాధ్యతలు తీసుకోవడంతో 'సాక్షి'తో గురువారం ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం..

ఏప్రిల్ 18వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతున్న నేపథ్యంలో అందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తి చేశాం. నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ అధికారులకు ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి సూచనలు, పాటించాల్సిన ఎన్నికల నియమాలను వివరించాం. ఆయా నియోజకవర్గాల వారీగా ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించాం. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఈవీఎంలను భద్రపరచటం, ప్రత్యేక పోలీస్‌భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటును పర్యవేక్షించాం.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు..

జిల్లాలో 1,763 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఆయా పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వర్తించే ఎన్నికల సిబ్బందితో పాటు ఓటర్లకు తగిన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాం. సిబ్బంది, ఎన్నికల సామగ్రిని తరలించేందుకు 434 బస్సులతో పాటు 22 డీజీటీ వాహనాలతో పాటు ఇతర వాహనాలు అవసరంగా గుర్తించి రవాణాశాఖ సమన్వయంతో పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. దివ్యాంగులు, వృద్ధులకు పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌చైర్లు ఏర్పాటు చేయటంతో పాటు వారికి ప్రత్యేక మార్గం ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశాం.

సీ–విజిల్.. 100 నిమిషాల్లో..

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై తక్షణమే చర్యలు తీసుకునేందుకు సీ–విజిల్ యాప్ ఫిర్యాదుల కేంద్రాన్ని మార్చి 16వ తేదీన కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేశాం. ఈ యాప్ ద్వారా ఇప్పటి వరకు 521 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో 402 ఫిర్యాదులు 100 నిమిషాల్లోపే పరిష్కరించాం. మిగిలిన ఫిర్యాదులు సంబంధం లేనివిగా భావించి తిరస్కరించాం. రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు రామ్మోహన్‌మిశ్రా, రాష్ట్ర వ్యయ పరిశీలకులు నీనా నిగమ్ జిల్లాలోని ఎన్నికల ఏర్పాట్లు, ఫిర్యాదుల పరిష్కార కేంద్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

తాగునీటి ఎద్దడి లేకుండా..

జిల్లాలోని ప్రజలకు తాగునీటి కష్టాలు తీర్చేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించాం. ప్రకాశం బ్యారేజీ నుంచి ఈ నెల 4వ తేదీ నుంచి నీరు విడుదలైన నేపథ్యంలో తాగునీటి అవసరాలకు వినియోగించేలా ప్రాధాన్యం ఇస్తున్నాం. జిల్లాలో 266 చెరువులకు గానూ గురువారం నాటికి 120 చెరువులను నింపి తాగునీటి సరఫరాకు చర్యలు చేపడుతున్నాం. శివారు ప్రాంతాలకు నీరు చేరేలా రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, పోలీస్ అధికారుల పర్యవేక్షణలో కమిటీలను ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఉంచాం. చెరువులకు అక్రమంగా నీరు తోడకుండా చర్యలు తీసుకున్నాం.

కొండలమ్మను దర్శించుకున్న గుంటూరు డీపీఓ

గుడ్లవల్లేరు: కృష్ణాజిల్లా వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మ వారిని గుంటూరు డీపీఓ ఆర్.కేశవరెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు.

శతాధిక వృద్ధుడు 'మూల్పూరు' కన్నుమూత



గన్నవరం: కేసరపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, శతాధిక వృద్ధుడు మూల్పూరు సత్యనారాయణ(101) గురువారం కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యల కారణంగా ఆయన తెల్లవారుజామున మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు ఐదుగురు కుమారులు ఉన్నారు. ఆయన కేసరపల్లి సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారు. సత్యనారాయణ పార్థివదేహాన్ని మాజీ ఎమ్మెల్యే ముసునూరు రత్నబోస్, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగ రాజకుమారి, సర్పంచి చేబ్రోలు లక్ష్మీ మౌనిక, పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు.

బుడమేరును తొలిచేస్తున్న పసుపు తోడేళ్లు

- ఇసుకను తోడేస్తున్న తెలుగు తమ్ముళ్లు
- రాత్రి సమయాలలో ట్రాక్టర్లలో ఇసుక తరలింపు
- అక్రమార్జనకు పాల్పడుతున్న టీడీపీ నాయకులు
- టీడీపీలోనే రెండు వర్గాల మధ్య వాటా కుదరక వెలుగులోకి...



కుంటముక్కల గ్రామ శివారులో బుడమేరు నుంచి రాత్రి సమయాల్లో ఇసుకను తరలిస్తున్న ప్రదేశం

జి.కొండూరు: గత ప్రభుత్వ హయాంలో సహజ వనరుల దోపిడీయే ప్రధాన ఆదాయ మార్గంగా ఎంచుకున్న టీడీపీ నాయకులు ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ యథేచ్ఛగా దోపిడీ సాగిస్తున్నారు. రాత్రి సమయాలలో బుడమేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అయితే టీడీపీలోనే రెండు వర్గాలకు వాటాలు కుదరకపోవడంతో అక్రమ ఇసుక వ్యాపారం గుట్టురట్టయ్యింది. వివరాలలోకి వెళ్తే...జి.కొండూరు మండల పరిధి కుంటముక్కల గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరుడు లంకా దిలీప్ కుమార్ గత ప్రభుత్వంలో గ్రామ శివారులోని తన మామిడితోటకు ఆనుకుని ఉన్న బుడమేరు నుంచి రూ.కోట్ల విలువైన ఇసుకను తరలించి సొమ్ముచేసుకున్నాడు. ఇసుక అక్రమ రవాణానే ఆదాయ మార్గంగా ఎంచుకున్న దిలీప్‌కుమార్ ఈ ఐదేళ్లలో కూడా అప్పుడప్పుడు రాత్రి సమయాలలో ఇసుకను తరలిస్తూ పోలీసులకు చిక్కాడు. అతనిపై జి.కొండూరు, మైలవరం పోలీసుస్టేషన్‌లలో పలుమార్లు కేసులు కూడా నమోదయ్యాయి. ఈ క్రమంలో ఇటీవల కుంటముక్కల గ్రామ శివారులోని బుడమేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన మరోవర్గం టీడీపీ నాయకులు అతనిపై ఫిర్యాదు చేయడంతో మైలవరం పోలీసులు రంగ ప్రవేశం చేసి ఒక ట్రాక్టరును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే బుధవారం రాత్రి



ఇసుక అన్‌లోడ్ చేసి మామిడి చెట్టు కింద ఉంచిన ట్రాక్టరు

కుంటముక్కల గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరుడు మందాడ లక్ష్మణరావు అనే వ్యక్తి తన ట్రాక్టరుతో పాటు మరి కొన్ని ట్రాక్టర్లతో బుడమేరు నుంచి ఇసుకను తరలిస్తుండగా, ఈ సమాచారం తెలుసుకున్న దిలీప్‌కుమార్ కొందరు యువకులతో కలిసి అక్కడికి చేరుకుని ఇసుకను రవాణా చేయకుండా అడ్డుకున్నాడు. తాను గతంలో ఇసుకను రవాణా చేస్తుంటే లక్ష్మణరావు పోలీసులకు ఫిర్యాదు చేసి తన ట్రాక్టరును పోలీసులకు పట్టించాడని, ఇప్పుడెలా అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నాడంటూ వాగ్వాదానికి దిగాడు. దీనిపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్రమ ఇసుక రవాణా వెలుగులోకి వచ్చింది. అయితే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే లోపే లక్ష్మణరావు వర్గీయులు ఇసుకను అన్‌లోడ్ చేసి అక్కడి నుంచి ట్రాక్టర్లతో పరారయ్యారు.

లక్ష్మణరావు ట్రాక్టరుతో పాటు మరో ట్రాక్టరును బుడమేరు పక్కనే ఉన్న మామిడితోటలో ఉంచడంతో పోలీసులు ట్రాక్టర్లను పరిశీలించారు. ట్రాక్టర్ల పక్కనే ఇసుక కుప్పలు ఉండడంతో అక్రమ ఇసుక రవాణా జరిగిందని నిర్ధారించుకున్న పోలీసులు, లక్ష్మణరావును పిలిపించి వివరణ కోరారు. అయితే తాను ఒక ట్రక్కు ఇసుక మాత్రమే తన భవన నిర్మాణం కోసం తరలించానని, తాను టీడీపీ నాయకుడు సుఖవాసి శ్రీహరి అనుచరుడినని బుకాయించాడు. లక్ష్మణరావు తీరుపై అనుమానం వచ్చిన పోలీసులు గురువారం పోలీసుస్టేషన్‌కు రావాలని ఆదేశించారు. దీనిపై జి.కొండూరు పోలీసులను వివరణ కోరగా ఇసుక లోడుతో ఉన్న ట్రాక్టర్లు పట్టుబడని కారణంగా ఎటువంటి కేసులు నమోదు చేయలేదన్నారు. ఇక మీదట ఇసుక అక్రమ రవాణా జరగకుండా పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు.



బుడమేరు పక్కనే మామిడి తోటలో డంప్ చేసిన ఇసుక కుప్పలు

వేడి గాలులతో ఉద్యాన పంటలకు నష్టం

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలే కారణం
- తగ్గనున్న పంట దిగుబడులు
- యాజమాన్యంపై దృష్టి సారిస్తే లాభాలు
- జిల్లా ఉద్యానశాఖ అధికారి జె.జ్యోతి

కంకిపాడు: ప్రస్తుత వాతావరణంలో వేడి గాలులు వీస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. దీంతో వేడి తరంగాలు ఉద్యాన పంటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పంటలు ఎండిపోయి, దిగుబడులు గణనీయంగా తగ్గితే రైతుకు కష్టాలే. సకాలంలో యాజమాన్య చర్యలు తీసుకోకపోతే సాగు నష్టాలమయంగా మారుతుంది. మేలైన యాజమాన్య చర్యలు తీసుకుంటే అవరోధాలను అధిగమించి లాభాలు ఆర్జించొచ్చంటున్నారు జిల్లా ఉద్యానశాఖ అధికారి జె.జ్యోతి. వేడితరంగాల నుంచి పంటను కాపాడుకోవాల్సిన చర్యలను ఆమె వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

కృష్ణా జిల్లాలో 25 మండలాల్లోనూ ఉద్యానపంటలను రైతులు సాగు చేస్తున్నారు. జిల్లాలో 0.24 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగులో ఉన్నాయి. ప్రధానంగా మామిడి, పసుపు, అరటి, జామ, ఆయిల్ పామ్, కొబ్బరి, నిమ్మ మొదలైన పంటలను వాణిజ్య పరంగా ఎంచుకుని సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వేడి తరంగాల ప్రభావం పంటలపై తీవ్రంగా కనిపిస్తోంది. ప్రధానంగా పంటల్లో దిగుబడి తగ్గిపోతోంది. కూరగాయలు, నిత్యావసరాలపై ప్రభావం చూపుతోంది. చెట్లు ఎండిపోయి రైతులకు తీవ్ర నష్టం ఏర్పడుతుంది.

ఇలా చేస్తే పంటలకు మేలు

- పంట అవశేషాలు, వరిగడ్డి, మినప పొట్టు, మొదలైన వాటితో పంటల్లో పాదులను కప్పి ఉంచుకోవాలి.
- పంటలకుఎండల నుంచి ఉపశమనం చేకూరేలా తరచూ తేలికపాటి నీటితడులు అందించటం ఉత్తమం. అది కూడా ఉదయం, సాయంత్రం వేళల్లోనే అందించాలి.
- పంటలు పూత, పిందె దశల్లో ఉన్నప్పుడు మరింత శ్రద్ధ వహించాలి. నీటి తడులు సమర్థంగా ఉండేలా చూసుకోవాలి.
- నీటి వృథాను అరికట్టడానికి పొలాల్లో స్ప్రింక్లర్లు అమర్చుకోవాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో స్ప్రింక్లర్లు వినియోగిస్తే నీటి తడులు సజావుగా ఇచ్చినట్లవుతుంది.



పునాదిపాడులో సాగులో ఉన్న ఆయిల్‌పామ్

- కూరగాయల సరఫరాలో కొరతను నివారించటానికి/తగ్గించడానికి నీటి పారుదల ఉన్న బహువార్షిక తోటల్లో కూరగాయ పాదులను పెంచుకోవాలి. ఇలా చేస్తే కూరగాయల కొరతను అధిగమించొచ్చు.
- డ్రిప్ ఇరిగేషన్ పద్ధతి ఉన్న పామ్‌ఆయిల్ తోటల్లోనూ, కొత్తగా వేసిన పండ్ల తోటల్లోనూ 15 రోజులకు ఒకసారి పొలం అంతటా నీరు పారించాలి. దీంతో చేను/తోట మొత్తం తడిచి పొలంలో సూక్ష్మ వాతావరణం మెరుగు పడుతుంది. భూమిలోని లవణాలు మొక్కల వేళ్ల వద్ద పేరుకోవు. పంటలు ఆరిపోకుండా ఎండు తెగులు రాకుండా ఉంటుంది.
- పంటలకు పొటాష్ ఎరువు వేయాలి. ప్రతికూల వాతావరణ ప్రభావం నుంచి తట్టుకునే శక్తిని పొటాష్ అందిస్తుంది. అధికారుల సూచనల మేరకు దీన్ని వినియోగిస్తే మంచిది.

సమస్యను నిర్లక్ష్యం చేయొద్దు



వేడి గాలుల తీవ్రత పంటలపై పడి నష్టం జరుగుతుంది. సమస్య చిన్నగా కనిపించొచ్చు. నష్టం అధికంగా ఉంటుంది. ఒక్కోసారి పెట్టుబడులు, దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుంది. యాజమాన్యం సమర్థంగా చేపడితే సాగు లాభదాయకంగా మారుతుంది. నిర్లక్ష్యం చేస్తే నష్టం మిగులుతుంది. నాణ్యమైన దిగుబడులు సాధించడానికి చర్యలు తీసుకోవాలి.

– జె.జ్యోతి, ఉద్యానశాఖ అధికారి, కృష్ణాజిల్లా



ఈడుపుగల్లులో సాగులో ఉన్న పూలతోట

పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలి

గంధ్రాయి(జగ్గయ్యపేట): రైతులు పాడి పరిశ్రమను అభివృద్ధి చేయాలని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. మిల్క్ యూనియన్ రైతులకు గురువారం ఆయన బోనస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి మూడవ విడతలో యూనియన్ పరిధిలో రూ.16.36 కోట్లు విడుదల చేశామన్నారు. ఇందులో భాగంగానే గ్రామంలో రైతులకు రూ.2లక్షలు బోనస్‌గా పంపిణీ చేశామన్నారు. అనంతరం పాల కేంద్రానికి అత్యధికంగా పాలు అందిస్తున్న గ్రామానికి చెందిన తెలగొర్ల భద్రమ్మ అనే మహిళను సన్మానించారు. వత్సవాయి మండలం పెద మోదుగపల్లి గ్రామంలో రూ.44,750 బోనస్‌గా పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు చెరుకూరి లవయ్య, ఇంజం రామారావు, చిల్లకల్లు పాలశీతల కేంద్రం మేనేజర్ వి.సంపత్ కుమార్, పాల కేంద్రాల అధ్యక్షులు కళ్యాణ రామారావు, బుడ్డి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.



గంధ్రాయిలో రైతులకు బోనస్ అందజేస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

కోనేరుసెంటర్: బందరు మండలం తపసిపూడి గ్రామంలో గురువారం గుర్తుతెలియని ఓ వృద్ధుడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామ వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. చనిపోయిన వృద్ధుడి వయసు సుమారు 55 సంవత్సరాలు ఉండగా మాసిన గడ్డం ఒంటిపై చుక్కల చొక్కా ధరించి ఉన్నాడు. మృతుని వివరాలు తెలిసిన వ్యక్తులు ఎవరైనా ఉంటే బందరు రూరల్ పోలీసులకు ఆచూకీ అందజేయాలని ఇన్‌చార్జి ఎస్ఐ వీరప్రసాద్ కోరారు.

తిరువూరు టీడీపీలో ముసలం

- అభ్యర్థిని మార్చాలంటూ పార్టీ శ్రేణుల డిమాండ్
- ఎంపీ అభ్యర్థి చిన్ని నివాసం ఎదుట ఆందోళన
- పార్టీ అధినేత చంద్రబాబు నివాసాన్ని సైతం ముట్టడించిన తెలుగు మహిళా కార్యకర్తలు

తిరువూరు: తిరువూరు తెలుగుదేశం పార్టీలో ముసలం ఏర్పడింది. తిరువూరు నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వర్గం ఆయన మార్పు కోరుతూ గురువారం పెద్ద ఎత్తున విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని కార్యాలయానికి తరలివెళ్లారు. తిరువూరు నుంచి 20 ప్రత్యేక వాహనాల్లో విజయవాడ బయల్దేరి వెళ్లిన క్యాడర్‌లో ఎస్సీ, బీసీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. వారంతా చిన్నిని కలిసి తమ అభ్యంతరాలను తెలిపారు. కొలికపూడిని ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చాల్సిందేనని పట్టుబట్టారు. తిరువూరు నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులతో అభ్యర్థికి సమన్వయం లేకపోగా, వివాదాస్పద వ్యాఖ్యలతో పార్టీ పరువు ప్రతిష్టలకు భంగం కలిగిస్తున్నారని, ఆయన స్థానంలో ఉండవల్లి శ్రీదేవిని అభ్యర్థిగా నిలపాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. తమ డిమాండ్‌ను అధిష్టానం దృష్టికి తీసుకెళతానని చిన్ని హామీ ఇచ్చినట్లు పార్టీ నాయకులు సిరికొండ ప్రసాద్ తెలిపారు. అనంతరం ఉండవల్లి కరకట్టపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నివాసం ఎదుట టీడీపీ క్యాడర్ ఆందోళన చేసింది. ఇదిలా ఉండగా బుధవారం రాత్రి ఉండవల్లి శ్రీదేవి తిరువూరులో తన మద్దతుదారులతో సమావేశం నిర్వహించినట్లు తెలిసింది.



తిరువూరు టీడీపీ అభ్యర్థి మార్పు కోరుతూ ఎంపీ అభ్యర్థి చిన్నిని కలిసిన నాయకులు, కార్యకర్తలు

వివాదాస్పద వ్యాఖ్యలతో వ్యతిరేకత

ఇప్పటికే కొలికపూడి ఎన్నికల ప్రచారంలో వివాదాస్పద వ్యాఖ్యలతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు. తాజాగా తిరువూరు మండలం చిట్టేల గ్రామంలో ''నేనంటే ఏమిటో చూపిస్తా, నా తడాఖా చూపిస్తా, నా కొడుకుల్ని తోలు తీస్తా'' అంటూ దురుసుగా మాట్లాడటంతో గ్రామస్తులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ, యువజన, మహిళా సంఘాల నాయకులు ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రీతిలో మాట్లాడుతున్న కొలికపూడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

14న గుడివాడలో 'సిద్ధం' సభ

నాగవరప్పాడు వద్ద సభా ప్రాంగణ ఏర్పాట్లు



గుడివాడలో సిద్ధం సభకు ముస్తాబవుతున్న వేదిక

గుడివాడటౌన్: గుడివాడ పట్టణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాక కొరకు సర్వం సిద్ధం అవుతుంది. ఏలూరు రోడ్ నాగవరప్పాడు వైఎస్సార్ కాలనీకి సమీపంగా సభా ప్రాంగణం ఏర్పాటు చేస్తున్నారు. గత రెండు రోజులుగా పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈనెల 14వ తేదీ జగన్ మోహన్‌రెడ్డి గుడివాడ పట్టణానికి సిద్ధం సభకు రానున్న నేపథ్యంలో ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. కృష్ణాజిల్లాకు చెందిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకి చెందిన ప్రజలు ఈ సభకు హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు పెద్ద ఎత్తున చేస్తున్నారు. రోజు రోజుకు సిద్ధం సభకు పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ అభిమానులు హాజరవుతున్న సందర్భంగా విశాలమైన సభాప్రాంగణం ఇతర వసతులు కల్పిస్తున్నారు. పూర్తి స్థాయిలో అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు

గ్రూప్-2 ప్రిలిమ్స్‌లో కేఎల్‌యూ విద్యార్థుల విజయబావుటా

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు గ్రూప్–2 ప్రిలిమ్స్ ఫలితాల్లో విజయ బావుటా ఎగురవేసినట్లు గురువారం వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. కేఎల్ విశ్వవిద్యాలయంలో బీఏ (ఐఏఎస్) కోర్సులో చదివిన జనరల్ నాలెడ్జ్, సి-శాట్ తమ విద్యార్థుల విజయానికి ఎంతగానో దోహదం చేశాయన్నారు. బీఏ (ఐఏఎస్) విభాగాధిపతి డాక్టర్ బి.శివనాగయ్య ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేసిన సుమారు 60 తరగతుల కరెంట్ అఫైర్స్ విజ్ఞానం వారి విజయానికి దోహదపడిందని, విద్యార్థులందరికీ ప్రతిరోజు ఇంగ్లిష్ పేపర్ ఇచ్చి విశ్లేషణ చేయించడం, ప్రధాన సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలను ఉచితం అందించడం, 365 రోజులు లైబ్రరీ అందుబాటులో ఉంచడంతో ఈ విజయం సాధించినట్లు వీసీ డాక్టర్ జి.పార్థసారధి ఆ ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా

యాగశాల పనులు వేగవంతం కావాలి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ప్రాంగణంలో నిర్మిస్తున్న యాగశాల పనులను మరింత వేగవంతం చేయాలని ఈఓ కె.ఎస్. రామరావు ఆదేశించారు. ఇంద్రకీలాద్రిపై నటరాజ స్వామి ఆలయం సమీపంలో నిర్మిస్తున్న యాగశాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ పనులపై దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. పనులను నాణ్యతా ప్రమాణాలు పాటించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నెలాఖరు నాటికి పనులు ఓ కొలిక్కి రావాలని స్పష్టంచేశారు. యాగశాలను త్వరలోనే ప్రారంభించి, భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. యాగశాలతో పాటు చుట్టుపక్కల పరిసరాలు కూడా అందంగా, ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు. పూజా మండపాల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. దుర్గగుడి స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యుడు రంగావఝ్జల శ్రీనివాసశాస్త్రి పాల్గొన్నారు.

బాబా మందిరం వద్ద అన్నసంతర్పణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): మహాత్మాగాంధీరోడ్డులోని కళానికేతన్ పక్కన ఉన్న శ్రీ సాయి బాబా మందిరం వద్ద గురువారం భక్తులకు అన్నసంతర్పణ జరిగింది. మొగల్రాజపురానికి చెందిన పాల భాగ్యరాజ్ ఆధ్వర్యంలో 500 మందికి అన్న సంతర్పణ చేశారు. ఈ సందర్భంగా పాల భాగ్యరాజ్ మాట్లాడుతూ.. సాయినాథుని సన్నిధిలో అన్నసంతర్పణ నిర్వహించడం ఒక బృహత్తర కార్యంగా భావిస్తున్నట్లు తెలిపారు. వెంకట్, మద్దెల పవన్, బాలాజీ, చిరంజీవి, రవిశర్మ పాల్గొన్నారు.

పార్టీలు మారటం పైలాకు అలవాటే

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మారడం పైలా సోమినాయుడుకు అలవాటేనని వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ నగర అధ్యక్షుడు పోతిరెడ్డి సుబ్బారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీ పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి సమక్షంలో ఆ పార్టీలో గురువారం చేరిన సోమినాయుడికి పశ్చిమంలో ఓటే లేదని తెలిపారు. తొలుత కాంగ్రెస్, ఆ తరువాత ఎన్టీ తివారి కాంగ్రెస్‌లో చేరి విజయవాడ ఎంపీగా పోటీ చేసి ఘోరంగా ఓటమి పాలయ్యారని గుర్తుచేశారు. ఆ తరువాత మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరి లగడపాటి రాజగోపాల్ ద్వారా సిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడయ్యాడని, అనంతరం వైఎస్సార్ సీపీలో చేరి దుర్గగుడి చైర్మన్‌గా చేశారని, దాని కాలపరిమితి పూర్తయ్యాక గుంటూరు జిల్లా పెదకూరపాడు వైఎస్సార్ సీపీ పరిశీలకుడిగా ఉన్న విషయం ప్రజలందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. ఇంత చేసిన వైఎస్సార్ సీపీ తనను గుర్తించటం లేదని పైలా వాపోవడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవాచేశారు.

శ్రీమద్రామాయణం నిత్యనూతన మహాకావ్యం

విజయవాడ కల్చరల్: శ్రీమద్రామాయణం నిత్యనూతన కావ్యమని ఆధ్యాత్మికవేత్త మండలీక శ్రీకృష్ణకుమార్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పున్నమ్మతోటలోని టీడీడీ కల్యాణ మండపంలో నిర్వహించే శ్రీమద్రామాయణ సప్తాహం వైభవంగా కొనసాగుతోంది. గురువారం శ్రీ రాముడు ధర్మ స్వరూపుడు అంశంగా మండలీక శ్రీకృష్ణకుమార్ ప్రసంగించారు. శ్రీరాముడి ఏక పత్నీవ్రతం, సత్యవాక్ పాలన, దుష్టశిక్షణ రామాయంలో కనిపిస్తాయని, ప్రజారంజక పాలనను రామరాజ్యంలో పోలుస్తారని పేర్కొన్నారు. ప్రోగ్రామ్ అసిస్టెంట్ సి.వి.కె.ప్రసాద్ పాల్గొన్నారు.

వైశాఖి వేడుకల్లో సిక్కుల తలపాగా



లబ్బీపేట(విజయవాడతూర్పు): సిక్కులకు పవిత్రమైన వైశాఖి పర్వదిన వేడుకలు లబ్బీపేటలోని ఓ షాపింగ్ మాల్‌లో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన టర్బన్ అప్‌లో భాగంగా సిక్కుల మత ఆచారమైన తలపాగాను షాపింగ్ మాల్‌కి వచ్చిన సందర్శకులకు కట్టి పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. గ్లోబల్ సిక్కుల సంస్థ రాష్ట్ర ఇన్‌చార్జ్ కరమ్ కౌర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గురుగోబింద్ సింగ్ ఫౌండేషన్ అధ్యక్షురాలు కుల్దీప్ కౌర్, కార్యదర్శి హరవిందర్ సింగ్ పాల్గొన్నారు. తెలుగు ప్రజలు ఉగాది పర్వదినం ఎంత పవిత్రమైనదో.. సిక్కులకు వైశాఖి పండుగ అంతే పవిత్రమైనదని ఈ సందర్భంగా వారు తెలిపారు.

ప్రేమానురాగాలు పంచాలి

- ఈద్ నమాజ్‌లో మౌలానా ముఫ్తి రియాజ్ సందేశం
- ఐజీఎంసీ స్టేడియంలో ఘనంగా ఈద్ నమాజు
- నమాజులో పాల్గొన్న తూర్పు వైఎస్సార్ సీపీ అభ్యర్థి దేవినేని అవినాష్



ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పండుగ అంటే సంతోషమని, మానవులందరూ సుఖసంతోషాలతో జీవించడమే రంజాన్ ముఖ్య ఉద్దేశమని మౌలానా ముఫ్తి రియాజ్ అన్నారు. పవిత్ర రంజాన్‌ను పురస్కరించుకుని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గురువారం సామూహిక ఈద్-ఉల్-ఫితర్ నమాజు జరిగింది. ఈద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నమాజులో ముఫ్తి రియాజ్ ఉర్దూ ప్రసంగం, నమాజు దువా చేయించారు. ఈ సందర్భంగా ఆయన తన సందేశంలో దివ్య ఖురాన్ సర్వమానవాళి కోసం అవతరించిందని, ఉత్తమ సమాజ నిర్మాణానికి ప్రవక్త మొహమ్మద్ బోధనలు అనుసరించాలని సూచించారు. ప్రేమానురాగాలు పంచడం, పేదలను సంతోషాలలో భాగస్వామ్యం కల్పించడం ఈద్- ఉల్- ఫితర్ ముఖ్య ఉద్దేశమని వివరించారు. మన ఆరాధనలు నమాజులు స్వీకార యోగ్యం కావాలంటే అల్లా, ఆయన ప్రవక్త విధేయులుగా ఉంటూ పాపాలకు దూరంగా ఉండాలన్నారు. మౌలానా మక్బూల్ నద్వి ఈద్గాకు వచ్చి నమాజ్ చేయడం వలన కలిగే లాభాలను తెలుగులో వివరించారు. అందరూ సమైక్యంగా ఈద్గాలో నమాజ్ చేస్తే దైవ శుభాలను పొందటం సులభం అవుతుందన్నారు. మానవులందరూ సుఖ సంతోషాలతో మెలగాలని, పండుగలు ఒక వర్గం వారికే కాదని, మానవులందరికీ సంతోషదాయకం కావాలని ఆకాంక్షించారు. రంజాన్ నమాజులో వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి దేవినేని అవినాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అవినాష్ మాట్లాడుతూ.. మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అన్నారు. నగరంలోని ముస్లింలు అందరూ సుఖ సంతోషాలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఈద్గా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కాలేషావలీ, మునీర్ అహ్మద్ షేక్, నగర పాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్, ఎండీఎస్ అధ్యక్షుడు ఎస్‌కే వలీ, వక్ఫ్‌బోర్డు రాష్ట్ర డైరెక్టర్ మీర్ హుస్సేన్, జిల్లా డైరెక్టర్ ఎండీ అబీద్, మైనార్టీ నేతలు ఎస్‌కే సుభానీ, ముస్లిం సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్తార్ అలీ, ఈద్ కమిటీ సభ్యులు అన్వర్, ఇర్ఫాన్, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పులో రంజాన్ సందడి

లబ్బీపేట(విజయవాడతూర్పు): పవిత్ర రంజాన్‌ను పురస్కరించుకుని తూర్పు నియోజకవర్గంలో సందడి వాతావరణం నెలకొంది. లబ్బీపేట, ఫారూఖ్‌నగర్, సనత్‌నగర్, అయ్యప్పనగర్, కృష్ణలంక ప్రాంతాల్లోని ముస్లింలు ఉదయం పలు ప్రాంతాల్లో నిర్వహించిన ఈద్‌నమాజులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు అలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం, ఫారూఖ్‌నగర్‌లో జరిగిన ఈద్‌నమాజులో వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పాల్గొనారు. ఫారూఖ్‌నగర్ ప్రార్థనల్లో మంత్రి జోగి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించిన ఈద్‌నమాజుకు సుమారు 10 వేల మందికిపైగా హాజరయ్యారు.



ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి దేవినేని అవినాష్



శుభాకాంక్షలు తెలుపుకొంటున్న ముస్లింలు

వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధం

డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ



రామలింగేశ్వరనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ

ఆటోనగర్(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరో మారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ అన్నారు. గురువారం సాయంత్రం రామలింగేశ్వర నగర్‌లోని శివగంగాభవాని రోడ్డు, ఠాగూర్ రోడ్డులో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బెల్లం దుర్గతో పాటు ఆళ్ల చెల్లారావు, వెంకటరెడ్డి ఆధ్వర్యంలో విజయవాడ తూర్పు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ, ఎంపీ అభ్యర్థులు దేవినేని అవినాష్, కేశినేని శ్రీనివాస్(నాని)లకు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధి జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఏ గడపకు వెళ్లినా తమకు సంక్షేమ పథకాలు వచ్చాయని, తామంతా సంతోషంగా ఉన్నామని మహిళలు చెబుతున్నారని బెల్లం దుర్గ పేర్కొన్నారు. రామలింగేశ్వరనగర్‌లో జరిగిన అభివృద్ధి గతంలో ఎప్పుడు జరగలేదని స్థానికులు పేర్కొన్నారు. ఎవరికి ఓటు వేయాలో తమకు బాగా తెలుసని స్థానికులు స్పష్టం చేశారు. పింఛన్ల పంపిణీ విషయంలో చంద్రబాబు ఆడిన నాటకం అంతా ఇంతా కాదని పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని ముక్తకంఠంతో పేర్కొన్నారు. కార్యక్రమంలో భుజంగరావు, కనకదుర్గ, దశరధరామయ్య, సంధ్య, సత్యనారాయణ, కాటూరి మోహనరావు, రామ లక్ష్మణ్, రామచంద్రారావు, మూర్ల నాగభూషణ్, శ్రీను, నాగేశ్వరరావు, ఏనుగ శ్రీనివాసరావు, సూరిబాబు, రాజు పాల్గొన్నారు.

రంజింప చేసిన నవ దుర్గ నృత్యరూపకం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో గురువారం సాయంత్రం కూచిపూడికి చెందిన చింతా రవి బాలకృష్ణ కళాబృందం ప్రదర్శించిన నవ దుర్గ నృత్యరూపకం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా ధర్మపథం వేదికపై పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మూడో రోజైన గురువారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ యువ పురస్కార్ గ్రహీత చింతా రవి బాలకృష్ణ బృందం ప్రదర్శించిన నృత్య రూపకాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు వేదిక వద్దకు తరలివచ్చారు. కళాకారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో లయబద్ధంగా నృత్య రూపకాన్ని ప్రదర్శించగా, భక్తులు ఆద్యంతం ఆసక్తిగా వీక్షించారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ ఈఓ రామరావు వారిని సత్కరించి ప్రసాదాలను అందజేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): రామలింగేశ్వరనగర్ న్యూ బ్రిడ్జి సెక్షన్ పరిధిలోని ఉపకేంద్రం, 11కేవీ పోలీస్ కాలనీ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి.సుధాకర్ గురువారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. సత్యనారాయణనగర్, పోలీస్ కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పూలే జీవితం ఆదర్శనీయం

వైఎస్సార్ సీపీ తూర్పు అభ్యర్థి దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం ఆదర్శనీయమని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. మహాత్మాజ్యోతీరావు పూలే జయంతి సందర్భంగా అయన చిత్రపటానికి అవినాష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రీస్తురాజుపురంలోని నియోజకవర్గ జోనల్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో వివక్షకు గురవుతున్న బలహీనవర్గాల ప్రజల్లో చైతన్యం కలిగించి, సామాజికంగా ఎదుగుదలకు ఎనలేని కృషి చేసిన మహానీయుడు పూలే అని పేర్కొన్నారు. పూలే బాటలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తూ, బీసీలకు అన్ని రంగాల్లో పెట్టపీట వేస్తున్నారని తెలిపారు. బీసీలను రాజకీయంగా ప్రాధాన్యం ఇస్తూ, ఉన్నత పదవుల్లో నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కలపాల అంబేడ్కర్, నాయకులు కోటినాగులు, సుబ్బరాజు, డేవిడ్‌రాజు, పరసా క్లైవ్, విఠల్, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీ విభాగం కార్యాలయంలో...

నగరంలోని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం కార్యాలయంలో గురువారం జ్యోతీరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ విభాగం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి కసగోని దుర్గారావుగౌడ్, రాష్ట్ర కార్యదర్శి కంపెల్ల భాను లక్ష్మీనారాయణ, నగర అధ్యక్షుడు బోను రాజేష్ తదితరులు మహాత్మా జ్యోతీరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.





పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దేవినేని అవినాష్ తదితరులు ; నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం నాయకులు





పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని తదితరులు ; పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు

డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో....

పాత ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు జరిగాయి. డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు, మహిళోద్ధరణకు పూలే కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ నవీన్, డాక్టర్ బాలాజీ, డాక్టర్ సునీల్, డాక్టర్ స్నేహ సమీర, సంకీర్తన, జ్యోతి, శివ, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మనుస్మృతిని వ్యతిరేకించడమే పూలేకు ఇచ్చే నివాళి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మనుస్మృతిని వ్యతిరేకించడమే మహాత్మ జ్యోతిబా పూలేకు మనమిచ్చే నిజమైన నివాళి అని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు దడాల సుబ్బారావు అన్నారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్‌లోని పూలే అంబేడ్కర్ భవనంలో మహాత్మ జ్యోతీరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. సుబ్బారావు మాట్లాడుతూ.. నాటి సనాతన ధర్మానికి వ్యతిరేకంగా అందరూ చదువుకోవాలని ఆశించిన పూలే తన భార్య సావిత్రమ్మకు చదువు నేర్పించడంతో పాటుగా అనేక పాఠశాలలు విద్యాదానం చేసిన మహోన్నత వ్యక్తి పూలే అని కొనియాడారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, సభ్యులు జి.నటరాజు, జి.క్రాంతి, చింతల శ్రీనివాస్, జి.అరుణ, శ్యామ్, విజయ్, రారాజు, గాదె సుబ్బారెడ్డి, ఆనంద్, భాను, రమణ, వై.కేశవరావు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయాలను సాధిస్తున్న సీఎం జగన్



జ్యోతీరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అయోధ్యరామిరెడ్డి, వెలంపల్లి, అవినాష్ తదితరులు

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేదలకు ఉజ్వల భవిష్యత్తును ప్రసాదించేందుకు అనేక పోరాటాలు చేసి, ఆదర్శజీవితాన్ని గడిపిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతీరావు పూలే అని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి కొనియాడారు. ఆయన కన్న కలలను, ఆ మహనీయుని ఆశయాలను నిజం చేసి చూపిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయంలో మహాత్మా జ్యోతీరావు పూలే జయంతిని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అయోధ్యరామిరెడ్డి సెంట్రల్, తూర్పు, వెస్ట్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు వెలంపల్లి శ్రీనివాసరావు, దేవినేని అవినాష్, షేక్ ఆసీఫ్‌తో కలిసి జ్యోతీరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ.. నేటి సమాజంలో మహిళలు చదువుకుంటున్నారన్నా, అన్ని రంగాల్లో రానిస్తున్నారన్నా, ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నా దానికి ప్రధానకారకుడు జ్యోతీరావు పూలే అని గుర్తుచేశారు. సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు ఆయన చేసిన పోరాటాలు, ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. పూలే కన్న కలలను ఆచరణలో చేసి చూపుతున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. బీసీల అభ్యున్నతికి జగనన్న చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు బోను రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు బీహెచ్‌ఎస్వీ జానారెడ్డి, బాలిగోవింద్, బీసీ నాయకులు లాకా వెంగళరావు యాదవ్, బోను దుర్గా నరేష్ పాల్గొన్నారు.

నేడు ఐఐటీ, జేఈఈపై అవగాహన సదస్సు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఇంటర్మీడియెట్‌తో పాటు ఐఐటీ, జేఈఈకి ఎలా సన్నద్ధం అవ్వాలనే అంశంపై శరత్‌చంద్ర ఐఐటీ అకాడమీ, శరత్‌చంద్ర జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్‌చంద్ర తెలిపారు. ఎంజీ రోడ్డులోని తమ అకాడమీలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఐఐటీ, జేఈఈకి ఎలా ప్రిపేర్‌అవ్వాలి, ఏ పుస్తకాలు చదవాలి, ఏటాపిక్స్ ఎక్కువగా ఫోకస్ చేయాలనే అంశాలపై ఆల్ ఇండియా ఆరో ర్యాంకు సాధించిన కార్తికేయ వివరిస్తారని, విద్యార్థులు సైతం సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకూ ఈ సదస్సు జరుగుతుందన్నారు.

కృష్ణలంక పీఎస్ పరిధిలో పోలీసుల కవాతు



కృష్ణలంక(విజయవాడతూర్పు): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీస్ కమిషనర్ సీపీ టి.కె. రాణా ఆదేశాల మేరకు డీసీపీ అధిరాజ్ సింగ్ రాణా, ఏసీపీ రత్నరాజు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలు కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కృష్ణలంక, రాణిగారితోటలోని పలు వీధుల్లో పోలీసుల కవాతు కొనసాగింది. వైట్ హౌస్ సెంటర్ నుంచి ప్రారంభమైన ఫ్లాగ్ మార్చ్ సిద్ధం కృష్ణారెడ్డి రోడ్డు, ఫీడర్ రోడ్డు, కరకట్ట రోడ్డు, రాధాకృష్ణ రోడ్డు, వైట్ హైస్ మీదుగా ఫీడర్ రోడ్డు, అండర్ పాస్ నుంచి సత్యంగారి హోటల్ వరకు కొనసాగింది. ఎన్నికల దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుస్తుగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును వినియోగించుకునేందుకు నిర్భయంగా భయపక్షపాతాలు లేకుండా ఉండేందుకు పోలీసులు ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటారన్నారు. ప్రజలు ఎటువంటి అపోహలకు గురికావద్దని, ప్రతి ఒక్కరికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని పేర్కొన్నారు. నిర్భయంగా ప్రజలందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎ.మురళీకృష్ణ, ఎస్‌ఐలు రంభ, మణి, స్టేషన్ రైటర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీ డాన్ స్పోర్ట్స్ మల్టీ కాంప్లెక్స్ ప్రారంభం

విజయవాడస్పోర్ట్స్: రామవరప్పాడు ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన డీ డాన్ స్పోర్ట్స్ మల్టీ కాంప్లెక్స్ ఎరీనాను ఏపీ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తే దేశానికి మరిన్ని అంతర్జాతీయ పతకాలు వస్తాయన్నారు. కాంప్లెక్స్ అధినేత కట్టపోగు సంపత్ మాట్లాడుతూ.. క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, మహిళలకు ప్రత్యేకంగా త్రోబాల్, హ్యాండ్‌బాల్ క్రీడల్లో అంతర్జాతీయ కోచ్‌లతో శిక్షణ ఇస్తామన్నారు. అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్(ఏఐసీసీ) అధ్యక్షుడు గ్యార హనూక్, ఫెయిత్ చర్చ నిర్వాహకులు జ్యోతి ఆనంద్, రక్షణ ఆనందం, విద్యాధర రావు పాల్గొన్నారు.



డీ డాన్ స్పోర్ట్స్ మల్టీ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

దక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం వద్ద దక్షిణామూర్తికి ఈఓ కె.ఎస్.రామరావు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి దక్షిణం వైపు ప్రతిష్ఠించిన దక్షిణామూర్తి విగ్రహానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించగా, ఈఓ పాల్గొన్నారు. దక్షిణామూర్తి దర్శనం, పూజతో కలిగే ఫలితాలను ఆలయ అర్చకులు వివరించారు. ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఏఈఓ ఎస్.రమేష్‌బాబు పాల్గొన్నారు.

మహిళా వలంటీర్లపై జనసేన గూండాగిరి

కాకినాడ రూరల్ జనసేన అభ్యర్థి దాష్టీకం • పుట్టినరోజు వేడుకలు చేసుకుంటున్న మహిళలపై దౌర్జన్యం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ రాజకీయ నాయకులందరినీ గుండాలు, రౌడీలంటూ నోరు పారేసుకుంటుంటారు. కానీ, ఆయన పార్టీ అభ్యర్థులు, నాయకులు మహిళా వలంటీర్ల పైన కూడా దౌర్జన్యానికి దిగి, గృహ నిర్బంధానికి పాల్పడ్డారు. కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ సహా ఆ పార్టీ నాయకులు గురువారం సాగించిన గూండాగిరీతో మహిళా వలంటీర్లు బెంబేలెత్తిపోయారు. ఓ మహిళా వలంటీరు పుట్టిన రోజు వేడుకలు చేసుకుంటుండగా ఆ భవనంలోకి చొరబడటమే కాకుండా, ఆమెతో పాటు వేడుకలకు వచ్చిన మిగతా మహిళా వలంటీర్లపై దౌర్జన్యం చేసి, కుర్చీలు విరగ్గొట్టి, వారిని గృహ నిర్బంధం చేసి భయభ్రాంతులకు గురి చేశారు. భయంతో మహిళలు కేకలు వేసినా, గర్భిణి ఉందని మొత్తుకున్నా ఖాతరు చేయలేదు. గంటన్నర పాటు మహిళలు ప్రాణాలు అరచేత పట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. ప్రాణ భయంతో పోలీసులకు ఫోన్ చేయడంతో వారు వచ్చి ఆ మహిళలను విడిపించారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మహిళా వలంటీరు మొయ్యా దుర్గా భవాని కాకినాడ రూరల్ నియోజకవర్గం వినాయక కేఫ్ సమీపంలోని ఓ భవనంలో గురువారం ముందస్తు పుట్టినరోజు వేడుకలు చేసుకున్నారు. ఈ వేడుకలకు ఆమె స్నేహితురాళ్లైన పలువురు మహిళా వలంటీర్లు హాజరయ్యారు. పుట్టిన రోజు కేకు, కూల్ డ్రింక్‌లు సిద్ధం చేసుకున్నారు. ఇంతలోనే హఠాత్తుగా 30 మందిని వెంట బెట్టుకుని కాకినాడ రూరల్ జనసేన అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) అక్కడకు వచ్చారు. ఇక్కడ పార్టీ సమావేశం పెట్టుకుంటున్నారంటూ పెద్దగా కేకలు వేస్తూ వారిపై విరుచుకుపడ్డారు. పుట్టిన రోజు వేడుకలు చేసుకుంటున్నామని చెబుతున్నా వినకుండా తలుపులు తన్నుకుంటూ లోపలకు వెళ్లి వీరంగం సృష్టించారు. దీంతో మహిళా వలంటీర్లు భయాందోళనలకు గురయ్యారు. తమతో పాటు గర్భిణి ఉన్నారని, ఆమె భయపడిపోతున్నారని, కేకలు వేయవద్దని బతిమిలాడారు. అయినా వారు వినలేదు. నానా రచ్చ చేసి, వలంటీర్లు కూర్చున్న కుర్చీలను ధ్వంసం చేశారు. మహిళా వలంటీర్లు లోపల ఉండగానే నానాజీ కనుసైగలతో ఆ పార్టీ కార్యకర్తలు గది తలుపులు మూసేసి గొళ్లేలు పెట్టేసి, భవనం కింది భాగంలోకి వెళ్లిపోయారు. మహిళా వలంటీర్లు కిటికీల వద్దకు వచ్చి తలుపులు తీయాలని,



జనసేన నేతలు విరగ్గొట్టిన కుర్చీలు

ఊపిరి ఆడటంలేదని ఎంతసేపు అర్థించినా వినిపించుకోలేదు. జనసేన నాయకుల విధ్వంసంతో గర్భిణి సున్న చిట్టమ్మ గదిలోనే సొమ్మసిల్లి పడిపోవడంతో అంతా భయకంపితులయ్యారు. వారిలో ఒక వలంటీరు తన మొబైల్ ఫోను ద్వారా కాకినాడ డీఎస్పీ హనుమంతరావుకు సమాచారం అందించింది. దీంతో సర్పవరం సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ అక్కడకు చేరుకున్నాయి. పోలీసులు తలుపులు తెరిచి మహిళా వలంటీర్లను విడిపించారు. అక్కడ రాజకీయ పార్టీ సమావేశం జరుగుతోందంటూ పంతం నానాజీ పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఆ కార్యాలయంలో రాజకీయ పార్టీకి సంబంధించి ఎటువంటి ఆధారాలూ లేవని ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి బీబీబీ రాజు తెలిపారు. ఈ మొత్తం వ్యవహారాన్ని వీడియో తీశామని, అన్ని వివరాలు రిటర్నింగ్ అధికారి ఇట్ల కిషోర్‌కు నివేదిస్తామని రాజు తెలిపారు.

పోలీసులకు ఫిర్యాదు

జనసేన నాయకుల దాడిపై రమణయ్యపేట కూరగాయల మార్కెట్ వీధికి చెందిన బాధిత వలంటీరు దుర్గాభవాని సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు జనసేన అభ్యర్థి పంతం నానాజీతో పాటు పలువురిపై పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. మహిళల గృహ నిర్బంధం, భయభ్రాంతులకు గురి చేయడం, మూకుమ్మడిగా వచ్చి దౌర్జన్యం చేశారనే అభియోగాలపై ఐపీసీ 143, 452, 341, 342, 506 రెడ్ విత్ 149 సెక్షన్ల కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు.

భయంతో వణికిపోయాం



ఒకేసారి మూకుమ్మడిగా వచ్చి పడి దౌర్జన్యానికి పాల్పడ్డారు. నాకు ఏడో నెల. గర్భిణి అని కూడా కనీసం జాలి, కరుణ కూడా లేకుండా గదిలో నిర్బంధించి తీవ్ర భయభ్రాంతులకు గురి చేశారు. ఏం జరుగుతుందోనని భయంతో వణికిపోయాం. తీవ్ర ఆందోళనతో సొమ్మసిల్లి పడిపోయాను.
– సున్న చిట్టమ్మ, రమణయ్యపేట

మహిళలని కూడా చూడలేదు



జనసేన నాయకులు, కార్యకర్తలు అమానుషంగా ప్రవర్తించారు. పుట్టిన రోజు వేడుకలు జరుపుకొంటున్న వారు మహిళలని కూడా చూడకుండా దౌర్జన్యానికి పాల్పడ్డారు. కుర్చీలు విరగ్గొట్టేశారు. అసలు ఏం జరుగుతోందో తెలుసుకునేలోపే దౌర్జన్యం చేసి, తలుపు గడియ పెట్టేసి వెళ్లిపోయారు. ఏ రాజకీయ పార్టీ సమావేశం పెట్టుకోవడం లేదని ఎంత చెప్పినా వినలేదు.
– కుసనం శాంతకుమారి, రమణయ్యపేట

పుట్టిన రోజు చేసుకుంటుంటే నిర్బంధించారు



నా పుట్టిన రోజు శుక్రవారం అయినప్పటికీ స్నేహితులందరూ అందుబాటులో ఉండరని చెప్పడంతో గురువారమే వేడుకలు చేసుకునేందుకు వారందరినీ ఆహ్వానించాను. కేకు తెచ్చుకొని పార్టీకి సిద్ధమవుతుండగా ఒకేసారి గుంపుగా వచ్చిన జనసేన నాయకులు, కార్యకర్తలు దౌర్జన్యానికి పాల్పడ్డారు. మా కార్యాలయం గది తలుపులు మూసేసి, గడియ పెట్టి నిర్బంధించారు. ఎంత వేడుకున్నా తలుపులు తీయలేదు.
– మొయ్యా దుర్గాభవాని, రమణయ్యపేట, కాకినాడ రూరల్

నిస్సిగ్గుగా నిజాలను కాలదన్ని..

చంద్రబాబు హయాంలో ఏమీ సాధించలేకున్నా... ప్రగతి పరుగులు తీసిందంటూ తప్పుడు రాతలు. పరిస్థితులు దిగజారినా... రాష్ట్రం పురోగమిస్తుందంటూ అడ్డగోలు అబద్ధాలు. ఐటీ కంపెనీ ఒక్కటైనా తీసుకురాలేకపోయినా... ఏదో సాధించారంటూ నిస్సిగ్గుగా కితాబులు. ఇదీ పచ్చముసుగు వేసుకున్న రామోజీ పత్రికలో నిత్యం అచ్చవుతున్న అసత్య కథనాల తీరు. అదే జగన్ హయాంలో ఎంత ఉన్నతంగా ఎదిగినా... ఏమీలేదంటూ కఠోర వ్యాఖ్యానాలు. కళ్లముందే దానికి సంబంధించిన రుజువులున్నా... దాచిపెట్టి అడ్డగోలు రోతలు. అవాస్తవాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తూ... జనానికి ఏమీ తెలియదులే అన్న అహంకార ధోరణి. ఇదీ రోజూ ఈనాడులో వండివారుస్తున్న అబద్ధాలు. గడచిన ఐదేళ్లలో ఐటీరంగం రాష్ట్రంలో అభివృద్ధి సాధిస్తే 'కల్పతరువును కాలదన్నారు' అంటూ అభాండాలు వేసేశారు. వాస్తవాలేమిటో ఒక్కసారి పరిశీలిద్దాం...

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తరువాత రాష్ట్రంలో మునుపెన్నడూ లేనివిధంగా ఐటీ రంగం వేగంగా విస్తరిస్తోంది. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో అంతర్జాతీయంగా ఐటీ రంగం కుదేలైనా రాష్ట్రంలో ఆ సమస్య ఎదురుకాలేదు. బహుళజాతి సంస్థలైన ఇన్ఫోసిస్,విప్రో,భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ వంటి సంస్థలు విశాఖలో డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయగా, రాండ్‌స్టాడ్ వంటి అంతర్జాతీయ సంస్థలు విశాఖ కేంద్రంగా కార్యకలాపాలను ప్రారంభించాయి. రాష్ట్రానికి 65కు పైగా కొత్త కంపెనీలు రాగా విశాఖలో డబ్ల్యూఎన్ఎస్, పల్సస్ గ్రూపులు భారీగా విస్తరించాయి. టెక్ మహీంద్రా విశాఖ నుంచి తన కార్యకలాపాలను విజయవాడకు విస్తరించింది. 'ఐటీకి పితామహుడిని నేనే... సైబరాబాద్‌ను నేనే సృష్టించా...' అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు పాలనలో విశాఖకు వచ్చిన ఐటీ దిగ్గజం ఒక్కటంటే ఒక్కటైనా లేదు. ఆయన సీఎం పదవి ముగిసేనాటికి రాష్ట్రంలో ఐటీ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య 27,643 అయితే ఇప్పు డు ఆ సంఖ్య 75,551కు చేరింది. చంద్రబాబు దిగిపోయే నాటికి ఉన్న ఐటీ ఉద్యోగుల్లో సగంమందికి పైగా దివంగత నేత ముందుచూపుతో విశాఖ, కాకినాడ, విజయవాడల్లో అభివృద్ధి చేసిన ఐటీ పార్కుల్లో పనిచేస్తున్నవారే. కానీ ప్రస్తుత వైఎస్ జగన్ హయాంలో ఐటీ రంగంలో 47,908 మందికి కొత్తగా ఉపాధి అవకాశాలు లభించినా కళ్లకు గంతలు కట్టుకున్న రామోజీకి అవేవీ కనిపించడం లేదు. పైగా ప్రజలను తప్పుదారి పట్టించేలా ఐటీ పాలసీ తుస్ అంటూ గురువారం ఒక అబద్ధాన్ని వండివార్చారు.



ఇటీవల విశాఖలో ఏర్పాటుచేసిన ఇన్ఫోసిస్ కార్యాలయం

తెలంగాణతో పోలికెందుకు రామోజీ...

2014–19 మధ్య చంద్రబాబు నాయుడు హయాంలో రాష్ట్రానికి తీసుకువచ్చిన ఒక్క కంపెనీ పేరు కూడా ఆ కథనంలో రాసుకోలేకపోయారు. ఎంతసేపూ ప్రస్తుత ప్రభుత్వంపై విషం చిమ్మాలన్నదే వారి దుగ్ధ. అందుకే పొరుగు రాష్ట్రం తెలంగాణతో పోలుస్తూ అబద్ధాలు అచ్చేశారు. బాబు పాలనలో తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్ వెనుకబడి ఉంటే ఆయన ఎందుకు ఉద్ధరించడానికి కృషి చేయలేదు? ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా తొమ్మిదేళ్లు పాలించిన చంద్రబాబు నాయుడు వల్లే కదా విశాఖ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. తన రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం కేవలం హైదరాబాద్‌ను మాత్రమే ప్రోత్సహించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నిలువునా ముంచేసిన విషయం రాష్ట్ర ప్రజలు మరచిపోయారనుకుంటున్నారా? రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా కేవలం అమరావతి పేరుతో గ్రాఫిక్స్ చూపించి ఐటీ రంగాభివృద్ధిని గాలికి వదిలేసిన విషయం ఇక్కడి యువత గమనించలేదనుకుంటున్నారా? పైగా ఇప్పుడు ఐటీ రంగంలో విశాఖ పురోగమిస్తుంటే తప్పుడు కథనాలతో జనాన్ని ఏమార్చడానికి యత్నిస్తారా?

నాడు ప్రచారం... నేడు ప్రోత్సాహం...

చంద్రబాబు ప్రభుత్వం కేవలం ఇంక్యుబేషన్ సెంటర్ పేరుతో ప్రచారానికే పరిమితం చేసి స్టార్టప్‌లలో రాష్ట్రం చతికిలబడితే వైఎస్ జగన్ ప్రభుత్వం స్టార్టప్‌ల ప్రోత్సాహానికి అనేక చర్యలు చేపట్టింది. స్టార్టప్‌లకు మెంటార్‌షిప్, ఫండింగ్, ఇండస్ట్రీ కనెక్ట్‌లతో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే విధంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసింది. దేశంలో ఎక్కడా లేని విధంగా తొలి నాలుగో తరం పారిశ్రామిక రంగం ఇండస్ట్రీ 4కు చెందిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీని "కల్పతరువు" పేరిట విశాఖలో ఏర్పాటు చేసింది. దీంతోపాటు నాస్కామ్ సహాయంతో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాల స్టార్టప్‌ల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలను కూడా విశాఖలో ఏర్పాటు చేసింది. ఆంధ్రా యూనివర్సిటీలో ఓ హబ్, ఓడల నిర్మాణంపైన, మెడ్‌టెక్ జోన్‌లోనూ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలు ఏర్పాటు చేసింది. ఈ విధంగా ఐటీ రంగంలో విశాఖను కల్పతరువుగా మార్చేలా ప్రభు త్వం చర్యలు తీసుకుంటే యువతను నైరాశ్యంలో నెట్టివేసేలా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈనాడు రామోజీ రాస్తున్న తప్పుడు రాతలను ప్రజలు గమనిస్తున్నారు.

మూడు రెట్లు పెరిగిన స్టార్టప్‌ల సంఖ్య

నూతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకువస్తూ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీల ఏర్పాటుతో రాష్ట్రంలో స్టార్టప్‌ల సంఖ్య భారీగా పెరిగింది. వీటి ద్వారా సాంకేతిక నిపుణులైన యువత స్వయం ఉపాధి పొందడమే గాకుండా, వేలాది మందికి ఉద్యోగాలూ వస్తున్నాయి. గడచిన ఐదేళ్లలో రాష్ట్రంలో స్టార్టప్‌ల సంఖ్య మూడు రెట్లకు పైగా పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వరంగ డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్(డీపీఐఐటీ) గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. ఆ సంస్థ తాజా గణాంకాల ప్రకారం.. 2019లో రాష్ట్రంలో 161 స్టార్టప్‌లు ఉండగా ఇప్పుడు వాటి సంఖ్య 586కు పెరిగింది. వీటిలో పనిచేసే ప్రత్యక్ష ఉద్యోగుల సంఖ్య కూడా అదే స్థాయిలో పెరిగింది. 2019లో 1,552 మంది పనిచేస్తుండగా, ఆ సంఖ్య ఇప్పుడు 5,669కు చేరింది.

ఆరోపణలే అజెండా!

▶ మొదటి పేజీ తరువాయి
మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమని పసిగట్టిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పురందేశ్వరి ఉనికి చాటుకోవడం, కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న టీడీపీ మనుగడ కోసమే బురద జల్లుతున్నారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు–వలంటీర్ల వ్యవస్థ, జిల్లాల పునర్ వ్యవస్థీకరణ ద్వారా పరిపాలనను వికేంద్రీకరించిన సీఎం జగన్ ప్రభుత్వ సేవలను ఇంటి గుమ్మం వద్దకే అందించే నూతన ఒరవడికి దేశంలో తొలిసారిగా నాంది పలికారు. ప్రజాభిమానం పొందిన వలంటీర్లపై మొన్నటి వరకు తూలనాడిన చంద్రబాబు ఇప్పుడు తనకు మాత్రమే సాధ్యమైన 'యూ' టర్న్ తీసుకుని ఆ వ్యవస్థను కొనసాగిస్తామని ప్రకటించడం ద్వారా వైఎస్ జగన్ ప్రభుత్వానికి కితాబిచ్చారు. అదే సమయంలో జన్మభూమి కమిటీల పేరెత్తేందుకు కూడా చంద్రబాబు సాహసించలేకపోతున్నారు. ఆ మాటెత్తితే ప్రజలు ఈడ్చి కొడతారేమోననే భయమే అందుకు కారణమని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

నాడు మోసమే ఒరవడిగా..

విభజన నేపథ్యంలో 2014 ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో జట్టు కట్టిన చంద్రబాబు 650కిపైగా హామీలిచ్చి కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో నాడు అధికారంలోకి వచ్చారు. చంద్రబాబు నేతృత్వంలో 2014 జూన్ 8న కొలువుదీరిన కూటమి ప్రభుత్వం మోసమే ఒరవడిగా పాలన సాగించింది. చంద్రబాబు, మోదీ, పవన్ కళ్యాణ్ ఫోటోలతో, చంద్రబాబు సంతకం చేసి మరీ ఇంటింటికీ లేఖలు పంపి ఇచ్చిన ప్రధాన హామీల్లో రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలను మాఫీ చేయకుండా వంచించారు. రూ.14,205 కోట్ల డ్వాక్రా రుణాలను మాఫీ చేయకుండా అక్క చెల్లెమ్మలకు బాబు దగా చేశారు. ఇంటికో



టీడీపీ 2014 ఎన్నికల మేనిఫెస్టో

ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతిగా నెలకు రూ.2 వేలు చొప్పున ఇస్తామని నమ్మబలికి యువతను మోసగించారు. బీసీ సబ్ ప్లాన్ కింద ఏడాదికి రూ.పది వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.50 వేల కోట్లు వ్యయం చేస్తామంటూ బలహీన వర్గాలకు వెన్నుపోటు పొడిచారు. అర్హులందరికీ మూడు సెంట్ల స్థలం, పక్కా ఇళ్లు కట్టిస్తామని చెప్పి ఏ ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వకుండా వంచించారు. పవర్ లూమ్స్, చేనేత రుణాలు మాఫీ చేయకుండా మోసం చేశారు. అరకొరగా ఇచ్చే సంక్షేమ పథకాల ఫలాలు దక్కాలంటే తమకు లంచాలు ఇవ్వాల్సిందేనంటూ నాడు జన్మభూమి కమిటీలు అరాచకం సృష్టించాయి.

ఖజానాను ఊడ్చేసి..

చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం దోపిడీ, ఎడాపెడా అప్పులతో 2019 మే 29 నాటికి రాష్ట్రాన్ని దివాలా తీయించింది. అప్పటికి ప్రభుత్వ ఖజానాలో కేవలం రూ.వంద కోట్లే మిగిలాయని నాటి ఆర్థిక మంత్రి యనమల స్వయంగా ప్రకటించడమే అందుకు నిదర్శనం. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడం ద్వారా మళ్లీ అధికారంలోకి రావాలనే ఎత్తుగడలో భాగంగా బీజేపీ, జనసేనతో విడిపోయిన చంద్రబాబు 2019 ఎన్నికల్లో మూడు పార్టీలు వేర్వేరుగా పోటీ చేసేలా పథకం వేశారు. అయితే కూటమి అరాచకాలకు తగిన శాస్తి చేస్తూ 2019 ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి చారిత్రక విజయాన్ని కట్టబెట్టారు.

అడుగడుగునా అక్రమాలే..

సంక్షోభాన్ని అవకాశంగా మల్చుకుని దేవతల రాజధానిని తలదన్నే రీతిలో అమరావతిని నిర్మిస్తానంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు ఓత్ ఆఫ్ సీక్రెసీకి తిలోదకాలు ఇచ్చి ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారు. కారు చౌకగా రైతుల భూములు కాజేసి రూ.లక్షల కోట్లు కొట్టేశారు. తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ భవనాల నిర్మాణంలో అవినీతికి పాల్పడటంతోపాటు స్టార్టప్ ఏరియా ప్రాజెక్టును సింగపూర్ ప్రైవేట్ కంపెనీల కన్సార్టియంకు కట్టబెట్టి మరో రూ.లక్ష కోట్ల దోపిడీకి స్కెచ్ వేశారు. అక్రమార్జనతో అమరావతిలో విధ్వంసం సృష్టించారు. ఉచిత ఇసుక పేరుతో గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి లాంటి నదులు, వాగులు, వంకలను అడ్డగోలుగా తవ్వేసి భారీ ధరలకు విక్రయించి రూ.వేల కోట్లు కొల్లగొట్టారు. కేవలం రూ.17,368 కోట్లతో పోలవరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి మినహా జలయజ్ఞం ప్రాజెక్టులను పూర్తి చేస్తానని బీరాలు పలికి రూ.68 వేల కోట్లు తగలేసినా ఒక్కటీ పూర్తి చేయలేకపోయారు. కేంద్రమే నిర్మించాల్సిన పోలవరాన్ని కమీషన్ల దాహంతో దక్కించుకున్న చంద్రబాబు నదీ ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్ వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయకుండా ప్రధాన డ్యామ్ పునాది డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించారు. కాఫర్ డ్యామ్ ఖాళీల గుండా గోదావరి అధిక ఉధృతితో ప్రవహించడంతో డయాఫ్రమ్ వాల్ ధ్వంసమైంది. కమీషన్ల కక్కుర్తితో పోలవరాన్ని చంద్రబాబు ఏటీఎంగా మార్చుకున్నారని ప్రధాని నరేంద్ర మోదీ అప్పట్లో చేసిన వ్యాఖ్యలే టీడీపీ కూటమి అరాచక పాలనకు నిదర్శనం.



వెలగపూడిలో చంద్రబాబు హయాంలో నిర్మించిన తాత్కాలిక సచివాలయంలో చిన్నవర్షానికే కారుతున్న పైకప్పు, శుభ్రం చేస్తున్న కార్మికురాలు

రాష్ట్రానికి జవసత్వాలు..



కూటమి ప్రభుత్వం వెంటిలేటర్‌పైకి చేర్చిన రాష్ట్రానికి గత 58 నెలలుగా సుపరిపాలనతో సీఎం వైఎస్ జగన్ జవజీవాలు కల్పించి శరవేగంగా పునర్నిర్మిస్తున్నారు. కూటమి సర్కార్ హయాంలో 2014–19 మధ్య అప్పులు 169 శాతం పెరిగితే 2019–24 మధ్య అప్పులు 58 శాతానికి తగ్గడమే అందుకు నిదర్శనం. ఎన్నికల్లో హామీల్లో 99 శాతం అమలు చేసిన సీఎం జగన్ దేశ చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ రూపంలో 87 శాతం కుటుంబాల ఖాతాల్లో రూ.2.70 లక్షల కోట్లు నేరుగా జమ చేశారు. 31 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇంటి స్థలాలు లాంటి నాన్ డీబీటీల రూపంలో మరో రూ.1.79 లక్షల కోట్ల మేర ప్రయోజనం చేకూర్చారు. డీబీటీ, నాన్ డీబీటీ కలిపితే ఏకంగా రూ.4.49 లక్షల కోట్ల దాకా పేదలకు లబ్ధి కలిగింది. వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవడంతో పేదరికం క్రమేణా తగ్గుతోంది. రాష్ట్రంలో పేదరికం 2015–16 నాటికి 11.77 శాతం ఉండగా 2022–23 నాటికి 4.19 శాతానికి తగ్గడమే అందుకు నిదర్శనం. టీడీపీ హయాంలో ఐదేళ్లలో కేవలం 32 వేల ఉద్యోగాలను మాత్రమే ఇవ్వగా సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక కొత్తగా 2.31 లక్షల శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించి యువతకు బాసటగా నిలవడం గమనార్హం.

అభివృద్ధిలో అగ్రగామిగా..

కమీషన్ల దాహంతో చంద్రబాబు విధ్వంసం సృష్టించిన పోలవరం ప్రాజెక్టును సీఎం వైఎస్ జగన్ గాడిలో పెట్టి ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నారు. స్పిల్ వే, స్పిల్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేసి 2021 జూన్ 11 నాటికే గోదావరి వరదను స్పిల్ వే మీదుగా మళ్లించారు. కుడి, ఎడమ కాలువ అనుసంధానాలను పూర్తి చేశారు. డయాఫ్రమ్ వాల్‌పై కేంద్రం నిర్ణయాన్ని వెల్లడించడమే తరువాయి శరవేగంగా ప్రధాన డ్యామ్‌ను పూర్తి చేసి ఆయకట్టుకు నీళ్లందించేలా అడుగులు వేస్తున్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను కొనసాగించి సంగం, నెల్లూరు బ్యారేజ్‌లు, లక్కవరం ఎత్తిపోతల, అవుకు టన్నెల్, వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ, కుప్పం బ్రాంచ్ కెనాల్‌లను పూర్తి చేసి జాతికి అంకితం చేశారు. పారదర్శకమైన పారిశ్రామిక విధానంతో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీని దేశంలో ఏటా అగ్రస్థానంలో నిలిపారు. నాలుగు పోర్టులు, పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, మూడు ఇండస్ట్రియల్ కారిడార్లు, పది ఇండస్ట్రియల్ నోడ్స్‌తో పారిశ్రామికాభివృద్ధిని పరుగులెత్తిస్తున్నారు. పారిశ్రామిక వృద్ధి రేటులో దేశంలో రాష్ట్రం 2018–19 నాటికి 3.2 శాతంతో 22వ స్థానంలో ఉండగా 2021–22 నాటికి 12.8 శాతం వృద్ధి రేటుతో మూడో స్థానానికి ఎగబాకడమే అందుకు నిదర్శనం. వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలతో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారు. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి తలసరి ఆదాయం భారీగా పెరిగింది. రాష్ట్రంలో 2018–19లో తలసరి ఆదాయం రూ.1,54,031 ఉంటే 2022–23 నాటికి రూ.2,19,518కు చేరుకోవడం గమనార్హం.



నెల్లూరులోని సంగం బ్యారేజీ

ఊరూరా ఉపాధికి బాటలు

సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత

- 35 శాతం సబ్సిడీతో గరిష్టంగా రూ.10 లక్షల వరకు ఆర్థిక సాయం
- వ్యక్తిగత, ఎఫ్‌పీఓ, స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహం
- మూడేళ్లలో 3,843 పరిశ్రమలకు ఆర్థిక తోడ్పాటు
- రూ.300 కోట్లకు పైగా రుణాలందించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: గ్రామీణ స్థాయిలో సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమలకు ఆర్థిక తోడ్పాటు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచింది. తద్వారా ఊరూరా ఉపాధి కల్పించేందుకు బాటలు వేస్తోంది. చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ.. పదిమందికి ఉపాధి కల్పిస్తూ గ్రామీణ ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు పెద్దఎత్తున ప్రోత్సాహం అందిస్తోంది. ఈ తరహా పరిశ్రమలు దేశవ్యాప్తంగా 25 లక్షలకు పైగా ఉంటే.. మన రాష్ట్రంలో 2 లక్షలకు పైగా ఉన్నాయి. వీటిని ఆధునీకరించేందుకు అవసరమైన తోడ్పాటు ఇవ్వడమే కాకుండా కొత్తగా ఈ రంగంలోకి వచ్చే వారిని ప్రోత్సహించే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. 'వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్' కింద జిల్లాకో ఉత్పత్తిని ఎంపిక చేసి.. ఆ ఉత్పత్తికి సంబంధించిన పరిశ్రమలను ప్రోత్సహిస్తోంది. ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ మైక్రో ఫుడ్ ప్రోసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎం ఎఫ్ఎంఈ)ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తితో ఆర్థిక చేయూత ఇస్తున్నాయి. 2021లో ప్రారంభించిన ఈ పథకం కింద ఐదేళ్లలో రూ.460 కోట్ల ఆర్థిక చేయూతతో 10 వేల యూనిట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా.. మూడేళ్లలో 3,843 పరిశ్రమలకు రూ.300 కోట్లకు పైగా ఆర్థిక చేయూత అందింది.

రూ.10 లక్షల వరకు చేయూత

వ్యక్తిగత కేటగిరీతో పాటు వ్యవసాయ సహకార సంఘాలు (ఎఫ్‌పీఓ), ఉత్పత్తిదారుల సంఘాలు (పీఓ), స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)కు గరిష్టంగా రూ.10 లక్షల వరకు రుణ అనుసంధాన గ్రాంట్ మంజూరు చేశారు. పచ్చళ్లు, తినుబండారాలు తయారు చేస్తూ జీవనోపాధి పొందే ఎస్‌హెచ్‌జీల్లోని సభ్యులకు రూ.40 వేల వరకు సీడ్ క్యాపిటల్ కింద అందించారు. వ్యక్తిగత కేటగిరీలో ప్రాజెక్టు వ్యయంలో 35 శాతం వరకు రుణ అనుసంధాన రాయితీ (క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ) గరిష్టంగా రూ.10 లక్షల వరకు అందించారు. ఇందులో 10 శాతం లబ్ధిదారు భరిస్తే మిగిలిన 55 శాతం బ్యాంకుల నుంచి రుణాల రూపంలో అందించారు.




కడపలోని గృహలక్ష్మి ఫుడ్ ఇండస్ట్రీస్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన మెషినరీ

కల్పించిన సౌకర్యాలివే..


ఈ స్కీమ్ కింద పొందే రుణాలతో కామన్ ప్రోసెసింగ్ ఫెసిలిటీ కింద వ్యవసాయ ఉత్పత్తులను సార్టింగ్, గ్రేడింగ్, గోడౌన్లు, కోల్డ్ స్టోరేజ్ వంటి సౌకర్యాలతోపాటు ఉత్పత్తులను ప్రోసెస్ చేయడానికి ఇంక్యుబేషన్ సెంటర్, ప్రయోగశాలలు అందుబాటులోకి తీసుకొచ్చారు. కెపాసిటీ బిల్డింగ్‌లో భాగంగా 9 కేటగిరీల్లో ఫుడ్ ప్రోసెసింగ్ టెక్నాలజీలు, తయారీ పద్ధతులు, ఆహార ప్రమాణాలు, నిబంధనలు, ఫుడ్ లైసెన్సింగ్ వంటి వాటిపై నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చారు. మనుగడలో ఉన్న పరిశ్రమల క్రమబద్ధీకరణతోపాటు మార్కెటింగ్, బ్రాండింగ్‌లో శిక్షణ, రిటైల్ సంస్థలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడంలో చేయూత ఇచ్చారు. బ్రాండింగ్ ఉత్పత్తుల ద్వారా మెరుగైన వాణిజ్యానికి సహకారం అందించారు.

యంత్రాలు కొన్నాం




మాది గృహలక్ష్మి ఫుడ్ ఇండస్ట్రీస్. మసాలా దినుసులు తయారు చేస్తాం. పరిశ్రమను విస్తరించాలనుకున్నాం. కరోనా వల్ల వెనక్కి తగ్గాం. ఆ సమయంలో ఉద్యాన శాఖ అధికారులొచ్చి ఈ స్కీమ్ గురించి చెప్పారు. దగ్గరుండి దరఖాస్తు చేయించారు. 35 శాతం సబ్సిడీతో రూ.30 లక్షల రుణం తీసుకున్నాం. కొత్త యంత్రాలు కొనుగోలు చేశా. వ్యాపార విస్తరణకు ఇది ఎంతగానో దోహదపడింది.
– బలుసు వీణ, గృహలక్ష్మి ఫుడ్ ఇండస్ట్రీస్, కడప

జీడిపప్పు వ్యాపారానికి చేయూత



కొన్నేళ్లుగా జీడిపప్పు వ్యాపారం చేస్తున్నాం. మెషినరీ కొనుగోలు కోసం ఆలోచిస్తున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం 35 శాతం సబ్సిడీతో రూ.7.50 లక్షల రుణం మంజూరు చేసింది. ఈ మొత్తం పరిశ్రమకు అవసరమైన మెషినరీ కొనుగోలుకు ఉపయోగపడింది.
– మణిదేవి, వజ్జిలపేట, తూర్పు గోదావరి జిల్లా

పప్పు పరిశ్రమకు విస్తరించాం



పప్పు ప్రోసెస్ చేసి మార్కెట్‌లోకి తీసుకెళ్తాం. వ్యాపారం విస్తరించుకోవాలని అనుకున్నాం. ఆర్థిక పరిస్థితి సహకరించలేదు. పీఎంఎఫ్ఎ స్కీమ్ కింద దరఖాస్తు చేశాం. రూ.28 లక్షల రుణమిచ్చారు. మెషినరీ కొనుగోలుతోపాటు వ్యాపారాన్ని మరింత విస్తరించుకోగలిగాం. – జోడు లక్ష్మీదేవి, ప్రొద్దుటూరు

తుపాకి గురిపెట్టి... షేర్లు కొల్లగొట్టారు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ సహ వ్యవస్థాపకుడు జీజే రెడ్డి కుటుంబంపై రామోజీ దౌర్జన్యం

గురివింద రామోజీ

- మార్గదర్శి ఏర్పాటుకు ఆర్థిక తోడ్పాటునందించిన జీజే రెడ్డి
- తండ్రి షేర్లను తమ పేరిట బదిలీ చేయాలని కోరిన జీజే రెడ్డి కుమారులు
- తుపాకీతో బెదిరించి ఫామ్ ఎస్‌హెచ్-4పై సంతకం చేయించుకున్న రామోజీ
- జీజే రెడ్డి షేర్లను ఫోర్జరీ సంతకాలతో తన కోడలు పేరిట అక్రమంగా బదిలీ చేసిన రామోజీ
- జీజే రెడ్డి కుమారుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన సీఐడీ
- తమ షేర్ల కోసం న్యాయపోరాటం చేస్తున్న జీజే రెడ్డి కుటుంబం



సాక్షి, అమరావతి : మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ డిపాజిట్ల బాగోతం బయటపెట్టాల్సిందేనన్న సుప్రీంకోర్టు విస్పష్ట తీర్పుతో ఆర్థిక ఉగ్రవాది రామోజీ అక్రమాలు మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ముసుగులోనే మార్గదర్శి ఫైనాన్సియర్స్ అనే మరో కంపెనీని ఏర్పాటు చేశారు. మార్గదర్శి ఫైనాన్సియర్స్ అని కనీసం బోర్డు కూడా పెట్టకుండా వేల కోట్ల రూపాయలు అక్రమంగా డిపాజిట్లుగా సేకరించారు. రామోజీ ఇంతటి ఆర్థిక అక్రమానికి కేంద్ర బిందువుగా మార్చుకున్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ అనే సంస్థ ఏర్పాటుకు, తన ఉన్నతికి సాయం చేసిన చేతినే ఆయన కాటేశారన్న వాస్తవం కూడా విస్మయపరుస్తోంది. నమ్మి ఆశ్రయం కల్పించిన మిత్రుడు, భాగస్వామి జీజే రెడ్డి కుటుంబాన్ని నిలువునా మోసం చేసి, వారి షేర్లను కొల్లగొట్టి.. తుపాకీతో బెదిరించి మరీ మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను హస్తగతం చేసుకోవడం రామోజీ వికృత వ్యాపారానికి నిదర్శనం. దీనిపై జీజే రెడ్డి వారసుల ఫిర్యాదుతో సీఐడీ కేసు నమోదు చేసింది. మరోవైపు ఆ సోదరులు ఇద్దరూ ఇప్పుడు న్యాయ పోరాటం చేస్తున్నారు.

సాయం చేసిన మిత్రుడిని ముంచేసిన రామోజీ

కృష్ణా జిల్లా పెదపారుపూడికి చెందిన చెరుకూరి రామోజీరావు 1960లలో నిరుద్యోగి. చిన్న ఉద్యోగం కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతూ ఉండేవారు. కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత కొండపల్లి సీతారామయ్యను కలిసి ఏదైనా ఉద్యోగానికి సిఫార్సు చేయమని ప్రాధేయపడేవారు. ఇదే జిల్లా జొన్నలపాడుకు చెందిన జీజే రెడ్డి చెకొస్లోవేకియాలో ఉన్నత విద్య పూర్తి చేసిన అనంతరం ఢిల్లీలో నవభారత్ ఎంటర్‌ప్రైజెస్ అనే కంపెనీని ఏర్పాటు చేశారు. కొండపల్లి సీతారామయ్య సిఫార్సుతో ఆయన రామోజీకి తన కంపెనీలో టైపిస్టుగా ఉద్యోగం ఇచ్చారు. రెండేళ్ల తరువాత 1962లో ఇద్దరూ కలిసి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను స్థాపించారు. జీజే రెడ్డి తన స్వగ్రామం జొన్నలపాడులోని భూముల ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఇందులో పెట్టుబడిగా పెట్టారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో జీజే రెడ్డికి 288 షేర్లు ఉన్నాయి. ఆ తర్వాత జీజే రెడ్డి చెకొస్లోవేకియాలో స్థిరపడి 1985లో అక్కడే చనిపోయారు. ఆయన భార్య కూడా 1986లో మరణించారు. జీజే రెడ్డి ఇద్దరు కుమారులు మార్టిన్ రెడ్డి, యూరి రెడ్డి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో తమ తండ్రి వాటా షేర్లను తమ పేరిట బదిలీ చేయాలని ఎన్నిసార్లు కోరినా రామోజీరావు ససేమిరా అన్నారు.

తుపాకితో బెదిరించిన రామోజీ

2014లో పత్రికల్లో వచ్చిన వార్తలు, నోటిఫికేషన్ల ద్వారా మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో షేర్ల వివరాలను మార్టిన్ రెడ్డి, యూరి రెడ్డి తెలుసుకున్నారు. అప్పటి నుంచి తమ తండ్రి పేరిట ఉన్న షేర్ల కోసం రామోజీరావును కలిసేందుకు రెండేళ్లపాటు ప్రయత్నించారు. చిట్టచివరకు 2016 సెప్టెంబరు 29న రామోజీరావు వారికి అపాయింట్‌మెంట్ ఇచ్చారు. తమ తండ్రి పేరిట ఉన్న షేర్లకు సంబంధించి షేర్ సర్టిఫికెట్ ఇవ్వాలని మార్టిన్ రెడ్డి రామోజీని కోరారు. అప్పుడు 2007 – 08 వార్షిక సంవత్సరం షేర్లపై డివిడెండ్ కింద రూ.39,74,400 విలువైన యూనియన్ బ్యాంక్ చెక్ (నంబరు 137991)ను ఆయన వారికిచ్చారు. మిగిలిన సంవత్సరాల డివిడెండ్ కూడా చెల్లించాలని కోరగా, అవన్నీ సెటిల్ చేస్తానని చెప్పి రామోజీరావు వెళ్లిపోయారు. అనంతరం.. రామోజీరావు సిబ్బంది మార్టిన్ రెడ్డి, యూరి రెడ్డిని ఓ గదిలో కూర్చోపెట్టారు. కాసేపటికి రామోజీ ఆ గదిలోకొచ్చి రూ.100 విలువైన స్టాంపు పేపర్‌పై రాసిన అఫిడవిట్ మీద సంతకం చేయమని మార్టిన్ రెడ్డికి చెప్పారు. తన వాటా షేర్లను తన సోదరుడు యూరి రెడ్డి పేరిట మార్చేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని అందులో రాసి ఉంది. అదే సమయంలో 2016 అక్టోబరు 5వ తేదీతో ఉన్న రూ.2,88,000 పోస్ట్ డేటెడ్ చెక్ (నంబరు 296460)ను యూరి రెడ్డికి ఇచ్చి తేదీ లేని ఫామ్ ఎస్‌హెచ్-4పై సంతకం చేయమని రామోజీరావు చెప్పారు. దీనిపై సంతకం చేసేందుకు యూరి రెడ్డి నిరాకరించారు. దాంతో రామోజీరావు వారిపై ఆగ్రహంతో చిందులు తొక్కారు. తుపాకీ తీసి మార్టిన్ రెడ్డి, యూరి రెడ్డిలకు గురిపెట్టారు. 'మిమ్మల్ని కాపాడటానికి ఇక్కడ ఎవరూ లేరు. సంతకాలు చేయకపోతే కాల్చి పారేస్తా' అని బెదిరించారు. ప్రాణభయంతో ఆ ఫామ్‌పై యూరి రెడ్డి సంతకం చేశారు. తమ షేర్లను ఎవరి పేరిట బదిలీ చేస్తారని గానీ, తేదీ గానీ ఆ ఫామ్‌పై లేవు. తుపాకితో బెదిరించడంతో కేవలం ప్రాణభయంతోనే ఆ ఫామ్‌పై సంతకాలు చేసి అక్కడి నుంచి బతుకు జీవుడా అని బయటపడ్డారు.

షేర్ల బదిలీకి సమ్మతించని సోదరులు

ప్రాణభయంతో ఆ ఫామ్‌పై సంతకం చేసినప్పటికీ, తమ షేర్లను బదిలీ చేసేందుకు యూరి రెడ్డి, మార్టిన్ రెడ్డి సమ్మతించలేదు. తమ తండ్రి వాటా షేర్లను అట్టిపెట్టుకోవాలనే నిర్ణయించుకున్నారు. రామోజీరావు ఇచ్చిన చెక్కును నగదుగా మారిస్తే చట్ట ప్రకారం షేర్ల బదిలీకి సమ్మతించినట్టు అవుతుంది. అందుకే వారు ఆ చెక్కును నగదుగా మార్చకుండా అలానే ఉంచారు. నిజానికి.. షేర్లు బదిలీ చేయాలంటే ఒక్క పత్రంపై సంతకం చేస్తే సరిపోదు. చిట్‌ఫండ్స్ చట్టం, కంపెనీల చట్టం ప్రకారం నిర్దేశించిన చాలా పత్రాలపై సంతకాలు చేయాలి. వాటన్నింటిపై తాను సంతకాలు చేయలేదు కాబట్టి తాను షేర్లు బదిలీ చేసినట్టు కాదని యూరి రెడ్డి ధీమాగా ఉన్నారు. రామోజీరావు ఇచ్చిన చెక్కును నగదుగా మార్చుకోలేదు కాబట్టి షేర్ల బదిలీకి అంగీకరించలేదనడానికి బలమైన సాక్ష్యంగా ఉందని ఆయన భావించారు. ప్రాణభయంతో మరోసారి రామోజీని సంప్రదించేందుకు సాహసించలేదు. తమ షేర్లపై రావల్సిన డివిడెండ్‌ను కూడా అడగలేకపోయారు. దీంతో 2016 నాటికి ఒక్కోటి రూ.55,450 విలువ చేసే 288 షేర్లు అంటే రూ.1,59,69,600 మూలధన విలువైన షేర్లు ఆయన పేరిట ఉన్నాయి.

ఫోర్జరీ సంతకాలతో అక్రమంగా బదిలీ

కానీ ఆర్థిక అక్రమాల్లో ఆరితేరిన రామోజీ తాను అనుకున్నంతా చేశారు. జీజే రెడ్డి షేర్లను ఫోర్జరీ సంతకాలతో తన కోడలు శైలజ కిరణ్ పేరిట బదిలీ చేసేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలపై ఇటీవల ఏపీ సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దాంతో కాస్త ధైర్యం చేసుకుని తమకు న్యాయం జరుగుతుందన్న నమ్మకంతో యూరి రెడ్డి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో తన షేర్ల గురించి తెలుసుకోవాలని భావించారు. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ కార్యాలయంలో పరిశీలించగా ఆయన పేరిట ఉన్న 288 షేర్లను 2016లోనే శైలజ కిరణ్ పేరిట బదిలీ చేసినట్లు రికార్డుల్లో ఉంది. తన పేరుతో ఒక్క షేరు కూడా లేకపోవడంతో విస్తుపోయారు. తాను సంతకాలు చేయకుండా ఎలా బదిలీ చేశారా అని పరిశీలిస్తే అసలు బాగోతం బయటపడింది. యూరి రెడ్డి సంతకాలను ఫోర్జరీ చేసి మరీ ఆయన షేర్లను శైలజ కిరణ్ పేరిట అక్రమంగా బదిలీ చేసేసినట్టు వెల్లడైంది. కంపెనీల చట్టం మార్గదర్శకాలను పాటించకుండానే రామోజీరావు ఫోర్జరీ సంతకాలు, నకిలీ పత్రాలతో అక్రమంగా షేర్లు బదిలీ చేసేసుకున్నట్టు వెల్లడైంది.

రామోజీ, శైలజపై సీఐడీ కేసు

జీజే రెడ్డి పెద్ద కుమారుడు మార్టిన్ రెడ్డి ప్రస్తుతం విదేశాల్లో ఉన్నారు. రెండో కుమారుడు యూరి రెడ్డి భారత్‌లో నివసిస్తూ తమ కుటుంబ ఆస్తి వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. తమ షేర్లను రామోజీరావు, శైలజ కిరణ్ ఫోర్జరీ పత్రాలతో అక్రమంగా బదిలీ చేసుకున్నారని యూరి రెడ్డి ఏపీ సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎందుకంటే కృష్ణా జిల్లాలోని తమ స్వగ్రామంలోని ఆస్తుల నుంచి సేకరించిన నిధులనే జీజే రెడ్డి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టారు. మరోవైపు.. ఆంధ్రప్రదేశ్‌లో 37 బ్రాంచి కార్యాలయాల ద్వారా మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. దీనిపై న్యాయ నిపుణులను సంప్రదించిన తరువాతే యూరి రెడ్డి తన షేర్ల అక్రమ బదిలీపై ఏపీ సీఐడీకి ఫిర్యాదు చేశారు. ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని నిర్ధారించుకున్న తరువాత సీఐడీ విభాగం కేసు నమోదు చేసింది. ఏ-1గా చెరుకూరి రామోజీరావు, ఆయన కోడలు చెరుకూరి శైలజ కిరణ్‌ను ఏ-2గా పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. వారిపై ఐపీసీ సెక్షన్లు 420, 467, 120-బి రెడ్‌విత్ 34 కింద అభియోగాలు నమోదు చేసింది. మరోవైపు ఇదే అంశంపై యూరి రెడ్డి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తమ తండ్రి పేరిట ఉన్న షేర్లను అక్రమంగా బదిలీ చేసుకున్న రామోజీరావు, శైలజ కిరణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, తమ షేర్లను తమ పేరిట బదిలీ చేసేలా రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌ను ఆదేశించాలని కోరుతున్నారు. దీనిపై న్యాయస్థానంలో వ్యాజ్యం కొనసాగుతోంది.

వలంటీర్లపై చంద్రబాబుది కపట ప్రేమే

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: వలంటీర్లపై చంద్రబాబుది కపట ప్రేమ అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. నిన్నటి వరకు వలంటీర్లను తూలనాడిన చంద్రబాబు.. ఇప్పుడు ప్రేమ చూపిస్తారంటే ఎవరూ నమ్మరని అన్నారు. సజ్జల బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. గోనె సంచులు మోస్తారు, ఆడవారి వివరాలు సేకరిస్తారు, అర్ధరాత్రి తలుపులు కొడతారని వలంటీర్ల గురించి నిన్నటిదాకా అన్న చంద్రబాబు.. ఇప్పుడు వలంటీర్లను కొనసాగిస్తా, రూ.10 వేలు ఇస్తా అంటే వలంటీర్లు, జనం నమ్మరని చెప్పారు. వలంటీర్లపై ఎల్లో మీడియాలో తప్పుడు రాతలు రాశారని, చంద్రబాబు తన మనిషి నిమ్మగడ్డ ద్వారా కేసులు వేయించి, ఫిర్యాదులు చేయించారని తెలిపారు. వలంటీర్ల పేరుతో జన్మభూమి కమిటీలను తెచ్చి, వాటిలోని సభ్యులనే వలంటీర్లుగా తేవాలనేది చంద్రబాబు పథకమని, అదెప్పటికీ జరగదని అన్నారు. వలంటీర్లు పెన్షన్ ఇవ్వకుండా అడ్డుకుంది చంద్రబాబే అని చెప్పారు. పైపెచ్చు నేడు 33 మంది చనిపోయారంటూ ఎన్‌హెచ్చార్సీకే ఫిర్యాదు చేశారని, వారికి వీలుంటే ఐక్యరాజ్యసమితికైనా ఫిర్యాదు చేస్తారని ఎద్దేవా చేశారు. వలంటీర్లు ఓటర్లను ప్రభావితం చేస్తారని బాబు అనడం అబద్ధమని స్పష్టం చేశారు. శవ రాజకీయాలు చేసేది చంద్రబాబేనని, వృద్ధులు చనిపోతే దానిని వైఎస్సార్‌సీపీకి అంటగట్టాలని చూస్తున్నారన్నారు. వలంటీర్లు గత నాలుగున్నరేళ్లుగా పింఛన్లు, పథకాలను ప్రజలకు అందిస్తున్నారని, రెండు నెలలు అడ్డుకోవడం ద్వారా వారి ప్రభావాన్ని ఆపగలరనుకుంటే అవివేకమే అవుతుందని తెలిపారు. సీఎం జగన్ రోడ్ షోలకు లభిస్తున్న ఆదరణ చూసి భయపడి ఇలాంటివి చేస్తున్నారని అన్నారు.

మార్గదర్శి పేరుతో రామోజీ ఆర్థిక నేరాలు

మార్గదర్శిపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని సజ్జల అన్నారు. మార్గదర్శి పేరుతో ఈనాడు రామోజీరావు ఆర్థిక నేరాలకు పాల్పడ్డారని చెప్పారు. రామోజీ అక్రమాలు, మోసాలన్నీ ఇప్పుడు వెలుగులోకి వస్తాయన్నారు. చంద్రబాబును గద్దెనెక్కించేందుకు రామోజీరావు పూర్తిగా దిగజారిపోయారని, నిత్యం సీఎం జగన్‌పై విషం కక్కుతున్నారని అన్నారు. అందరికి నీతులు చెప్పే రామోజీరావు ఏనాడైనా నిష్పక్షపాతంగా వార్తలు రాశారా అని ప్రశ్నించారు. మార్గదర్శి ఫైనాన్స్‌పై తీర్పు వస్తే ఆ వార్త ఈనాడులో ఎక్కడా లేదన్నారు. రామోజీ సృష్టించిన అబద్ధాలనే బ్యానర్ కథనాలుగా ఇస్తున్నారన్నారు. సాక్షాత్తు కోర్టులోనే ఏపీ ప్రభుత్వం ఆయనకు వ్యతిరేకంగా ఉందని రామోజీరావు లాయర్ ద్వారా చెప్పారని అన్నారు. ఈనాడు స్క్రిప్టులనే చంద్రబాబు మాట్లాడతారని, వాటినే సోషల్ మీడియాలో నిజమనేలా దుష్ప్రచారం చేస్తారని చెప్పారు. చంద్రబాబును అర్జెంట్‌గా గద్దెనెక్కించాలనే తపన రామోజీలో కనపడుతోందన్నారు. సీఎం జగన్ వ్యవస్థలను సక్రమంగా నడుపుతూ, చట్టాలను గౌరవిస్తూ ప్రజాస్వామ్యయుతంగా ముందుకు వెళ్తున్నారన్నారు. వాస్తవాలు బయటకు రావాలనే తాపత్రయం సీఎం జగన్‌లో ఉందని చెప్పారు. ఇదే క్రమంలో రామోజీరావు మార్గదర్శి అక్రమాలను, చంద్రబాబు స్కామ్‌లను బయటకు తెస్తున్నారని అన్నారు.

అభ్యర్థుల ఎంపికలో కూటమిలోనే గందరగోళం

వైఎస్సార్‌సీపీ టీం బ్రహ్మాండంగా ఉందని, తమ అభ్యర్థులను మార్చాల్సిన స్థితి లేదని సజ్జల స్పష్టం చేశారు. శాస్త్రీయ పద్ధతిలో, సుదీర్ఘ కసరత్తు తర్వాత అభ్యర్థుల ఎంపిక జరిగిందన్నారు. అభ్యర్థుల మార్పు జరుగుతుందనేది తప్పుడు ప్రచారమన్నారు. అభ్యర్థుల ఎంపికపై కూటమిలోనే గందరగోళం ఉందని, వారిలో వారికి పొత్తులు కుదరక నిత్యం అభ్యర్థులను మారుస్తూ.. వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఓటమి భయంతోనే చంద్రబాబు ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. నూటికి నూరు పాళ్లు విజయం వైఎస్సార్‌సీపీదేనని సజ్జల స్పష్టం చేశారు.

టీడీపీ వాళ్లే హింసకు పాల్పతున్నారు

రాష్ట్రంలో టీడీపీ వాళ్ళే హింసకు పాల్పడుతూ ఆ బురద వైఎస్సార్‌సీపీపై వేస్తున్నారని ఓ ప్రశ్నకు సమాధానంగా సజ్జల చెప్పారు. మచిలీపట్నంలో వైఎస్సార్‌సీపీ వాళ్లపై దాడిచేసింది టీడీపీవేనని, ఒంగోలులో గొడవ చేసింది టీడీపీ వాళ్లేనని అన్నారు. సీఎం జగన్ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల్లోకి వెళ్లి తాను చేసింది చెప్పి మద్దతు కోరుతున్నారని తెలిపారు. చంద్రబాబు, పవన్, పురందేశ్వరికి ఏం చేయాలో తెలియక గంగవెర్రులెత్తుతున్నారని చెప్పారు. రాబోయే తీర్పుకు వారు ఇప్పట్నుంచే సాకులు వెతుక్కుంటున్నారన్నారు.

నేను, పవన్, మోదీ కలిసొచ్చాం.. యుద్ధం చేసి చూపిస్తాం

కోనసీమ జిల్లా పర్యటనల్లో చంద్రబాబు • ఎక్కడ తగ్గాలో నాకు బాగా తెలుసు : పవన్

సాక్షి అమలాపురం/ అంబాజీపేట/ అమలాపురం టౌన్/ అమలాపురం రూరల్/నిడదవోలు : 'ఎన్నికల్లో సిద్ధం అన్నవారితో యుద్ధం చేసి చూపిస్తాం.. మీ దెబ్బకు జగన్ అదిరిపోవాలి. జగన్‌ను మళ్లీ బయటకు రాకుండా కొట్టాలి. వచ్చేది మన ప్రభుత్వమే' అని టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌లు సంయుక్తంగా పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం, అమలాపురంలో గురువారం వారిద్దరూ పర్యటించారు. రోడ్ షో చేయడంతో పాటు అంబాజీపేట, అమలాపురం గడియారస్తంభం సెంటర్లలో ప్రసంగించారు. ముందుగా చంద్రబాబు మాట్లాడుతూ 'నేను, పవన్, మోదీ కలిసి వచ్చాం.. ఎదురుగా నిలబడే సత్తా జగన్‌కు లేదు' అని అన్నారు. 'మీకు జాబ్‌లు రావాలంటే మా కూటమి రావాలి. అధికారంలోకి రాగానే తొలి సంతకం మెగా డీఎస్సీ మీదే పెడతాను. సూపర్ సిక్స్‌తో మరో నాలుగు పథకాలు.. మొత్తం పది పథకాలు అమలు చేస్తాను' అని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగం అంటే భరోసా లేదని.. విశాఖలో ప్రభుత్వ ఉద్యోగి శంకరరావు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ 'ఈ ఎన్నికలలో ఓటు బదిలీ కీలకం. ఓటు చీలకూడదనే పొత్తులకు వెళ్లాను. సీట్లు తగ్గించుకున్నాను. నాకు ఎక్కడ తగ్గాలో తెలుసు కాబట్టి సీట్లు తగ్గించుకున్నాను. మీరు అర్థం చేసుకుని ఓటు వేయండి' అన్నారు. సంక్షేమ పథకాలను ఏదీ కూడా ఆపబోమన్నారు. జగన్ కోనసీమను కొట్లాట సీమగా మార్చారని, తాము అందరినీ ప్రేమతో కలిపామన్నారు. మహిళలకు భద్రత, యువతకు ఉద్యోగాలు ఇవ్వని ప్రభుత్వం మనకు కావాలా? అని ప్రశ్నించారు. కులాల మధ్య చిచ్చు కోసం సొంత మంత్రి ఇంటిని తగులబెట్టుకున్న ప్రభుత్వం ఇది అని, దీనిని గుర్తించి ఓటు వేయాలని కోరారు. ఇదిలా ఉండగా, తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు తిరుమల కల్యాణ మండపంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన రంజాన్ వేడుకల్లో ఆ పార్టీ అధినేత చంద్రబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రబాబు

అంబేడ్కర్ జయంతి పూర్తయిందంట!

ఈ నెలలో ముగ్గురు మహానుభావులు పుట్టారన్న చంద్రబాబు అంబేడ్కర్ జయంతి పూర్తయిందని చెప్పడం చూసి సభలో జనం అవాక్కయ్యారు. ఈ నెల 14న అంబేడ్కర్ జయంతి అని తెలియదా బాబూ.. అని దళిత నాయకులు మండిపడ్డారు. నిర్ణీత సమయం ప్రకారం మధ్యాహ్నం 3.30 గంటలకు అంబాజీపేటలో సభ జరగాల్సి ఉండగా మూడు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. జనం లేక చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఆలస్యంగా వచ్చారు. అంబాజీపేటలో ఒక మోస్తరు జనం కనిపించినా జిల్లా కేంద్రం అమలాపురంలో మరీ తీసికట్టు అన్నట్టుగా ఉన్నారు. అంబాజీపేట సభలో చంద్రబాబు, పవన్‌లు మాట్లాడుతున్న సమయంలో జనం వెనుదిరగడం గమనార్హం.

జాకీలేస్తున్నా.. జారిపోతున్నారు

కుమ్ములాటలతో కూటమి అతలాకుతలం

- భీమవరంలో కలిసిరాని జనసేన కేడర్
- ఉండిలో ఆమరణ దీక్ష కొనసాగింపు
- పాలకొండలో కూటమి అభ్యర్థిని మార్చాలని డిమాండ్
- చంద్రబాబు సీటు అమ్ముకున్నారని ముద్దరబోయిన ధ్వజం
- కార్యకర్తల అభీష్టంతో రెబల్‌గా పోటీ చేస్తానంటున్న దొన్నుదొర

సాక్షి, నెట్‌వర్క్: విపక్ష కూటమిలో తలెత్తిన టికెట్ల కుంపటి రోజురోజుకీ ఉధృతంగా మారుతోంది. టికెట్ ఇస్తానని నమ్మించిన చంద్రబాబు చివరికి దారుణంగా వెన్నుపోటు పొడవటంతో భంగపడిన నేతలు ఒక్కొక్కరుగా రోడ్డెక్కుతున్నారు. ఐదేళ్లపాటు ఉన్నదంతా ఊడ్చి ఖర్చు చేశామని తీరా ఎన్నికల సమయానికి సూట్‌కేసులతో వచ్చిన నాయకులకు టీడీపీ తలొగ్గిందని దుమ్మెత్తిపోస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నియోజకవర్గం కూటమిలోని వర్గపోరు, కుమ్ములాటలు అభ్యర్థి పులపర్తి రామాంజనేయులుకు సంకటంగా మారాయి. జనసేనలోని ఆధిపత్య పోరుకు టీడీపీ మాజీ ఎమ్మెల్యేను అరువు తెచ్చుకుని అభ్యర్థిగా ప్రకటించడం మరింత ఆజ్యం పోసింది. టీడీపీ కేడర్ కలిసిరాక నియోజకవర్గంలో కూటమి డీలా పడుతోంది. ఎన్నికల వేడి మొదలైన సమయంలో టీడీపీ నుంచి టిక్కెట్ రేసులో నిలిచిన ఆయన పొత్తు ప్రకటనతో జనసేనలో చేరి సీటు తెచ్చుకున్నారు. ఎన్నికల ప్రకటనకు ముందువరకు జనసేన పార్టీలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, వీరవాసరం జెడ్పీటీసీ గుండా జయప్రకాష్‌నాయుడు గ్రూపులుగా పార్టీ నియోజకవర్గ కార్యక్రమాలు నిర్వహించేవారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ భీమవరం నుంచి పోటీ చేయకుంటే తమకే సీటు దక్కుతుందని ఇద్దరూ ఆశించారు. చినబాబు, జయప్రకాష్‌నాయుడు గ్రూపుల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరి ఇరు వర్గాల మధ్య కొట్లాటకు దారితీసింది. కాగా, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి భీమవరంలోనే ఉంటున్నా కూటమి కార్యక్రమాలకు అంతంతమాత్రంగానే హాజరవుతున్నారు.

కుటుంబంతో కలిసి చనిపోవాలనుకున్నా

తనకు అరకు టికెట్ కేటాయించి తర్వాత కూటమి అభ్యర్థిగా పాంగి రాజారావును ప్రకటించడం దారుణమని టీడీపీ సీనియర్ నాయకుడు దొన్నుదొర ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తనకు తొలుత టికెట్ కేటాయించి తరువాత బీజేపీకి కేటాయించి అవమానించారన్నారు. తనకు టికెట్ రాలేదన్న బాధతో గుమ్మకోట పంచాయతీకి చెందిన మహేష్, అరకులోయ మండలానికి చెందిన పాంగి రాజు ఆత్మహత్య చేసుకుంటామని పురుగుల మందు వెంట పెట్టుకుని తిరిగేవారని వారిని బుజ్జగించమన్నారు. సాంబమూర్తి అనే వ్యక్తి ఉరి వేసుకునేందుకు వెళితే గ్రామస్తులు కాపాడారన్నారు. చివరి నిమిషంలో టికెట్ రాకపోవడంతో కుటుంబంతో కలిసి చనిపోవాలని అనుకున్నానన్నారు. అయితే తనను నమ్మిన కార్యకర్తల భవిష్యత్‌ను ఆలోచించి ఆత్మహత్యాయత్నం విరమించుకున్నానన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నియోజకవర్గంలో 4 సార్లు ఓటమిపాలైన కూటమి అభ్యర్థి జయకృష్ణకు మరోసారి ఓటమి తప్పదని ఆయన వ్యతిరేక వర్గం స్పష్టం చేసింది. పాలకొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా కొనసాగిన వ్యక్తి జనసేనలోకి చేరిన రెండురోజులకే టికెట్ ఎలా కేటాయిస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. కూటమి తరఫున పాలకొండ టికెట్ ఆశించిన పడాల భూదేవితోపాటు వారంతా జయకృష్ణ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారు. భూదేవి మాట్లాడుతూ జనసేన తరఫున టికెట్ ఇస్తానని, పార్టీలో చేరాలని పవన్ హామీ ఇచ్చారని చెప్పారు. దీనిపై అధిష్టానం పునరాలోచించకపోతే వారం రోజుల్లో తమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.



రామరాజుకే టికెట్ కేటాయించాలంటూ టీడీపీ నాయకులు నిరాహారదీక్ష చేస్తున్న దృశ్యం

ధన బలానికే తలొగ్గిన చంద్రబాబు

ప్రజా బలం ఉన్న నాయకుల కంటే ధన బలం ఉన్న వారికే చంద్రబాబు టికెట్‌లు ఇస్తున్నారని నూజివీడు టీడీపీ రెబల్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ధ్వజమెత్తారు. పెనమలూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అయిన కొలుసు పార్థసారథికి కనీసం పార్టీలో చేరకుండానే నూజివీడు టికెట్ ఇచ్చారన్నారు. దీనిని టికెట్ అమ్ముకోవడం కాక ఇంకేమంటారో చంద్రబాబు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. నూజివీడులో టీడీపీ రెబల్ అభ్యర్థిగా గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇప్పటి వరకు వలంటీర్లపై కుట్రలు చేసిన చంద్రబాబు, వారు ఆగ్రహంతో ఉండటంతో అధికారంలోకి వస్తే రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తానని మాయమాటలు చెప్తున్నారని విమర్శించారు. తాను స్వతంత్ర అభ్యర్థిగా నూజివీడు నియోజకవర్గంలో పోటీకి దిగుతున్నానని చెప్పారు.

ఉండిలో ఉద్రిక్త పరిస్థితులు

ఉండి సీటు వ్యవహారంలో చంద్రబాబు వైఖరిని నిరసిస్తూ టీడీపీ శ్రేణులు ఆందోళనను తీవ్రతరం చేస్తున్నాయి. ఎమ్మెల్యే మంతెన రామరాజుకు మద్దతుగా చేపట్టిన నిరాహారదీక్షలు రెండో రోజుకు చేరాయి. పార్టీ శ్రేణులు గురువారం భీమవరంలోని జిల్లా పార్టీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఉండి నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా ఎమ్మెల్యే రామరాజు పేరును మొదటి జాబితాలోనే ప్రకటించారు. అయితే ఇక్కడ నుంచి ఎంపీ రఘురామకృష్ణరాజుకు టికెట్ ఇస్తారని ప్రచారం జరుగుతోంది. దీంతో అభ్యర్థి మార్పుపై నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. రామరాజును మారిస్తే మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని మండల, నియోజకవర్గస్థాయి నాయకులు ప్రకటించి సంతకాలు చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆందోళనకారులతో చర్చించారు. సమస్యను చంద్రబాబు దృష్టికి తీసుకువెళతానన్నారు. ఈ విషయమై స్పష్టత ఇచ్చే వరకు తాము కదిలేది లేదని కార్యాలయం ముందు బైటాయించారు. ఎన్నిరోజులైనా ఇక్కడే ఉంటామంటూ కార్యాలయం ఆవరణలో వంటవార్పునకు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల నియమావళి దృష్ట్యా జనం గుమిగూడదని పోలీసులు వారికి సర్దిచెప్పడంతో తాత్కాలికంగా ఆందోళన విరమించారు. భవిష్యత్తు కార్యాచరణపై శుక్రవారం సమావేశమై నిర్ణయం తీసుకోనున్నట్టు పార్టీ నాయకులు తెలిపారు.

టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డిపై కేసు



ఈద్గా సమీపంలో ముస్లింలకు మజ్జిగ, ఖర్జూరం అందజేస్తున్న కోట్ల

డోన్ టౌన్: ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించి ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినందుకు నంద్యాల జిల్లా, డోన్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డిపై పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. రంజాన్ పండుగ సందర్భంగా గురువారం గుత్తి రోడ్డులోని ఈద్గా సమీపంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో భాగంగా వీడియో చిత్రీకరిస్తుండగా టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి ముస్లింలకు మజ్జిగ ప్యాకెట్లు, ఖర్జూరం పండ్లు, వాటర్ ప్యాకెట్లు అందజేయడం గుర్తించారు. ఈ మేరకు ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్ ఫిర్యాదు ఆధారంగా కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, టీడీపీ నాయకులు కొట్రికె ఫణిరాజ్, కేశవయ్య గౌడ్‌తో పాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

నయవంచకులను ఓడించండి

మాజీ మంత్రి అమరనాథరెడ్డిపై మంత్రి పెద్దిరెడ్డి ఫైర్



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పెద్దపంజాణి (చిత్తూరు జిల్లా): ఏ కాలానికి ఆ కాలం జెండా పట్టుకుంటూ ఊసరవెల్లిలా పార్టీలు మారుస్తూ నిరంతరం ప్రజలను మోసం చేస్తున్న నయ వంచకుడు పలమనేరు టీడీపీ అభ్యర్థి అమరనాథరెడ్డిని రానున్న ఎన్నికల్లో ఘోరంగా ఓడించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఎంపీ రెడ్డెప్ప, స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ కో-ఆర్డినేటర్ రాకేష్‌రెడ్డి, సూపర్‌బజార్ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్‌తో కలసి ఆయన పెద్దపంజాణిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. ఎన్నో దశాబ్దాలుగా రాజకీయ కుటుంబమని గొప్పలు చెప్పుకునే మాజీ మంత్రి అమర్, ఆయన తండ్రి రామకృష్ణారెడ్డి ముప్పై ఏళ్లుగా వారి సొంత మండలమైన పెద్దపంజాణిలో చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. 2014 ఎన్నికల్లో తాను అమరనాథరెడ్డిని వైఎస్సార్‌సీపీలో గెలిపిస్తే మంత్రి పదవి కోసం వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలోకి వెళ్లిన నీచ చరిత్ర ఆయనదని ఎద్దేవా చేశారు. ఆయన సొంత మండలంలో అప్పట్లో మంత్రిగా ఆయన ఓ రోడ్డు వేస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎన్ని రోడ్లు వేశామో చూసుకోవచ్చునని సవాల్ విసిరారు. గతంలో వారు కేవలం జన్మభూమి కమిటీల ద్వారా కావాల్సిన వారికి పనులు చేసుకుంటే ఈ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని అందించామని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సుష్మా, కన్వీనర్ బాగారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, రాష్ట్ర కన్వీనర్ బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, బైరెడ్డిపల్లి ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, వైస్ ఎంపీపీలు, జిల్లా కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు, అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.

పచ్చమీడియాకు దోచిపెట్టిన ఘనుడు బాబు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



లోకేశ్ వ్యాఖ్యలను ఫోన్ ద్వారా వినిపిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: చంద్రబాబు ముఖ్యమంత్రిగా 14 ఏళ్ల కాలంలో పచ్చమీడియాకు వేలాది కోట్ల ప్రజాధనాన్ని దోచిపెట్టాడని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో గురువారం నిర్వహించిన కిళ్లీ, బీడీ, సిగరెట్, సోడా అండ్ కూల్‌డ్రింక్స్ వర్తక సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి రూపాయినీ పారదర్శకంగా సంక్షేమం రూపంలో ప్రజలకు నేరుగా అందిస్తుంటే.. బాబు మాత్రం అధికారంలో ఉండగా రూ.2 లక్షల కోట్లు కూడబెట్టి ఆ ధనంతో నేడు తన మందీమార్బలాన్ని పోషిస్తున్నాడని మండిపడ్డారు. ప్రజల సొమ్ము దోచుకున్నందుకే జైలు ఊచలు లెక్కపెట్టి వచ్చాడని తెలిపారు.

ఊళ్ల మీదికి పచ్చ బ్యాచ్..

రాష్ట్రవ్యాప్తంగా పచ్చమీడియాతో పాటు పచ్చ బ్యాచ్‌ను వేలాదిగా వదిలారని, వీరంతా ప్రతి నియోజకవర్గంలోనూ కూటమి గెలుస్తుందంటూ మౌత్ పబ్లిసిటీ చేయడం, కూటమి మెజారిటీపై లక్షకు రెండు లక్షలు పందెం ఇస్తామంటూ హైప్ చేయడమే పనిగా పెట్టుకున్నారని మంత్రి చెప్పారు. కానీ పందేనికి సిద్ధమంటే పారిపోతున్నారని తెలిపారు. తణుకులో ఈ తరహా మోసానికి కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ దిగాడని ఎద్దేవా చేశారు. తమ కౌన్సిలర్లు చెప్పిన వారికే పింఛన్లు, రైస్ కార్డులు ఇస్తామని లోకేశ్ బహిరంగ సభలో చెప్పడం కూటమి బరితెగింపునకు నిదర్శనమన్నారు.

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఆనందంగా జీవిస్తున్నాం



రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబం మాది. ఏ ప్రభుత్వంలోనూ అందని లబ్ధి ఈ ప్రభుత్వంలో చేకూరింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం గంటిపల్లిపాలెంలో మా ఆయన కల్లుగీత కార్మికుడిగా కొనసాగుతూ, కొంత భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తుంటారు. మాకు ఇద్దరు కుమారులు. వచ్చిన ఆదాయం సరిపోక మా కుటుంబ పోషణకు, పిల్లల చదువులకు తీవ్ర ఇబ్బందులు పడేవారం. ఈ సమయంలో సీఎంగా జగన్ బాధ్యతలు చేపట్టారు. ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలు మా కుటుంబానికి ఆసరాగా నిలిచాయి. మా ఆయనకు పింఛన్ కానుక వస్తోంది. వైఎస్సార్ పంటల బీమా కింద రూ.22,474, వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రూ.13,500 వంతున, ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.600 వచ్చాయి. వైఎస్సార్ చేయూత కింద ఏడాదికి నాకు 18,750, వైఎస్సార్ ఆసరా కింద రూ.35,780, జగనన్న అమ్మ ఒడి కింద ఏటా రూ.15 వేలు, జగనన్న విద్యా దీవెన కింద రూ.1,11,975, జగనన్న వసతి దీవెన కింద రూ.23,042, ఇవిగాకుండా రూ.2 లక్షలు విలువైన ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించారు. ఇప్పుడు మా పిల్లల చదువుకు బెంగ లేదు. ఆనందంగా జీవిస్తున్నాం. ఎప్పటికీ ఆయన మేలు మరచిపోలేం.

– ఈరి లక్ష్మి, గంటిపల్లిపాలెం
(జగత శ్రీరామచంద్రమూర్తి, విలేకరి, కొత్తపేట)

సొంతిల్లు సమకూరింది



నా భర్త 18 ఏళ్ల క్రితం పాము కాటుకు గురై మృతి చెందారు. నాకు ఒక కుమారుడు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం వేములూరులో ఏళ్ల తరబడి అద్దె ఇంట్లోనే నివాసం ఉంటున్నాం. కుటుంబ బాధ్యత కూడా నాపైనే పడింది. మా అమ్మకు ముగ్గురం ఆడపిల్లలం. పెద్దకుమార్తెనైన నా వద్దే ఆమె ఉంటోంది. గత ప్రభుత్వ హయాంలో మాకు ఎలాంటి సాయం అందలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మా కుటుంబానికి ఆసరా లభించింది. నాకు వితంతు పింఛన్, మా అమ్మకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. నాకు వైఎస్సార్ ఆసరా కింద ప్రతి విడతలో రూ.6 వేలు వంతున వచ్చింది. ముఖ్యంగా ఎవరి వద్దకు తిరగకుండానే వలంటీర్ ద్వారా కొవ్వూరు పట్టణానికి చేరువగా రైల్వే స్టేషన్ పక్కన అత్యంత విలువైన ప్రాంతంలో ఇంటి స్థలం, ఇల్లు మంజూరైంది. ఎవరికీ లంచం ఇవ్వలేదు. గతంలో ఇదే ఇంటి కోసం నాయకుల చుట్టూ తిరిగాం. ఏ ఒక్కరూ మా గోడు పట్టించుకోలేదు. ఇన్నాళ్లకు ఓ గూడు దొరికింది. ఇప్పుడు మేము ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవించగలుగుతున్నాం.

– వాడపల్లి వెంకటలక్ష్మి, వేములూరు
(జి.వి.వి.సత్యనారాయణ, విలేకరి, కొవ్వూరు)

పైసా ఖర్చు లేకుండా ఉన్నత చదువులు



విద్యకు ఈ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, సాయం కారణంగా మాకు ఎలాంటి భారం లేకుండా మా పిల్లల చదువులు సాఫీగా సాగుతున్నాయి. నా భర్త అప్పలరాజు ప్రైవేటు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఆయన ఆదాయం అంతంత మాత్రమే. దాంతో మా పిల్లల చదువులు ఎలా అని ఎప్పుడూ భయపడేవాళ్లం. అదృష్టవశాత్తు ఈ ప్రభుత్వం వచ్చాక ఆ బెంగ తీరిపోయింది. మేము విశాఖపట్నం జిల్లా భీమిలి బాలాజీనగర్‌లో ఉంటున్నాము. మా అమ్మాయి ప్రసన్న ఇంజినీరింగ్, మా అబ్బాయి ముఖేష్ డిగ్రీ చదువుతున్నారు. వీరికి సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా దీవెన పథకం ద్వారా రూ.2,16,840, వసతి దీవెన పథకం ద్వారా రూ.75 వేలు వచ్చాయి. ప్రభుత్వ సాయం లేకపోతే ఇన్ని ఫీజులు భరించడం మా వల్ల అయ్యేది కాదు. పద్మనాభం మండలం తునివలసలో మాకు ఇంటి స్థలం మంజూరు చేశారు. నాకు సున్నా వడ్డీ కింద రూ.6,875 లభించింది. వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.48,475 సాయం అందింది. అరకొర ఆదాయంతో అవస్థలు పడుతున్న మేము ఈ ప్రభుత్వం అందించిన సాయంతో దర్జాగా బతుకుతున్నాం. ఎప్పటికీ ఈ ప్రభుత్వ సాయం మరువలేం.

– కానూరి మీనాక్షి, బాలాజీనగర్
(గేదెల శ్రీనివాసరెడ్డి, విలేకరి, తగరపువలస)

చంద్రబాబును మించిన ఊసరవెల్లి షర్మిల

- చంద్రబాబు లాంటి రాక్షసులతో చేతులు కలిపింది
- షర్మిలపై వైఎస్సార్‌టీపీ ఫౌండర్, వైఎస్సార్ వీరాభిమాని కొండా రాఘవరెడ్డి ఫైర్



సెల్ ద్వారా షర్మిల ప్రసంగాన్ని వినిపిస్తున్న కొండా రాఘవరెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప : 'చంద్రబాబు లాంటి రాక్షసులతో చేతులు కలిపావు.. వైఎస్ కుటుంబాన్ని రోడ్డున పడేయాలని చూస్తున్నావు.. ఏం ఆశించి ఇదంతా చేస్తున్నావు? సమైక్యాంధ్రలో ఊసరవెల్లి ఎవరంటే చంద్రబాబు అని ఠక్కున చెప్తారు.. కానీ, ఇప్పుడు అంతకుమించిన ఊసరవెల్లిగా కీర్తి గడిస్తున్నావు. వైఎస్సార్ పేరు చెప్పుకుని ప్రచారం చేసుకుంటూ వైఎస్ కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తే చూస్తూ ఊరుకోం. వైఎస్సార్ వీరాభిమానులుగా మేం సహించలేం'.. అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలపై వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఫౌండర్, వైఎస్సార్ వీరాభిమాని కొండా రాఘవరెడ్డి తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడపలో వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్ రాజారెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలది ఆదర్శనీయమైన కుటుంబమన్నారు. వారెంతో మందికి మేలుచేశారని.. కానీ, ఆ కుటుంబం నుంచి వచ్చిన షర్మిల మానసిక పరిస్థితేంటో అర్థం కావడం లేదన్నారు. ఆమె ఏడున్నరేళ్ల తర్వాత తెలంగాణకు వచ్చి వైఎస్సార్ తెలంగాణ పార్టీ పెట్టినప్పుడు మా వైఎస్సార్ బిడ్డ వచ్చిందని సంతోషపడ్డామని ఆయన తెలిపారు. 'షర్మిల అక్కడ ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేసింది.. ఆడ బిడ్డను కాదు, ఈడ బిడ్డనే అంది.. నా మెట్టినిల్లు తెలంగాణ అంది, పాదయాత్ర చేసింది.. 119 సీట్లలో పోటీచేస్తానంది.. పాలేరు నుంచి పోటీ చేస్తానంటివి, మట్టి పట్టుకుంటివి.. ఎన్నికలకు ముందు పార్టీని మూసేసిందని రాఘవరెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణలో ఉన్న వైఎస్సార్ అభిమానులు, ప్రజలు దారుణంగా మోసానికి గురయ్యారన్నారు. అసలు తెలంగాణలో ఆమెను నమ్మి 300 కుటుంబాలు రోడ్డు పాలయ్యాయని తెలిపారు. ఆమె ఏపీకి వచ్చి రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తన ధ్యేయమంటూ కల్లబొల్లి మాటలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

షర్మిల నోట చంద్రబాబు స్క్రిప్ట్

చంద్రబాబు ఏ ఆరోపణలైతే చేస్తారో అవే ఆరోపణలు దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ చేస్తారు. ఇప్పుడు షర్మిల కూడా చంద్రబాబు స్క్రిప్ట్‌ను వల్లెవేస్తోంది. వైఎస్సార్ కుటుంబాన్ని అన్ని విధాలా రోడ్డున పడేయడానికి చంద్రబాబు, పవన్ కుట్రలు పన్నుతుంటే అందులో నువ్వు భాగస్వామ్యం కావడం మంచిది కాదు. నీకు తోడు వైఎస్ వివేకా కుమార్తె సునీతను వెంటబెట్టుకొని సీఎం జగన్‌పై అసత్య ప్రచారం చేయడం పద్ధతేనా? సీతమ్మ లాంటి మీ అమ్మ విజయమ్మపై వివేకా మీసం మెలేసి, తొడగొట్టినప్పుడు షర్మిల ఏం చేసింది? అన్నకు రాఖీ కట్టే ఒక చెల్లిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్షేమం కోరకుండా, చంద్రబాబు లాంటి విషసర్పాలకు పాలుపోస్తావా.. ఏం ఆశించి ఇదంతా చేస్తున్నావు? ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని హంతకుడు అని అంటావా? అలా అయితే 55 రోజుల పాటు జైల్లో ఉన్న చంద్రబాబు హంతకుడు కాదా? అసలు వివేకా ఎవరి ప్రభుత్వంలో మరణించారో నీకు తెలీదా?

మొరుసుపల్లి షర్మిలగా ప్రజల ముందుకెళ్లు

ఇక షర్మిల ప్రజల ముందుకు మొరుసుపల్లి షర్మిలగా వెళ్లి ఏమైనా ఆరోపణలు చేయి.. మాకెలాంటి అభ్యంతరంలేదు. వైఎస్సార్ బిడ్డ అంటూనే వైఎస్ కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తే మాలాంటి వీరాభిమానులు ఎక్కడికక్కడ నీ చర్యలను నిలదీస్తాం. కడప పార్లమెంట్ పరిధిలో ప్రతి గడపకు వెళ్లి నీ కుట్ర, కుతంత్రాలను వివరిస్తాం.

ఏ ముఖ్యమంత్రి కొడుకూ ఇలా పోరాడి సీఎం కాలేదు

దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన పరిపాలనలో ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారు. ప్రధానంగా మైనార్టీలకు దేశంలో ఎక్కడాలేని విధంగా 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఆయనదే. ఈ ఘనత వైఎస్సార్‌దే.. కాంగ్రెస్ పార్టీది కాదు. ఇక మహానేత మరణానంతరం కాంగ్రెస్ చర్యలతో కాంగ్రెస్‌లో ఇమడలేక వైఎస్సార్‌సీపీ పార్టీని స్థాపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో కష్టాలను అనుభవించారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి కొడుకూ ఇలా పోరాడి సీఎం కాలేదు. సీఎం కాగానే ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు పరుగులు పెడుతున్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంటి సీఎం ఉండడం ఆంధ్రప్రదేశ్ ప్రజల అదృష్టం.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

తణుకు అర్బన్/నరసాపురం రూరల్/గణపవరం/పెదవేగి/నందిగామ టౌన్/విజయనగరం: పశ్చిమ గోదావరి జిల్లా తణుకు 8వ వార్డులోని వెలమ సంఘ భవనం ప్రాంతంలో టీడీపీ, జనసేన నుంచి 60 కుటుంబాలు, కొండాలమ్మ తల్లి ఆలయం వద్ద 70 కుటుంబాలు మంత్రి కారుమూరి సమక్షంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. నరసాపురం మండలం చామకూరిపాలెంలో జనసేన, టీడీపీల నుంచి నేతలు, కార్యకర్తలు భారీగా ఎమ్మెల్యే ప్రసాదరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సమక్షంలో గణపవరం మండలం సరిపల్లెకి చెందిన 50 మంది జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. పెదవేగి మండలం కొండలరావుపాలెంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సమక్షంలో టీడీపీ వార్డు సభ్యులు, నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. లక్ష్మీపురం పంచాయతీ ఎంఆర్‌సీ కాలనీకి చెందిన వార్డు సభ్యులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలోని ఎమ్మెల్యే మొండితోక అరుణ్‌కుమార్ సమక్షంలో వీరులపాడు మండలం జుజ్జూరుకి చెందిన 20 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. విజయనగరం జిల్లా డెంకాడ మండల జనసేన పార్టీ అధ్యక్షురాలు పతివాడ కృష్ణవేణి, మరో 30 కుటుంబాలు ఆ పార్టీని వీడి ఎంపీ, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సమక్షంలో విజయనగరంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం ఎమ్మెల్యే, కొవ్వూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎస్.రాజీవ్‌కృష్ణ సమక్షంలో వాడపల్లికి చెందిన టీడీపీ, జనసేన పార్టీల నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు.



ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన పార్టీల నేతలు, కార్యకర్తలు



ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన సరిపల్లె జనసేన కార్యకర్తలు



విజయనగరంలో వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో చేరిన పతివాడ కృష్ణవేణి, తదితరులు



టీడీపీ వార్డు సభ్యులు, ఇతర నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొఠారు రామచంద్రరావు



ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు సమక్షంలో చామకూరిపాలెంలో చేరిన గ్రామస్తులు

జస్టిస్ రామలింగేశ్వర్‌రావుకు కన్నీటి వీడ్కోలు



భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న జస్టిస్ తుకారాంజీ, జస్టిస్ పుల్లా కార్తీక్

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎ.రామలింగేశ్వర్‌రావుకు పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు బుధవారం కన్నీటి వీడ్కోలు పలికారు. జర్మనీలో ఉంటున్న కూతురుని చూసేందుకు వెళ్లిన ఆయన గుండెపోటుతో అక్కడే గతవారం కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆయన భౌతికకాయం జర్మనీ నుంచి సత్వరం హైదరాబాద్‌కు తరలేందుకు ఏపీ ప్రభుత్వం చొరవ చూపింది. న్యాయమూర్తులు జస్టిస్ తుకారాంజీ, జస్టిస్ పుల్లా కార్తీక్, జస్టిస్ శ్రీనివాస్‌రావు, జస్టిస్ లక్ష్మీనారాయణ, మాజీ అడిషనల్ సొలిసిటర్ జనరల్ సూర్యకరణ్‌రెడ్డి, మాజీ ఏజీ బీఎస్.ప్రసాద్ హైదరాబాద్ రాయదుర్గంలోని ఆయన స్వగృహంలో పార్థివదేహానికి నివాళులర్పించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని అడవుల రక్షణ, చెంచుల హక్కుల కోసం రామలింగేశ్వర్‌రావు న్యాయవాదిగా వాదించిన కేసు దేశమంతటా 'సమత' కేసుగా ప్రసిద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్ దాఖలు చేసిన 'శక్తి'సంస్థ శివరామకృష్ణ మాట్లాడుతూ.. తాము ఇద్దరం కృష్ణార్జునుల్లా ఈ కేసులో పోరాటం చేశామని చెప్పారు. బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేయడానికి ఆయన కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ఉదయం 11 గంటల తర్వాత మహాప్రస్థానంలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఈద్గాలో టీడీపీ అభ్యర్థి దౌర్జన్యం

- మైక్ ఇవ్వలేదని ముస్లిం పెద్దలకు బెదిరింపులు
- అధికారంలోకి వస్తే మత పెద్దను మార్చేస్తామని హెచ్చరిక
- చిత్తూరులో ఘటన



చిత్తూరు ఈద్గాలో మతపెద్దలతో గొడవపడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు రూరల్: రంజాన్ పవిత్రతను దెబ్బతీస్తూ ఈద్గా మైదానంలో టీడీపీ నేతలు దౌర్జన్యానికి దిగిన ఘటన చిత్తూరు నగరంలోని గిరింపేట ఈద్గాలో గురువారం చోటుచేసుకుంది. ఈద్గాలో రంజాన్ చివరి ప్రార్థనకు ముందు ఈద్గా కమిటీ సభ్యులు ఏడాది కాలంలో ముస్లింలకు జరిగిన మేలును వివరించారు. వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి ముస్లింల కల్యాణ మండప నిర్మాణానికి విరాళమివ్వడమే కాకుండా మూడేళ్లుగా రంజాన్ తోఫా అందజేశారని గుర్తు చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి ముస్లింలు ఐక్యతతో పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని.. చిత్తూరు ప్రజలు చల్లగా ఉండేలా అల్లాను ప్రార్థించాలని కోరారు. దీనిని జీర్ణించుకోలేని టీడీపీ నేతలు ఈద్గాలో రచ్చ చేశారు. చిత్తూరు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్‌కు మైకు ఇవ్వాలని టీడీపీ మాజీ ఎమ్మెల్సీ దొరబాబు నాయుడు, ఆ పార్టీ నేతలు ప్రార్థన వేదిక వద్ద గందరగోళం సృష్టించారు. మైకు ఇవ్వాలంటూ మత పెద్ద, సభ్యులతో గొడవకు దిగారు. మైకు ఇవ్వకపోవడంతో తాము అధికారంలోకి వస్తే మత పెద్దను మార్చేస్తామని హెచ్చరించారు. టీడీపీ నాయకులు మతపెద్ద, సభ్యులపైకి దూసుకురావడంతో అక్కడున్న ముస్లింలంతా ఏకమయ్యారు. టీడీపీ నేతలపై తిరగబడి మైక్ ఇవ్వడం కుదరదని తేల్చిచెప్పారు. ప్రార్థన నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీతో జత కట్టిన టీడీపీకి ఇక్కడ స్థానం లేదని.. వెంటనే వెళ్లిపోవాలని పలువురు నినాదాలు చేశారు. దీంతో టీడీపీ అభ్యర్థి సహా అనుచరులు, నాయకులు ఈద్గా నుంచి వెనుదిరిగారు.

టీడీపీ అభ్యర్థిని అడ్డుకున్న ముస్లింలు

- రంజాన్ ప్రార్థనలకు రాజకీయ రంగు పులమొద్దన్న మతపెద్దలు
- మేడికొండూరు మండలం పేరేచర్లలో ఘటన




శ్రావణ్‌కుమార్‌ను అడ్డుకుంటున్న ముస్లింలు

మేడికొండూరు: గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పేరేచర్లలో తాడికొండ టీడీపీ అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్‌కు చుక్కెదురైంది. గురువారం రంజాన్ సందర్భంగా పేరేచర్లలోని ఈద్గా వద్ద ముస్లింలు నమాజ్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి శ్రావణ్‌కుమార్ రాగా.. దీనికి రాజకీయ రంగు పులమొద్దని ముస్లింలు స్పష్టం చేశారు. దీంతో టీడీపీ నాయకులకు, ముస్లింలకు మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తింది. విషయం తెలుసుకున్న మేడికొండూరు పోలీసులు అక్కడకు చేరుకుని వారందరిని చెదరగొట్టడంతో వివాదం సద్దుమణిగింది. ఇదిలావుండగా.. మొదటి నుంచీ టీడీపీలో పనిచేస్తున్న వారికి ప్రాధాన్యం ఇవ్వకుండా శ్రావణ్‌కుమార్ ఒక సామాజిక వర్గానికి చెందిన వారికి మాత్రమే పెద్దపీట వేస్తున్నట్టు ఆరోపిస్తున్నారు. దీంతో వ్యతిరేక వర్గీయులే శ్రావణ్‌కుమార్‌ని కావాలని అడ్డుకున్నట్టు టీడీపీ నేతలు చెబుతున్నారు.

చంద్రబాబు స్పందించిన తీరు సరికాదు

- 4 నెలల గర్భిణీని నెట్టేసి కొట్టారు.. ఆమెకు ఏమైనా జరిగితే పరిస్థితేంటి?
- ఆస్పత్రిలో ఉన్నవారిని సైతం బెదిరించడం ఎంతవరకు సబబు..
- దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం
- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి



ఒంగోలు/ ఒంగోలు సబర్బన్ : ఒంగోలులో ఏం జరిగిందో కూడా తెలుసుకోకుండా చంద్రబాబు స్పందించిన తీరు సరికాదని ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. తన నివాసంలో గురువారం సాక్షితో మాట్లాడారు. 'ఎన్నికల ప్రచారానికి వచ్చిన వారు కరపత్రం ఇస్తే తీసుకో.. తీసుకోకపో.. అది మీ ఇష్టం. కానీ, బూతులు మాట్లాడే సంస్కృతేంటి?' అని బాలినేని ప్రశ్నించారు. అక్కడ టీడీపీ నాయకులు వాడిన అసభ్య పదజాలం దారుణమన్నారు. గతంలో నగరంలోని కమ్మపాలెం వద్ద తనను కూడా టార్గెట్ చేశారని, అయినా మౌనం వహించానని, కానీ, నేడు తన కుటుంబాన్ని టార్గెట్ చేసినా మౌనం వహించమంటారా.. అంటూ ప్రశ్నించారు. కులాల మధ్య చిచ్చుపెడితే పోయేది పెట్టిన వాళ్లేనని, తనకు అన్ని కులాలతో సత్సంబంధాలున్నాయని చెప్పారు. కమ్మ సామాజికవర్గంవారు కూడా ఎంతోమంది తన వద్దకు వచ్చి పనులు చేయించుకువెళ్లారని, కానీ టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాత్రం అదే సామాజికవర్గానికి చెందిన వారి ఇళ్లు పడగొట్టించడం, కొట్టడం వంటి పనులు చేసిన విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. పవన్‌కళ్యాణ్ కూడా ఒంగోలు వ్యవహారంపై స్పందించాలని, వారి కుటుంబంపై ఇదే రకంగా దాడి జరిగితే మౌనం వహిస్తారా? అని బాలినేని ప్రశ్నించారు. తన కోడలు శ్రీకావ్య ఉత్సాహంగా క్యాంపెయిన్ చేస్తుండటాన్ని తట్టుకోలేక కుట్రపూరితంగా అసభ్య పదజాలంతో దూషిస్తూ వీడియోలు తీశారని, తమ వాళ్లు స్పందించిన వీడియోలు కూడా తీసి సామాజిక మాధ్యమాల ద్వారా.. తమ వాళ్లదే తప్పని సృష్టించాలనే యత్నం చేశారని.. ఇది ముమ్మాటికీ ప్రణాళికాబద్ధంగా జరిగిన కుట్రేనన్నారు. చివరకు హాస్పిటల్లో చికిత్స పొందుతున్న తమ పార్టీ కార్యకర్తలు ఉన్న బెడ్ల వద్దకు వెళ్లి.. బయటకు వస్తే చంపేస్తామంటూ బెదిరించడం ప్రజాస్వామిక చర్య అవుతుందా అని ప్రశ్నించారు. కొన్ని పత్రికలు కూడా ఇష్టం వచ్చినట్లు వార్తలు రాస్తున్నాయని, ఇదే ఘటన వాళ్ల కుటుంబ సభ్యులకు జరిగినా ఇదే విధంగా రాస్తారా అంటూ బాలినేని నిలదీశారు. నాలుగు నెలల గర్భిణిని కొట్టి నెట్టివేస్తే ఆమెకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారంటూ మండిపడ్డారు. జరిగిన ఘటనపై సాక్ష్యాధారాలతో సహా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఎస్పీ చర్యలు తీసుకోకుంటే.. ఇంటికొచ్చి కొడతామంటూ చేసిన హెచ్చరికలను కూడా ప్రజలు గమనించాలని, ఇలాంటి రౌడీయిజాన్ని సహించేదిలేదని బాలినేని స్పష్టం చేశారు.

బాలినేని ఎంత సౌమ్యుడో అందరికీ తెలుసు : ఎమ్మెల్యే కరణం


ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఎలాంటి వాడో, ఎంత సౌమ్యుడో ఒంగోలు ప్రజానీకం మొత్తానికి తెలుసని, దానికి ఎవరూ ఎలాంటి సర్టిఫికెట్ ఇవ్వాల్సిన అవసరం లేదని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. బుధవారం రాత్రి ఓట్లు అభ్యర్థించేందుకు వెళ్లిన బాలినేని కోడలు శ్రీకావ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల పట్ల ఒంగోలు సమతానగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో మహిళ స్పందించిన తీరు దురదృష్టకరమన్నారు. ప్రజాస్వామ్యంలో ఓట్లు అభ్యర్థిస్తారని, ఇష్టం అయితే ఓటు వేయి.. లేకుండా వెయ్యకు, అంతే తప్ప అసభ్య పదజాలంతో దూషించడం సరికాదన్నారు. కులాలను రెచ్చగొట్టడం ద్వారా ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తే అది ప్రోత్సహించిన పార్టీకే మైనస్ అవుతుందని హెచ్చరించారు. చంద్రబాబు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడే విధానం ఎప్పుడో పోయిందన్నారు. రిమ్స్‌లో గాయపడి ఆస్పత్రిలో ఉన్నవారిని పరామర్శించేందుకు వెళ్తే.. అక్కడ కూడా బాలినేని పట్ల దామచర్ల జనార్దన్ వ్యవహరించిన తీరు బాగాలేదని, ఉడత ఊపులకు చింతకాయలు రాలవని హెచ్చరించారు. పక్కా ప్లాన్ ప్రకారమే వివాదం సృష్టించినట్లు స్పష్టమవుతుందన్నారు. 2019లో కమ్మపాలెం వద్ద, ఇప్పుడు సమతానగర్ వద్ద జరిగిన ఘటనలు ప్రజాస్వామ్య విధానాలకు వ్యతిరేకమని.. ఎవరైనా స్వేచ్ఛగా ఓట్లు అభ్యర్థించేందుకు అవకాశం ఉంటుందని కరణం బలరాం స్పష్టం చేశారు.

రెండు పార్టీల నేతలపై మూడు కేసులు నమోదు

సమతానగర్‌లో బుధవారం టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు సంబంధించిన ఘర్షణలో ఒంగోలు తాలూకా పోలీసులు రెండు పార్టీల వర్గీయులపై విడివిడిగా కేసులు నమోదు చేశారు. సోనియాగాంధీనగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు కుమ్మరిగుంట సుజనప్రియ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 36 మంది టీడీపీ నేతలు, కార్యకర్తలపై, టీడీపీ నాయకురాలు చప్పిడి ప్రభావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మొత్తం 31 మందిపై కేసులు నమోదు చేశారు. సమతానగర్‌లో జరిగిన ఘర్షణలో గాయాలపాలైన వారిని ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. దీంతో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తోపాటు రెండు పార్టీల నేతలపై జీజీహెచ్ సూపరింటెండెంట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదయ్యాయి.

ప్రభుత్వ సంస్కరణలతోనే పదోన్నతులు

- ఏపీ ఉద్యోగులపై ప్రతిపక్ష కూటమి ఆరోపణలు సరికాదు
- తెలంగాణ ప్రభుత్వ సలహాదారు జయపాల్‌రెడ్డి



కర్నూలు (అర్బన్): ఏపీ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల వల్లే పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్య, వైద్య తదితర శాఖల్లోని ఉద్యోగులకు పదోన్నతులు లభించాయని తెలంగాణ ప్రభుత్వ పీఆర్ అండ్ ఆర్‌డీ సలహాదారు, జెడ్పీ రిటైర్డు సీఈవో జి.జయపాల్‌రెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని ఉద్యోగులు మరువకూడదన్నారు. ఈ మేరకు ఆయన కర్నూలులో గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఏపీలోని 13 జిల్లాలను 26 జిల్లాలుగా మార్చడంతో రెవెన్యూలో అదనంగా 13 కలెక్టర్, 13 జేసీ, 13 డీఆర్‌వో పోస్టులు మంజూరయ్యాయి. కొత్తగా 39 రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయడం వల్ల 39 ఆర్‌డీఓ పోస్టులూ మంజూరయ్యాయి. ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల రెవెన్యూ శాఖలో అనేక మంది ఉద్యోగులకు పదోన్నతులు లభించాయి. పంచాయతీరాజ్ శాఖలో ఏళ్ల తరబడి పోరాటాలు చేసినా ఏ ప్రభుత్వం ఒక్క డివిజన్ స్థాయి అధికారి పోస్టు మంజూరు చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 77 డీఎల్‌డీవో పోస్టులు మంజూరు చేసింది. ఎంపీడీవోలకు పదోన్నతులు కల్పించి వారి చిరకాల కోర్కెను కూడా ప్రభుత్వం తీర్చింది. కొత్తగా 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడం వల్ల ప్రస్తుతం ఉన్న వైద్యులకు పదోన్నతులతోపాటు అనేక మందికి కొత్తగా ఉద్యోగాలు లభించనున్నాయి. ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీల కూటమి అధికారులు, ఉద్యోగులపై నిరాధారమైన ఆరోపణలు చేస్తోంది. చిన్న విషయాలను కూడా భూతద్దంలో చూపిస్తూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం పరిపాటిగా మారింది. ప్రభుత్వ ప్రధాన అధికారి, ఐజీ స్థాయి అధికారుల నుంచి కిందిస్థాయి ఉద్యోగులపై ఆరోపణలు చేయడం, వారి విధుల్లో జోక్యం చేసుకోవడం సమంజసం కాదు' అని జయపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

డిజిటల్ జెండర్ గ్యాప్‌ను కోడింగ్ చేసింది!



● కోడింగ్‌లో శిక్షణ పొందుతున్న అమ్మాయిలు

స్త్రీలు సాంకేతికంగా కూడా సాధికారిత సాధించాలనే లక్ష్యంతో వారికి ఉచితంగా కోడింగ్ పాఠాలు నేర్పుతోంది ఢిల్లీవాసి 23 ఏళ్ల జప్నీత్ అహూజా. కోడింగ్ తెలిసిన వారికి ఉద్యోగావకాశాలు అధికంగా లభిస్తాయి. ఈ రకంగా దేశంలో ఆర్థికంగా వెనుకబడిన అమ్మాయిలకు ఆశాజ్యోతిగా మారింది జప్నీత్. ఇప్పటి వరకు 2 వేల మంది అమ్మాయిలకు ఉచితంగా డిజిటల్ పాఠాలు నేర్పింది. వంద మంది వాలంటీర్ల బృందానికి నాయకత్వం వహిస్తోంది.

ఢిల్లీకి చెందిన జప్నీత్ అహూజాకు కోడింగ్ అంటే చాలా ఆసక్తి. దాంతో కోడింగ్ నేర్చుకోవడం మీదనే దృష్టిపెట్టింది. అదే సమయంలో ఆమె ఒక విషయాన్ని గుర్తించింది. అదేమంటే, కోడింగ్ రంగంలో స్త్రీలు చాలా తక్కువగా ఉన్నారనీ, ఆ ఉన్న వారిలో కూడా చాలామందికి దానిపై తగినంత పరిజ్ఞానం లేదనీ. మిగిలిన వారితో పోల్చితే కోడింగ్ తెలిసిన వాళ్లకి ఉద్యోగావకాశాలు కాసింత ఎక్కువగానే దొరుకుతాయి. అయితే ఆ రంగంలో పురుషులదే పై చేయి. దాంతో సాంకేతికపరంగా ఏమైనా ఉద్యోగాలు ఉంటే కోడింగ్‌లో వారే ముందుకు దూసుకుపోవడం వల్ల ఆ ఉద్యోగాలు కూడా వారే ఎక్కువగా దక్కించుకోగలుగుతున్నారు.

ఇప్పటిదాకా స్త్రీలు ఎన్నో రంగాలలో పట్టుదలతో కృషి చేసి, పై చేయి సాధించగలుగుతున్నప్పుడు కోడింగ్‌లో మాత్రం పట్టు ఎందుకు సాధించకూడదు... అని ఆలోచించింది.

అంతే... ముందు తాను ఆ రంగంలో బాగా కృషి చేసింది. పట్టుదలతో కోడింగ్ నేర్చుకుంది... ఆ రకంగా అందులో చకచకా పై మెట్టుకు చేరిపోగలిగింది. తన లాగే మరికొందరు ఆడపిల్లలకు కూడా కోడింగ్ నేర్పితేనో... అనుకుంది. అలా అనుకోవడం ఆలస్యం... ఇతర అమ్మాయిలను కొందరిని పోగు చేసి తనకు తెలిసిన దానిని వారికి ఉచితంగా పాఠాలు నేర్పడం ఆరంభించింది. అలా తన 16వ ఏట ఆమె 'గో గర్ల్' అనే సంస్థను స్థాపించింది. అయితే భాష సమస్య రాకుండా వారికి వచ్చిన స్థానిక భాషలోనే ఉచితంగా కోడింగ్‌ను నేర్పడం ఆమె ప్రత్యేకత. తోటి ఆడపిల్లలను సాంకేతికంగా ఎదిగేలా చేయడం కోసం ఎంచుకున్న లక్ష్యం, అందుకు ఆమె చేసిన కృషీ వృథా పోలేదు. చాలా మంది అమ్మాయిలు ఆమె దగ్గర కోడింగ్ నేర్చుకుని మంచి ఉద్యోగావకాశాలను సాధించుకోగలిగారు. అలా తనకు లభించిన ప్రోత్సాహ ఉత్సాహంతో తన వయసు ఆడపిల్లలకే కాదు, తల్లి వయసు స్త్రీలకు కూడా కోడింగ్ నేర్పడం మొదలు పెట్టింది. అలా తనకు 23 ఏళ్లు వచ్చేసరికి చిన్న, పెద్ద కలిసి దాదాపు రెండు వేల మందికి పైగా ఆమె వద్ద కోడింగ్ నేర్చుకుని సాంకేతికంగా అభివృద్ధి చెంది, తమ కాళ్ల మీద తాము నిలబడగలిగారు. అన్నింటికన్నా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... ఆరవ తరగతి చదివేటప్పుడే కోడింగ్ రంగంలో సాధించిన ప్రావీణ్యం బాల మేధావిగా ఆమెకు గుర్తింపు తెచ్చిపెట్టింది.

ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ "చిన్నప్పుడు స్కూల్ నుంచి రాగానే అమ్మానాన్న ఆఫీసులనుంచి ఇంటికి వచ్చేలోగా వారికోసం ఎదురు చూస్తూ రకరకాల వెబ్‌సైట్లకు రూపకల్పన చేసేదానిని. అప్పుడు నాన్న నాతో.. 'ఈ పిచ్చి పిచ్చి వెబ్‌సైట్లు కాదు బేబీ... నువ్వు నాసా సైంటిస్ట్‌గా ఎదగాలి. తలచుకుంటే నీకదేమీ ఒక లెక్కలోనిది కాదు' అని చెప్పిన మాట నన్ను ఎంతో ప్రభావితం చేసింది. అలా ఎయిత్ క్లాస్‌కు వచ్చేసరికి పెద్దయ్యాక నేను చేయవలసింది ఉద్యోగం కాదని... సాంకేతికంగా అభివృద్ధి చెందడం, దానిద్వారా నేను నేర్చుకున్న పాఠాలను పదిమందికీ చెప్పడంలోనే ఎంతో థ్రిల్ ఉందనీ అర్థమైంది. నా దగ్గర కోడింగ్ పాఠాలు నేర్చుకున్న వారే తమంతట తాము స్వచ్ఛందంగా ఇతరులకు నేర్పించడం మొదలు పెట్టారు. ఆ విధంగా 'కోడింగ్ ఫర్ ఉమెన్ బై ఉమెన్' కాన్సెప్ట్ మాకు బాగా ఉపకరించింది. అంతే కాదు, డిజిటల్ జెండర్ గ్యాప్ అనే వివక్షను పూడ్చాలన్న నా స్వప్నం సాకారం అయ్యేందుకు ఉపకరించింది. ఏమైనా పిల్లలు గ్యాడ్జెట్స్‌తో ఆడుకుంటున్నప్పుడు వాళ్లు వాటితో ఏం చేస్తున్నారో... తల్లిదండ్రులు ఓ కంట కనిపెట్టాలి. దానిని వారు మంచికే ఉపయోగిస్తున్నారు అని గుర్తించగలిగితే ఆ దిశగా వారిని ప్రోత్సహించడం మంచిది. నా తల్లిదండ్రులు కోడింగ్‌పై నాకున్న ప్యాషన్‌ను గుర్తించకుండా ఏవో పిచ్చి ఆటలు ఆడుతున్నాను అనుకుని దానికి అడ్డుకట్ట వేసి ఉంటే నేను ఈ స్థాయికి ఎదిగి ఉండేదానిని కాను" అని ఆమె చెప్పిన మాటలు ఆలోచించదగ్గవి.

బ్యూటిప్స్: మృదువుగా.. ముడతలు లేకుండా..!

ముఖ చర్మం మృదువుగా ముడతలు లేకుండా ఉండాలంటే చర్మాన్ని తేమగా ఉండేలా చూసుకోవడం అవసరం. ఇందుకు బీట్‌రూట్ దుంప బాగా ఉపయోగపడుతుంది. బీట్‌రూట్‌ను చెక్కు తీసి సన్నగా తురుముకుని రసం తీసుకోవాలి. ఈ రసంలో కొద్దిగా తేనె కలిపి ముఖానికి ప్యాక్‌లా వేసుకోవాలి. ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో కడిగేసుకోవాలి.

అలాగే కొన్ని గులాబీ ఆకులను తీసుకుని వాటికి తగినన్ని నీటిని చేర్చి మెత్తగా రుబ్బుకుని ముఖానికి రాసుకోవాలి. ఆరిన తర్వాత కడిగేసుకుంటే ముఖం తేమగా ఉంటుంది. ఇది ముఖానికి గులాబీ రంగుని ఇస్తుంది. ఇవి అందుబాటులో లేకపోయినా లేదా తగిన సమయం లేకున్నా, ముఖంపై రోజ్‌వాటర్‌ను చల్లుకున్నా ఇది చర్మాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. ముఖంపై, బుగ్గల పైన తేనె రాసుకుని ఆరాక శుభ్రం చేసుకున్నా ముఖం స్మూత్‌గా.. మెరుస్తూ కనిపిస్తుంది.













నెయిల్ క్లాసికల్ జ్యూవెలరీ

నెయిల్ ఆర్ట్ గురించి మనకు తెలిసిందే. ఎన్నో డిజైన్లు మన చూపు తిప్పుకోనివ్వవు. ఆర్టిఫిషియల్ నెయిల్స్‌ని అతికించి మరీ చూడచక్కని డిజైన్లతో చేసే ఆ అలంకారం వేలి కొసలలో మెరుపులుగా కనువిందు చేస్తుంది.
ఇప్పుడు వాటి స్థానాన్ని నెయిల్ జువెలరీ ఆక్రమిస్తోంది. ఫింగర్ క్లా రింగ్స్‌గా ఈ నెయిల్ జ్యువెలరీ ఆధునికమైన టచ్‌తో అందంగా రూపుకడుతుంది. ప్రాచీనకాలంలో రక్షణలో భాగంగా చేరిన ఈ ఆభరణం ఇప్పుడు సొగసైన అలంకార జాబితాలో చేరి ప్రత్యేకతను చాటుతోంది.

బంగారు, వెండి, ఇతర లోహాలలోనూ ఈ నెయిల్ జ్యువెలరీ అందుబాటులో ఉంది. సంప్రదాయం, ఆధునికం ఏ వేడుకకైనా కొత్తగా వెలిగిపోవాలని కోరుకునే వారికి ఈ నెయిల్ రింగ్స్ సరైన ఎంపిక అవుతాయి.

లోహపు డిజైన్లలో ముత్యాలు, రత్నాలు, ఎనామిల్.. వంటివి జతచేసిన డిజైన్ల ఎంపిక మనదైన ప్రత్యేకతను చాటుతుంటుంది. లోహాన్ని బట్టి, డిజైన్‌ను బట్టి ధరలు వందల రూపాయల నుంచి అందుబాటులో ఉన్నాయి.

చరిత్రలో నెయిల్ జువెలరీ



ప్రాచీన చైనా, ఈజిప్ట్ రాజులు, రాణుల ఈ నెయిల్ క్లా జ్యువెలరీ విరివిగా ధరించే వారు. పొడవాటి గోర్లు సంపదకు చిహ్నంగా భావించేవారు. వాటి వల్ల శారీర శ్రమ చేయవలసి అవసరం లేదు. అలా శ్రమ చేయాల్సిన అవసరం లేని వారు, స్థితిమంతులుగా జాబితాలో ఉండేవారు. అంతేకాదు, నెయిల్ గార్డ్‌గా పిలిచే ఈ ఆభరణాన్ని ధరించడం ప్రాచీన చైనీస్ మహిళలు శక్తికి, అందానికి చిహ్నంగా భావించేవారు. నెయిల్ క్లా లేదా గార్డుల తయారీలో సాధారణంగా లోహాలు లేదా సముద్ర తీరాల్లో లభించే ఆల్చిప్పల పెంకులను కూడా ఉపయోగించేవారు. అయితే, ఎక్కువగా బంగారం, వెండి, కాంస్య లేదా పోత పోసిన లోహంతో తయారు చేస్తారు. ముత్యాలు, విలువైన రాళ్లను వాటిలో పొదుగుతారు. వేలిగోళ్ల గార్డు ధరించిన వారి సామాజిక స్థితిని తెలియజేసేది. 3సెం.మీ నుండి దాదాపు 15 సెంటీ మీటర్ల వరకు ఉండేలా డిజైన్ చేయించేవారు. కొన్నిసార్లు చిటికెన వేలు, ఉంగరపు వేలికి సరిపోయేలా డిజైన్ చేయించుకునేవారు. కుడి చేతి, ఎడమ చేతి డిజైన్లు భిన్నంగా ఉండేవి. తమ దేశ సంప్రదాయ ఆభరణాలలో భాగంగా ఉన్నా, రక్షణ కోసం ఉపయోగించేవిగా పేరొందాయి. వారి వారి దేశాల్లోని నాణేలు, జంతువులు, పక్షులు, మొక్కల బొమ్మలను నెయిల్ గార్డ్స్‌పైన డిజైన్ చేయించేవారు.

మహారాణి కళ







జువెలరీ డిజైన్ సృష్టి, ఎంపిక అనేవి మన భావ వ్యక్తీకరణ పట్ల నుండి పుట్టుకు వచ్చిన ఆలోచన. నా డిజైన్స్ ఎక్కువగా బంజారా సంస్కృతికి అద్దం పడతాయి. ఎన్నో ఏళ్లుగా చూసిన వివిధ జాతుల సంస్కృతి, కళలు నా డిజైన్స్‌లో కనిపిస్తాయి. క్లియోపాత్రా నుంచి ప్రేరణ పొందిన నెయిల్ రింగ్స్ అలంకరణ మహారాణి కళను తీసుకువస్తుంది.



– భవ్య రమేష్, జ్యువెలరీ డిజైనర్



చలువ పొట్లం

వంటిల్లు

పొట్లకాయ... స్నేక్‌గార్డ్. చూడడానికి పాములా భయపెడుతుంది. కానీ... ధైర్యంగా నమిలి మింగేస్తే సరి. పొట్టలోకి వెళ్లి చల్లగా కాపాడుతుంది. సమ్మర్ గార్డ్ ఫ్యామిలీలో ఇదీ ఒకటి. పొట్టను కాపాడే కాయ... పొట్లకాయ. వేడి నుంచి రక్షించే... కూరగాయ.

పొట్లకాయ పెసరపప్పు



కావలసినవి: పొట్లకాయ ముక్కలు– 2 కప్పులు; పెసరపప్పు – అర కప్పు ; కొబ్బరి తురుము – అర కప్పు ; ఆవాలు – టీ స్పూన్ ; మినప్పప్పు – 2 టీ స్పూన్‌లు ; ఎండుమిర్చి – 2 ; కరివేపాకు – 2 రెమ్మలు ; ఇంగువ– పావు టీ స్పూన్ ; నూనె లేదా నెయ్యి – టేబుల్ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; చక్కెర – టీ స్పూన్.

తయారీ: ● బంగాళాదుంపను శుభ్రం చేసి నిలువుగా కోసి గింజలను తొలగించిన తర్వాత ముక్కలు చేయాలి. పెసరపప్పు కడిగి పక్కన పెట్టాలి ● పాత్రలో రెండు కప్పుల నీటిని పోసి మరిగేటప్పుడు పొట్లకాయ ముక్కలు, పెసరపప్పు వేసి ఉడికించాలి. పప్పు ఒక మోస్తరుగా ఉడికిన తర్వాత ఉప్పు కలిపి పొట్లకాయ ముక్కలు మెత్తబడే వరకు ఉడికించాలి. ముక్కలు ఉడకడానికి నీరు సరిపోకపోతే మరికొంత నీటిని చిలకరించి ఉడికించాలి ● బాణలిలో నెయ్యి వేడి చేసి ఆవాలు వేయాలి. అవి వేగిన తర్వాత మినప్పప్పు, ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువ వేయాలి. మినప్పప్పు వేగిన తర్వాత చక్కెర, ఉడికించి సిద్ధంగా ఉంచిన పొట్లకాయ– పెసరపప్పును వేసి కలపాలి. తేమ ఆవిరి అయ్యే వరకు కలియబెడుతూ వేయించి చివరగా కొబ్బరి తురుము వేసి కలపాలి. కొబ్బరి రుచి కూరగాయ ముక్కలకు పట్టడం కోసం ఓ నిమిషం పాటు గరిటెతో కలియబెడుతూ వేయించి స్టవ్ ఆపేయాలి. వేడి తగ్గే కొద్దీ కూర రుచి ఇనుమడిస్తుంది. ఇది సాంబార్, రసం అన్నంలోకి సైడ్ డిష్‌గా రుచిగా ఉంటుంది.

పొట్లకాయ పొరిచ్చ కొళంబు



కావలసినవి: కందిపప్పు – అరకప్పు; పొట్లకాయ ముక్కలు – 3 కప్పులు ; సాంబారు పొడి – టీ స్పూన్ ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; నిమ్మకాయ రసం – ఒక టేబుల్ స్పూన్.
పొడి కోసం: ధనియాలు – 2 టీ స్పూన్‌లు; పచ్చి శనగపప్పు – 2 టీ స్పూన్‌లు ; ఎండుమిర్చి – 2; మినపప్పు– టీ స్పూన్ ; ఎండు కొబ్బరి తురుము – పావు కప్పు ; ఇంగువ – చిటికెడు ; నూనె – టీ స్పూన్. **పోపు కోసం:** నూనె – టీ స్పూన్ ;ఆవాలు – టీ స్పూన్ ; మినప్పప్పు – టీ స్పూన్ ; కరివేపాకు– 2 రెమ్మలు. **తయారీ:** ● కందిపప్పును శుభ్రంగా కడిగి ప్రెషర్ కుకర్‌లో వేసి తగినంత నీటిని పోసి ఉడికించి పక్కన ఉంచాలి ● పొడి కోసం తీసుకున్న దినుసులను వేయించి పొడి చేసి పెట్టుకోవాలి ● పొట్లకాయను శుభ్రంగా కడిగి తరిగి గింజలు తొలగించి ముక్కలను సిద్ధం చేసుకోవాలి ● ఒక పాత్రలో ఉప్పు, సాంబారు, పొట్లకాయ ముక్కలు వేయాలి. ముక్కలు మునిగేటట్లు నీటిని పోసి మెత్తగా ఉడికించాలి ● ఉడికిన కందిపప్పు చల్లారిన తర్వాత మెత్తగా గ్రైండ్ చేయాలి. ఇందులో ఉడికించిన పొట్లకాయ ముక్కలను, మసాలా పొడి వేసి నీరు పోసి కలిపి ఉడికించాలి. పప్పు, కూరగాయ ముక్కలు, మసాలా పొడి అన్నింటి రుచి కలిసే వరకు ఉడికించి, నిమ్మరసం కలిపి దించేయాలి. రుచి చూసి అవసరమైతే ఉప్పు, నిమ్మరసం మరికొంత చేర్చుకోవచ్చు ● పోపు కోసం మందపాటి పాత్ర తీసుకోవాలి. పాత్రలో నూనె వేడి చేసి ఆవాలు వేసి చిటపటలాడిన తర్వాత మినప్పప్పు వేయించి కరివేపాకు వేసి ముందుగా ఉడికించి సిద్ధంగా ఉంచిన కందిపప్పు కూరగాయ ముక్కల మిశ్రమాన్ని పోసి కలిపి దించేయాలి. ఘుమఘుమలాడే పొట్లకాయ పొరిచ్చ కొళంబు రెడీ. ఇది అన్నంలోకి బాగుంటుంది.

పొట్లకాయ పచ్చడి



కావలసినవి: పొట్లకాయ ముక్కలు – కప్పు; ఎండుమిర్చి –3 ; మినప్పప్పు – టేబుల్ స్పూన్ ; పచ్చి శనగపప్పు – టేబుల్ స్పూన్ ; వేరు శనగపప్పు లేదా నువ్వులు లేదా కొబ్బరి తురుము – పావు కప్పు ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; నెయ్యి లేదా నూనె – టేబుల్ స్పూన్; చింతపండు– అంగుళం ముక్క ; బెల్లం పొడి– టీ స్పూన్ (ఇష్టమైతేనే).
పోపు కోసం: నూనె– టేబుల్ స్పూన్ ; ఆవాలు– టీ స్పూన్; మినప్పప్పు – టీ స్పూన్ ; ఎండుమిర్చి– ఒకటి; ఇంగువ– చిటికెడు ; కరివేపాకు– 2 రెమ్మలు.
తయారీ: ● మందపాటి బాణలిలో నెయ్యి లేదా నూనె వేడి చేసి మినప్పప్పు, పచ్చి శనగపప్పు, నువ్వులు, ఎండుమిర్చిని దోరగా వేయించి మరొక ప్లేట్‌లోకి తీసుకుని పక్కన పెట్టాలి. అదే బాణలిలో పొట్లకాయ ముక్కలను వేసి పచ్చిదనం తగ్గేవరకు వేడి చేసి ఆపేయాలి ● చల్లారిన తరవాత మిక్సీలో గ్రైండ్ చేయాలి, అందులోనే చింతపండు, బెల్లం, ఉప్పు కలిపి మరో రౌండ్ తిప్పాలి. ఇప్పుడు పొట్లకాయ ముక్కలు కూడా వేసి గ్రైండ్ చేసి మరొక పాత్రలోకి తీసుకోవాలి ●ఇప్పుడు బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు వేసి వేగిన తర్వాత మినప్పప్పు, ఎండుమిర్చి, ఇంగువ, కరివేపాకు వేసి దోరగా వేయించి పచ్చడిలో వేసి కలపాలి. ఇది అన్నంలోకి ఇడ్లీ, దోసెల్లోకి కూడా రుచిగా ఉంటుంది.

పొట్లకాయ వేపుడుకూర



కావలసినవి: పొట్లకాయ ముక్కలు – పావుకేజీ ; ధనియాల పొడి– టీ స్పూన్ ; జీలకర్ర– టీ స్పూన్ ; పసుపు– పావు టీ స్పూన్ ; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; ఇంగువ– చిటికెడు ; కారం – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; నెయ్యి– టేబుల్ స్పూన్ ; నీరు– పావు కప్పు ; వేరుశనగ పప్పుల పొడి లేదా శనగపిండి– టేబుల్ స్పూన్.
తయారీ: ● బాణలిలో నెయ్యి వేడి చేసి జీలకర్ర వేసి చిటపటలాడిన తర్వాత ధనియాలపొడి, కారం పొడి, పసుపు, ఇంగువ వేసి కలపాలి. పచ్చిదనం పోయిన తర్వాత ఇందులో ఉప్పు వేసి, కొద్దిగా నీటిని పోసి కలపాలి. మసాలా పొడులన్నీ సమంగా కలుస్తాయి. ఇప్పుడు స్టవ్ ఆపేసి బాణలిలో పొట్లకాయ ముక్కలు వేసి మసాలా సమంగా పట్టేటట్లు కలపాలి. ముక్కలకు మసాలా సమంగా పట్టిన తర్వాత స్టవ్ వెలిగించి ముక్కల్లో నీటిని పోసి కలిపి మంట తగ్గించి మూత పెట్టాలి. రెండు నిమిషాలకోసారి మూత తీసి గరిటెతో ముక్కలను కలిపి మళ్లీ మూత పెడుతుండాలి. పది నిమిషాలకు ముక్కలు మెత్తగా మగ్గిపోతాయి. ముక్కలు ఉడకలేదనిపిస్తే కొద్దిగా నీటిని చిలకరించి మళ్లీ మూత పెట్టి ఉడికించాలి. చివరగా వేరుశనగపప్పు పొడి లేదా శనగపిండి చల్లి బాగా కలిపి దించేయాలి. ఇది అన్నంలోకి, చపాతీల్లోకి రుచిగా ఉంటుంది.

యువర్స్

● గేమింగ్

సోల్ ఎనర్జీ



సర్జెంట్ స్టూడియోస్ వారి 'టేల్స్ ఆఫ్ కెన్‌జెర' ఈ నెల 23న విడుదల కాబోతోంది. ఈ గేమ్‌లో ప్రధాన పాత్ర జావ్. డబుల్ జంప్, వాల్ జంప్, గాల్లో గంతులు వేయడంలో దిట్ట. మూడు ఆత్మలను బంధించి మృత్యుదేవత కలుంగకు అర్పిస్తుంది. సన్ మాస్క్, మూన్ మాస్క్ అనేవి జావ్ ప్రధాన ఆయుధాలు. శత్రువుల ఆటకట్టించడంలో ఈ రెండు ఆయుధాలకు తమదైన ప్రత్యేకత ఉంది. శత్రువులను జయించినప్పుడు వారి నుంచి 'ఉలోగి' అనే సోల్ ఎనర్జీని కలెక్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. 'టేల్స్ ఆఫ్ కెన్‌జెర' అనేది 2.5డీ ప్లాట్‌ఫామ్ అడ్వెంచర్ గేమ్. ప్లేయర్స్ క్రమంగా కొత్త కొత్త స్కిల్స్‌ను సొంతం చేసుకుంటారు.

ప్లాట్‌ఫామ్స్: మైక్రోసాఫ్ట్ విండోస్, నిన్‌టెండో స్విచ్, ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్
మోడ్: సింగిల్ ప్లేయర్

● టెక్.. టాక్

షావోమి వాచ్ 2



డిస్‌ప్లే: 1.43 అంగుళాలు
రిజల్యూషన్: 466×466 పిక్సెల్స్ ● లైట్ వెయిట్ ● 150 స్పోర్ట్స్ మోడ్స్
● బ్యాటరీ: 495 ఎంఏహెచ్ ● స్లీప్ ట్రాకింగ్

పోకో ఎక్స్ 6 నియో 5జీ



డిస్‌ప్లే: 6.67 అంగుళాలు ఓఎస్: ఆండ్రాయిడ్ 13
ర్యామ్: 8జీబి, 12జీబి స్టోరేజ్: 128జీబి, 256జీబి
బ్యాటరీ: 5000 ఎంఏహెచ్
బరువు: 175.00 గ్రా.

● ఇంగ్లీష్ ఇడియమ్స్



మోర్ దేన్ మీట్స్ ది ఐ

'అనుకున్నంత సులభం కాదు' అనుకున్నప్పుడు, ఊహించిన దానికి పూర్తి భిన్నంగా ఉండడం...మొదలైన సందర్భాలలో వాడే మాట... మోర్ దేన్ మీట్స్ ది ఐ.
ఉదా: ఐ హ్యాడ్ డన్ సమ్ రిసెర్చ్. బట్ దేర్ ఈజ్ మోర్ టు ది సబ్జెక్ట్ దెన్ మీట్స్ ది ఐ

టర్న్ ది క్లాక్ బ్యాక్

పూర్వస్థితికి తీసుకురావడం, గతంలోకి వెళ్లడం, వోల్డ్-ఫ్యాషన్ ఐడియాలు...మొదలైన సందర్భాలలో వాడే మాట...టర్న్ ది క్లాక్ బ్యాక్.
ఉదా: ది కోర్ట్స్ డెసిషన్ ఇన్ దిస్ కేస్ విల్ టర్న్ ది క్లాక్ బ్యాక్

● సక్సెస్ స్టోరీ



దిప్రజ్ జాదవ్

దిగ్విజయ దిప్రజ్

'అనుకోలేదని ఆగవు కొన్ని' అంటాడు కవి.
డిజిటల్ కంటెంట్ క్రియేటర్ కావాలని దిప్రజ్ జాదవ్ ఎప్పుడూ అనుకోలేదు. డిజిటల్ కంటెంట్ క్రియేషన్ అంటే ఏమిటో కూడా తెలియదు. సరదాగా చేసిన ఒక వీడియో అతడి స్థాయిని ఎక్కడికో తీసుకెళ్లింది. ప్రముఖ డిజిటల్ కంటెంట్ క్రియేటర్‌గా డిజిటల్ ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చింది...

ఒక వైరల్ వీడియోతో మహారాష్ట్రలోని షిర్పూర్ అనే చిన్న పట్టణానికి చెందిన దిప్రజ్ జాదవ్ జీవితం ఊహించని మలుపు తిరిగింది. మరాఠీ సినిమా 'లై బారి'లోని ఒక డైలాగ్ మీమ్ మాషప్ చేశాడు జాదవ్. బాలీవుడ్ హీరో రితేష్ దేశ్‌ముఖ్ దృష్టిని కూడా ఆ వీడియో ఆకట్టుకుంది. వైరల్ అయింది.

'ఫేస్‌బుక్‌లో నేను పేజీ స్టార్ట్ చేసినప్పుడు కంటెంట్ క్రియేషన్ అనేది పెద్ద విషయం కాదు. దానికి అంత ప్రాముఖ్యత కూడా లేదు. అలాంటి సమయంలోనే కొత్త కొత్త వీడియోలు చేసేవాడిని' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంటాడు దిప్రజ్ జాదవ్.

జాదవ్‌కు సినిమాలు అంటే చాలా ఇష్టం. అందులోని పాపులర్ సీన్‌లకు తనదైన స్టైల్ జోడించి అనుకరించే వాడు. పుణెలో యానిమేషన్ కోర్సు చేస్తున్నప్పుడు వీడియో ఎడిటింగ్‌పై ఇష్టం పెరిగింది.

విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను పర్‌ఫెక్ట్‌గా మిక్స్ చేయడంలో గట్టి పట్టు సంపాదించాడు. ఆ విద్య అతడికి ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో ఎంతోమంది ఫాలోవర్స్‌ను తెచ్చిపెట్టింది.

సెకండ్ టర్నింగ్ పాయింట్ విషయానికి వస్తే,.,..

రామానంద్‌సాగర్ 'రామాయణం'లోని రాముడు, రావణుడికి మధ్య జరిగిన యుద్ధానికి సంబంధించిన వీడియోకు ర్యాపర్ డివైన్ పాడిన 'సీన్ క్యా హై' పాటను జోడించాడు. ఇది చూసి మ్యూజిక్ ప్రొడ్యూసర్ న్యూక్లియ(ఉద్యాన్ సాగర్) జాదవ్‌ను సంప్రదించి సబ్ సినిమా సిరీస్‌లో భాగంగా ఇలాంటి ఫిల్మీ మాషప్స్ మరిన్ని కావాలని, వాటిని మ్యూజిక్ ప్రోగ్రాంలలో ఉపయోగించుకుంటానని చెప్పాడు.

జాదవ్ క్రియేటివిటీకి న్యూక్లియ బాగా ఇంప్రెస్ అయ్యాడు. 'ఊహకు అందనిది ఆలోచించే సామర్థ్యమే అరుదైన సృజనాత్మకత. ఇలాంటి అరుదైన సృజనకారులలో జాదవ్ ఒకరు. రెండు పరస్పర విరుద్ధ అంశాలను మిళితం చేసి అందరినీ ఆకట్టుకుంటాడు' అంటాడు న్యూక్లియ.

చిత్రపరిశ్రమలో పనిచేయాలనేది జాదవ్ కోరిక. బాలీవుడ్‌లోని కొన్ని సినిమాలు, బాట్లా హౌజ్, రాకెట్ బాయ్స్‌లాంటి వెబ్‌సిరీస్‌లకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసే అవకాశం వచ్చింది.

'నేను చేస్తున్న పని గురించి నా తల్లిదండ్రులకు అవగాహన లేదు. ఏదైన స్థిరమైన ఉద్యోగం చేయాలని కోరుకునేవారు. అయితే నాకు వచ్చిన గుర్తింపు చూసిన తరువాత వారి ఆలోచన మారింది. నాపై నమ్మకం పెరిగింది' అంటాడు దిప్రజ్ జాదవ్.

28 సంవత్సరాల జాదవ్ 'ఫోర్బ్స్ 30 అండర్ 30-2024' జాబితాలో చోటు సాధించాడు.

కొత్త ద్వారాలు

'పదిమందిలో ఒకరు' అని కాకుండా పదిమందికి భిన్నంగా ఆలోచించినప్పుడే మంచి ఫలితం సాధించగలం. ఒక టాపిక్ గురించి మనకు ఇష్టం ఏర్పడినప్పుడు దానికి సంబంధించి అన్ని కోణాల గురించి తెలుసుకోవాలి. అప్పుడే ఆ టాపిక్‌పై పట్టు వస్తుంది. కొత్తగా ఆలోచించడానికి ద్వారాలు తెరుచుకుంటాయి.

– దిప్రజ్ యాదవ్, డిజిటల్ కంటెంట్ క్రియేటర్

● ఆర్ట్ అండ్ కల్చర్

సమ్మోహనం



పదకొండు సంవత్సరాల వయసులోనే బాస్ గిటారిస్ట్‌గా మంచి పేరు తెచ్చుకుంది మోహిని డే. మోహిని మూడు సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు తండ్రి సుజయ్ డే బాస్ గిటార్ చేతికి అందించాడు. అలా మూడు సంవత్సరాల వయసు నుంచే బాస్ గిటార్‌తో మోహిని ఫ్రెండ్‌షిప్ మొదలైంది.

జాజ్ ఫ్యూజన్ గిటారిస్ట్‌గా సంగీత ప్రయాణాన్ని మొదలుపెట్టిన సుజయ్ ఆ తరువాత జాజ్‌కు దూరమై కుటుంబ పోషణ కోసం కోల్‌కత్తా నుంచి ముంబైకి వచ్చాడు. సెషన్స్ ఆర్టిస్ట్‌గా మారాడు.

మోహిని విషయానికి వస్తే తండ్రి సుజయ్ తొలి మ్యూజిక్ టీచర్. తండ్రి సహకారంతో చిన్న వయసులోనే పేరున్న పెద్ద కళాకారులతో కలిసి సంగీత కచేరీలు చేసింది మోహిని.

పదమూడు సంవత్సరాల వయసులో ప్రసిద్ధ పృథ్వీ థియేటర్ నుంచి మోహినికి ఆహ్వానం అందింది.

'మ్యూజిక్ ప్రాక్టిస్ చేస్తున్న నా దగ్గరకు నాన్న వచ్చి రంజిత్ అంకుల్ నుంచి కాల్ వచ్చింది, బ్యాగ్ సర్దుకో అని చెప్పారు. పృథ్వీ థియేటర్‌కు వెళ్లిన తరువాత అక్కడ జాకీర్ హుస్సేన్‌ను, ఫిల్మ్‌స్టార్స్‌ను చూశాను. రంజిత్ అంకుల్ నన్ను జాకీర్ అంకుల్‌కు పరిచయం చేశారు. ఆ తరువాత స్టేజీ మీద బాస్ గిటార్ ప్లే చేశాను. మంచి స్పందన వచ్చింది' అంటూ తన మ్యూజికల్ మెమోరీలోకి వెళుతుంది మోహిని.

తండ్రి సుజయ్ బాస్ గిటారిస్ట్. ఎంత బిజీగా ఉన్నా కూతురికి సంగీత పాఠాలు నేర్పడానికి అధిక ప్రాధాన్యత ఇచ్చేవాడు.

విక్టర్ వుటెన్ నుంచి మార్కస్ మిల్లర్ వరకు ఎంతో మంది గిటారిస్ట్‌ల ప్రభావం మోహినిపై ఉంది.

ఒకే స్టైల్‌కి పరిమితం కాకుండా రకరకాల స్టైల్స్‌ను ప్లే చేయడంలో ప్రావీణ్యం సంపాదించింది.

'రకరకాల స్టైల్స్‌ను ప్రాక్టిస్ చేస్తున్న క్రమంలో ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయి. ఆ సవాళ్లను అధిగమించగలిగినప్పుడు కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం దొరుకుతుంది. స్కూల్, కాలేజి రోజుల్లో నా ఆలోచనలు స్నేహితులకు వింతగా అనిపించేవి. నా ఆలోచనలు, ఐడియాలు ఎప్పుడు నా వయసు వారి కంటే చాలా భిన్నంగా ఉండేవి' అంటుంది మోహిని.

'ఫ్యూచర్ ప్లాన్స్ ఏమిటి?' అనే ప్రశ్నకు మోహిని ఇచ్చే జవాబు ఇది....'సొంతంగా మ్యూజిక్ స్కూల్ స్టార్ట్ చేయాలనేది నా కల. జంతుసంరక్షణకు సంబంధించిన కార్యక్రమాలలో పాల్గొనాలనుకుంటున్నాను. వోన్ మ్యూజిక్ షోతో ప్రేక్షకులకు నచ్చే మ్యూజిక్ అందించాలనుకుంటున్నాను'

తల్లిదండ్రులే నా సంగీత పాఠశాల

తల్లిదండ్రులే నాకు వరం. వారు నాకు సంగీత పాఠశాలలాంటి వారు. ప్రశంస ఎవరికైనా సరే ఉత్సాహాన్ని ఇస్తుంది. నాకు ఎన్నో ప్రశంసలు వచ్చినప్పటికీ అహం ప్రదర్శించలేదు. ఇది కూడా నా తల్లిదండ్రుల నుంచి నేర్చుకున్నదే. బాస్ గిటార్‌తో జీవనోపాధికి ఇబ్బంది అని, ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడం కష్టం అనుకునే సమయంలో యువతకు బాస్ గిటార్‌పై ఆసక్తి పెరిగేలా చేశాను.

– మోహిని డే



అవును...ఇది నిజమే!

● 'పోలిస్' ఫుల్‌ఫామ్.... పబ్లిక్ ఆఫీసర్ ఫర్ లీగల్ ఇన్వెస్టిగేషన్స్ అండ్ క్రిమినల్ ఎమర్జెన్సీస్ ● కళ్లు మూసుకున్నప్పుడు మనకు కనిపించే రంగును 'ఐగన్‌గ్రావ్' అంటారు. ఇది నలుపురంగుకు భిన్నమైనది. ● థాయ్‌లాండ్ జాతీయ గ్రంథం రామకియన్. దీని అర్థం రామ మహిమ. ● ఆస్కార్ గెలుచుకున్న తొలి నాన్ హ్యూమన్ మిక్కీ మౌస్ యానిమేటెడ్ మిక్కీ మౌస్. ● ఏప్రిల్ 18,1930లో బీబీసి రేడియో 'నో న్యూస్ టుడే' అని ప్రకటించి న్యూస్‌కు బదులుగా పియానో మ్యూజిక్‌ను ప్రసారం చేసింది.

సినిమా

నా పేరు రాసి ఉంది!



● గోపీచంద్

గోపీచంద్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'విశ్వం' అనే టైటిల్ ఖరారు చేశారు. శ్రీను వైట్ల దర్శకత్వంలో ఈ చిత్రాన్ని దోనేపూడి చక్రపాణి సమర్పణలో టీజీ విశ్వప్రసాద్, వేణు దోనేపూడి నిర్మిస్తున్నారు. రంజాన్ సందర్భంగా ఈ మూవీ టైటిల్‌ని ప్రకటించి, ఫస్ట్ స్ట్రైక్ వీడియోను విడుదల చేశారు. వీడియో చివరలో 'దానే దానే పే లిఖా ఖానే వాలే కా నామ్, ఇస్‌పే లిఖా మేరే నామ్' (గింజ గింజ మీద తినేవాళ్ల పేరు రాసి ఉంటుంది.. దీని మీద నా పేరు రాసి ఉంది) అంటూ గోపీచంద్ చెప్పే డైలాగ్ ఉంది. ''హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'విశ్వం' రూపొందుతోంది. గోపీచంద్ కెరీర్‌లో ఇది 32వ సినిమా. తనని ఒక విభిన్నమైన పాత్రలో చూపించనున్నారు శ్రీను వైట్ల. కెమెరామేన్ కేవీ గుహన్ నైపుణ్యం ప్రతి ఫ్రేమ్‌లోనూ కనిపిస్తుంది. సినిమా సాంకేతికంగా ఎంత రిచ్‌గా ఉందో చేతన్ భరద్వాజ్ సంగీతం తెలియజేస్తుంది. ఈ చిత్రం హీరోయిన్, ఇతర వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అన్నారు మేకర్స్.

రామ్ చరణ్‌కి గౌరవ డాక్టరేట్



● రామ్‌చరణ్

ప్రముఖ హీరో రామ్ చరణ్‌కు చెన్నై వేల్స్ విశ్వ విద్యాలయం నిర్వాహకులు గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించారు. రాజమౌళి దర్శకత్వం వహించిన 'ఆర్ఆర్ఆర్' చిత్రంతో అంతర్జాతీయ స్థాయిలో క్రేజ్ సొంతం చేసుకున్నారు హీరోలు రామ్‌చరణ్, ఎన్టీఆర్. నటుడిగానే కాకుండా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు రామ్‌చరణ్. ఆయన సినీ, సామాజిక సేవలను గుర్తిస్తూ వేల్స్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. రేపు (శనివారం) చెన్నైలో ఈ అవార్డు ప్రదానోత్సవం జరగనుందని ఆ విశ్వ విద్యాలయం అధినేత ఐసరి గణేశ్ తెలిపారు. ఇక ప్రస్తుతం 'గేమ్ చేంజర్' సినిమాతో బిజీగా ఉన్నారు రామ్‌చరణ్.

బాలీవుడ్ వార్‌లో...



● ఎన్టీఆర్

బాలీవుడ్ వార్‌లో పాల్గొనేందుకు ముంబై వెళ్లారు ఎన్టీఆర్. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'వార్ 2'. 2019లో హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ లీడ్ రోల్స్‌లో నటించి, సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో రూపొందిన హిట్ ఫిల్మ్ 'వార్'కు 'వార్ 2' చిత్రం సీక్వెల్. మలి భాగానికి 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే 'వార్ 2' సినిమా చిత్రీకరణ మొదలైంది. 'వైఆర్ఎఫ్' (యశ్‌రాజ్ ఫిలింస్) స్పై యూనివర్స్‌లో భాగంగా ఆదిత్యా చోప్రా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా 'వార్ 2' సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ నేడు ముంబైలో ప్రారంభం కానున్నట్లు తెలిసింది. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ పాల్గొనగా ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరణను ప్లాన్ చేశారని సమాచారం. ప్రస్తుతం ఎన్టీఆర్ ముంబైలో ఉన్న ఫొటోలు వైరల్‌గా మారాయి. పది రోజులు 'వార్ 2' చిత్రీకరణలో పాల్గొంటారట ఎన్టీఆర్. ఈ షెడ్యూల్ పూర్తి కాగానే, హైదరాబాద్‌లో 'దేవర' చిత్రీకరణలో పాల్గొంటారని తెలిసింది. కొరటాల శివ దర్శకత్వంలో రెండు భాగాలుగా రూపొందుతున్న 'దేవర' తొలి భాగం అక్టోబరు 10న విడుదల కానుంది. ఇక 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాల ఫేమ్ ప్రశాంత్ నీల్‌తో కూడా ఎన్టీఆర్ ఓ సినిమా అంగీకరించిన సంగతి తెలిసిందే.

ఓ భక్తురాలి కథ



● మంచు లక్ష్మి

మంచు లక్ష్మి లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఆదిపర్వం'. సంజీవ్ కుమార్ మేగోటి దర్శకత్వంలో రావుల వెంకటేశ్వర రావు సమర్పణలో ఎమ్.ఎస్.కె నిర్మించారు. తెలుగు, కన్నడ, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రానికి మాధవ్ సైబా, సంజీవ్ మేగోటి, బి. సుల్తాన్ వలి, ఓపెన్ బనానా, లుబెక్ లీ మార్విన్ సంగీతం అందించారు. కాగా 'ఆదిపర్వం' ఆడియో ఆవిష్కరణ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ వేడుకలో సంగీత దర్శకులు ఆర్.పి. పట్నాయక్, ఎం.ఎం. శ్రీలేఖ, రఘు కుంచె, ఘంటాడి కృష్ణ ముఖ్య అతిథులుగా, నిర్మాత చీర్ల శ్రీనివాస యాదవ్, డ్యాన్స్ మాస్టర్ సన్ రేస్, ఆల్ ఇండియా రేడియో స్టేషన్ డైరెక్టర్ వి. ఉదయ శంకర్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ''1974 నుంచి 1992 మధ్య జరిగే పీరియాడిక్ డ్రామా చిత్రం 'ఆదిపర్వం'. ఓ అమ్మవారి కథ.. అమ్మవారిని నమ్ముకున్న భక్తురాలి కథ. ఆ భక్తురాలిని దుష్ట శక్తుల నుండి కాపాడే ఓ క్షేత్రపాలకుడి కథ ఇది'' అన్నారు మేకర్స్.

దర్శకరత్న పేరుతో అవార్డులు

– తమ్మారెడ్డి భరద్వాజ



● ప్రసన్నకుమార్, బీఎస్ఎన్ సూర్యనారాయణ, భరద్వాజ, నరసింహారావు

''దర్శకరత్న దాసరి నారాయణరావుగారి 77వ జయంతి వేడుకలను మే 5న నిర్వహించనున్నాం. గురువుగారికి నివాళులు అర్పిస్తూ... అభినవ దర్శక రత్న, అభినయ రత్న, నిర్మాణ రత్న, పంపిణీ రత్న, ప్రదర్శనా రత్న, కథా రత్న, సంభాషణా రత్న, గీతా రత్న, పాత్రికేయ రత్న, 'సేవా రత్న' వంటి పురస్కారాలు ప్రదానం చేయనున్నాం. చిన్న, మీడియమ్ బడ్జెట్ సినిమాలకూ అవార్డులు ఇవ్వనున్నాం'' అని దర్శక-నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. తెలుగు సినీ రంగంలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచినవారికి దర్శకరత్న దాసరి నారాయణరావు 77వ జయంతి సందర్భంగా 'దర్శకరత్న డి.ఎన్.ఆర్. ఫిల్మ్ అవార్డ్స్' పేరిట అవార్డులు ఇవ్వనున్నారు. మే 5న హైదరాబాద్‌లోని శిల్ప కళా వేదికలో ఈ వేడుక జరగనుంది. ఈ అవార్డుల జ్యూరీ కమిటీ అధ్యక్షుడిగా తమ్మారెడ్డి భరద్వాజ, కార్యదర్శులుగా దర్శకుడు రేలంగి నరసింహారావు, నిర్మాత సి. కల్యాణ్, సభ్యులుగా నిహార్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఫౌండర్, దాసరికి ఆడిటర్‌గా వ్యవహరించిన బీఎస్ఎన్ సూర్యనారాయణ, సీనియర్ జర్నలిస్టులు ప్రభు, ధీరజ అప్పాజీ ఉన్నారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో రేలంగి నరసింహారావు మాట్లాడుతూ– ''ఈ అవార్డుల ఎంపిక అత్యంత పారదర్శకంగా, ప్రామాణికంగా ఉంటుంది'' అన్నారు. ''ఇకపై ప్రతి ఏటా దాసరిగారి జయంతి, అవార్డుల వేడుక నిర్వహిస్తాం'' అన్నారు బీఎస్ఎన్ సూర్యనారాయణ.

ఆస్కార్ డేట్ ఫిక్స్



తొంభైఆరవ ఆస్కార్ అవార్డుల వేడుక పూర్తయి నెల రోజులు మాత్రమే అవుతోంది (మార్చి 10న 96వ ఆస్కార్ అవార్డుల వేడుక జరిగింది). కానీ ఆస్కార్ అకాడమీ మాత్రం అప్పుడే 97వ ఆస్కార్ అవార్డుల వేడుకను గురించిన వివరాలను అధికారికంగా ప్రకటించింది. 2025 మార్చి 2న లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ అట్మాస్ థియేటర్‌లో 97వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం జరపనున్నట్లు ఆస్కార్ నిర్వాహకులు వెల్లడించారు. అలాగే వచ్చే ఏడాది జనవరి 17న ఆస్కార్ ఫైనల్ నామినేషన్స్ వివరాలను ప్రకటించనున్నట్లుగా కూడా తెలిపారు. ఇక ఈ ఏడాది నవంబరు 17న ఆస్కార్ గవర్నర్స్ అవార్డుల విజేతల ప్రకటన ఉంటుందని, డిసెంబరు 17న ఆస్కార్ షార్ట్‌లిస్ట్ జాబితాను వెల్లడిస్తారని, ఫిబ్రవరి 8తో ఫైనల్ ఓటింగ్ గడువు ముగుస్తుందని సమాచారం.

ఎక్కడి నుండి మొదలుపెడదాం



● దుల్కర్ సల్మాన్

'మిడిల్ క్లాస్ మెంటాలిటీ సర్.. మేమింతే', 'కష్టమొస్తే ఖర్చులు తగ్గించుకుని రూపాయి రూపాయి దాచుకుంటాం.. పంతం వస్తే ఒక్క రూపాయి కూడా మిగల్చకుండా ఖర్చు పెట్టేస్తాం సర్', 'ఎక్కడి నుండి మొదలుపెడదాం' అంటూ హీరో దుల్కర్ సల్మాన్ చెప్పిన డైలాగులు 'లక్కీ భాస్కర్' సినిమా టీజర్‌లో ఉన్నాయి. 'మహానటి', 'సీతారామం' వంటి చిత్రాలతో తెలుగులోనూ అభిమానులను సంపాదించుకున్న దుల్కర్ సల్మాన్ నటిస్తున్న తాజా చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. గురువారం రంజాన్‌ను పురస్కరించుకుని ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు నిర్మాతలు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.

సల్మాన్ ఖాన్ సికందర్



● సల్మాన్ ఖాన్

సల్మాన్ ఖాన్ హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాకు 'సికందర్' టైటిల్ ఖరారైంది. గురువారం (ఏప్రిల్ 11) ఈద్ సందర్భంగా 'సికందర్' టైటిల్‌ను అధికారికంగా ప్రకటించి, టైటిల్ లోగోను కూడా విడుదల చేశారు మేకర్స్. సాజిద్ నడియాద్‌వాలా నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఈద్‌కు రిలీజ్ కానుంది. ''ఈ ఈద్‌కు 'బడే మియా చోటే మియా', 'మైదాన్' సినిమాలను థియేటర్స్‌లో చూడండి. వచ్చే ఈద్‌కు 'సికందర్' వస్తాడు'' అంటూ సోషల్ మీడియా వేదికగా స్పందించారు సల్మాన్ ఖాన్.

జనతా బార్ సందేశం



● రాయ్ లక్ష్మి

రాయ్ లక్ష్మి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'జనతా బార్'. రోచిశ్రీ మూవీస్ పతాకంపై అశ్వథ్ నారాయణ సమర్పణలో రమణ మొగిలి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం మేలో రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. రాయ్ లక్ష్మి మాట్లాడుతూ– ''బార్ గర్ల్‌గా ప్రారంభమయ్యే నా పాత్ర సమాజంలోని మహిళలు గొప్పగా చెప్పుకునే స్థాయికి ఎలా ఎదిగింది? అన్నదే ఈ చిత్రం కథాంశం. ఈ సినిమాలో మంచి సందేశం కూడా ఉంది'' అని అన్నారు. ''కుస్తీ పోటీల నేపథ్యంలో సాగే కథ ఇది. ఈ సినిమాతో సమాజంలో స్త్రీల ప్రాధాన్యతను మరోసారి చాటి చెప్పే ప్రయత్నం చేశాం'' అన్నారు రమణ మొగిలి.

సాక్షి **బిజినెస్**
శుక్రవారం
12-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (బుధవారం ముగింపు)		
సెన్సెక్స్ ▲	354	75,038
నిఫ్టీ ▲	111	22,754

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	16,336	▲ 167
డోజోన్స్	38,428	▼ 33
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,924	▼ 37
డాక్స్	17,949	▼ 148
షాంఘై	3,034	▲ 7
నికాయ్	39,445	▼ 121

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎసిఐఐ	82.82	83.84
£	బ్రిటన్ పౌండ్	ఎసిఐఐ	104.37	106.92
€	యూరో	ఎసిఐఐ	89.25	91.63
¥	జపాన్ ఎన్ (100)	ఎసిఐఐ	54.31	55.52
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎసిఐఐ	54.26	56.18
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.55	64.25
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.29	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.76	23.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.38	12.45

యూఏఈలో 'ద టేస్ట్ కంపెనీ'

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రెడీ టు ఈట్ సంస్థ 'ద టేస్ట్ కంపెనీ' యూఏఈలో ఎంట్రీ ఇచ్చింది. భారత్‌లో తొలిసారిగా రెడీ టు ఈట్ నాన్ వెజ్ ఉత్పత్తులను పరిచయం చేసిన ఈ కంపెనీ యూకే, యూఎస్ఏ, సింగపూర్‌లో త్వరలో అడుగుపెట్టనుంది. 18 రకాల అల్పాహారం, వెజ్, నాన్-వెజ్ మీల్ ఉత్పత్తులను తయారు చేస్తున్నట్టు ద టేస్ట్ కంపెనీ కో-ఫౌండర్, సీఈవో అనిల్ కుమార్ తెలిపారు. భారత్‌కు చెందిన ఆరు విమానయాన సంస్థలు కంపెనీ ఉత్పత్తులను ఆఫర్ చేస్తున్నాయి. అడ్వాన్స్‌డ్ డీహైడ్రేషన్, ఫ్రీజ్ డ్రైయింగ్ టెక్నాలజీ ప్లాంటును రూ.34 కోట్లతో హైదరాబాద్‌లో సంస్థ ఏర్పాటు చేసింది. నెలకు 30 లక్షల బాక్స్‌లను తయారు చేయగలదు. 2021లో ప్రారంభమైన సంస్థ 20 లక్షలకుపైగా బాక్స్‌లను విక్రయించింది. ప్రస్తుతం అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఈ-కామర్స్ వేదికలతోపాటు కంపెనీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే విక్రయిస్తోంది.

క్రిటికల్ రివర్ బోర్డులోకి పరిశ్రమ దిగ్గజాలు

ముంబై: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే టెక్నాలజీ కన్సల్టింగ్ సంస్థ క్రిటికల్‌రివర్‌లో పలువురు పరిశ్రమ దిగ్గజాలు కీలక హోదాల్లో చేరారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్ అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా ఫణీష్ మూర్తి, స్వతంత్ర డైరెక్టరుగా రాజు రెడ్డి చేరినట్లు సంస్థ తెలిపింది. ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా నారాయణ మూర్తి, గ్లోబల్ హెడ్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ డిజిటల్ సొల్యూషన్స్‌గా సునీల్ శర్మ నియమితులయ్యారు. వారి అపార అనుభవం సంస్థ వృద్ధికి గణనీయంగా తోడ్పడగలదని వ్యవస్థాపకులు అంజి మారం ఆశాభావం వ్యక్తం చేశారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

12-4-2024 ఫామ్ ధర...	
విశాఖ	408-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	393-00
విజయవాడ	393-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	380-00
వరంగల్	382-00
రిటైల్ ధర	4.40

కార్పొరేట్ ఫలితాల సీజన్



నేటి నుంచి ప్రారంభం
- టీసీఎస్ రిజల్ట్స్‌తో షురూ
- వచ్చే వారం ఇన్ఫీ, విప్రో, టెక్ఎం
- క్యూ4, గైడెన్స్‌పై అంచనాలు వీక్!

న్యూఢిల్లీ: ఐటీ సేవల నంబర్‌వన్ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) చివరి త్రైమాసిక(జనవరి-మార్చి) ఫలితాల సీజన్‌కు శ్రీకారం చుడుతోంది. నేడు (శుక్రవారం) క్యూ4తోపాటు.. మార్చితో ముగిసిన గత పూర్తిఏడాది(2023-24)కి సైతం పనితీరు వెల్లడించనుంది. అయితే క్యూ4సహా.. గతేడాదికి ఐటీ కంపెనీలు నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించే అవకాశమున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. వెరసి సాఫ్ట్‌వేర్ రంగ కంపెనీల క్యూ4, పూర్తి ఏడాది పనితీరు వెల్లడికానుండగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి(2024-25) ఆదాయ అంచనాలు(గైడెన్స్) సైతం ప్రకటించనున్నాయి. అయితే పలు కంపెనీలు నిరుత్సాహకర ఫలితాలనే ప్రకటించనున్నట్లు పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఇందుకు బలహీన ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, ఐటీ వ్యయాలు తగ్గడం తదితర అంశాలు ప్రభావం చూపనున్నట్లు పేర్కొంటున్నాయి. ఆర్థిక అనిశ్చితుల కారణంగా టెక్నాలజీ సేవలకు డిమాండ్ మందగించడం, ఐటీపై క్లయింట్ల వ్యయాలు తగ్గడం ఈ ఏడాది అంచనాలను సైతం దెబ్బతీసే వీలున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వెరసి ఐటీ కంపెనీలు అప్రమత్తతతో కూడిన గైడెన్స్‌ను ప్రకటించనున్నట్లు తెలియజేశాయి.

గ్లోబల్ దిగ్గజాలు సైతం

గ్లోబల్ దిగ్గజాలు యాక్సెంచర్, కాగ్నిజెంట్ టెక్నాలజీ, క్యాప్‌జెమిని సైతం ఈ క్యాలండర్ ఏడాది(2024) ఓమాదిరి పనితీరును ఊహిస్తున్నాయి. ఫలితంగా తొలి అర్ధభాగం(జనవరి-జూన్)లో అంతంతమాత్ర వృద్ధిని అంచనా వేశాయి. అయితే ద్వితీయార్ధం(జూలై-డిసెంబర్)లో రికవరీకి వీలున్నట్లు అభిప్రాయపడ్డాయి. కాగా.. దేశీ ఐటీ దిగ్గజాలలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ రక్షణాత్మక బిజినెస్ మిక్స్ ద్వారా లబ్ధి పొందే వీలున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ పేర్కొంది. ఇక డిజిటల్, బిజినెస్ ట్రాన్స్‌ఫార్మేషన్ విభాగాల కారణంగా టీసీఎస్, ఇన్ఫోసిస్ కీలక పురోగతిని సాధించవచ్చని అభిప్రాయపడింది.

బ్రోకింగ్ వర్గాల అంచనాలు

నేడు(12న) ఐటీ సేవల నంబర్‌వన్ కంపెనీ టీసీసీఎస్ క్యూ4సహా.. 2023-24 ఫలితాలను విడుదల చేయనుంది. ఈ బాటలో సాఫ్ట్‌వేర్ దిగ్గజాలు ఇన్ఫోసిస్ 18న, విప్రో 19న, టెక్ మహీంద్రా 25న, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 26న క్యూ4, గతేడాదికి పనితీరును వెల్లడించనున్నాయి. దేశీ ఐటీ కంపెనీలు క్యూ4లో అంతంతమాత్ర ఫలితాలను సాధించనున్నట్లు బ్రోకింగ్ సంస్థ ఎమ్‌కే ఇటీవల అంచనా వేసింది. ఈ ఏడాది ద్వితీయార్ధం(అక్టోబర్-మార్చి)లో మాత్రమే రికవరీ ఆశలనుపెట్టుకోవచ్చునంటూ పేర్కొంది. అయితే క్యూ3(అక్టోబర్-డిసెంబర్)లో సాధించిన నిరాశామయ పనితీరుతో పోలిస్తే క్యూ4లో త్రైమాసికవారీగా కాస్తమెరుగైన ఫలితాలు సాధించవచ్చని బ్రోకింగ్ సంస్థ మోతీలాల్ ఓస్వాల్ అభిప్రాయపడింది. ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల రీత్యా ఐటీ సర్వీసులకు డిమాండ్ మందగించినట్లు పేర్కొంది. వెరసి కరోనా మహమ్మారి తలెత్తిన 2019-20ను మినహాయిస్తే వార్షికంగా 2008-09 తదుపరి బలహీన ఫలితాలు విడుదలయ్యే వీలున్నట్లు తెలియజేసింది. వ్యయాలు తగ్గడం ప్రభావం చూపనున్నట్లు పేర్కొంది. ఐచ్ఛిక వ్యయాలు తగ్గడంతో ఐటీ పరిశ్రమలో ప్రస్తావించదగ్గ మార్పులకు అవకాశంతక్కువేనని అభిప్రాయపడింది. కాగా.. యూఎస్ ఫెడ్ సానుకూల దృక్పథం, పూర్తి చేయవలసిన భారీ ఆర్డర్లు వంటి అంశాలు ఈ ఏడాది(2024-25)లో ప్రోత్సాహక ఫలితాలకు దారిచూపవచ్చని అంచనా వేసింది.

క్యూ4లో డీల్స్ ద్వారా సాధించే మొత్తం కాంట్రాక్టుల విలువ(టీసీవీ) సానుకూలంగానే కనిపిస్తున్నప్పటికీ ఆదాయంపై స్థూల ఆర్థిక పరిస్థితుల కారణంగా ఒత్తిడి కనిపించవచ్చని వివరించింది. ఐటీ సేవలకు ప్రధానమైన బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసులు, ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ)తోపాటు, రిటైల్, హైటెక్, కమ్యూనికేషన్స్ విభాగాలతోపాటు.. ప్రాంతాలవారీగా కూడా బలహీనతలు కనిపిస్తున్నట్లు ఐటీ విశ్లేషకులు పేర్కొన్నారు.

పెట్టుబడులు సిప్ చేస్తున్నారు

- రూ. 2 లక్షల కోట్లకు సిప్‌లు
- 2022-23తో పోలిస్తే 28 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: ఆర్థిక పరిస్థితులపై సానుకూల అంచనాల నేపథ్యంలో క్రమానుగత పెట్టుబడులు (సిప్) 2023-2024లో రూ. 2 లక్షల కోట్ల రికార్డ్ స్థాయికి చేరాయి. 2022-2023తో పోలిస్తే ఇది 28% అధికం. ఫండ్స్ సంస్థల సమాఖ్య యాంఫీ గణాంకాల ప్రకారం 2016-17లో రూ. 43,921 కోట్లుగా ఉన్న సిప్ పెట్టుబడులు 2022-23 నాటికి రూ. 1.56 లక్షల కోట్లకు చేరాయి. ఇవి 2020-21లో రూ. 96,080 కోట్లుగా, 2021-22లో రూ. 1.24 లక్షల కోట్లుగా ఉన్నాయి. మరోవైపు, గతేడాది మార్చి నెలలో సిప్‌ల రూపంలో రూ. 14,276 కోట్లు రాగా ఈ ఏడాది మార్చిలో 35 శాతం వృద్ధి చెంది ఆల్-టైమ్ గరిష్ట స్థాయి రూ. 19,270 కోట్లు వచ్చాయి. ఫిబ్రవరి, మార్చిలో వరుసగా రెండు నెలల పాటు సిప్ పెట్టుబడులు రూ. 19,000 కోట్ల మార్కును దాటాయి.

భారత్ వృద్ధి అంచనా పెంచిన ఏడీబీ



6.7 శాతం నుంచి 7 శాతానికి అప్

న్యూఢిల్లీ: భారత్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) వృద్ధి అంచనాలను ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) 30 బేసిస్ పాయింట్లు పెంచింది. తొలి అంచనాలు (2023 డిసెంబర్ అంచనాలు) 6.7 శాతంకాగా, దీనిని 7 శాతానికి పెంచుతున్నట్లు వివరించింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగ పెట్టుబడుల పెరుగుదల, వినియోగ డిమాండ్ పటిష్టత తాజా అంచనాలకు కారణమని ఏప్రిల్ ఎడిషన్ అవుట్‌లుక్‌లో ఏడీబీ పేర్కొంది. ఆసియా పసిఫిక్ ప్రాంతానికి ప్రధాన ''గ్రోత్ ఇంజిన్''గా భారత్ ఉంటుందని అవుట్‌లుక్‌లో విశ్లేషించింది. ఇక 2025-26లో వృద్ధి 7.2 శాతంగా ఉంటుందన్నది ఏడీబీ తాజా అంచనా. అయితే ప్రస్తుత ఆర్థిక సవాళ్ల పట్ల అప్రమత్తత అవసరమని హెచ్చరించింది. 2024-25 విషయానికి వస్తే, ఆర్‌బీఐ కూడా దేశాభివృద్ధి రేటు 7 శాతంగా ఉంటుందని పేర్కొనడం గమనార్హం.

ఎడిల్‌వీజ్ ఆల్ట్ చేతికి ఇన్‌ఫ్రా ఆస్తులు



ఎల్అండ్‌టీ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్స్ కొనుగోలు

ముంబై: ప్రత్యామ్నాయ పెట్టుబడుల ఫండ్ ఎడిల్‌వీజ్ ఆల్టర్నేటివ్స్ మౌలిక సదుపాయ ప్రాజెక్టులపై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా ప్రయివేట్ రంగ దిగ్గజం ఎల్అండ్‌టీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్(ఎల్‌టీఐడీపీఎల్) కొనుగోలును పూర్తిచేసినట్లు తెలియజేసింది. భాగస్వామ్య కంపెనీ(జేవీ) ఎల్‌టీఐడీపీఎల్‌ను సొంతం చేసుకునే బాటలో రూ. 6,000 కోట్ల విలువైన డీల్‌ను పూర్తి చేసినట్లు ఎడిల్‌వీజ్ ఆల్ట్ తాజాగా వెల్లడించింది. ఎల్‌టీఐడీపీఎల్ వివిధ రహదారులు, విద్యుత్ ప్రసార లైన్లతో కూడిన ఆస్తులను కలిగి ఉన్నట్లు పేర్కొంది. జేవీలో ఎల్అండ్‌టీ వాటా 51 శాతంకాగా.. కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్ మిగిలిన 49 శాతం వాటాను కలిగి ఉంది. జేవీ కొనుగోలును తొలుత 2022 డిసెంబర్‌లో ఎడిల్‌వీజ్ ఆల్ట్ ప్రకటించింది. దీనిలో భాగంగా తాజా పరిణామం చోటుచేసుకుంది.

భారతి హెక్సాకామ్ లిస్టింగ్ నేడు




న్యూఢిల్లీ: టెలికం దిగ్గజం భారతి ఎయిర్‌టెల్‌లో భాగమైన భారతి హెక్సాకామ్ షేర్లు శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కానున్నాయి. దీని ఇష్యూ ధర షేరు ఒక్కింటికి రూ. 570. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇదే తొలి పబ్లిక్ ఇష్యూ కానుంది. ఏప్రిల్ 5తో ముగిసిన ఈ ఇష్యూకి 29.88 రెట్లు బిడ్లు దాఖలయ్యాయి. రూ. 4,275 కోట్ల సమీకరణ ఈ ఆఫర్ లక్ష్యం.

ప్రియం కానున్న టెలికం చార్జీలు!



న్యూఢిల్లీ: ఇంటర్నెట్, ఫోన్ కాల్ చార్జీలు పెరగనున్నాయి. సాధారణ ఎన్నికల తర్వాత కొత్త ధరలను అమలు చేసేందుకు టెలికం కంపెనీలు సన్నద్ధం అవుతున్నట్టు సమాచారం. ఇదే జరిగితే టెలికం టారిఫ్‌లు 15-17 శాతం పెరిగే అవకాశం ఉంది. ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 మధ్య ఎన్నికలు జరుగనున్న సంగతి తెలిసిందే. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

ఎన్‌టీపీసీ గ్రీన్ ఐపీవో సన్నాహాలు



రూ. 10,000 కోట్ల సమీకరణ!

ముంబై: పీఎస్‌యూ దిగ్గజం ఎన్‌టీపీసీ అనుబంధ కంపెనీ.. ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ పబ్లిక్ ఇష్యూ సన్నాహాలు ప్రారంభించింది. ఇందుకు అనుగుణంగా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ల ఎంపికను చేపట్టినట్లు తెలుస్తోంది. ఐపీవో ద్వారా పునరుత్పాదక రంగ కంపెనీ రూ. 10,000 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. తద్వారా 2022లో బీమా రంగ ప్రభుత్వ దిగ్గజం ఎల్ఐసీ తదుపరి అతిపెద్ద పబ్లిక్ ఇష్యూకి తెరతీయనుంది. నిధులను సోలార్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా తదితర భవిష్యత్ ప్రాజెక్టులు, విస్తరణ ప్రణాళికలకు పెట్టుబడులుగా వెచ్చించనుంది. ఐపీవో కోసం ఐడీబీఐ క్యాపిటల్ మార్కెట్స్ అండ్ సెక్యూరిటీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్, నువామా వెల్త్ మేనేజ్‌మెంట్‌ను షార్ట్‌లిస్ట్ చేసింది.

సాక్షి **స్పోర్ట్స్**



పోరాడి ఓడిన సుమిత్

మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో భాగంగా గురువారం ప్రపంచ ఏడో ర్యాంకర్ హోల్గర్ రూనే (డెన్మార్క్)తో జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో భారత టెన్నిస్ స్టార్ సుమిత్ నగాల్ 3-6, 6-3, 2-6తో పోరాడి ఓడిపోయాడు. 2 గంటల 11 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రపంచ 93వ ర్యాంకర్ సుమిత్ ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. సుమిత్‌కు 42,935 యూరోల (రూ. 38 లక్షల 38 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 50 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ప్రదర్శనతో సుమిత్ ఈనెల 15న విడుదల చేసే ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 13 స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ 80వ ర్యాంక్‌కు చేరుకోనున్నాడు. అంతేకాకుండా మేలో జరిగే ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో నేరుగా మెయిన్ 'డ్రా'లో చోటును ఖరారు చేసుకున్నాడు. 2019లో ప్రజ్నేశ్ గుణేశ్వరన్ తర్వాత ఫ్రెంచ్ ఓపెన్ మెయిన్ 'డ్రా'లో ఆడనున్న భారత ప్లేయర్‌గా సుమిత్ గుర్తింపు పొందుతాడు.

ప్రజ్ఞానంద, విదిత్ విజయం



టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నీ ఆరో రౌండ్ ఓపెన్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, విదిత్ సంతోష్ గుజరాతీ విజయాలు అందుకోగా... దొమ్మరాజు గుకేశ్ 'డ్రా' నమోదు చేశాడు. నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్)తో జరిగిన గేమ్‌లో తమిళనాడు కుర్రాడు ప్రజ్ఞానంద 45 ఎత్తుల్లో... అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్)తో జరిగిన గేమ్‌లో మహారాష్ట్రకు చెందిన విదిత్ 40 ఎత్తుల్లో గెలుపొందారు. హికారు నకమురు (అమెరికా)తో జరిగిన గేమ్‌ను గుకేశ్ 40 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. ఆరో రౌండ్ తర్వాత గుకేశ్ నాలుగు పాయింట్లతో నిపోమ్‌నిషితో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు. మహిళల విభాగం ఆరో రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, వైశాలి ఓటమి పాలయ్యారు. హంపి 48 ఎత్తుల్లో లె టింగ్జీ (చైనా) చేతిలో... వైశాలి 29 ఎత్తుల్లో కాటరీనా లాగ్నో (రష్యా) చేతిలో ఓడిపోయారు.

భారత రెజ్లర్లకు మూడు పతకాలు




బిష్కెక్ (కిర్గిస్తాన్): ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజు భారత ఫ్రీస్టయిల్ రెజ్లర్లు మూడు పతకాలు సాధించారు. ఉదిత్ (57 కేజీలు) రజతం నెగ్గగా... అభిమన్యు (70 కేజీలు), విక్కీ (97 కేజీలు) కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. ఫైనల్లో ఉదిత్ 4-5తో కెంటో యుమియా (జపాన్) చేతిలో ఓడిపోయాడు. బౌట్ చివరి సెకన్లలో ఉదిత్ ప్రత్యర్థికి ఒక పాయింట్ కోల్పోయాడు. 2020 నుంచి 2023 వరకు ఈ విభాగంలో భారత్‌కు స్వర్ణ పతకాలు లభించాయి. రవి కుమార్ దహియా వరుసగా మూడేళ్లు (2020, 2021, 2022)... గత ఏడాది అమన్ ఈ విభాగంలో పసిడి పతకాలు నెగ్గారు. మరోవైపు కాంస్య పతకాల బౌట్‌లలో అభిమన్యు 6-5తో కుల్దాషెవ్ (ఉజ్బెకిస్తాన్)పై, విక్కీ 10-1తో అరోనోవ్ (కిర్గిస్తాన్)పై గెలుపొందారు.

స్పెయిన్‌లో శిక్షణకు జ్యోతి యర్రాజీ



న్యూఢిల్లీ: ఆసియా క్రీడల రజత పతక విజేత, ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ జ్యోతి యర్రాజీ స్పెయిన్‌లో 45 రోజుల ప్రత్యేక శిక్షణ తీసుకోనుంది. జ్యోతికి సంబంధించి విమాన ప్రయాణాలు, వసతి, శిక్షణ ఇతరత్రా ఖర్చులన్నీ మిషన్ ఒలింపిక్ సెల్ (ఎంఓసీ) భరిస్తుందని కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖ ప్రకటించింది. పారిస్ ఒలింపిక్స్ సహా, ఈ సీజన్‌లో అత్యున్నత ప్రదర్శన కనబరిచేందుకు ఎంఓసీ పథకంలో ఆమెతో పాటు పలువురు అథ్లెట్లకు ఆర్థిక చేయూత ఇవ్వనున్నారు. వైజాగ్‌కు చెందిన 24 ఏళ్ల జ్యోతి గత ఆసియా క్రీడల్లో 100 మీటర్ల హర్డిల్స్‌లో రజత పతకం గెలిచింది. మరో తెలుగుతేజం, స్టార్ షట్లర్ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టిలకు కూడా మరింత మెరుగైన శిక్షణ కోసం ఆర్థిక సాయం అందించే ప్రతిపాదనకు ఎంఓసీ ఆమోదం తెలిపింది.


అమెరికన్ ఫుట్‌బాల్ దిగ్గజం ఓజే సింప్సన్ కన్నుమూత



లాస్ వేగస్: వివాదాస్పద అమెరికన్ ఫుట్‌బాల్ దిగ్గజ క్రీడాకారుడు, హాలీవుడ్ నటుడు ఓజే సింప్సన్ కన్ను మూశాడు. 76 ఏళ్ల సింప్సన్ కొన్నాళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. 1969 నుంచి 1979 వరకు అమెరికాలోని విఖ్యాత నేషనల్ ఫుట్‌బాల్ లీగ్ (ఎన్ఎఫ్ఎల్)లో బఫెలో బిల్స్, శాన్‌ఫ్రాన్సిస్కో 49ఈఆర్ఎస్ జట్లకు సింప్సన్ ప్రాతినిధ్యం వహించాడు. 1994 జూన్‌లో తన మాజీ భార్య నికోల్ బ్రౌన్, ఆమె స్నేహితుడు రొనాల్డ్ గోల్డ్‌మన్‌ల జంట హత్య కేసులో ప్రమేయం ఉందంటూ సింప్సన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అంతర్జాతీయంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో 11 నెలల విచారణ తర్వాత సింప్సన్ నిర్దోషిగా బయటపడ్డాడు. అయితే 2007లో సింప్సన్ లాస్ వేగస్‌లోని ఓ క్యాసినోలో మారణాయుధాలతో ప్రవేశించి దోపిడికి పాల్పడ్డారు. విచారణ అనంతరం 2008లో సింప్సన్‌కు 33 ఏళ్ల జైలు శిక్ష విధించారు. తొమ్మిదేళ్ల జైలు శిక్ష అనుభవించాక 2017లో సింప్సన్ పెరోల్‌పై విడుదలయ్యాడు.

ముంబై ఫటాఫట్...

- 197 పరుగుల లక్ష్యాన్ని 15.3 ఓవర్లలోనే ఛేదించిన హార్దిక్ బృందం
- ఇషాన్, సూర్యకుమార్‌ల విధ్వంసం
- 5 వికెట్లతో హడలెత్తించిన బుమ్రా
- బెంగళూరు జట్టుకు ఐదో పరాజయం





ముంబై: ముంబై ఇండియన్స్ ముందున్న కొండంత లక్ష్యాన్ని ఇద్దరే ఇద్దరి విధ్వంసం మంచు ముక్కలా కరిగించేసింది. ఓపెనర్ ఇషాన్ కిషన్ (34 బంతుల్లో 69; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు), సూర్యకుమార్ యాదవ్ (19 బంతుల్లో 52; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) సిక్సర్ల సునామీతో ముంబై 197 పరుగుల లక్ష్యాన్ని కేవలం 15.3 ఓవర్లలోనే ఛేదించింది. దాంతో హార్దిక్ పాండ్యా నాయకత్వంలోని ముంబై ఇండియన్స్ 7 వికెట్ల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)పై ఘనవిజయం సాధించింది. అంతకుముందు తొలుత ఆర్‌సీబీ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. డుప్లెసిస్ (40 బంతుల్లో 61; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించగా, రజత్ పటిదార్ (26 బంతుల్లో 50; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), దినేశ్ కార్తీక్ (23 బంతుల్లో 53 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరిపించారు. ముంబై బౌలర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బుమ్రా 21 పరుగులిచ్చి 5 వికెట్లు తీశాడు.

కోహ్లి విఫలం

సూపర్ ఫామ్‌లో ఉన్న కోహ్లి (3) విఫలమవగా, విల్ జాక్స్ (8) నిరాశపరిచాడు. ఈ దశలో బెంగళూరును కెప్టెన్ డుప్లెసిస్ అండతో పటిదార్ ధాటిగా నడిపించాడు. 12వ ఓవర్లో కోయెట్జి బౌలింగ్‌లో రెండు వరుస సిక్స్‌లు బాదిన పటిదార్ 25 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకొని తర్వాతి బంతికే వెనుదిరిగాడు. మ్యాక్స్‌వెల్ (0) ఈ సీజన్‌లో మూడోసారి డకౌటయ్యాడు. అడపాదడపా షాట్లతో డుప్లెసిస్ 33 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. అయితే బుమ్రా వరుస ఓవర్లలో రెండేసి వికెట్లను పడగొట్టాడు. డుప్లెసిస్, హిట్టర్ లామ్రోర్ (0)లతో పాటు, సౌరవ్ (9), వైశాక్ (0)లను బుమ్రా అవుట్ చేసినా... దినేశ్ కార్తీక్ ధనాధన్ ఆటతో బెంగళూరు మంచి స్కోరు చేసింది.

ఇషాన్, సూర్యల తుఫాన్‌తో...

భారీ లక్ష్య ఛేదనలో ముంబై బ్యాటర్లు మెరుపు షాట్‌లతో హోరెత్తించారు. ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. దీంతో ముంబై పవర్‌ప్లేలోనే 72/0 స్కోరు చేసింది. ఇషాన్ 23 బంతుల్లో అర్ధ సెంచరీని సాధించగా, రోహిత్ నింపాదిగా ఆడాడు. కేవలం 8.3 ఓవర్లలోనే జట్టు స్కోరు 100 చేరింది. అదే ఓవర్లో ఇషాన్ దూకుడు ముగిసింది. అనంతరం సూర్యకుమార్ విధ్వంసం సృష్టించి 17 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. రోహిత్, సూర్యలు అవుటయ్యాక హార్దిక్ పాండ్యా (6 బంతుల్లో 21 నాటౌట్; 3 సిక్స్‌లు), తిలక్ వర్మ (10 బంతుల్లో 16 నాటౌట్; 3 ఫోర్లు) ధాటిగా ఆడి ముంబైను విజయతీరాలకు చేర్చారు.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) ఇషాన్ (బి) బుమ్రా 3; డుప్లెసిస్ (సి) డేవిడ్ (బి) బుమ్రా 61; జాక్స్ (సి) డేవిడ్ (బి) మధ్వాల్ 8; పటిదార్ (సి) ఇషాన్ (బి) కోయెట్జీ 50; మ్యాక్స్‌వెల్ (ఎల్బీడబ్ల్యూ) గోపాల్ 0; దినేశ్ కార్తీక్ (నాటౌట్) 53; లామ్రోర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బుమ్రా 0; సౌరవ్ (సి) ఆకాశ్ (బి) బుమ్రా 9; వైశాక్ (సి) నబి (బి) బుమ్రా 0; ఆకాశ్‌దీప్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 196. వికెట్ల పతనం:** 1-14, 2-23, 3-105, 4-108, 5-153, 6-153, 7-170, 8-170. **బౌలింగ్:** నబీ 1-0-7-0, కోయెట్జీ 4-0-42-1, బుమ్రా 4-0-21-5, ఆకాశ్ 4-0-57-1, శ్రేయస్ గోపాల్ 4-0-32-1, షెఫర్డ్ 2-0-22-0, హార్దిక్ 1-0-13-0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: ఇషాన్ (సి) కోహ్లి (బి) ఆకాశ్‌దీప్ 69; రోహిత్ (సి) టాప్లీ (బి) జాక్స్ 38; సూర్యకుమార్ (సి) మహిపాల్ (బి) వైశాక్ 52; హార్దిక్ (నాటౌట్) 21; తిలక్ వర్మ (నాటౌట్) 16; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (15.3 ఓవర్లలో 3 వికెట్లకు) 199. వికెట్ల పతనం**: 1-101, 2-139, 3-176. **బౌలింగ్:** టాప్లీ 3-0-34-0, సిరాజ్ 3-0-37-0, ఆకాశ్‌దీప్ 3.3-0-55-1, మ్యాక్స్‌వెల్ 1-0-17-0, వైశాక్ 3-0-32-1, 2-0-24-1.

ఐపీఎల్‌లో నేడు

లక్నో X ఢిల్లీ
వేదిక: లక్నో
రాత్రి 7:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	5	4	1	8	0.871
కోల్‌కతా	4	3	1	6	1.528
లక్నో	4	3	1	6	0.775
చెన్నై	5	3	2	6	0.666
హైదరాబాద్	5	3	2	6	0.344
గుజరాత్	6	3	3	6	-0.637
ముంబై	5	2	3	4	-0.073
పంజాబ్	5	2	3	4	-0.196
బెంగళూరు	6	1	5	2	-1.124
ఢిల్లీ	5	1	4	2	-1.370

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ముగిసిన భారత్ పోరు

ప్రిక్వార్టర్స్‌లో ఓడిన సింధు, ప్రణయ్, అశ్విని-తనీషా జోడీ



నింగ్బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు... పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్... మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో ద్వయం ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయారు. ఆరో సీడ్ హాన్ యువె (చైనా)తో జరిగిన మ్యాచ్‌లో సింధు 18-21, 21-13, 17-21తో ఓటమి చవిచూసింది. ఏడో సీడ్ ప్రణయ్ 18-21, 11-21తో లిన్ చున్ యి (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం పాలయ్యాడు. అశ్విని-తనీషా జోడీ 17-21, 12-21తో మూడో సీడ్ నామి మత్సుయామ-చిహారు షిదా (జపాన్) జంట చేతిలో ఓడింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో అశ్విని-తనీషా ఓటమి పాలైనా పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. ఈనెల 30న విడుదలయ్యే ర్యాంకింగ్స్‌లో టాప్-16లో ఉన్న డబుల్స్ జోడీలకు పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌లు ఖరారవుతాయి. అశ్విని-తనీషా ద్వయం 20వ ర్యాంక్‌లో ఉన్నప్పటికీ... ఒక దేశం నుంచి గరిష్ఠంగా రెండు జోడీలకు మాత్రమే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ ర్యాంకింగ్స్‌లో అశ్విని ద్వయం 12వ స్థానంలో ఉండటం... ఇదే చివరి అర్హత టోర్నీ కానుండటంతో భారత జోడీ ర్యాంకింగ్స్‌లో ఎలాంటి మార్పు ఉండదు.

మూడు మ్యాచ్ పాయింట్లు కాపాడుకొని భారత్ గెలుపు



చాంగ్షా (చైనా): బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా మహిళల టీమ్ టెన్నిస్ టోర్నీలో భారత జట్టు రెండో విజయం సాధించింది. చైనీస్ తైపీతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2-1తో నెగ్గింది. తొలి మ్యాచ్‌లో రుతుజా భోస్లే 6-3, 6-2తో హావో చింగ్ చాన్‌ను ఓడించింది. రెండో మ్యాచ్‌లో అంకిత రైనా 6-2, 4-6, 4-6తో ఎన్ షువో లియాంగ్ చేతిలో ఓటమి పాలైంది. నిర్ణాయక మూడో మ్యాచ్‌లో అంకిత-ప్రార్థన జోడీ 4-6, 6-1, 15-13తో హావో చింగ్ చాన్-ఎన్ షువో లియాంగ్ జంటపై గెలిచి భారత్‌కు విజయాన్ని అందించింది. టైబ్రేక్‌లో అంకిత జోడీ మూడు మ్యాచ్ పాయింట్లను కాపాడుకోవడం విశేషం.

క్లుప్తంగా...

నేవల్ ఆర్మ్‌డ్ డిపోను సందర్శించిన రక్షణ శాఖ కార్యదర్శి



ఆయుధాల్ని పరిశీలిస్తున్న గిరిధర్

సాక్షి, విశాఖపట్నం: నౌకాదళానికి అవసరమైన ఆయుధ సంపత్తి తయారీలో మేక్ ఇన్ ఇండియాలో దూసుకుపోతున్నామని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ కార్యదర్శి గిరిధర్ ఆర్మణీ అన్నారు. విశాఖలో తూర్పు నౌకాదళ పరిధిలో ఉన్న నేవల్ ఆర్మ్‌డ్ డిపో(ఎన్ఏడీ)ని గిరిధర్ గురువారం సందర్శించారు. ఆయుధాలు, బుల్లెట్స్, గన్స్, రాకెట్స్, బాంబుల్ని పరిశీలించారు. స్వదేశీ పరిజ్ఞానంతో ఆయుధాల్ని తయారు చేయడం, నిర్వహణ విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలపై ఎన్ఏడీ అధికారులు, సిబ్బందిని అభినందించారు.

విశాఖలో జీఈఎం అత్యాధునిక లాజిస్టిక్ సెల్ ప్రారంభం



జీఈఎం సెల్‌ను పరిశీలిస్తున్న మురళీమోహన్

సాక్షి, విశాఖపట్నం: రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ప్రభుత్వ ఈ మార్కెట్ (జీఈఎం) పోర్టల్ ద్వారా దేశవ్యాప్తంగా రూ.లక్ష కోట్ల ఉత్పత్తులు ప్రొక్యూర్‌మెంట్ జరిగిందని తూర్పు నౌకాదళం చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ (సీఎస్‌వో) రియర్ అడ్మిరల్ మురళీమోహన్ రాజు తెలిపారు. విశాఖలోని ఈఎన్‌సీ ప్రధాన కార్యాలయంలో ఆధునీకీకరించిన బేస్ లాజిస్టిక్ ఆఫీస్‌లో జీఈఎం సెల్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. జీఈఎంలో రిజిస్టర్ చేసుకున్న సంస్థల ద్వారా సేకరించిన ఆర్డర్స్‌లో 50 శాతం వరకూ రక్షణ మంత్రిత్వ సంస్థలు, అనుబంధ ప్రభుత్వ సంస్థల ద్వారా ఎంఎస్ఎంఈలకు అందజేసినట్లు కేంద్ర గణాంకాలు చెబుతున్నాయని చెప్పారు. రక్షణ విభాగ ఉత్పత్తుల కొనుగోళ్లు, విక్రయాలు ఇక మరింత సులభతరమవుతాయన్నారు.

శ్రీరామ నవమికి భద్రాద్రిలో ఆన్‌లైన్‌లో గదుల బుకింగ్ సౌకర్యం



సూపర్‌బజార్(కొత్తగూడెం): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఈ నెల 17,18 తేదీల్లో జరిగే శ్రీరామనవమి, మహాపట్టాభిషేకం వేడుకలకు ఆన్‌లైన్ ద్వారా పట్టణంలో గదులు బుక్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. గదులు కావాల్సినవారు https://book.bhadrachalamonline.com/book& hotel లింక్ ద్వారా బుక్ చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

రూ.5.60 కోట్ల సొత్తు స్వాధీనం

- లాజిస్టిక్ వాహనంలో బంగారం, వెండి వస్తువుల రవాణా
- పెద్దాపురంలో పట్టుకున్న పోలీసులు

పెద్దాపురం: సుమారు రూ.5.60 కోట్ల విలువైన బంగారు, వెండి వస్తువులను కాకినాడ జిల్లా, పెద్దాపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీఓ జేఎస్ రామారావు కథనం ప్రకారం.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో గురువారం రాత్రి బీవీసీ లాజిస్టిక్స్‌కు చెందిన వాహనంలో సుమారు 8.116 కేజీల బంగారు, 46 కేజీల వెండి వస్తువులు పట్టుబడ్డాయి. ఈ వాహనం కాకినాడ నుంచి విశాఖపట్నం వెళుతోంది. పెద్దాపురంలోని ఓ నగల దుకాణం నుంచి వెండి వస్తువులు తీసుకుని వెళుతుండగా పోలీసులు అనుమానంతో ఆ వాహనాన్ని ఆపి, తనిఖీ చేశారు. దీంతో విషయం బట్టబయలైంది. పట్టుబడిన సొత్తుకు సరైన ఆధారాలు చూపలేదు. డీఎస్పీ లతాకుమారి ఆధ్వర్యాన సొత్తును, వాహనాన్ని సీఐ రవికుమార్, ఎస్ఐ వెలుగుల సురేశ్ స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌డీఓ కార్యాలయానికి తరలించి, విచారణ చేపడుతున్నామని పెద్దాపురం పోలీసులు తెలిపారు.

పచ్చగంతలు తీస్తే రహదారులు కనిపిస్తాయి

- రోడ్లపై రోత రాతలతో పరాకాష్టకు రామోజీ పైత్యం
- చంద్రబాబు హయాంలోనే రోడ్లపై తీవ్ర నిర్లక్ష్యం
- టీడీపీ ప్రభుత్వం పెట్టిన ఖర్చు రూ.23,792.19 కోట్లు
- రోడ్ల పునరుద్ధరణకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్న సీఎం వైఎస్ జగన్
- వైఎస్సార్‌సీపీ వెచ్చించింది రూ.46,383.20 కోట్లు
- యుద్ధప్రాతిపదికన రహదారుల నిర్మాణం, మరమ్మతులు



ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో టీడీపీ ఓటమి తథ్యమని స్పష్టం కావడంతో ఈనాడు రామోజీరావు పైత్యం పరిపరి విధాలుగా ప్రకోపిస్తోంది. అసహనంతో చిందులు తొక్కుతూ రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తూ విద్వేష విషం కక్కుతున్నారు. అందుకే రాష్ట్ర రోడ్ల పరిస్థితిపై మరోసారి రామోజీ తన మార్కు రోత రాతలతో ఈనాడు పత్రికను ఖరాబు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తూ రహదారుల పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసినా సరే ...కళ్లకు పచ్చ గంతలు కట్టుకున్న రామోజీ కబోదిలా వ్యవహరిస్తున్నారు. అందులో భాగంగానే ఈనాడు పత్రిక గురువారం 'రోడ్లేయని జగన్ ఓ జనహంతక చక్రవర్తి' అంటూ మరోసారి రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారానికి తెరతీశారు. తప్పుడు కథనంతో ప్రజలను తప్పుదోవ పట్టించే యత్నంలో ఈనాడు బోల్తా కొట్టింది. వాస్తవానికి రాష్ట్రంలో రోడ్లు తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది చంద్రబాబు హయాంలోనే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే రోడ్ల పునరుద్ధరణ పనులు వేగం పుంజుకున్నాయని ప్రభుత్వ రికార్డులు వెల్లడిస్తున్న వాస్తవం. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014 నుంచి 2019 వరకు అయిదేళ్లలో ఆర్ అండ్‌బి, పంచాయతీరాజ్, జాతీయ రహదారులకు కలిపి మొత్తం రూ.23,792.19 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2019 నుంచి 2024 వరకు ఏకంగా రూ.46,383.20 కోట్లు వెచ్చించారు. రోడ్ల అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనమిది. కళ్లుండీ కబోదిగా వ్యవహరిస్తున్న రామోజీకి కనువిప్పు కలిగించేందుకే ఈ ఫ్యాక్ట్ చెక్...

రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం, నిర్వహణకు టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాలు చేసిన ఖర్చు(రూ.కోట్లలో)

పని	టీడీపీ	వైఎస్సార్‌సీపీ
రోడ్ల మరమ్మతులకు..	2,953.81	5,099.59
రాష్ట్ర రహదారులు, జిల్లా ప్రధాన రహదారుల నిర్మాణానికి..	4,325	9,175
పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి	3,160.38	6,804.61
జాతీయ రహదారుల నిర్మాణానికి..	14,353	25,304
మొత్తం	23,792.19	46,383.20

చంద్రబాబు జమానా.. రహదారులు అధ్వాన్నం

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో రోడ్ల నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నది అక్షరసత్యం. ఆ ప్రభుత్వ హయాంలో మొదటి మూడేళ్లూ అసలు రోడ్ల గురించే పట్టించుకోలేదు. తరువాత రోడ్ల పునరుద్ధరణకు 2017–18లో తీసుకున్న రూ.3 వేల కోట్ల రుణాన్ని కూడా ఎన్నికల ప్రయోజనాల కోసం 'పసుపు–కుంకుమ' పథకానికి మళ్లించారు. దాంతో 2019 నాటికి రాష్ట్రంలో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి.

- టీడీపీ ప్రభుత్వ ఐదేళ్లలో రోడ్ల నిర్మాణానికి రూ.2,953.81 కోట్లు వెచ్చించింది. అంటే ఏడాదికి సగటున రూ.591 కోట్లు ఖర్చు చేసింది.
- రాష్ట్ర రహదారులు, జిల్లా ప్రధాన రహదారుల పునరుద్ధరణకు రూ.4,325 కోట్లే వెచ్చించింది.
- పంచాయతీరాజ్ రహదారుల కోసం రూ.3,160.38 మాత్రమే ఖర్చు చేసింది.
- 2014 నుంచి 2019 వరకు రాష్ట్రంలో జాతీయ రహదారుల కోసం రూ.13,353 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది.

వైఎస్సార్‌సీపీ హయాంలో మారిన రూపురేఖలు

2019లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రోడ్ల పునరుద్ధరణకు ప్రాధాన్యతనిస్తోంది. కోవిడ్ పరిస్థితులు, వరుసగా రెండేళ్లు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దెబ్బతీసినా రోడ్ల నిర్మాణంపై రాజీ పడలేదు. ప్రజల సంక్షేమంతోపాటు మౌలిక సదుపాయాలపైనా దృష్టి సారించారు. రోడ్ల మరమ్మతులు చేపట్టి విశాలంగా చేస్తున్నారు. కొత్త రోడ్లు వేస్తున్నారు. యుద్ధ ప్రాతిపదికన రోడ్ల పునరుద్ధరణ పనులు చేపట్టడంతో రాష్ట్రంలో రోడ్లు మెరుగయ్యాయి. ఇందు కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం చేసిన ఖర్చు ఇలా ఉంది...

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అయిదేళ్లలో రోడ్ల నిర్మాణానికి రూ.5,099.59 కోట్లు వెచ్చించింది. అంటే ఏడాదికి సగటున రూ.951కోట్లు. దీని ప్రకారం బాబు ప్రభుత్వం ఖర్చు చేసిన రూ. 591 కోట్లకంటే చాలా ఎక్కువే.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అయిదేళ్లలో రాష్ట్ర రహదారులు, జిల్లా ప్రధాన రహదారుల నిర్మాణానికి రూ.9,175 కోట్లు ఖర్చుచేసింది.
- పంచాయతీరాజ్ రోడ్ల కోసం రూ.6,804.61 కోట్లు వెచ్చించింది.
- జాతీయ రహదారుల కోసం రూ.25,304 కోట్లు వెచ్చించారు. సీఎం వైఎస్ జగన్ కేంద్రానికి పంపిన ప్రతిపాదనలు, నిరంతరం పర్యవేక్షణతోనే ఇది సాధ్యమైంది.
- ఇక రోడ్ల అభివృద్ధి సెస్ ద్వారా వచ్చిన రూ.3 వేల కోట్లను టీడీపీ చేసిన అప్పులు తీర్చడానికే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయించాల్సి వచ్చింది. సెస్ ద్వారా వచ్చిన మరో రూ.2 వేల కోట్లకు అదనంగా రూ.2,500 కోట్ల రుణం తీసుకుని మొత్తం రూ.4,500 కోట్లతో 7,600 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించింది.

'షార్'లో మూడో ప్రయోగ వేదిక

- ఇప్పటికే స్థల పరిశీలన పూర్తి
- 2040లో చంద్రుడిపైకి వ్యోమగాములను పంపేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు
- ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడి



మాట్లాడుతున్న ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): చందమామపై దాగి ఉన్న రహస్యాలను తెలుసుకునేందుకు 2040 నాటికి చంద్రుడిపైకి వ్యోమగాములను పంపిస్తామని భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) చైర్మన్ ఎస్.సోమనాథ్ తెలిపారు. దీని కోసం ప్రత్యేకంగా శ్రీహరికోటలోని రాకెట్ ప్రయోగ కేంద్రం(షార్)లో మూడో ప్రయోగ వేదికను నిర్మిస్తామని చెప్పారు. ఇప్పటికే స్థల పరిశీలన కూడా పూర్తిచేశామని తెలిపారు. బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రుడిపైకి భారతీయులు అడుగుపెట్టేలోపు చంద్రయాన్–4 ప్రయోగం ద్వారా చంద్రుడిపైకి క్రాఫ్ట్(ఉపగ్రహం)ను పంపించి అక్కడి నమూనాలను సేకరించి భూమిపైకి తీసుకువచ్చేందుకు మొదటి అడుగు వేయబోతున్నామని చెప్పారు. ఈ ప్రయోగాన్ని 2028లో నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకుని, ఆ దిశగా పనులు చేస్తున్నామని తెలిపారు. చంద్రయాన్–1తో ప్రారంభమైన చంద్రయాన్ సిరీస్ ప్రయోగాలకు కొనసాగింపుగానే ఇది ఉంటుందని వివరించారు. చంద్రయాన్–4 ప్రయోగం తర్వాత చంద్రుడిపైకి వ్యోమగాములను పంపించి, అక్కడి రహస్యాలను ఛేదించి తిరిగి వారిని భూమిపైకి క్షేమంగా తీసుకురావడానికి ఇప్పటి నుంచే కృషి చేస్తున్నామని చెప్పారు. ముందుగా 2028లో చంద్రయాన్–4, ఆ తర్వాత 2040లో చంద్రుడిపైకి భారతీయులు తొలి అడుగు పెట్టేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నామని సోమనాథ్ చెప్పారు.

చంద్రబాబుకి సామాజిక న్యాయ వేదిక సూపర్ సిక్స్ ప్రశ్నలు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నామినేటెడ్ పదవులు, పనుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఇస్తోంది
- మహిళలకు 50 శాతం అవకాశాలపై మీరెందుకు హామీ ఇవ్వడంలేదు?
- బీసీ, పేద ఓసీలు, కాపులు, మహిళలకు సమన్యాయం చేయడానికి ఇబ్బంది ఏమిటి?
- సామాజిక న్యాయం అమలులో స్పష్టత ఇవ్వాలి
- చంద్రబాబుకు బహిరంగ లేఖ విడుదల చేసిన ఎస్‌జేఎఫ్

సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికి సామాజిక న్యాయ వేదిక (ఎస్‌జేఎఫ్) సూపర్ సిక్స్ (ఆరు) ప్రశ్నలు సంధించింది. సామాజిక న్యాయం అమలులో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం బహిరంగ లేఖను విడుదల చేసింది. ఎస్‌జేఎఫ్ రాష్ట్ర చైర్మన్ యర్రాకుల తులసీ రామ్ యాదవ్, కో చైర్మన్ కోటిపల్లి అయ్యప్ప, కన్వీనర్ పంచాది రంగారావు, కో కన్వీనర్ పెద్దిరెడ్డి మహేష్ ఈ లేఖను మీడియాకు విడుదల చేశారు. తాము సంధించిన సూపర్ సిక్స్ ప్రశ్నలకు చంద్రబాబు సూటిగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ ప్రశ్నలివీ..

- రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నామినేటెడ్ పదవులు, నామినేషన్ పనులు, స్థానిక సంస్థలు, గ్రామ, వార్డు వలంటీర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ నియామకాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు ఇప్పటికే అమలు చేస్తోంది. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని సంపూర్ణ మహిళా సాధికారతకు మూలాలైన విద్య, ఉద్యోగాల్లో కూడా 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి మీకు (చంద్రబాబు) ఉన్న ఇబ్బందేమిటి? మీరు ఆ దిశగా ఎందుకు హామీ ఇవ్వలేకపోతున్నారు?
- బీసీ, పేద ఓసీ, కాపులు, మహిళలకు సమన్యాయం–సామాజిక న్యాయం చేయడానికి మీకు ఇబ్బందేమిటి?
- బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని బాహాటంగా హామీ ఇస్తున్న మీరు.. విద్య, ఉద్యోగాల్లో కూడా 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామనే హామీ ఎందుకు ఇవ్వడంలేదు? ఈ ద్వంద్వ నీతి ఏమిటి? ఈ ద్వంద్వ విధానం దేనికి సంకేతం?
- అగ్రవర్ణ పేదలకు (బ్రాహ్మణ, క్షత్రియ, ఆర్య వైశ్య, కమ్మ, రెడ్డి, వెలమ తదితరులకు) కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను యథావిధిగా కొనసాగించడానికి మీకు ఇబ్బందేమిటి?
- మహారాష్ట్రలో మరాఠాలకు ఇచ్చిన మాదిరిగా అటు బీసీలు, ఇటు ఓసీలకు ఇబ్బంది లేకుండా 10 శాతం ప్రత్యేక బీసీ రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల వారికి న్యాయం చేయడానికి మీకున్న ఇబ్బందేమిటి?
- ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ సబ్‌ప్లాన్ మాదిరిగా ఓసీ, కాపు సబ్‌ప్లాన్ అమలు చేస్తానని ఎందుకు హామీ ఇవ్వలేకపోతున్నారు? కాపులను ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేయడం కాకుండా వారికి అధికారంలో ఎందుకు పరిగణనలోని తీసుకోవడంలేదు అంటూ చంద్రబాబుకు ఎస్‌జేఎఫ్ ప్రశ్నలు సంధించింది.

వచ్చే నెలలో 50 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు!

- వాతావరణ నిపుణుల అంచనా
- అసాధారణ ఉష్ణోగ్రతలు అరుదే
- 2003 మే 28న 49.9 డిగ్రీలతో రెంటచింతల టాప్
- ఏప్రిల్ చరిత్రలో తిరుపతిలో అత్యధికంగా 45.7 డిగ్రీలు
- ఆదివారం 46 డిగ్రీలతో ఆ రికార్డును తుడిచేసిన మార్కాపురం



సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో అసాధారణ ఉష్ణోగ్రతలు అరుదుగా నమోదవుతున్నాయి. వేసవిలో రికార్డయ్యే ఈ ఉష్ణోగ్రతలు ఒకింత ఆశ్చర్యం గొలుపుతున్నాయి. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఏప్రిల్ ఆరంభంలోనే మే నెలను తలపించే వడగాడ్పులు, తీవ్ర వడగాడ్పులు వీస్తున్నాయి. మే నెలలో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలకు మించి నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో గడచిన 132 ఏళ్లలో భారత వాతావరణ విభాగం (ఐఎండీ) గణాంకాలను పరిశీలిస్తే.. మన రాష్ట్రంలో నమోదైన గరిష్ట (పగటి) ఉష్ణోగ్రతలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. 1875లో ఐఎండీ ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో రికార్డయిన ఉష్ణోగ్రతలను గమనిస్తే.. 2003 మే 28న రెంటచింతలలో (ప్రస్తుత పల్నాడు జిల్లా) అత్యధికంగా 49.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇప్పటివరకు రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతల్లో ఇదే రికార్డు. ఆ తర్వాత స్థానంలో ప్రస్తుత తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నిలిచింది. అక్కడ 1962 మే 26న 48.9 డిగ్రీలు నమోదైంది. గన్నవరంలో 2002 మే 11న 48.8, నంద్యాలలో 1994 మే 11న 48.2, మచిలీపట్నంలో 1906 మే 25న 47.8, తునిలో 1998 మే 30న 47.5, విజయవాడలో 1980 మే 26న 47.5, ఒంగోలులో 2003 మే 31న 47.4, నరసారావుపేటలో 1983 మే 2,3 తేదీల్లో 47, నెల్లూరులో 1892 మే 15న, 1894 జూన్ 1న 46.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

ఏప్రిల్ ఉష్ణోగ్రతలు ఇలా..

ఏప్రిల్ నెలలోనూ అసాధారణ ఉష్ణోగ్రతలు నమోదైన పరిస్థితులున్నాయి. గడచిన పదేళ్లలో (ఏప్రిల్‌లో) 2016 ఏప్రిల్ 25న తిరుపతిలో నమోదైన 45.7 డిగ్రీల ఉష్ణోగ్రతే అత్యధికం. ఈ రికార్డును ఆదివారం ప్రకాశం జిల్లా మార్కాపురంలో నమోదైన 46 డిగ్రీల ఉష్ణోగ్రత చెరిపేసింది. ఇంకా ఆదివారం నంద్యాల జిల్లా చాగలమర్రి, నెల్లూరు జిల్లా కలిగిరిలో 45.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏప్రిల్‌లో ఎల్‌నినో వంటి ప్రత్యేక పరిస్థితుల్లో అసాధారణ ఉష్ణోగ్రతలు రికార్డవుతాయని అమరావతి వాతావరణ కేంద్రం డైరెక్టర్ ఎస్.స్టెల్లా 'సాక్షి'కి చెప్పారు.

ఏపీలో 132 ఏళ్లలో నమోదైన రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు

ప్రాంతం	తేదీ	ఉష్ణోగ్రత
రెంటచింతల	28.5.2003	49.9
నిడదవోలు	26.5.1962	48.9
గన్నవరం	11.5.2002	48.8
నంద్యాల	11.5.1994	48.2
మచిలీపట్నం	25.5.1906	47.8
విజయవాడ	26.5.1980	47.5
తుని	30.5.1998	47.5
ఒంగోలు	31.5.2003	47.4
బాపట్ల	31.5.2003	47.4
నందిగామ	31.5.2003	47.1
కళింగపట్నం	20.5.1978	46.9
నెల్లూరు	15.5.1892	46.7
నరసాపురం	31.5.1998	46.1
తిరుపతి	25.4.2016	45.7
కర్నూలు	10.5.1921	45.6
విశాఖపట్నం	09.6.1995	45.4

గత పదేళ్లలో ఏప్రిల్‌లో అసాధారణ ఉష్ణోగ్రతలు

ప్రాంతం	తేదీ	ఉష్ణోగ్రత	ప్రాంతం	తేదీ	ఉష్ణోగ్రత
మార్కాపురం	07.4.24	46.0	అనంతపురం	26.4.16	44.5
చాగలమర్రి	07.4.24	45.9	కావలి	24.4.16	44.3
కలిగిరి	07.4.24	45.9	నందిగామ	28.4.16	44.2
తిరుపతి	25.4.16	45.7	రెంటచింతల	29.4.14	44.2
కర్నూలు	26.4.16	45.1	గన్నవరం	24.4.16	43.5
నంద్యాల	25.4.16	45.0	కడప	29.4.19	43.2
ఒంగోలు	24.4.16	44.7	బాపట్ల	24.4.16	43.1
నెల్లూరు	25.4.16	44.6	తుని	12.4.16	43.0

ఈపీఎఫ్ఓ చందాదారుల వేతన పరిమితి పెంపు!

- రూ.15 వేల నుంచి రూ.21 వేలకు పెంచే యోచన
- కేంద్ర కార్మిక శాఖ కసరత్తు

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) పరిధిలోని చందాదారుల గరిష్ట వేతన పరిమితిని రూ.21 వేలకు పెంచేందుకు కేంద్రం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. కార్మిక సంఘాలు, అనుబంధ సంస్థలు ఇందుకోసం గత కొంత కాలంగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నాయి. ఈ క్రమంలో వేతన పరిమితి పెంపుతో జరిగే పరిణామాలపై కేంద్ర కార్మిక శాఖ ప్రాథమిక కసరత్తుకు ఉపక్రమించినట్లు సమాచారం. ప్రస్తుతం ఈపీఎఫ్ చందాదారుడి గరిష్ట వేతన పరిమితి రూ.15 వేలుగా ఉంది. 2014కు ముందు ఇది రూ.6,500 కాగా.. అప్పటి ప్రభుత్వం ఈ పరిమితిని రూ.15 వేల వద్ద ఫిక్స్ చేసింది. ఈపీఎఫ్ఓ ఫార్ములా ప్రకారం ఒక ఉద్యోగికి భవిష్యనిధి చందా కింద 12 శాతం యాజమాన్యం చెల్లిస్తుండగా, మరో 12 శాతం ఉద్యోగి వేతనం నుంచి చెల్లిస్తారు. ఈ మొత్తాన్ని (పెన్షన్ మినహా) ఉద్యోగి పదవీ విరమణ సమయంలో వడ్డీతో సహా ఈపీఎఫ్ఓ తిరిగి ఇచ్చేస్తుంది.

ఉద్యోగికి లాభం..యాజమాన్యాలపై భారం

చందాదారుడి గరిష్ట వేతన పరిమితి పెంపుతో ఉద్యోగికి లాభం కలగనుండగా.. అధిక చెల్లింపుల భారం యాజమాన్యాలపై పడనుంది. ప్రస్తుత ఫార్ములా ప్రకారం ఉద్యోగి గరిష్ట వేతన పరిమితి రూ.15 వేలు కాగా అందులో 12 శాతాన్ని (రూ.1800) యాజమాన్యం సదరు ఉద్యోగి ఈపీఎఫ్ఓ ఖాతాకు బదిలీ చేస్తుంది. ఇందులో నుంచి 8.33 శాతం(రూ.1250) పెన్షన్ ఖాతాకు బదిలీ అవుతుండగా... మిగతా 3.67 శాతం (రూ.550) మొత్తం భవిష్యనిధి ఖాతాలో జమ అవుతుంది. దీనికి సమానంగా ఉద్యోగి వేతనం నుంచి 12 శాతం (రూ.1800) భవిష్యనిధి ఖాతాలో జమ చేస్తారు. తాజాగా ఉద్యోగి వేతన పరిమితి రూ.21 వేలకు పెంచితే ఇందులోని 12 శాతం (రూ.2520) యాజమాన్యం చెల్లించాల్సి వస్తుంది. ఈ లెక్కన ఉద్యోగి పెన్షన్ ఖాతాలో రూ.1790, భవిష్య నిధి ఖాతాలో రూ.730 జమ అవుతాయి. దీనికి సమానంగా ఉద్యోగి వేతనం నుంచి రూ.2520 భవిష్య నిధి ఖాతాలో జమ చేస్తారు. ప్రస్తుతం ఈఎస్ఐ చట్టం కింద చందాదారుడి గరిష్ట వేతన పరిమితి రూ.21 వేలుగా ఉంది. రూ.21 వేలు దాటిన వారు ఈఎస్ఐ పరిధిలోకి రారు. ఈఎస్ఐ గరిష్ట వేతన పరిమితి 2016కు ముందు రూ.15 వేలు ఉండగా.. కేంద్ర ప్రభుత్వం దీన్ని రూ.21 వేలకు పెంచింది. ఈ తరహాలోనే ఈపీఎఫ్ఓ కూడా వేతన పరిమితిని రూ.21 వేలకు పెంచే యోచనలో ఉందని ప్రాథమిక సమాచారం. కాగా ఇందుకు సంబంధించి ఈపీఎఫ్ఓ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

ఇన్సూరెన్స్ డబ్బు కోసం చావు డ్రామా

- బతికే ఉన్న ఫారుక్‌బాషా
- గోడౌన్‌లో సజీవ దహనమైన వ్యక్తి శెట్టి ప్రతాప్‌గా గుర్తింపు



ఫారుక్‌బాషా



సజీవ దహనమైన శెట్టి ప్రతాప్

పాములపాడు: నంద్యాల జిల్లా పాములపాడులోని ఏకే ట్రేడర్స్ గోదాంలో ఈ నెల 1న రాత్రి మంటల్లో సజీవ దహనమైన వ్యక్తిగా భావించిన ఫారుక్‌బాషా బతికే ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఆ రోజు రాత్రి సజీవ దహనమైన వ్యక్తి పాములపాడు మండలం చెలిమిల్ల గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని శెట్టి ప్రతాప్‌గా గుర్తించారు. అప్పుల్ని ఎగ్గొట్టడంతోపాటు ఇన్సూరెన్స్ డబ్బు కోసం ఫారుక్‌బాషా తాను చనిపోయినట్టుగా చిత్రీకరించాడని తేలింది. వివరాల్లోకి వెళితే.. పాములపాడుకు చెందిన ఫారుక్‌బాషా ధాన్యం వ్యాపారం చేసేవాడు. అతడు రైతులకు దాదాపు రూ.కోటి వరకు బకాయి పడినట్టు తెలుస్తోంది. అప్పులు తీర్చకుండా ఎగ్గొట్టడంతోపాటు రూ.50 లక్షల ఇన్సూరెన్స్ సొమ్ము రాబట్టేందుకు ఫారుక్‌బాషా చనిపోయినట్టు నమ్మించాడు. అతడి కుటుంబ సభ్యులు కూడా మంటల్లో మరణించిన వ్యక్తి ఫారుక్‌బాషానే అని నిర్ధారించడంతో పోలీసులు పంచనామా నిర్వహించి.. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహానికి అంత్యక్రియలు కూడా పూర్తయ్యాయి.

మహిళ ఫిర్యాదుతో వెలుగులోకి..

కాగా.. చెలిమిల్ల గ్రామానికి చెందిన శెట్టి ప్రతాప్ అదృశ్యమైనట్టు అతడి భార్య స్వరూప ఈ నెల 4న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దర్యాప్తులో భాగంగా మంటల్లో లభ్యమైన మృతదేహం ఆనవాళ్లను ఆమెకు చూపించగా.. చొక్కా, ఇతర ఆనవాళ్లను బట్టి తన భర్తగానే గుర్తించింది. ఫారుక్‌బాషా తన భర్తను సజీవ దహనం చేశాడని ఆరోపించింది. దీంతో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. మృతదేహం శెట్టి ప్రతాప్‌దేననే నిర్ధారణకు వచ్చారు. అప్పటికే ఫారుక్‌బాషా పరారీలో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. అతడు హైదరాబాద్‌లో ఉన్నాడని తెలిసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ విషయమై ఎస్ఐ అశోక్‌ను వివరణ కోరగా.. దర్యాప్తు కొనసాగుతోందని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

గన్‌తో కాల్చుకుని ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

విశాఖ నగరంలో ఘటన



పాలవలస శంకరరావు

సీతమ్మధార (విశాఖ ఉత్తర): విధి నిర్వహణలో ఉన్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ ఎస్ఎల్ఆర్ గన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ద్వారకాపోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. విజయనగరం జిల్లా వంగర మండలం, కొట్టిశ గ్రామానికి చెందిన పాలవలస శంకరరావు (37)కు భార్య శ్రావణి, పిల్లలు బాబు కిశోర్‌చంద్రదేవ్ (6), పాప జ్ఞానవిత (3) ఉన్నారు. 2010 బ్యాచ్‌కు చెందిన శంకరరావు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ మద్దిలపాలెంలో నివాసం ఉంటున్నారు. ద్వారకానగర్‌లోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో చెస్ట్ గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం 5.55 గంటల సమయంలో తన వద్దనున్న ఎస్ఎల్ఆర్ గన్‌తో గుండెపై కాల్చుకుని అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. మృతి చెందినట్లు గుర్తించిన ఉద్యోగులు వెంటనే అధికారులకు తెలియజేశారు. ద్వారకా జోన్ ఏసీపీ రాంబాబు ఆధ్వర్యంలో సీఐ ఎస్.రమేష్, కేసు దర్యాప్తు చేస్తున్నారు. శంకరరావు ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.